# 1 విద్య ధ్యేయాలు మరియు ఉద్దేశ్యాలు
# (Aims and Purposes of Education)

"విద్య అనే మహావృక్షం వేళ్ళు చేదుగానూ అది అందించే ఫలాలు మధురంగాను వుంటాయి" – అరిస్టాటిల్.

**Sub Units :**

1.1 పాఠశాల విద్య మరియు విద్య (schooling and education)కు గల సంబంధము మరియు మానవ సమాజాలలోని వివిధ విద్యా ప్రక్రియలను అన్వేషించుట.

1.2 విద్య – విలువలు మరియు గమ్యాలు; రాజ్యాంగ విలువలు, NPE–1986, NCF–2005, APSCF–2011.

1.3 మానవ స్వభావము, సమాజము, అభ్యసనము మరియు విద్యా ధ్యేయాల యొక్క ప్రాథమిక భావనల అవగాహన.

1.4 మానవ సమాజములో విద్య స్వభావం మరియు అవసరాల అన్వేషణ.

1.5 పాఠశాల విద్య మరియు విద్యలపై భారతీయ మరియు పాశ్చాత్య విద్యావేత్తల దృక్కోణం.

- స్వామి వివేకానంద, మహాత్మగాంధి, రవీంద్రనాథ్ ఠాగూర్, జిడ్డుకృష్ణమూర్తి, గిజుభాయి భగేకా, జ్యోతిభాపూలె, పండిట్ మదన్ మోహన్ మాలవ్య, శ్రీ అరబిందో, ది మదర్, సర్వేపల్లి రాధాక్రిష్ణన్, సంత్‌కబీర్, ప్రొ.జె.పి.నాయక్, ప్రొ.డి.యస్.కొఠారి, జాన్ డ్యూయీ, ఫ్రోబెల్ మరియు మాంటెస్సోరి.

### యూనిట్ లక్ష్యాలు

**ఈ అధ్యాయం చదివిన తరువాత ఛాత్రోపాధ్యాయులు**

- పాఠశాలలో నేర్చుకొనే విద్య మరియు విద్యకు గల సంబంధాలు మానవ సమాజాలలోని వివిధ విద్యా ప్రక్రియల ప్రయోజనాల గురించి తెలుసుకుంటారు.
- విద్యా ధ్యేయాల పరిచయం, ప్రాముఖ్యతలపై అవగాహన పెంచుకుంటారు. ఉత్తమ పౌరుణ్ణి రూపొందించుటకు రాజ్యాంగ విలువలు, NPE–1986, NCF–2005, SCF–2011లలోని ధ్యేయాలు మరియు విలువలను అవగాహన చేసుకుంటారు.

- సమాజము, మానవ స్వభావము, అభ్యసనం ద్వారా విద్యాధ్యేయాల సాధనను అవగాహన చేసుకుంటారు.
- విద్యస్వభావము మరియు విద్యావసరాలపై అవగాహన పెంచుకుంటారు.
- పాఠశాల విద్య మరియు విద్యలపై భారతీయ మరియు పాశ్చాత్య విద్యావేత్తల యొక్క దృక్కోణాలను తెలుసుకుంటారు. విలువలు పెంపొందించటంలో వివిధ విద్యా విధానాల, విద్యాప్రణాళికల ప్రమేయాలను అవగాహన చేసుకుంటారు.

## పరిచయం

మానవులంతా తమ జీవితానికి కొన్ని ధ్యేయాలను, ఆదర్శాలను, గమ్యాలను, లక్ష్యాలను ఏర్పరచుకుంటారు. ధ్యేయాలు లేని జీవితం తెరచాప లేని నావలాంటిది. అందుకే మానవులు ఎన్నో ధ్యేయాలను తమ జీవితానికి ఒక దిశా నిర్దేశం కోసం ఏర్పాటు చేసికోవడం జరుగుతుంది. ఈ ధ్యేయాలు వాటి ఆదర్శాలు, ఆశయాల ఆధారంగా ఏర్పడతాయి. ఇలా జరిగే ప్రక్రియలో మానవ జీవితం క్రమబద్దంగా, ఆనందంగా ఆత్మతృప్తి పొందే విధముగా కొనసాగుతుంది. ధ్యేయాలు ముఖ్యంగా విద్యా విధానంలో ఏర్పరచుకోవడం అత్యంత ఆవశ్యకం. ఒక నిర్ణీత వ్యవధిలో కొన్ని నిర్దిష్టమైన ధ్యేయాలను వివిధ విద్యా స్థాయిలలో సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే విధంగా పాఠ్యప్రణాళికలు రూపొందించుటలో లక్ష్యాలు, ధ్యేయాల ఆధారంగా చేసుకుంటారు.

వ్యక్తి మానసిక, శారీరక, నైతిక సామర్థ్యాన్ని ప్రభావితం చేసే ఏ చర్యనైనా లేదా ఏ అనుభవాన్నైనా విద్యగా పిలవవచ్చు. అది పుట్టుకతో ప్రారంభమై జీవితమంతా నిరంతరంగా కొనసాగుతుంది. వ్యక్తి తన అనుభవం అవసరం ప్రకారం తను ఎదుర్కొనే పరిస్థితిని మార్చుకునే ప్రయత్నం ద్వారా, తను పరిసరంతో జరిపే పరస్పర చర్య ద్వారా అనేక విషయాలను నేర్చుకుంటారు. యథార్థ పరిస్థితిని ఎదుర్కొంటున్నపుడు ఆ పరిస్థితిలో సంబంధం గల తన పూర్వ అనుభవాలను అతడు ఉపయోగిస్తాడు. ఈ ప్రక్రియలో తన జీవితమంతా తన అనుభవాలను పునఃనిర్మించుకుంటూ ఉంటారు. అందుకే విద్య అనేది నిరంతరం జరిగే ఒక గతిశీల క్రియాత్మక ప్రక్రియ.

భవిష్యత్ ఉపాధ్యాయులు విద్య యొక్క ముఖ్యమైన భావనలు, సూత్రాలు మరియు తాత్విక దృక్పథాల గురించిన పరిపూర్ణమైన జ్ఞానం పొందవలసిన అవసరం ఉంది. అందువలన విద్య ఆవశ్యకతను పరిశోధించాలి. విద్య యొక్క ధ్యేయాలు, అర్థము, ప్రయోజనాలు తెలుసుకోవలసిన అవసరం యున్నది. భారతదేశం ప్రాచీన కాలంలో ప్రపంచానికి విద్యను అందించింది. భారతీయులు తమ ఆలోచన, అనుభవం, పరిశీలన, పరిశోధన ద్వారా విద్య సాహిత్యం, శాస్త్రసాంకేతిక రంగాలలో ప్రపంచఖ్యాతిగాంచారు. విద్యారంగానికి విశేష సేవలు అందించిన ప్రముఖ భారతీయ మరియు పాశ్చాత్య విద్యాతత్వవేత్తల దృక్కోణాలను అవగాహన చేసుకుంటారు.

## 1.1 పాఠశాల విద్య మరియు విద్య (Schooling and Education) కు గల సంబంధము మరియు మానవ సమాజాలలోని వివిధ విద్యా ప్రక్రియలను అన్వేషించుట

### 1.1.1 పాఠశాల విద్య (Schooling)

సంకుచిత అర్థములో పాఠశాల విద్య అంటే ఎన్నిక చేయబడిన పాఠశాల అనబడే నియంత్రిత సన్నివేశంలో వ్యక్తిగత అభివృద్ధికి, సామాజిక సమర్థతకు అవసరమయ్యే విజ్ఞానాన్ని పొందడం. సమాజం దాని వారసత్వాన్ని, అదికూడబెట్టిన

విజ్ఞానాన్ని, విలువలను, నైపుణ్యాలను, ఒక తరం నుంచి మరొక తరానికి ఉద్దేశపూర్వకంగా సంక్రమింపచేయుటకు పాఠశాలలను స్థాపిస్తుంది. ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులు పొందే అభ్యసనానుభవాలను స్కూలింగ్ (Schooling) అంటున్నాం. స్కూలింగ్ అంటే పాఠశాలలో పొందే విద్య.

### విద్య (Education)

'విద్య' అనే పదం ఒక వజ్రం లాంటిది. వజ్రం వివిధ కోణాల నుంచి చూసినపుడు వివిధ రంగుల్లో కనిపిస్తుంది. అలాగే విద్యకు అనేక అర్థాలున్నాయి. "విద్య" ఒక్కొక్కరికి ఒక్కొక్కరకంగా కనిపిస్తుంది. తత్వవేత్తలు, రాజకీయ వాదులు, విద్యావేత్తలు, మతాచార్యులు ఇలా అనేక మంది విద్య పై తమ అభిప్రాయాలకు వారు నివశించిన కాలాన్నిబట్టి, జీవితాన్ని బట్టి, సందర్భాలను బట్టి చెప్పారు. ఒకరు 'విద్యంటే ప్రశ్నించడం' అన్నారు. ఇంకొకరు మనిషి 'ప్రవర్తనలు మార్చడం' అన్నారు. రెండూ విద్యాభావనలే.

### భారతీయ మరియు పాశ్చాత్యుల దృష్ట్యా విద్య నిర్వచనాలు – భావనలు
### (Definitions of Education - Indian and Western Context)

### భారతీయ విద్య భావన (Indian Concept of Indian Education)

2I48XW

ప్రాచీన భారతీయ ఆలోచనాపరులు భావవాద లేక ఆధ్యాత్మిక విద్యా దృక్పథాన్ని వివరిస్తే ఆధునిక భారతీయ పండితులు విద్యను ప్రధానంగా ఆచరణ దృక్పథం (practical point of view) నుంచి వివరించినట్లు కనిపిస్తుంది. భిన్న కాలాల్లో భిన్న విధాలుగా విద్యను నిర్వచించారు. కొన్ని భారతీయ విద్యా నిర్వచనాలను ఇపుడు చూద్దాం.

#### ప్రాచీన భారతీయ విద్యా నిర్వచనాలు

1. ఋగ్వేదం: మనిషిని స్వావలంభకుడిగా (self radiant) గా నిస్వార్థిగా తయారుచేయునదే విద్య.
2. ఉపనిషత్తులు: మోక్షసాధనకు దారిచూపే విధానమే విద్య.
3. శంకరాచార్యుడు: 'ఆత్మసిద్ధియే విద్య'.
4. యజ్ఞవల్క్యుడు: మనిషిని శీలవంతుడిగాను, సమాజానికి ఉపయోగపడే వాడిగానూ తీర్చిదిద్దునదే విద్య.

#### ఆధునిక భారతీయ విద్యా నిర్వచనాలు

1. వివేకానందుడు: "మానవునిలో వున్న దైవశక్తిని బయటకు లాగడమే విద్య".
2. గాంధీజీ: మనిషిలోని అత్యున్నత శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులను బహిర్గతం చేయడమే విద్య.
3. స్వామి దయానంద సరస్వతి: "శీల నిర్మాణమే విద్య".
4. అరవిందుడు: మనిషి మనస్సు, ఆధ్యాత్మిక శక్తులను అభివృద్ధి పరచడమే విద్య.

### పాశ్చాత్య విద్యా భావన (Western Concept of Education)

పాశ్చాత్య పండితులూ భిన్నమైన విద్యా భావనలను పేర్కొన్నారు. వారు ఆధ్యాత్మిక విషయానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. అయితే పాశ్చాత్య ప్రపంచంలో కూడా కాలంతో పాటు విద్యాభావన కూడా మారుతూ వచ్చింది. ఇప్పుడు కొన్ని పాశ్చాత్య విద్యా నిర్వచనాలను చూద్దాం.

1. సోక్రటీస్ :– 'తప్పును తరిమి, సత్యాన్ని అన్వేషించడమే విద్య".
2. ప్లాటో :– సరైన సమయంలో సంతోషం, తదానుభూతి చెందే సామర్థ్యమే విద్య.
3. అరిస్టాటిల్ :– ఆరోగ్యవంతమైన శరీరంలో ఆరోగ్యవంతమైన మనస్సును సృష్టించడమే విద్య.
4. డ్యూయీ :– సామాజిక సామర్థ్యాన్ని పెంపొందించడమే విద్య.
5. స్పెన్సర్ :– సంపూర్ణ జీవనానికి ఆయత్తం చేయడమే విద్య.
6. ఎమర్సన్ :– మనస్సును నియంత్రించడమే విద్య.
7. హెర్బార్ట్ :– నైతిక వికాసమే విద్య.
8. రెడ్డెన్ (Redden) :– "పరిణతిగల వ్యక్తి, అపరిణతి గల వ్యక్తిపై ఉద్దేశపూర్వకంగా, క్రమబద్ధంగా, సమాజ అవసరాలను బట్టి, శారీరక, మానసిక, సౌందర్య, సామాజిక ఆధ్యాత్మిక శక్తుల సమ్మేళనాభివృద్ధి కోసం అంతిమ లక్ష్యంగా చదువరిని (educant) అతని సృష్టికర్తతో లీనం చేసేవైపు మళ్ళించడం కోసం శిక్షణ (instruction), క్రమశిక్షణ ద్వారా చేయు ప్రభావమే విద్య" అని సమగ్ర నిర్వచనము ఇచ్చాడు.

**విద్యా పరిధి (Scope of Education)**

విద్యా పరిధి చాలా విస్తృతమైనది. విద్యకు పరిమితులను గీయలేము. దీని పరిధి ప్రపంచమంత విస్తృతంగా, ఈ భూమ్మీద మానవుని చరిత్రంతటి విశాలంగా ఉంటుంది.

నియత, అనియత విద్యా రకాలు, సంకుచిత విస్తృత విద్యార్థం అలాగే భారతీయ, పాశ్చాత్య విద్యావేత్తలు ఇచ్చిన విద్యా నిర్వచనాలు పేర్కొన్నపుడు చాలా వరకు మనం విద్యాపరిధిని గురించి తెలిసుకున్నాం. విద్య అంటే వ్యక్తి సంపూర్ణమూర్తిమత్వాభి వృద్ధి అని తెలుసుకున్నాం. అటువంటి అభివృద్ధిలో భౌతిక, మానసిక, సామాజిక, సౌందర్య మరియు ఆధ్యాత్మిక వికాసం చేరియుంటాయి. మరొక మాటలో చెప్పాలంటే విద్యంటే మనిషిని పూర్తిగా అభివృద్ధి చేయడమే.

స్వామి వివేకానంద అభిప్రాయంలో "మానవున్ని తయారు చేయడమే విద్య (Education is man making). విద్య ద్వారా శీలం ఏర్పడుతుంది. మానసిక శక్తి పెరుగుతుంది. బుద్ధి విస్తరించబడుతుంది. ఆ విధంగా వ్యక్తి తన కాళ్ళ మీద తాను నిలబడగలడు. ఈ విధంగా ఆచరణలో జీవితమే విద్య. విలువలు, నీతులు, అభిరుచులు, నైపుణ్యాలు, వైఖరులు ఇవన్నీ దానిలో చేరివుంటాయి. మానవ మూర్తిమత్వ సంపూర్ణాభివృద్ధికి తోడ్పడే ఈ లక్షణాలను వ్యక్తులలో అలవరచడమే విద్యాపరిధి అవుతుంది.

అయితే విద్యా పరిధి గురించి స్పష్టంగా చెప్పాలంటే ఇది ప్రధానంగా రెండు అంశాలకు సంబంధించి ఉంటుందని చెప్పవచ్చు. అవి. 1: పిల్లల బౌద్ధిక, నైతిక, సాంస్కృతిక వికాసం కోసం విద్యా ప్రణాళికపరంగా ఏఏ విషయాలు (subjects) బోధించాలి అనే అంశం. అంటే ఏ విజ్ఞానాన్ని, ఏ నైపుణ్యాలను పిల్లలకు నేర్పాలి అనే విషయం అన్న మాట. 2. ఆ జ్ఞానాన్ని నైపుణ్యాలను అలవరచడానికి ఏ పద్ధతులను లేదా ఏ విధానాలను అనుసరించాలనేది రెండవ అంశం అవుతుంది.

**పాఠశాల విద్య మరియు విద్యకు గల సంబంధము (Relationship between Schooling and Education)**

సాధారణంగా పాఠశాల (school) అంటే విద్య పొందే ప్రదేశము. స్కూలింగ్ (schooling) అంటే పాఠశాలలో పొందే విద్య. పాఠశాలలు స్కూలింగ్ (schooling)ను దాదాపు దేశమంతటా ఒకే వయస్సులో ప్రారంభిస్తాయి. దాదాపు ఒకే రకమైన పాఠ్యాంశాలు, పరీక్షలు, ఉపాధ్యాయుల బోధన ఉంటాయి. పాఠశాల విద్యలో నియమనిబంధనలు పాటిస్తారు. దీనినే నియత విద్య అంటారు.

అయితే విద్యను ఎక్కడైనా పొందవచ్చు అనగా వంట గదిలోగాని, పొలంలోగానీ పనిచేయడంలోగానీ పొందవచ్చు. ఇలా పొందే విద్యను అనియత విద్య అని అంటారు. ఈ విద్య పొందడానికి తల్లిదండ్రులు, స్నేహితులు, పెద్దలు, ప్రసార మాధ్యమాలు, రాజకీయ, వ్యాపార, వృత్తిపరమైన అంశాలు తోడ్పడును.

స్కూలింగ్ (schooling)లో ఉపాధ్యాయుడు విద్యార్థి ఉంటారు. వారు పాఠ్యప్రణాళికలో నిర్దేశించిన విషయాలు నేర్చుకుంటారు. అయితే అనియత విద్యలో విద్యార్థి, ఉపాధ్యాయులు నిర్ధిష్టంగా ఉండరు. తాము ఊహించిన, ఊహించని విషయాలను ఎన్నింటినో తమ అనుభవాల ద్వారా తెలుసుకుంటారు.

పాఠశాల విద్య కొన్ని లక్ష్యాల ఆధారంగా విద్యా ప్రణాళిక (curriculum) రూపొందించుకొని క్రమ బద్ధంగా వివిధ యాజమాన్యాల క్రింద నిర్వహణ జరుగుచున్నది. కొన్ని నియమ నిబంధనల ప్రకారము పూర్తి విద్యార్జన కాలము ఒక పద్ధతిలో విద్యార్థులు చదువుకుంటారు. పాఠశాల విద్య సమాజం యొక్క సాంస్కృతిక వారసత్వాన్ని, విజ్ఞానాన్ని, విలువలు మరియు నైపుణ్యాలను ఒక తరం నుండి మరొక తరానికి ఉద్దేశపూర్వకంగా సంక్రమింపచేయడానికి తోడ్పడుతుంది.

వ్యక్తి మానసిక, శారీరక, నైతిక సామర్థ్యాన్ని ప్రభావితం చేసే ఏ చర్యనైనా లేదా అనుభవాన్నైనా విద్య అని చెప్పవచ్చు. ఈ అర్థములో ప్రయాణించడాన్ని, పఠించడాన్ని లేదా ఒకరితో కలిసి నివసించడాన్ని కూడా విద్యానుభవం అంటున్నారు. ఈ విస్తృతార్థములో విద్య జీవితాంతం జరిగే ప్రక్రియ (life long process).

స్కూలింగ్‌లో అసెంబ్లీ కార్యక్రమాలు, వివిధ రకాల విద్యావిషయక, సాంస్కృతిక, ఆటలు–క్రీడలు ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్., ఎన్.జి.సి, జాతీయ పండుగలు, ర్యాలీలు, వినోదకార్యక్రమాలు, ప్రాజెక్టు కృత్యాలు మొదలైనవి నిర్వహించబడతాయి. సాధారణంగా వీటిలో చురుకుగా పాల్గొన్నవారు మంచి పౌరులుగా, నాయకులుగా రాణించడం జరుగుతుంది. స్కూలింగ్ వ్యక్తి సమగ్రాభివృద్ధికి ఒక ప్రత్యేకమైన బాధ్యత, పాత్ర నిర్వహించాలి. ఒక దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మింపబడుతుంది అన్నది అక్షరాల వాస్తవం.

విద్య అంటే కేవలం 3□□ (□□□□□□□, □□□□□□□, □□□□□□□□□□) మాత్రమే కాదు. జీవితంలో జరిగే ప్రతిచర్య ఒక అనుభవాన్ని ఇస్తుంది. ఈ అనుభవాలను దృష్టిలో యుంచుకొని భవిష్యత్ సన్నివేశాలను లేదా సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కావలసిన శక్తిని విద్య కల్పిస్తుంది.

## విద్య మరియు స్కూలింగ్

| క్ర.సం. | అంశం (Aims) | విద్య (Education) | పాఠశాల విద్య (Schooling) |
|---|---|---|---|
| 1. | ధ్యేయాలు | సమగ్రాభివృద్ధి మరియు ఉపాధి. | ప్రాథమికంగా మానసిక, శారీరక నైతిక వికాసము. |
| 2. | పరిధి | విశాలమైనది | విద్యలో భాగము |
| 3. | స్వభావము | సహజమైనది | కృత్రిమమైన పద్ధతి |
| 4. | రకాలు | 2 రకాలు అవి: 1) నియత 2) అనియత | నియత విద్యకే ప్రాధాన్యం |
| 5. | కాలం | నిరంతరం, జీవితాంతం కొనసాగే ప్రక్రియ | విద్యాసంస్థలో కొనసాగినంతకాలం మాత్రమే. |
| 6. | స్థలం | వివిధ రకాల సంస్థలు అవి ఇల్లు, మత, సాంస్కృతిక, సామాజిక పాఠశాల, కళాశాలలు మొదలైనవి. | విద్యా సంస్థలకే పరిమితం. |
| 7. | విద్యాప్రణాళిక | సులభం, సౌకర్యకరంగా ఉంటుంది. | విషయం (subject)లు నిర్దిష్టంగా యుండును. |
| 8. | బోధనాపద్దతులు | వివిధ పద్ధతులు ఆచరణాత్మకము. | కొన్ని పద్ధతులకు మాత్రమే పరిమితం. |
| 9. | క్రమశిక్షణ | సామాజిక నియంత్రణ ఉండును. | క్రమశిక్షణ నిర్ధిష్టంగా యుండును. |
| 10. | వ్యక్తులు | పరిస్థితులను బట్టి ఉపాధ్యాయులు మారుతుంటారు. | నిర్ధిష్టంగా విషయాన్ని బట్టి నియమించబడుతారు. |
| 11. | సంస్థలు | వివిధ రకాల సంస్థలు అందిస్తాయి. | ప్రాథమికంగా పాఠశాలయే సంస్థ (agency). |
| 12. | పరిసర వాతావరణం | సహజంగా, అనుకూల వాతావరణం. | ఒక రకంగా కృత్రిమ వాతావరణం. |
| 13. | మూల్యాంకనము | సరళంగా, వ్యక్తిత్వ వికాసముల మూల్యాంకనం జరుగును. | వివిధ రకాల ప్రశ్నలు, సాంకేతిక పద్ధతులు వినియోగిస్తారు. |
| 14. | సహపాఠ్యాంశాలు | వివిధ రకాల సహజ సేవాకార్యక్రమాలు నిర్వహించబడును. | పరిమిత స్థాయిలో అంతర్గత కృత్యాలు నిర్వహిస్తారు. |
| 15. | ధృవపత్రాలు | ధృవపత్రాలు ఇవ్వవచ్చు/ఇవ్వకపోవచ్చు. | కోర్సు పూర్తి అయిన తరువాత ధృవపత్రాలు ఇస్తారు. |

## 1.1.2 మానవ సమాజాలలోని వివిధ విద్యా ప్రక్రియలను అన్వేషించుట (Exploring various educative process in human societies)

మనిషి సంఘజీవి. మనిషి పుట్టిన తరువాత కొంతకాలం పాటు కేవలం సహజాతాల ఆధారంగా జీవనం సాగిస్తారు. ఆ తరువాత తల్లి, తండ్రి, ఇతర కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారి సాంగత్యముతో క్రమ క్రమంగా సామాజిక చర్యల ప్రభావానికి లోనవుతారు. ఇక పాఠశాలలో చేరినప్పటినుండి సమవయస్కులతో చర్య, ప్రతిచర్యలు జరుగుతూ ఉపాధ్యాయుల మార్గ దర్శకత్వములో సామాజిక లక్షణాలను అలవరచుకుంటూ ఎదుగుతాడు. ఇల్లు, పాఠశాల, సమాజాల ప్రభావముతో సహజ సభ్యునిగా పరిణితితో కూడిన వ్యక్తిత్వాన్ని అలవరచుకొని తాను కూడా సమాజంలో కొనసాగడానికి, సమాజం అభివృద్ధి చెందడానికి తనవంతు పాత్రపోషిస్తాడు.

శిశువును వ్యక్తిగా రూపొందించడానికి తల్లితో మొదలైన విద్య, పాఠశాల మరియు సమాజం తదితర సంస్థల నుండి అలవరచుకునే జ్ఞానముతో పరిపూర్ణమవుతుంది. ఆ విధముగా మనిషి జీవితంలో విద్య, సమాజం ప్రముఖపాత్ర పోషిస్తాయి. వీటి పాత్రను వివరంగా తెలిసికొనడానికి విద్యా ప్రక్రియను, సమాజశాస్త్రాన్ని వాటి మధ్యయున్న పరస్పర సంబంధాన్ని కాబోయే ఉపాధ్యాయులు అవగాహన చేసుకోవలసిన అవసరం ఉంది.

**సమాజశాస్త్రము:**

సమాజ శాస్త్రాన్ని ఆంగ్లములో సోషియాలజి అంటారు. సోషియాలజి అనే ఆంగ్ల పదము సొసైటస్ లేదా సోషియస్ అనే లాటిన్ పదం మరియు లాగోస్ అనే గ్రీకు పదాల కలయిక. సొసైటస్ లేదా సోషియస్ అంటే సమాజం లేదా సామూహిక జీవనం అని, లాగోస్ అంటే అధ్యయనం లేదా శాస్త్రం అని అర్థం. ఆ విధంగా సమాజ శాస్త్రం అంటే సమాజాల లేదా సామూహిక జీవనాల శాస్త్రీయ అధ్యయనం.

సమాజశాస్త్రాన్ని కూడా ఇతర విజ్ఞాన శాస్త్రాల్లాగా శాస్త్రీయంగా అధ్యయనం చేయవచ్చని ఆగస్ట్‌కోమ్ట్ భావించి ఆధునిక సమాజశాస్త్రానికి ఆధ్యుడయ్యారు. కోమ్ట్ వ్రాసిన “కోర్స్ ది ఫిలాసఫీ పాజిటివ్” అనే గ్రంథంలో సమాజశాస్త్ర స్వభావాన్ని తెలియచేశాడు.

సమాజ శాస్త్రం మనిషి నివశించే మానవ సమాజాలలోని సమూహాల మధ్య జరిగే ప్రక్రియల గురించి అధ్యయనం చేస్తుంది. మనిషి తన చుట్టూఉన్న పరిసరాలతో జరిపే పరస్పర చర్యలే సమాజశాస్త్రంలో ప్రధానమైన అంశం. సమాజశాస్త్రం చర్చించే వివిధ (సమాజశాస్త్ర పరిధిలో) అంశాలలో విద్య ఒకటి.

### విద్యా సమాజ శాస్త్రము (Educational Sociology)

విద్య వ్యక్తిలోని ప్రతిభలను వెలికితీస్తుంది. అదే విధంగా వ్యక్తి తాను నివశిస్తున్న సమాజంలో ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగడానికి తద్వారా సమాజానికి సమాజ అభివృద్ధికి తన వంతు కృషి చేసేలా విద్య శిక్షణను ఇస్తుంది. ఆయా సమాజాల్లోని ప్రత్యేక సంస్కృతిని వ్యక్తికి అందచేయడానికి విద్య ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. వ్యక్తిని తీర్చిదిద్దేక్రమంలో విద్య సమాజాన్ని విస్మరించలేదు. ప్రతి వ్యక్తి సమాజంలోని సభ్యుడే కాబట్టి సమాజ పరిధిలోనే విద్య వ్యక్తిని తీర్చిదిద్దాలి. విద్యతో పాటు సమాజంలోని ఇతర సంస్థలు కూడా వ్యక్తిని తీర్చిదిద్దుతాయి. ఆ విధంగా చూస్తే విద్య కూడా ఒక సామాజిక ప్రక్రియగానే కనిపిస్తుంది.

విద్యా విషయక సమాజశాస్త్రాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేయడానికి జార్జిపేనె (George Payne) ఒక జాతీయ సంస్థను స్థాపించాడు. ఈ సంస్థ ప్రచురించే విద్యావిషయక సమాజశాస్త్ర పత్రికను సంపాదకత్వం చేసిన జార్జిపేనె 1928వ సంవత్సరములో "ద ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సోషియాలజి" అనే గ్రంథాన్ని ప్రచురించాడు. జార్జి పేనె చేసిన విశేషకృషి ఆయనకు "విద్యా సమాజశాస్త్ర పితామహుడనే (Father of Educational Sociology) పేరు తెచ్చిపెట్టింది.

## సమాజంలో విద్యనందించే సంస్థలు – వాటి పాత్ర

ప్రతి సమాజంలో (ఏ దేశమైనా, రాజ్యమైనా) వివిధ సంస్థల ద్వారా విద్యా వ్యాప్తి జరుగుతుంది. ఈ సంస్థలు పాఠ్యాంశాలు నేర్పేవేకాక ఆ ప్రాంతానికి చెందిన, ఆ దేశానికి చెందిన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు విలువలు వంటివి అందిస్తూ సంపూర్ణమూర్తిమత్వం కలిగిన పౌరులను తయారు చేయడానికి తోడ్పడతాయి.

అయితే ఈ సంస్థలను ఎన్నో విధాలుగా వర్గీకరించవచ్చు. ఉదాహరణకు కొన్ని వర్గీకరణలను ఇక్కడ చర్చించుకుందాం.

**మొదటి వర్గీకరణ :**

**విద్యా సంస్థలు**

| **ప్రత్యక్ష సంస్థలు** | **పరోక్ష సంస్థలు** |
|---|---|
| పాఠశాలలు | సినిమాలు |
| కళాశాలలు | రేడియో |
| మతసంస్థలు | టెలివిజన్ |
| కుటుంబం | దినపత్రికలు మొదలైనవి. |
| ఆటల సమూహాలు | |
| యువజన సంఘాలు | |
| సాంఘిక క్లబ్బులు మొదలైనవి. | |

**రెండో వర్గీకరణ :**

**విద్యా సంస్థలు**

| **నియత సంస్థలు** | **అనియత సంస్థలు** | **యాదృచ్ఛిక సంస్థలు** |
|---|---|---|
| పాఠశాలలు | పాఠశాలేతర సంస్థలు | కుటుంబం |
| కళాశాలలు | సార్వత్రిక పాఠశాలలు | ఇరుగు పొరుగు |
| మతసంస్థలు | అనియత విద్యాకేంద్రాలు | సంఘం |
| గ్రంథాలయాలు | వయోజన విద్యా కేంద్రాలు | సాంస్కృతిక సంస్థలు |
| మ్యూజియంలు | మొదలైనవి. | యువజన క్లబ్బులు |
| వ్యవస్థీకృతమైన | | బహుళ ప్రసార మాధ్యమాలు |
| క్రీడావినోద కేంద్రాలు మొదలైనవి | | సమవయస్కుల సమూహాలు మొ॥ |

పై సంస్థలన్నియు విద్యాప్రతినిధి సంస్థలే. విద్యనందించుటలో వాటి పాత్రను గురించి తెలిసుకుందాం.

### 1. విద్యా ప్రతినిధి సంస్థగా కుటుంబం:

అతిపురాతనమైన సామాజిక వ్యవస్తే కుటుంబం. ఇది యాదృచ్ఛిక విద్యాసంస్థ. కుటుంబం వ్యక్తికి మొదటి పాఠశాల. తల్లిదండ్రులు మొదటి గురువులు. విద్యకు కుటుంబం ఒక మూల స్థంభం లాంటిది.

కుటుంబం ఇచ్చే శిక్షణా పునాదిపై బాలల భావి విద్య ఆధారపడి ఉంది అని ఫ్రోబెల్ అన్నారు.

### క్లుప్తంగా కుటుంబం నిర్వర్తించే విధులు

- భౌతిక వికాసం
- ఉద్వేగ సమతౌల్యం
- వృత్తి నైపుణ్యాభివృద్ధి
- ఆధ్యాత్మిక చింతనాభివృద్ధి
- నైతిక విలువలు పెంపొందించడం.
- వినోదాత్మక వాతావరణాన్ని కల్పించడం.
- భాషాభివృద్ధికి తోడ్పడటం.

ఇలా పిల్లల విద్యార్జన, మూర్తిమత్వాభివృద్దిలో కుటుంబం పాత్ర అత్యంత ముఖ్యమైనది.

### 2. సమాజం – విద్య

మానవ సమూహము, మానవ సంఘం, మానవ సముదాయం ఇలా నిత్యం ఎన్నో రకాల పదాలతో మనం సమాజం గురించి చర్చించుకుంటాం.

ప్రతి సమాజం కొన్ని విద్యాపరమైన విధులను నిర్వహించాలి. భావిపౌరులకు సరైన గమ్యాన్ని చూపించాలి. సమాజాన్ని ఒక తాటిపైన నడిపే అధికారులు గాని, పెద్దలుగాని, విద్యార్థి సంఘాలు గాని సమన్వయంతో ఉండి సామాజిక విధులను కొనసాగించవలసి ఉంటుంది.

### సమాజం – విధులు

- సాంఘికీకరణం చేయడం; తన సంస్కృతి కట్టుబాట్లకు అనుగుణంగా ప్రతివ్యక్తిని తీర్చిద్దిదడం.
- సంస్కృతి, విలువలు, విజ్ఞానాన్ని తరతరాలకు అందించవలసిన బాధ్యత కల్గి యుంటుంది.
- వృత్తిపరమైన శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పనా బాధ్యత చేపట్టడం.
- సామాజిక నియంత్రణ, అనగా ఆయా సమాజాల్లోని వ్యక్తుల ప్రవర్తనకు సంబంధించిన విలువలు, నియమాలు సరిగా పాటించే విధంగా వివిధ స్థాయిల్లో సామాజిక అధికారుల ద్వారా, న్యాయ వ్యవస్థల ద్వారా నియంత్రణా విధానాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది.
- విజ్ఞాన సాంకేతికాభివృద్ధికి విజ్ఞాన ప్రసారం జరగాలి. విజ్ఞాన ప్రసారం అనగా అంతవరకు సముపార్జించిన విజ్ఞానాన్ని తరతరాలకు అందించడం. ఈ బాధ్యత సమాజానిదే.

- పాఠశాల అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయడం.
- సమాజం, పాఠశాల కలిపి కొన్ని కార్యక్రమాలు చేపట్టాలి. ప్రధానంగా అక్షరాస్యత, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు.

### 3. ప్రభుత్వేతర విద్యా సంస్థలు-విద్య:

విద్యా ప్రసారంలో ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు కూడా ముఖ్యపాత్రను నిర్వహిస్తున్నాయి. మన రాజ్యాంగంలోని ఆర్టికల్ 45ను అనుసరించి అందరికి విద్యను అందించాలంటే ఈ ప్రభుత్వేతర సంస్థల సహకరం తప్పనిసరి.

ఈ సంస్థల్లో కొన్ని ప్రత్యక్ష విద్యాసంస్థలుగా వివిధ స్థాయిల్లో విద్యను అందిస్తాయి. మరికొన్ని సంస్థలు పరోక్షంగా విద్యను అందిస్తూ సమగ్ర మూర్తిమత్వ పెంపుదలకు, బాలల సాంఘీకరణకు దోహదం చేస్తాయి. కొన్ని సంస్థలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పూర్వప్రాథమిక, ప్రాథమిక, సెకండరీ, ఉన్నత విద్యాస్థాయిల్లో విద్యార్థులకు విద్యను అందించే కార్యక్రమాలను చేపట్టాయి. వీటిలో అతి ముఖ్యమైన సంస్థలు 1) సామాజిక సంస్థలు 2) సాంస్కృతిక సంస్థలు 3) మతపరమైన సంస్థలు.

ఇవి అన్నీ స్వచ్ఛంద సంస్థలుగా పనిచేస్తాయి. కొన్ని సంస్థల్లో సభ్యత్వం అందరికీ ఉంటుంది. కొన్నింటిలో కొందరికే పరిమితం అవుతుంది. వీటిని ప్రాంతీయ, రాష్ట్రీయ, జాతీయ, విదేశీ స్థాయిల అవసరాల ఆధారంగా స్థాపించి నిర్వహిస్తారు.

ఈ సంస్థలు మన రాజ్యాంగం ఆకాక్షించిన లౌకిక, ప్రజాస్వామ్య సమాజ సాధనకు తోడ్పడతాయని ఆశిద్దాం.

### 4. విద్యాప్రతినిధి సంస్థలుగా బహుళ ప్రసారమాధ్యమాలు

నేటి సమాజం సాంకేతికంగా విప్లవాత్మక మార్పులు జరిగి ఎంతో అభివృద్ధి చెందింది. ఈ ఆధునిక వైజ్ఞానిక, సాంకేతిక ప్రగతిలో బహుళ ప్రసార మాధ్యమాల పాత్ర చాలా కీలకమైనది. ఇవి పౌరుల్లో విద్యావ్యాప్తికి చక్కటి భాగస్వామ్యం వహిస్తాయి. నేడు ఈ మాధ్యమాల సహాయం ఎంతో అవసరం. అంతేగాక ఇవి సాంఘికీకరణలో కూడా ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి.

### బహుళప్రసార మాధ్యమాలలో ముఖ్యమైనవి

1. ముద్రణ – పత్రికలు, పుస్తకాలు, గ్రంథాలు, కరపత్రాలు మొదలైనవి.
2. చలనచిత్రాలు
3. రేడియో
4. టెలివిజన్
5. అంతర్జాలం

3SEX18

విద్యా రంగములో నేడు ప్రసార మాధ్యమాలు ఎంతగానో ఉపయోపడుతున్నాయి. అనియత విద్యలోనే కాక నియత విద్యలో కూడా వీటి పాత్ర, ప్రాముఖ్యత చాలా ఎక్కువగా యున్నది. అయితే వీటిని సరియైన క్రమంలో వినియోగించుకోవడం, వినియోగించుకొనేటట్లు చూడడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రభుత్వము, సమాజం మరియు వ్యక్తులు శ్రద్ధ తీసికోవాల్సిన అవసరం ఎంతగానోయున్నది.

## 1.1.3 మానవ సమాజాలలో ఒక ప్రక్రియగా మరియు ఫలితంగా విద్య (Education as a process and product in Human Societies)

విద్యను ఒక ప్రక్రియగాను, ఒక ఫలితంగాను పరిగణించవచ్చు. విద్యార్థిలో అనుభవాల ద్వారా మరియు అభ్యసనం ద్వారా విజ్ఞానాన్ని, నైపుణ్యాలను, భావాలను, విలువలను అభివృద్ధి చేసే కార్యక్రమమును విద్యాప్రక్రియ అనవచ్చు.

విద్యను ప్రక్రియతో పాటు ఫలితంగా కూడా పేర్కొంటారు. ఒక వ్యక్తిని మనం విద్యావంతుడు అంటున్నాం అంటే ఆ వ్యక్తి తన సమూహ సంస్కృతి యొక్క విజ్ఞానం, నైపుణ్యాలు, వైఖరులు, విలువలు, ఆదర్శాలు మొదలైనవి ఆకళింపుచేసుకొన్నాడని అర్థం చేసుకోవాలి. కొంత కాలం అభ్యసన ఫలితంగా పొందిన "జ్ఞానమే" ఈ ఫలితం. ఇది విద్యా ప్రక్రియ ద్వారా వ్యక్తిసాధించిన మొత్తం ఫలితం.

విద్యా ప్రక్రియ జీవితాంతపు ప్రక్రియ మరియు గతిశీల ప్రక్రియ. విద్య అనేది ఒక క్రమబద్ధమైన ప్రక్రియ కూడా. ఈ విద్యా ప్రక్రియ ఎన్ని విధాలో గమనిద్దాం.

విద్యా ప్రక్రియలో ముఖ్యమైన అంశాలను ఆధారం చేసుకుని విద్యను మూడు రకాలైన ప్రక్రియలుగా విభజించవచ్చు. అవి : 1. ఏకధృవ ప్రక్రియ (unipolar process) 2. ద్విధృవ ప్రక్రియ (bipolar process) 3. త్రిధృవ ప్రక్రియ (tripolar process)

### 1. ఏకధృవ ప్రక్రియ :

పూర్వకాలంలో విద్యను ఏకధృవ ప్రక్రియగా భావించేవారు. ఈ ప్రక్రియా విధానములో విద్యార్థులు, ఉపాధ్యాయుడు చెప్పిన ప్రతి పాఠ్యాంశాన్ని ఎలాంటి తర్కవితర్కాలు లేకుండా అభ్యసించేవారు. ఇక్కడి విద్యార్థులు నిష్క్రియాత్మక అభ్యాసకులు (passive learners) గా ఉంటే ఉపాధ్యాయులు క్రియాత్మక బోధకులుగా ఉండేవారు. బోధనాభ్యసన కార్యక్రమాల్లో ఉపాధ్యాయుని ఆధిపత్యం అధికంగా ఉండేది.

**ఉపాధ్యాయుడు – విద్య – విద్యార్థులు**


### 2. ద్విధృవ ప్రక్రియ

తరువాత కాలములో విద్యను ద్విధృవ ప్రక్రియగా పరిగణించారు. విద్య ద్విధృవ ప్రక్రియ అని తొలుత ప్రకటించిన వారు జాన్ ఆడమ్స్ (John Adams). ద్విధృవ ప్రక్రియలో ఇద్దరి వ్యక్తుల పాత్ర వుంటుంది. ఒకరు ఉపాధ్యాయుడు, మరొకరు విద్యార్థి. ఉపాధ్యాయుడు బోధిస్తే విద్యార్థి అభ్యసిస్తాడు. విద్యార్థి తన అవగాహన, అనుమానాలకు అనుగుణంగా ప్రశ్నలు వేస్తే వాటికి ఉపాధ్యాయుడు తగిన సమాధానాలు ఇస్తాడు. ఇలా ద్విధృవ ప్రక్రియలో ఉపాధ్యాయుడు మరియు విద్యార్థులు పరస్పర చర్య మరియు ప్రతిచర్యల ద్వారా బోధన మరియు అభ్యసన కృత్యాలను నిర్వహిస్తారు. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయుడు, విద్యార్థులు ఆశించిన విద్యాలక్ష్యాలను సాధిస్తారు. ఇక్కడ ఉపాధ్యాయ విద్యార్థుల సంబంధాలు చేతనంగా (conscious) మరియు ఉద్దేశపూర్వకంగా (delibarate) ఉంటాయి.

### 3. త్రిధృవ ప్రక్రియ

విద్య సమాజానికి వెలుపల ఉన్నపుడు మాత్రమే విద్య ద్విధృవ ప్రక్రియగా ఉండటం సాధ్యమని, అది సమాజంలో భాగంగా ఉన్నపుడు విద్యాక్రమంలో జరిగే ప్రతి కృత్యంపై బయటి సమాజపు ప్రభావము తప్పనిసరిగా ఉంటుందని

భావించి విద్యను సామాజిక క్రమంగా (education as a social process) అర్థం చేసుకోవడం ప్రారంభించారు. దీనిలో విద్య మూడు ధృవాల మధ్య జరిగే ప్రక్రియగా గుర్తించడం జరిగినది. ఈ ప్రక్రియను జాన్ డ్యూయీ మొదట ప్రతిపాదించాడు. ఇందులో విద్యార్థి, ఉపాధ్యాయులన్న ధృవాలతో పాటు, సమాజం అన్నమూడవ ధృవము విద్యా ప్రక్రియలో వచ్చిచేరింది. గురువు ఎంత సమర్థవంతంగా బోధించినప్పటికీ, విద్యార్థి సహజ ఆసక్తులను ఎన్ని కల్గిఉన్నప్పటికీ విద్యార్థి అభ్యసనను అతని సామాజిక నేపథ్యం ప్రభావితం చేస్తుంది. కాబట్టి విద్యను త్రిధృవ ప్రక్రియగా పేర్కొనడం జరిగినది. విద్య త్రిధృవ ప్రక్రియ అని కింది పటం ద్వారా చూపవచ్చు.




ఉపాధ్యాయులైనా, విద్యార్థులైనా సామాజిక అవసరాలకు అనుగుణంగా తమ తమ విధులను నిర్వర్తించినపుడే విద్యార్థి భావి జీవితంలో మంచి పౌరునిగా సమాజంలో నిలబడగలుగుతాడు. కనుక ఉపాధ్యాయుడు, విద్యార్థి మరియు సామాజిక పరిసరాల అన్యోన్య సహకారంతో విద్యా ప్రక్రియ జరగాలి.

"ఓటమి ఎరుగని వ్యక్తివి కావడం కన్న, విలువలకు ప్రాధాన్యమిచ్చే వ్యక్తివి కావడానికి ప్రయత్నించు" – ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

## 1.2 విద్యా గమ్యాలు మరియు విలువలు:రాజ్యాంగ విలువలు, ఎన్‌పిఇ 1986, ఎన్‌సిఎఫ్ 2005, ఎపిఎస్‌సిఎఫ్ 2011

**(Aims and Values of Education : Constitutional Values, NPE 1986, NCF 2005, APSCF 2011)**

విద్యా ధ్యేయాలకు ఆధారం జీవిత ధ్యేయాలు. జీవిత ధ్యేయాలకు ఆధారాలు సమాజ సంస్కృతులు. విద్యారంగములో ధ్యేయాలకు, ఉద్దేశాలకు ప్రముఖ స్థానముంటుంది. ఇవి విద్యా విధానాన్ని, విద్యా ప్రణాళికలను రూపొందించడానికి మార్గదర్శకాలుగా ఉంటాయి. అందువల్లనే ధ్యేయాలను శక్తివంతమైన మేలు విత్తనాలుగా పేర్కొనడమైనది. వీటి నుంచి మంచి విద్యా విధానాలు అనే మొక్కలు పెరుగుతాయి. (Aims are potential seeds from which grows the plant and good education policy)

విలువలు మానవ సంస్కృతిలో ఒక భాగం. మనిషిని ఉన్నతుణ్ణి చేసేది విలువలే. సమాజంలో స్థిరత్వానికి విలువలే మూలం. మనిషి ప్రవర్తనకు ఇవి సాధారణ మార్గదర్శకత్వాలను అందిస్తాయి. మనిషిని, సమాజాన్ని అదుపులో పెట్టడానికి ఇవి గొప్ప సాధనాలు. వారిదైనందిన జీవితాలను, వారి ప్రాధాన్యతలను నిర్ణయించుకోవడంలోను, వారి కష్ట సుఖాలను మాపనం చేసికొనడంలోను వ్యక్తులు ఉపయోగించే ప్రమాణాలే విలువలు. విద్యకు విలువలకు మధ్య బలమైన సంబంధం ఉంది.

## విద్యా ధ్యేయాలు (Aims of Education)

**ఆవశ్యకత:** విద్యా ప్రక్రియను ప్రతిచోట, ప్రతివారు, ప్రతియుగములోను దాని గమ్యాల పరిభాషల్లో చర్చించడం జరిగినది. విద్యలో గమ్యాల ప్రాధాన్యతను అన్ని కాలాల్లోను పండితులు, తత్వవేత్తలు, విద్యావేత్తలు నొక్కిచెప్పారు.

జాన్‌డ్యూయి గారన్నట్లు "ఒక లక్ష్యముతో పనిచేయడము అంటే తెలివిగా వ్యవహరించడమే". లక్ష్యాలు స్పష్టంగా లేనటువంటి ఎటువంటి విద్యా విధానమైన విఫలమవకతప్పదు. బి.డి.భాటియా విద్యాలక్ష్యాల ప్రాధాన్యతను ఈ మాటల్లో చక్కగా వివరించారు. "లక్ష్యాల విజ్ఞానము లేకపోతే విద్య తన లక్ష్యమేమిటో, గమ్యమేమిటో తెలియని నావికుడి వంటిది. అప్పుడు విద్యార్థి ఎక్కడికో తీరానికి, ప్రవాహవేగానికి కొట్టుకొని పోయిన చుక్కాని లేని నావ వంటివాడు. ఇంకా స్పష్టంగా విద్యా లక్ష్యాల ప్రాధాన్యతను ఈ క్రింది మాటల్లో చెప్పవచ్చు.

- లక్ష్యాలు విద్యా నిర్వహణకు ఒక మార్గాన్ని చూపుతాయి.
- కాలాన్ని పొదుపుగా వాడుటకు, తెలివిగా వ్యవహరించుటకు దోహదపడును.
- విద్యా ప్రక్రియ ఫలితాలను అంచనావేయుటకు తోడ్పడును.
- సమర్థవంతమైన పాఠశాల పరిపాలన కొరకు అవసరం.
- తల్లిదండ్రులు, జన బాహుళ్యం పాఠశాల విధానాన్ని అనవసరంగా విమర్శించకుండా తోడ్పడును.
- అర్థవంతంగా పనిచేయడానికి, విద్యకు నిరంతరతను కల్పించుటకు తోడ్పడుతాయి.

### విద్యాధ్యేయాలు నిర్ణయించే అంశాలు :

విద్య అనేది ఒక విస్తృత భావన. విద్యావేత్తలు, మేధావులు, తత్వవేత్తలు, రాజకీయ వేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, విద్య యొక్క అర్థాన్ని ధ్యేయాలను వారి వారి కోణాల్లో తెలియచేశారు.

1. తాత్విక కారకాలు – విద్య (Philosophical factors)
2. సామాజిక కారకాలు
3. ఆర్థిక కారకాలు
4. రాజకీయ కారకాలు
5. విజ్ఞానశాస్త్ర –సాంకేతికశాస్త్ర కారకాలు

### విద్యాధ్యేయాలు రకాలు :

విద్య స్థాయిని బట్టి, స్వభావాన్ని బట్టి విద్యా ధ్యేయాలు మారుతూఉంటాయి. విద్యాధ్యేయాలను ప్రధానంగా రెండు భాగాలుగా విభజించారు.

అవి 1. సాంప్రదాయక విద్యాధ్యేయాలు 2. సమకాలీన విద్యా ధ్యేయాలు.

### సాంప్రదాయక విద్యా ధ్యేయాలు :

ఇవి వివిధ రకాలుగా యున్నాయి. అవి : 1) జ్ఞానం కోసం విద్య 2) శీలం కోసం విద్య 3) వృత్తికోసం విద్య 4) సాంస్కృతిక వారసత్వం కోసం విద్య 4) విరామ కాల సద్వినియోగం కోసం విద్య 6) ఆత్మసాక్షాత్కారం కోసం విద్య 7) మానవత్వం కోసం విద్య.

**సమకాలీన విద్యా ధ్యేయాలు :** ఇవి వివిధ రకాలుగా యున్నాయి. అవి:

1. ప్రజాస్వామ్యం కోసం విద్య.
2. పౌరసత్వం కోసం విద్య.
3. సంపూర్ణ మూర్తిమత్వాభివృద్ధి కోసం విద్య.
4. జాతీయ సమైక్యత కోసం విద్య.
5. అంతర్జాతీయ అవగాహన కోసం విద్య.
6. ప్రపంచ శాంతి కోసం విద్య.

**విలువల భావన మరియు ప్రాధాన్యత**

**భావన:**

మనం సాధారణంగా ఏది కావాలనుకుంటామో లేదా ఏమి అవ్వాలనుకుంటున్నామో దానికి విలువఇస్తాం. పసిబిడ్డ తనతల్లికి, పాలసీసాకు విలువిస్తుంది. ఎందుకంటే ఈ రెండూ తన ఆకలిని తీరుస్తాయి.

బిడ్డ పెరిగి పెద్దై బాల్యదశకొచ్చేసరికి తన మనస్సును నూతన విలువలు ఆక్రమించేస్తాయి. ఇక్కడ పిల్లవాళ్ళకు ఆటవస్తువులు విలువైనవిగా కనిపిస్తాయి. బాల్యదశనుంచి కౌమారదశకు వచ్చేసరికి స్నేహితులు విలువైన వారిగా పరిగణించబడతారు.

అయితే పాలసీసా, తల్లి, ఆటవస్తువులు లేదా వ్యక్తులను పొందటానికే విలువలు పరిమితమవ్వవు. ఈ విలువలు ఇప్పుడు పేర్కొన్న భౌతిక విలువలు కావచ్చు సత్యం, శాంతి వంటి అమూర్త విలువలు లేదా గుణాలు కావచ్చు.

అయితే మనం ఏమి ఆశిస్తున్నామో, ఏమి అవ్వాలను కుంటున్నామనేదే విలువలకు సంబంధించిన కీలకాంశము. ఉదాహరణకు ఒక పిల్లవాడు మంచి అథ్లెట్ అవ్వాలని కోరుకుంటున్నాడనుకుందాం. అప్పుడతడు వ్యాయామ కార్యకలాపాలకు ఎక్కువ విలువ ఇస్తాడు.

విలువలనేవి మనం సాధించాలనుకునే వాటికి మనం ఏర్పాటు చేసికొన్న ఆదర్శాలుగా చెప్పవచ్చు. విద్య విద్యార్థులలో మంచి విలువలను పెంపొందిస్తే విద్యార్థులు తమ జీవితాలను సుఖమయం చేసికోవడానికే కాక వారు దేశాభివృద్ధికి కూడా పాటుపడేటట్లు చేసినట్లు అవుతుంది.

విద్యా విలువల గురించి చెప్తూ బ్రుబేచర్ విద్యా విలువలను పేర్కొనడమంటే విద్యా లక్ష్యాలను పేర్కొనడమే అంటారు. విద్య సమాజంలోని విలువలను పరిరక్షించడమేకాక పెంపొందిస్తుంది కూడా.

**ప్రాధాన్యత:**

- సంపూర్ణ మూర్తిమత్వాభివృద్ధికి విలువలతో కూడిన విద్య ఎంతో ప్రాధాన్యతనిస్తుంది.
- మతసహనం, అహింస శాంతియుత సహజీవనం, కరుణ వంటి విలువలను పెంపొందించినట్లయితే సామాజిక ఐక్యతను సాధించేవీలవుతుంది.

- శాస్త్ర, సాంకేతిక రంగాలలో జరిగిన అభివృద్ధితో పాటు పర్యావరణ కాలుష్యం, ఓజోన్ పొరకు తీవ్ర ప్రమాదం ఏర్పడటం చూస్తున్నాం. శాస్త్రీయ, ఆర్థిక సమస్యల పరిష్కారానికి విలువల విద్య అవసరం ఎంతో వున్నదని కొఠారి కమీషన్ పేర్కొంది.
- విజ్ఞానంతో పాటు విలువలను కూడా విద్యార్థులలో పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా యున్నది.

**విలువల రకాలు :**

విలువలను అనేక రకాలుగా చెప్పవచ్చు. అవి వ్యక్తిగత విలువలు, శాస్త్రీయ విలువలు, మానవీయ విలువలు, రాజ్యాంగ విలువలు, సాంస్కృతిక విలువలు, సామాజిక విలువలు మొదలైనవి.

## 1.2.1 భారత రాజ్యాంగము పేర్కొన్న విద్యా ధ్యేయాలు

రాజ్యాంగం ఏ దేశానికైనా అనేక అభివృద్ధి విషయాలకు సంబంధించి పాలనా విధానాలను శాసించే మూలపత్రంగా వుంటుంది. మన రాజ్యాంగములో కూడా విద్యకు సంబంధించి కొన్ని ఆర్టికల్స్‌ను, క్లాజులను చేర్చారు. విద్యకు సంబంధించి మన రాజ్యాంగములో చెప్పిన అంశాలను బట్టి విద్యాధ్యేయాలుగా ఈ క్రింది వాటిని పేర్కొనవచ్చు.

**నిర్దిష్ట ధ్యేయాలు**

1. 6–14 వయస్సు గల పిల్లలందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించడం.
2. మైనారిటీలకు విద్యా సంస్థలను స్థాపించుకునే హక్కుని ఇవ్వటం.
3. ప్రాథమిక దశలో మాతృభాషలోనే విద్యను బోధించడం.
4. జాతీయ భాష అధ్యయనాన్ని ప్రోత్సహించడం.
5. సామాజికంగా వెనుకబడిన వర్గాల వారికి విద్యా సౌకర్యాలు కల్పించడం.
6. స్త్రీలలో విద్యను పెంపొందించడం.

**సాధారణ ధ్యేయాలు :**

1. సార్వభౌమ, సర్వసత్తాక, లౌకిక రాజ్యాన్ని స్థాపించుటలో తోడ్పడటం.
2. ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయాన్ని సాధించటం.
3. వాక్ స్వాతంత్ర్యాన్ని, తమ విశ్వాసాలను కాపాడుకునే హక్కును ప్రజలకు కల్పించటం.
4. ప్రజలందరికి అభివృద్ధి పరంగా సమానావకాశాలను కల్పించడం.
5. సౌభ్రాతృత్వాన్ని పెంపొందించట.
6. జాతి ఐక్యతను, సమైక్యతను కాపాడటం.
7. ప్రజాస్వామ్యాన్ని పెంపొందించటం.

**భారత రాజ్యాంగములో పొందుపరచిన ప్రముఖమైన విలువలు**

| | | |
|---|---|---|
| 1. ప్రజాస్వామ్యం | 2. సామ్యవాదం | 3. సమానత్వం |
| 4. న్యాయం | 5. లౌకిక వాదం | 6. జాతీయ ఐక్యత |

మన భారత రాజ్యాంగ అవతారిక (preamble) పైన పేర్కొన్న విలువలను ఆధారంగా చేసికొని ప్రజల అభివృద్ధికి మార్గాన్ని చూపించమని చెప్పింది. ఈ విలువలను ఆధారంగా చేసికొని విద్య అమలుకు తగిన రాజ్యాంగ ఏర్పాట్లు చేయడం జరిగినది.

భారత రాజ్యాంగం ద్వారా భారతదేశానికి గణతంత్ర ప్రతిపత్తి వచ్చింది. 1950 జనవరి 26న భారత రాజ్యాంగాన్ని అమలు పరచిన తరువాత స్వతంత్ర భారత దేశం సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించింది. ప్రభుత్వము ఎలా ఉండాలి, పరిపాలన ఎలా జరగాలి అనే విషయాలను రాజ్యాంగం నిర్దేశించింది.

విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 29లో సూచించిన అంశాలలో విద్యార్థులలో రాజ్యాంగ విలువలను పెంపొందించాల్సిన అవసరాన్ని నిర్దేశించింది. అట్టి రాజ్యాంగ విలువలను పాఠ్యాంశంలో బోధన చేసేటపుడు ఉపాధ్యాయుడు గుర్తించి విద్యార్థులకు అందించాల్సిన అవసరం ఉంది. ఎందుకనగా రాజ్యాంగపు విలువలను విద్యార్థులలో కల్గించకపోతే ఉత్తమ పౌరులుగా రాణించలేరు.

భారత రాజ్యాంగం ప్రపంచంలోకెల్ల విశిష్టమైనది. మన ఆశయాలు, రాజ్యాంగపు లక్ష్యాలను విద్యార్థులకు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా రాజ్యాంగ విలువలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం, న్యాయం, ప్రజాస్వామ్యం వంటివి అత్యంత కీలకమైనవి. భారత రాజ్యాంగపు ప్రవేశికలో పౌరులందరికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందిస్తూ ఆలోచనలో భావప్రకటనలో స్వాతంత్ర్యాన్ని చేకూర్చుటకు హామీనిచ్చింది.

**రాజ్యాంగపు విలువలు :**

ఈ విలువలను విద్య ద్వారా పిల్లల్లో పెంపొందించాలి.

- అంతస్తుల్లోను, అవకాశాల్లోను సమానత్వాన్ని సాధించడం.
- వ్యక్తిగౌరవం, శ్రమపట్ల గౌరవం.
- రాజ్యాధికారానికి ప్రజలే మూలమని తెలిసికోవడం.
- అన్ని మత విషయాల పట్ల రాజ్యాంగం తటస్థ వైఖరిని అవలంభించడం.
- న్యాయం, సమానత్వం లేని స్వేచ్ఛ నిరూపయోగం అని గుర్తించడం.
- పౌరులందరికి సమాన అవకాశాలు లభించాలని కోరుకోవడం.
- అందరికొరకు ఒక్కరు, ఒక్కరి కొరకు అందరు అనే భావం పెంపొందించడం.
- ఓటు విలువను తెలిసికోవడం, తమకున్న ఓటు హక్కును వినియోగించుకోవడం.
- సాంఘిక అసమానతలను రూపుమాపి సామాజిక న్యాయాన్ని సాధించడం.
- నిరుపేదల పట్ల, రోగుల పట్ల, ప్రాణుల పట్ల దయాగుణం కలిగి వుండటం.
- పర్యావరణాన్ని సంరక్షించడం, రాబోవుతరాలకు మంచి పర్యావరణాన్నీ, ప్రకృతి వనరులను అందించడం.

పాఠశాలలో కల్పించే అభ్యసన అనుభవాలు పిల్లలు రాజ్యాంగ బద్ధమైన పౌరులుగా ఎదిగేందుకు సహాయపడేదిగా ఉండాలి. అలా ఉన్నప్పుడే విలువలతో కూడిన నూతన తరాన్ని నిర్మించడానికి సాధ్యమవుతుంది.

### 1.2.2 1986 జాతీయ విద్యా విధానం (National Policy of Education - NPE 1986)

మారుచున్న దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితులతో పాటు విద్యావిధానం కూడా మారుతూఉండాలి. అలా మార్పు చెందనిచో విద్యావ్యవస్థకు, ప్రజల ఆశయాలకు, అవసరాలకు అనుబంధముండదు. అట్టి పరిస్థితులలో విద్యావ్యవస్థ నిరర్థకమవుతుంది.

స్వాతంత్ర్యము వచ్చిన తరువాత దేశములో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మార్పులు శరవేగంగా వచ్చాయి. వాటికనుగుణంగా విద్యా విధానములో మార్పులు రాలేదు. ఆలోపాన్ని గుర్తించి భారత ప్రభుత్వ విద్యామంత్రిత్వ శాఖ "విద్యా సవాళ్ళు – విధాన దృక్పథం" (challenges in education, a policy perspective) అనే పత్రాన్ని ప్రజాభిప్రాయ సేకరణకు విడుదల చేసింది.

దాని ప్రకారం విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర సాంఘిక, రాజకీయ సమస్యలు, విద్యాభివృద్ధిపై వాటి ప్రభావం, నాటి విద్యా పరిస్థితి, భవిష్యత్‌లో ఎటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి అనే అంశాలను గురించి వివరంగా విద్యావేత్తలనుంచి, ఉపాధ్యాయ సంఘాల నుంచి, సామాన్య ప్రజలనుంచి దేశం యొక్క నలుమూలల నుంచి సూచనలను సేకరించింది. వాటన్నిటిని పరిశీలించి, విశ్లేషించి, క్రోడీకరించి ఆనాటి మానవ వనరుల శాఖామాత్యులు శ్రీపి.వి. నరసింహారావుగారు ఒక జాతీయ విద్యావిధానమును 1986 (Document I) అను ఒక అధికార పత్రమును పార్లమెంటులో ప్రవేశపెట్టి దాని ఆమోదము పొందినారు. ఇదియే నూతన జాతీయ విద్యావిధానం 1986. ఈ చట్టంలోని సూచనలు అమలు చేయటానికి మరొక అధికార పత్రం, ఆచరణాత్మక కార్యక్రమం (Programme of Action) . ను కూడా విడుదల చేసినారు. అందులో సూచించిన విద్యాధ్యేయాలు.

- సార్వత్రిక విద్యను సాధించడం.
- సమాన విద్యావకాశాలను పెంపొందించడం.
- జాతీయ సమైక్యత సాధించడం, అంతర్జాతీయ శాంతికి తోడ్పడటం.
- శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడం.
- ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద ఆశయాలను సాధించడం.
- మానవ వనరులను సక్రమంగా వినియోగించడం.
- సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందించడం.
- జనాభా నియంత్రణ.
- స్త్రీలకు సమాన ప్రతిపత్తిని కల్పించుట.
- ఉన్నత ప్రమాణాలు గల విద్యను అందరికీ అందుబాటులో ఉంచుట.

**జాతీయ విద్యావిధానం ప్రాథమిక ఆశయాలు:**

విద్యావ్యవస్థలో సార్వజనీన ప్రాథమిక విద్యకు జాతీయ విద్యా విధానములో అత్యధిక ప్రాముఖ్యతనివ్వడం జరిగింది. జాతీయ విద్యా విధానము దృష్టిలో ప్రాథమిక విద్య ఆశయాలు.

1. ఆధునికీకరణ, శాస్త్రీయ దృక్పథమును పెంపొందించుట.
2. గ్రామీణాభివృద్ధికి మానవ వనరులను పెంపొందించుట.
3. సామాజిక వ్యక్తిగత విలువలను పెంచుట.

4. ప్రజాస్వామ్య సమసమాజ పునర్నిర్మాణానికి పునాది వేయుట.
5. జాతీయ సమైక్యతకు దోహదము చేయుట.
6. భారతీయ సంస్కృతిని పునరుజ్జీవింపచేయుట.

ఇవి జాతి భవిష్యత్తుకు మూలాధారము. అయితే ఈ క్రింది లక్ష్యాలను ఈ శతాబ్దములోనే సాధించాలి. అవి :

1. బడి వయస్సు బాలబాలికలందరినీ పాఠశాలలో చేర్చి వారికి 14 సం॥ వయసు నిండే వరకు గాని లేదా కనీసం 5వ తరగతి పూర్తిచేసే వరకు గాని పాఠశాలలోనే ఉండేటట్లు చూచుట.
2. విద్యా ప్రమాణాలు గణనీయమైన పురోభివృద్ధిని సాధించుట.

ఈ లక్ష్యాలను సాధించుటకు జాతీయ విద్యా విధానం కొన్ని మార్గాలను ప్రతిపాదించింది. అవి :

1. ఉపాధ్యాయ కేంద్రముగా (Teachers Centre) ఉన్న ప్రాథమిక విద్యను శిశువు కేంద్రముగా రూపొందించాలి. విద్యాప్రణాళిక పాఠశాల కార్యక్రమాలు శిశువు ఆలోచనలకు అభిరుచులకు అనుగుణంగా రూపొందించాలి.
2. పాఠశాల వాతావరణాన్ని, పరిసరాలను విద్యార్థులకు ఆకర్షణీయంగా, సౌకర్యంగా ఉండునట్లు చూడాలి.
3. ఉన్నత ప్రమాణాలను సాధించుటకు అవసరమైన వనరులన్నిటిని పాఠశాలకు కల్పించాలి.
4. సమాజంలోని అన్ని వర్గాల వారికి, బాలబాలికలకు అనుకూలమైన వాతావరణమును, పరిస్థితులను కల్పించాలి.
5. బాలబాలికలందరకూ నియత పాఠశాలల్లో చదువుకొను అవకాశమును కల్పించవలెను. చదువుకొనుటకు అవకాశము లేని వారి కొరకు విస్తృతమైన, వివిధ రకాలైన అనియత విద్యావకాశాలను కల్పించాలి.
6. దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థ నిర్మాణము ఒకే విధముగా ఉండాలి.
7. కార్యక్రమాలను అమలు పరచుటలో ఏ ప్రాంతానికి ఆ ప్రాంత వనరులను, అవకాశాలను గుర్తించి తదనుగుణంగా విద్యా ప్రణాళికలను తయారుచేయాలి.
8. జాతీయ విద్యా విధాన కార్యక్రమాలు అమలు పరచుటలో ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయ సంఘాలకు అధిక ప్రాధాన్యతనియ్యాలి. అన్ని ముఖ్య విషయాలలో ఉపాధ్యాయులతో సలహా సంప్రదింపులు ఉండాలి.
9. కార్యక్రమముల నిర్వహణలో సమాజానికి సన్నిహిత సంబంధము కలిగించాలి.

**జాతీయ విద్యా విధానము 1986 ప్రకారం విద్యా విలువలు (Values of Education - NPE 1986)**

విద్యలో ఉన్నత ప్రమాణాలు సాధించాలంటే ఈ కింద తెలిపిన విలువలతో కూడిన విద్యను అందించవలసిన అవసరము ఎంతైనా ఉంది.

- మన పురాతన సంస్కృతి విలువలు, ఆధునిక సంస్కృతి విలువల రెంటిని విద్యలో సమ్మిళితం చేయాలి.
- వృత్తి విద్యా కోర్సులు పలుస్థాయిల్లో ఏర్పరచి సమానత్వం, పనియొక్క ఔన్నత్యాన్ని పెంపొందించాలని సూచించడం జరిగినది.
- పాఠ్యాంశాలలో వైవిధ్యమైన విలువలను సమ్మిళితం చేసి విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు.
- విద్యాలయాలలో క్రీడలకు, వ్యాయామాలకు సముచిత స్థానాన్నిచ్చి సహకారం, నాయకత్వ లక్షణాలు వంటివి పెంపొందించాలి.

### 1.2.3 NCF - 2005 ప్రకారం ధ్యేయాలు మరియు విలువలు (Aims and Values - Ntional Curriculam Frame work - 2005)

NCF - 2005 ప్రకారం విద్యా ధ్యేయాలు, విద్యా ప్రక్రియలను ఎంచుకున్న ఆదర్శాలు, అంగీకరించిన సూత్రాల ప్రకారం రూపొందించడానికి విస్తృత మార్గదర్శకాలుగా ఉపయోగపడతాయి. ప్రస్తుత సమాజ అవసరాలను, సమాజ ఆకాంక్షలను, విలువలను, తక్షణ సముదాయ ప్రాధాన్యతలను, విస్తృత మానవ ఆదర్శాలను విద్యాధ్యేయాలు ప్రతిబింబిస్తాయి. మొత్తం మీద ఒక సమాజంలో ఉండే సామాజిక విలువల ప్రకారము విద్యా ధ్యేయాలు నిర్ణయించబడతాయి. ఆ ప్రకారంగా చూస్తే విద్యా ధ్యేయాలుగా కింది వాటిని పేర్కొనవచ్చు.

**NCF - 2005 మౌలిక అంశాలు :**

1. ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధత కలిగి యుండటం.
2. సమానత్వం, న్యాయం, స్వాతంత్ర్యము, ఇతరుల సంక్షేమాన్ని పట్టించుకోవడం.
3. లౌకిక వాదము మరియు మానవ హక్కులు వంటి విలువల పట్ల నిబద్ధత కలిగి ఉండటం.
4. ఇతరుల సంక్షేమం పట్ల, వారి అనుభూతుల పట్ల సున్నితంగా స్పందించడం.
5. నేర్చుకున్న అంశాలకు కొత్త సందర్భాలకు సరళంగా, సృజనాత్మకంగా ప్రతిస్పందించడం.
6. ప్రజాస్వామ్య ప్రక్రియలో అందరూ పాల్గొనే సామర్థ్యాన్ని పెంపొందించటం.
7. పనిచేసే సామర్థ్యాన్ని, ఆర్థిక ప్రక్రియల్లో, సామాజిక మార్పు సాధనలో అందరూ పాల్గొనే సామర్థ్యాన్ని పెంపొందించటం.
8. అందాన్ని, కళారూపాలను ఆస్వాదించడం. ఈ ధ్యేయాన్ని సాధించడానికి అవసరమైన కళలను, సాహిత్యానికి సంబంధిత జ్ఞానాన్ని పిల్లలకు అందించటం.

సృజనాత్మక శక్తి, సహజమైన ఆనందం బాల్యానికి కీలకమైనవని ఈ చట్రంలో పేర్కొనడం జరిగింది. అంతేగాక ఈ రెండిటిని పెద్దల ప్రపంచం ధ్వంసం చేస్తున్నదని ఆవేదన చెందారు.

### 1.2.4 రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం 2011 (State Curriculum frame work 2011)

జాతీయ పాఠ్యప్రణాళికా చట్రం 2005, భారత రాజ్యాంగ పీఠిక, విద్యా హక్కు చట్టం 2009 నిర్దేశాల ప్రకారం రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం 2011 (ఎస్.సి.ఎఫ్ 2011) ఈ క్రింది అంశాలను నిర్దేశించింది. వాటిని పరిశీలిద్దాం.

- పిల్లలంతా ఇతరుల భావాలను గౌరవించే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి.
- ప్రకృతిని, పర్యావరణాన్ని గురించి నిశితంగా పరిశీలించగలగాలి. తులనాత్మకంగా ఆలోచించగలగాలి.
- ప్రకృతి వనరుల ప్రాధాన్యతను గుర్తించి వాటి పరిరక్షణకు బాధ్యత వహించాలి.
- జంతు వృక్షజాలం పట్ల దయ, సహనం కలిగి జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు కృషి చేయాలి.
- విన్న, చదివిన వివిధ అంశాలను అర్థం చేసుకొని స్పందించాలి.
- నిర్భయంగా ప్రశ్నించాలి.
- సహానుభూతి, తధానుభూతి కలిగి సమభావనతో మెలుగుతూ మానవ విలువలు పాటించాలి.
- ప్రేమ, దయ, శాంతి భావనలను అర్థం చేసుకొని అనుసరించాలి.
- పరస్పర సహకారం, సోదరభావం కలిగి వ్యవహరించాలి.

- భౌతిక, మానసిక, జ్ఞానాత్మక వికాసాల మధ్య సమతుల్యత ఉండే విధంగా పిల్లల అభివృద్ధి జరగాలి.
- సమాజపు బహుళత్వాన్ని గుర్తించడం మరియు గౌరవించడం ద్వారా తన ఉనికిని చాటుకోగలగాలి.
- అంకితభావం కలిగిన పౌరులుగా రూపొందాలి.
- తోటి మానవుల కష్టసుఖాలలో పాలుపంచుకునేందుకు సిద్ధంగా ఉండడంతోపాటు సున్నితత్వం కలిగిన వ్యక్తులుగా రూపొందాలి.
- ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తూ ఇతరులతో కలిసి పనిచేయడంలో పరస్పరం సహకారం కలిగినవారుగా ఎదగాలి.
- తాను చేస్తున్న పనిపట్ల విషయాలపట్ల విశ్వాసంతో కుతూహలంతో కృషి చేయగలగాలి.
- భిన్నత్వం మనకున్న గొప్పసంపద. మన సమాజంలో ఉన్న విభిన్న సంస్కృతులను గుర్తించాలి. వాటిని గౌరవించాలి. ఆయా సాంస్కృతిక సమూహాలతో ప్రతిచర్య చేయగలగాలి. ఇచ్చిపుచ్చుకోవాలి.
- పిల్లల్లో దాగి ఉన్న విభిన్న నైపుణ్యాలు, కౌశలాలు వెలికి తీసి వాటిని మరింతగా మెరుగుపరచాలి.

మానవత్వం, దయ, సహనం, శాంతి, ప్రేమ వంటి ఉదాత్తమైన మానవ విలువలు ఉన్నప్పుడే సమాజం సుఖసంతోషాలతో విలసిల్లుతుందని అనుకున్నప్పుడు విద్యా లక్ష్యాలు వీటిని సాధించే దిశగా నిర్మితమవుతాయి. శాస్త్రసాంకేతిక ప్రగతి, ఆధునిక ఆవిష్కరణలు మన జీవితాలను సుఖమయం చేస్తున్నాయి. కాబట్టి వాటన్నింటిని అధ్యయనం చేయడం కోసం విద్యాలక్ష్యం నిర్ధారితమవుతుంది.

ఆధునిక కాలంలో ఎదురయ్యే అనేక విపత్తులను, సవాళ్ళను ఎదుర్కొనగలిగే రేపటి తరాన్ని తయారు చేయడం అవసరం కాబట్టి విద్యా లక్ష్యాలను తదనుగుణంగా రూపొందించాలి. పాఠశాల వ్యవస్థ ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను స్వావలంబనం చేయడం, దేశ సమగ్రతను పటిష్టం చేసుకోవడం అవసరం కాబట్టి విద్యా లక్ష్యాలు ఈ దిశగా నిర్ధారితమవుతాయి. స్వభావరీత్యా గతిశీలమైన సమాజం మరియు విద్య ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. దేశీయ వనరులను సద్వినియోగపరచుకొనేలా విద్యా లక్ష్యాలను నిర్ధారించుకోవాలి.

“సమాజంలో నివసించని వ్యక్తి దేవుడైనా అయి ఉండాలి లేక పిచ్చివాడైనా అయి ఉండాలి”. – అరిస్టాటిల్

## 1.3 మానవ స్వభావము, సమాజము, అభ్యసనము మరియు విద్యా ధ్యేయాల యొక్క ప్రాథమిక భావనల అవగాహన (Understanding basic assumption about human nature, society, learning and aims of education )

### 1.3.1 మానవ స్వభావం గురించి ప్రాథమిక భావనలు (Basic assumption about human nature)

**1. మానవ స్వభావము :** మానవుడు స్వేచ్ఛాజీవి. పుట్టుకతో మనిషి స్వతంత్రుడు. కాని విచారకరమైన విషయమేమిటంటే ఎక్కడ చూసినా అతడు సంకెళ్ళతో బంధితుడై ఉన్నాడు. "Man is born free. But he is every where in chains" అని రూసో అన్నాడు. ఈ బంధనాల నుంచి అతడు విముక్తుడైనప్పుడే అతడు అభివృద్ధి సాధిస్తాడు. అతడిలో అంతర్గతంగా ఉన్న శక్తులను స్వేచ్ఛా వాతావరణములో మేల్కొలపాలి. ఇది విద్య ద్వారానే సాధ్యం.

మానవుడు ఒక స్వచ్ఛమైన మనస్సుతో జన్మిస్తాడు. కాని సమాజంలో పెరిగే వాతావరణాన్ని బట్టి వారి మూర్తిమత్వం ఆధారపడి ఉంటుంది.

ఎవరైనా హింసాత్మక వాతావరణం కల్గిన గృహంలోగాని, సమాజంలో గాని, పట్టణములో గాని, దేశంలోగాని లేదా ఖండంలోగాని పెరిగి యుంటే వారు కూడా ఆ సమాజంలో హింసాత్మక సభ్యులుగా మారడానికి అవకాశము యుంటుంది. అలా కాకుండా సమాజంలోని అందరు సభ్యులు స్వీయ వాస్తవికత కోసం శ్రమిస్తూ యుంటే వారిలో సంతోషము ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎలాంటివారైనా తప్పకుండా స్వీయ వాస్తవికతను సాధించడం కోసం ప్రయత్నిస్తారు. సమాజం విజయవంతం కావాలంటే వారికున్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసికుని, సమాజానికి ఉపయోగపడేలా ప్రయత్నించాలి. అప్పుడే వారు ఒక మంచి సమాజాన్ని తయారు చేయగల్గుతారు.

ఆల్‌పోర్ట్ (Allport) మరియు ఎరిక్‌సన్ (Erickson) అనే మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు మానవ స్వభావానికి సంబంధించి ఎనిమిది దశలను తెలియచేశారు.

1. స్వేచ్ఛ–నిర్ణయాత్మకత:– ఇక్కడ స్వేచ్ఛ అనే ఆలోచన వైపు పరుగెత్తడం.
2. హేతుబద్ధత–అహేతుకత :– అహేతుకత కంటే హేతుబద్ధతకు ప్రాముఖ్యత ఇవ్వడం.
3. సంపూర్ణత్వం–ఎలిమెటలిజం:– సంపూర్ణత్వంను ఇష్టపడటం.
4. రాజ్యాంగవాదం–పర్యావరణవాదం:– ఇక్కడ రెండింటి మధ్య సమతుల్యంను నమ్మడం.
5. వస్త్రాశ్రయత–విషయ నిష్టత:– ఈ రెండింటి మధ్య సమతుల్యత ఉన్నప్పటికీ వస్త్రాశ్రయత వైపు మొగ్గు చూపడం.
6. ప్రోయాక్టివిటి–రియాక్టివిటి :– ఈ రెండిటిలో ప్రోయాక్టివిటీ (పురోగమనం) నే ఇష్టపడటం.
7. హోమియోస్టాటిస్–హెటిరోస్టాటిస్ :– ఇక్కడ మానవీయ విధానం ఉన్నటువంటి హోమియో స్టాటిస్ (సమావస్థం)ను ఇష్టపడటం.
8. తెలుసుకోవడం–తెలియకపోవడం:– తెలియకపోవడం కన్నా తెలుసుకోవడం చాలా ముఖ్యం. కనుక దీని మూలంగా మానవ స్వభావం/ప్రవర్తనాంశాలను పరిశీలించడం.

మానవ స్వభావం వారి ఆలోచన, అనుభూతి మరియు నడతను బట్టి గుర్తించవచ్చు. సంస్కృతి, సంప్రదాయాలు మానవ స్వభావాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే విద్యతో బాటు సంస్కృతి, నాగరికత వంటి అంశాలను జోడించి విద్యా ప్రణాళిక రూపొందిస్తారు.

మానవ స్వభావమునకు కుటుంబం, ఇరుగు పొరుగు, సమవయస్కుల సమూహాలు (peer groups), సముదాయం, మతం, విద్యాసంస్థలు, రాజ్యం మరియు బహుళ ప్రసార సాధనాలు వంటి సంస్థలు పునాదులు వేస్తాయి.

### 1.3.2 సమాజం గురించిన ప్రాథమిక భావనలు (Basic Assumption about Society)

**2. సమాజము:**

సమాజము అనేది విస్తృతమైన ఒక అమూర్త భావన. ఒకే విధమైన అభిప్రాయాలు ఉండి, సమిష్టి శ్రేయస్సు కోసం కలసి మెలసి పనిచేసే సమూహాల, సంఘాల కలయికను సమాజంగా చెప్పవచ్చు. ఎఫ్.హెచ్.గిడ్డింగ్ (F.H.Giddings) అనే సమాజ శాస్త్రజ్ఞుడు సమాజాన్ని ఈ విధంగా నిర్వచించాడు.

"ఒకే రకమైన ఆలోచనా సరళి ఉన్న చాలా మంది వ్యక్తులు, ఉమ్మడి జీవన సరళిని గుర్తించడం ద్వారా సమిష్టి ప్రయోజనాల కోసం కలిసికట్టుగా కృషి చేయగలుగుతారు. ఇట్లాంటి వ్యక్తుల కలయికను సమాజం అని చెప్పవచ్చు."

క్లుప్తంగా చెప్పాలంటే సమాజం వ్యక్తులతోను, సమూహాలతోను, సంస్థలతోను, సముదాయాలతోను కూడుకొని ఉంటుంది. ఈ అంశాల మధ్య సామాజిక సంబంధాలను ప్రమాణాలు, విలువలు నియంత్రిస్తుంటాయి. సామాజిక సంబంధాలు నిరంతరం పరివర్తన చెందుతుంటాయి. అయితే సమాజం మాత్రం సమాజ సభ్యుల ప్రయోజనాలను సంతృప్తి పరుస్తూ నిరంతరంగా కొనసాగుతూ ఉంటుంది. కాబట్టి, దానిలో ఉండే సామాజిక సంబంధాలు కూడా వివిధ రకాలుగా ఉండి సంకీర్ణంగా ఉంటాయి. భారతీయ సమాజం, ఐరోపా సమాజం, అమెరికా సమాజం మొదలైన వాటిని సమాజానికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఇట్లా ప్రపంచములో ఎన్నో సమాజాలున్నాయి.

**సమాజ లక్షణాలు:**

మానవ సమాజాలలో కొన్ని వైవిధ్యాలున్నప్పటికీ వాటిలో కొన్ని సాధారణ లక్షణాలుంటాయి. వాటిలో ముఖ్యమైనవి.

1. **భౌగోళిక ప్రాంతాన్ని ఆక్రమించిన జనాభా/సభ్యులు:–** ఒకే ప్రాంతానికి చెందిన వారవడంతో వారిలో ఒకరి పట్ల ఒకరికి సంఘీభావము ఏర్పడుతుంది. దాని వల్ల వారు సమాజ అవసరాలకు అనుగుణంగా లక్ష్యాలను ఏర్పరచుకొని తమ ప్రయోజనాలను సులువుగా సాధించగలుగుతారు.

2. **సామాజిక సంబంధాలు:–** ఒకరికొకరు సహకరించుకోవడం, కష్టసుఖాలలో బాసటగా నిలవడం మొదలైన పరస్పర చర్యల్లో సామాజిక సత్సంబంధాలు పెంపొందుతాయి. ఉదాహరణకు ఏదైనా విపత్తు వచ్చినా ఏ విధమైన అన్యాయం జరిగినా ఆ ప్రాంతంలోని వారు కలసికట్టుగా దాన్ని ఎదుర్కోవడం జరుగుతుంది. అందరూ కలిసి ఒక సంఘటిత శక్తిగా ఉన్నపుడు వారి మధ్య సంబంధాలు మెరుగవుతాయి. అన్నిటిని ఎదుర్కొనే సాహసం అలవడుతుంది.

3. **వ్యవస్థాపన:–** సమాజంలో పౌరులు తమ నియమ నిబంధనలను సక్రమంగా పాటిస్తూ ఒకరినొకరు గౌరవిస్తూ ఇతరుల సలహాలను, సంప్రదింపులను పరిగణిస్తూ సామాజిక అభివృద్ధిలో పాలుపంచుకోవడం ద్వారా సామాజిక వ్యవస్థీకరణ సాధ్యపడుతుంది. తద్వారా ఆశించిన అభివృద్ధి సాధ్యపడుతుంది.

4. **ఐక్యత, లక్ష్యసాధన:–** ఏ సమాజం అయినా భిన్న అభిప్రాయాలు ఉన్న ప్రజలతో కొన్ని సందర్భాలలో విభేదాలను చవిచూస్తుంది. కుల, మత, వర్గ, ప్రాంతీయ, భాషా భేదాలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించడానికి సమైక్యత అవసరం. సమాజ లక్ష్యాల సాధనకు ఐక్యతా భావన ఒకరిపట్ల ఒకరికి సంఘీ భావం ఉండటం అత్యవసరం.

5. **సంస్కృతి :–** ప్రతి సమాజానికి ఒక సంస్కృతి ఉంటుంది. సమాజంలోని అన్ని సముదాయాలలోను సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ఒక సమాజం నుంచి ఇంకొక సమాజాన్ని వేరు పరచేది ఆ సమాజ సంస్కృతే. సంస్కృతి సమాజానికి ఒక నిదర్శనంగా ఉంటుంది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ ఇలా ఏ ప్రాంతానికి వెళ్ళినా అక్కడి పౌరులు ఒక ప్రత్యేక సంస్కృతిని ప్రతిబింబించేలా వ్యవహరించడం గమనించవచ్చు.

6. **విలువలు, గమ్యాలు :–** ఒక్కో సమాజం వారి వారి సంస్కృతిని బట్టి తదను గుణమైన విలువలు ఏర్పరచుకొని పాటిస్తారు. అయితే కొన్ని విలువలు అన్ని సమాజాల్లో తప్పని సరిగా ఉంటాయి. కొన్ని విలువలు కొన్ని సమాజాలకు మాత్రమే వర్తిస్తాయి. ఆయా సమాజాల సాంస్కృతిక విలువల ఆధారంగా గమ్యాలు ఉంటాయి.

ఇలా పై లక్షణాలు ఉండే ప్రాంతాన్నే సమాజముగా పరిగణిస్తారు.

ప్రతి పౌరుడు జన్మతహా ఆయా సమాజాల్లో సభ్యత్వాన్ని పొంది ఉండటం వల్ల అక్కడున్న సంస్కృతి సంప్రదాయాలకు కట్టుబడి ఉంటాడు. పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు భావంతో సమాజంలో ఒక పౌరునిగా తన కర్తవ్యాలను, బాధ్యతలను నిర్వర్తిస్తూ ఇతరులను గౌరవిస్తూ వారి అభిప్రాయాలను ఆదరిస్తూ ఉన్నప్పుడే అది శాంతియుత సమసమాజంగా వెలుగొందుతుంది.

ప్రతి సమాజం కొన్ని విద్యాపరమైన విధులను నిర్వర్తించాలి. భావిపౌరులకు సరైన గమ్యాన్ని చూపించవలసి ఉంటుంది. అంతేకాక సమాజంలో ఉన్న ఇతర సంస్థలకు సంధాన కర్తగా సమన్వయ పరచే బాధ్యతను గూడా నిర్వహించవలసి ఉంటుంది.

సమాజాన్ని ఒక తాటిపై నడిపే అధికారులుగాని, పెద్దలు గాని, విద్యార్థి సంఘాలుగాని సమన్వయంతో ఉండి. సామాజిక విధులను కొనసాగించవలసి ఉంటుంది.

5H9G4V

**సమాజం విద్యా విధులు :**

- సాంఘికీకరణం.
- సంస్కృతిని అందచేయడం.
- వృత్తిపరమైన శిక్షణ.
- సామాజిక నియంత్రణ.
- విజ్ఞాన సాంకేతికాభివృద్ధి, విజ్ఞాన ప్రసారం.

సముపార్జించిన విజ్ఞానాన్ని తరతరాలకు అందించవలసిన బాధ్యత కూడా సమాజానిదే.

### 1.3.3 అభ్యసనం గురించిన ప్రాథమిక భావనలు (Basic assumption about learning)

**3. అభ్యసనము**

మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ 21వ శతాబ్దములో సమాజం అనేది సాంకేతికంగా చాలా అభివృద్ధి చెందింది. దీనికి తగినట్లుగా మానవుడు నేర్చుకోవలసిన విషయాలు, నైపుణ్యాలు ఇతర అలవాట్లు కూడా మారుతున్నాయి. ముఖ్యంగా విద్యావ్యవస్థలో గణనీయంగా మార్పులు చోటు చేసుకున్నాయి. విద్యాధ్యేయాలు, బోధనాభ్యాసన ప్రక్రియ మార్పులకులోనయ్యాయి.

విద్యాలక్ష్యాలు, విద్యాభ్యసన ప్రక్రియ పూర్తిగా వ్యక్తి యొక్క స్వీయ అభ్యసనాన్ని పొందేలా మార్చబడ్డాయి. విద్యా ప్రణాళికతో ఏర్పరచిన విషయభాగం అంతా వ్యక్తి యొక్క ఆలోచనను అంచనా వేయుటలో కేంద్రీకరించబడింది.

- ఒక విద్యాకార్యక్రమానికి ప్రణాళిక వేయడంలో అభ్యసనం గురించి కొన్ని ప్రాథమిక ఊహలు, అంచనాలు ఉన్నాయి. ఈ అంచనాలు అన్నీ విద్యాతత్వశాస్త్రం నుంచి వచ్చినవే.
- అధ్యయనం, విద్య, అనుభవం ద్వారా ఆర్జించే జ్ఞానం, నైపుణ్యాలు, నమ్మకాలను, సముపార్జించే ప్రక్రియను అభ్యసనంగా పేర్కొనవచ్చు.
- అన్ని వయస్సుల వారూ నేర్చుకొనే శక్తిని కలిగి ఉంటారు. కావున వారి యొక్క ఇష్టం మరియు ఆసక్తిని బట్టి వారి యొక్క అభ్యసనా వేగం ఉంటుంది.

- కొత్త కొత్త అభ్యసనా పరిస్థితులలో నేర్చుకొనే అనుభవం వ్యక్తులకు కొంత ఒత్తిడిని కలిగిస్తుంది. నేర్చుకోవాలన్న ఆతృత ఉన్న వారికి కొత్త పరిస్థితులు ప్రేరణను కలిగించవచ్చు. కానీ, ఎక్కువ ఒత్తిడి కలిగినపుడు వారిలో అభ్యసనా అడ్డంకులు ఏర్పడతాయి.
- అ భిప్రాయాలు పంచుకోవడం, సమస్యా సాధనా వ్యూహాలు పాటించడం లాంటి వాటి వల్ల అభ్యసనం సమర్థవంతంగా జరుగుతుంది.
- అభ్యసన విషయాన్ని అభ్యాసము చేసే కొలది ఆ అభ్యసన క్రియను చేసే వేగం పెరుగుతుంది లేదా ఆ ప్రక్రియ చేయడానికి పట్టే సమయం తగ్గుతుంది.
- అభ్యాసం వల్ల అభ్యసించే విషయాల సంఖ్య పెరుగుతుంది.
- అభ్యాసం చేసే కొద్ది అభ్యసన ప్రక్రియలో తప్పుడు ప్రతిస్పసందనల సంఖ్య తగ్గుతుంది. దీని ద్వారా అభ్యసనంలో పురోగమనాన్ని తెలుసుకోవచ్చు.
- విద్యా ప్రక్రియలో అభ్యాసకుడు క్రియాత్మకంగా ఉంటేనే అభ్యసనం బాగా జరుగుతుంది.
- ఉత్తమమైన మరియు విభిన్నమైన బోధనా పద్ధతులు అమలు పరచినప్పుడే అభ్యాసకులలో ప్రేరణ, ఆసక్తి కలిగి వారిలో అభ్యసనం పూర్తవుతుంది.
- నేర్చుకున్న విషయాలను నిత్యజీవితంలో అమలు చేయగలిగితేనే అభ్యసనం పరిపూర్ణమవుతుంది.

**నిర్వచనాలు :**

- **గేట్స్ (Gates):–** "అనుభవం మరియు శిక్షణ వలన ప్రవర్తనలో వచ్చే మార్పే అభ్యసనం."
- **హెన్రీ పి.స్మిత్ (Henry P.Smith):–** "అనుభవ ఫలితంగా నూతన ప్రవర్తనను పొందడం లేదా పాతప్రవర్తనను బలపరచడం లేదా బలహీన పరచడమే అభ్యసనం."
- **డిసెకో మరియు క్రాఫర్డ్ (Dececo and Crowford):–** "అభ్యసనం అనేది పునర్బలనం చెందిన ఆచరణవలన ప్రవర్తనా రీతిలో ఏర్పడే దాదాపు శాశ్వతమైన మార్పు."
- **ఉడ్‌వర్త్ (Woodworth):–** "వ్యక్తిలో అభివృద్ధిని (మంచి మార్గంలోనైనా, చెడు మార్గంలోనైనా) చేకూర్చే, వ్యక్తి ప్రవర్తనలో మార్పుతెచ్చే ఏ ప్రక్రియనైనా అభ్యసనం అనవచ్చు."

పై నిర్వచనాలను బట్టి "అభ్యసనం అంటే నూతన అనుభవాలను సాధించడం". ఆ నూతన అనుభవాలను సంస్కార రూపంలో నిలుపుకోవడం, వాటిని అంచెలంచెలుగా అభివృద్ధి పరచుకోవడం, పాత కొత్త అనుభవాలను మార్పుచేయడం, వ్యవస్థీకరించడం, విశ్లేషించడం, ఏకీకృత మొనర్చడం, సమైక్య పరచడం అని తెలుస్తుంది. అనుభవం వలన ప్రవర్తనలో కలిగే మార్పునే అభ్యసనం అనవచ్చు."

### 1.3.4 విద్యా ధ్యేయాలు గురించిన ప్రాథమిక భావనలు (Basic Assumption about Aims of Education)

"ఉత్తమ వ్యక్తిని రూపొందించటమే విద్యకు ఉండవలసిన లక్ష్యము." – రాధాకృష్ణన్

"ఒక లక్ష్యముతో పనిచేయడం అంటే వ్యక్తి తెలివిగా వ్యవహరించడమే" – జాన్ డ్యూయీ.

ధ్యేయం లేదా లక్ష్యం లేని విద్య చుక్కాని లేని నావ వంటిది. ధ్యేయం లేదా లక్ష్యం లేని విద్య నిరర్థకం కనుక దేశకాల పరిస్థితులను బట్టి విద్యాధ్యేయాలు రూపుదిద్దుకొంటూ ఉంటాయి. ఒక సమయంలో లేదా ఒక సమాజంలో ఉపయుక్తమయ్యే విద్యాధ్యేయాలు మరొక సమాజంలో, మరొక సమయంలో ఉపయుక్తం కాకపోవచ్చు. కనుక విద్యాధ్యేయాలు మారుతున్న కాలాలకు, అవసరాలకు అనుగుణంగా మార్పుచెందుతూ వ్యక్తి మరియు సమాజ పురోభివృద్ధికి తోడ్పడతాయి. అలానే విద్యాధ్యేయాలు ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్య లాంటి విద్యా స్థాయిలను బట్టి వైద్య, సాంకేతిక, వాణిజ్య, కళ, భాష లాంటి విద్యలను బట్టి వేర్వేరుగా ఉంటాయి.

కన్నింగ్ హామ్ అభిప్రాయంలో "విద్యా విలువలే విద్యా ధ్యేయాలు అవుతాయి". అలానే బ్రుబేచర్ అభిప్రాయం ప్రకారం "ఒకడు తన విద్యాధ్యేయాన్ని చెప్పాలంటే ముందు తన విద్యా విలువల్ని వివరించాల్సి ఉంటుంది." అంటే ఏ విద్యనభ్యసించినా అది కొన్ని విలువలకు లోబడి తన ధ్యేయాలతో సంపూర్ణ మానవుణ్ణి తయారు చేస్తుందన్నమాట.

ధ్యేయాలు ముఖ్యంగా విద్యా విధానములో ఏర్పరచుకోవడం అత్యంత ఆవశ్యకము. ఒక నిర్ణీతవ్యవధిలో కొన్ని నిర్దిష్టమైన ధ్యేయాలను వివిధ విద్యాస్థాయిలలో సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ధ్యేయాలు స్పష్టంగా ఏర్పరచుకొన్నప్పుడే లక్ష్యసాధనవైపు దిశానిర్దేశం చేస్తాయి. వాటిని సరయిన మార్గాల ద్వారా సాధించే ప్రయత్నం సమర్థవంతంగా చేసినప్పుడే సఫలీకృతం కావడం జరుగుతుంది. అదే విధముగా పాఠ్యప్రణాళికలు రూపొందించే సందర్భములో వారు ఏర్పరచుకునే లక్ష్యాలు, ధ్యేయాల ఆధారంగా పాఠ్యప్రణాళికను నిర్ణయిస్తారు.

ఉన్నత విద్యా ధ్యేయాలుగల విద్యా కార్యక్రమాలు గమ్యం తెలిసిన నావికుడులాగా విద్యార్థుల్ని వారు ఆశించిన తీరాలకి చేరుస్తాయి. వ్యక్తి, సమాజం మరియు విద్య మూడు విద్యా ధ్యేయాల లక్ష్యాల నిర్ణయకాలే.

మన విద్యా వ్యవస్థలో ఏర్పరచుకున్న ధ్యేయాలు, విద్యా ప్రణాళికలు, బోధనా పద్ధతులు అన్నీ కూడా ఎన్నో నిర్దిష్ట కారకాలపై ఆధారపడి ఉంటాయి. విద్యాలక్ష్యాలను నిర్ణయించే కారకాలు. 1. మతం 2. సంస్కృతి 3. విజ్ఞానం, సాంకేతికత 4. రాజకీయతత్వం 5. ఆర్థికపరిస్థితులు 6. జాతీయ గమ్యాలు 7. అంతర్జాతీయ గమ్యాలు.

విద్యా ధ్యేయాలను వివిధ రకాలుగా వర్గీకరించవచ్చు. అవి

I.
1. నిర్దిష్ట, సాధారణ ధ్యేయాలు.
2. వ్యక్తిగత, సామాజిక ధ్యేయాలు.
3. జాతీయ, అంతర్జాతీయ ధ్యేయాలు.
4. సమీప, అంతిమ ద్యేయాలు.

II. తత్వశాస్త్రం ఆధారంగా విద్యా ధ్యేయాలు.
1. ఆత్మసాక్షాత్కారానికి విద్య.
2. సామాజిక సమర్థతకు విద్య.
3. మంచి జీవనం గ`డపడానికి విద్య.
4. శీలనిర్మాణానికి విద్య.

III. సామాజికపరమైన విద్యా ధ్యేయాలు.

1. వృత్తిపరమైన ధ్యేయాలు.

2. ప్రవృత్తిని పెంపొందించే ధ్యేయాలు.

3. మంచి పౌరసత్వం కోసం ధ్యేయాలు.

4. బాధ్యతాయుత కుటుంబ సభ్యుడిగా తయారు చేసే ధ్యేయాలు.

అలాగే వివిధ కమీషన్‌లు మరియు కమిటీలు కూడా విద్యా ధ్యేయాలను ప్రతిపాదించడం జరిగినది.

**విద్యాధ్యేయాల ప్రాధాన్యత లేక ప్రాముఖ్యం**

1. విద్యా ప్రక్రియకు ఒక మార్గాన్ని చూపుతాయి, అర్థవంతంగా వ్యవహరించడానికి తోడ్పడతాయి.
2. సమర్థవంతమైన విద్యా పరిపాలనను నిర్దేశిస్తాయి.
3. పాఠ్యప్రణాళికల్ని, బోధనా విధానాలను నిర్ధారిస్తాయి.
4. విద్యా ఫలితాలను అంచనావేయుటకు తోడ్పడును.
5. విద్యార్థి మరియు సమాజ అవసరాలను తీరుస్తాయి.
6. జీవన విలువల్ని రూపొందించి వాటిని సాధించేలా చూస్తాయి.
7. వ్యక్తి పరిపూర్ణతను సాధించడంలో తోడ్పడును.
8. వ్యక్తి శీల నిర్మాణములో సహకరిస్తాయి.
9. వ్యక్తి సరియైన ఆలోచనలు, వివేచన కలిగి ఉండేలా చూస్తాయి.
10. సమాజ అవసరాలకు అనువైన విద్యను, వృత్తుల్ని రూపొందిస్తాయి.
11. సమాజంలో ఆచరణ యోగ్యమైన విలువల్ని పెంపొందిస్తాయి.
12. సమాజ నిర్మాణం, పురోభివృద్ధిలో పాలుపంచుకుంటాయి.

విద్యా రంగములో ధ్యేయాలకు, ఉద్దేశ్యాలకు ప్రముఖస్థానం ఉంటుంది. ఇవి విద్యా విధానాన్ని, పాఠ్యాంశాలను, ప్రణాళికలను రూపొందించడానికి మార్గదర్శకాలుగా ఉంటాయి.

"పిల్లలకు నిజాయితీ అలవర్చటం విద్యాభ్యాసంలో తొలిమెట్టు." – జాన్‌రస్కిన్

## 1.4 మానవ సమాజములో విద్య స్వభావము మరియు అవసరాల అన్వేషణ

## (Exploring and enquiring into the nature and the needs of education in human society)

### 1.4.1 విద్య స్వభావము (Nature of Education)

అనాది నుంచి కనీసపు జీవితావసరాలకు అనుగుణంగా, సామాజిక అవసరాలకు తగినట్లుగా కొన్ని విద్యలు పెద్దల నుంచి పిల్లలకు సంక్రమిస్తూనే ఉంటాయి. ఈ విధానాన్ని మనం ఈ నాటికీ గిరిజన సముదాయాల్లో చూడవచ్చు. శారీరక, మానసిక, వైజ్ఞానానికి, సామాజిక, ఆధ్యాత్మిక విషయాలలో బోధన ద్వారా, క్రమశిక్షణ ద్వారా ఎదిగిన మానవుడు ఎదగని శిశువుపై తీసికొని వచ్చే మార్పును 'విద్య' అని చెప్పవచ్చు.

విద్య యొక్క అర్థము విద్య యొక్క స్వభావాన్ని తెలుపుతుంది. విద్య వ్యక్తిలోని అంతర్గత శక్తులను వెలికితీసి వాటిని వికసింపచేస్తుంది. విద్య మానవున్ని స్వావలంబపరునిగా చేస్తుంది. విద్యశీల నిర్మాణంలో తోడ్పడుతుంది. విద్య సర్దుబాటును కలుగచేస్తుంది. విద్య సమయానుకూలంగా అవసరాలను తీరుస్తుంది. విద్య సంపూర్ణమూర్తిమత్వాన్ని ఏర్పరుస్తుంది.

విద్య స్వభావము గురించి ఈ క్రింది అంశాల ద్వారా తెలిసికోవచ్చు. అవి:

1. **విద్య అనేది ఒక ప్రక్రియ (Education is a process):-** ఏ ఒక్క చర్యో లేదా ఏ ఒక్క అనుభవమో దానంతటదే విద్య కాబోదు, కాలేదు. అలాగే కేవలం కొన్ని యదార్థాల వరుసను విద్య అని అనలేము. దేనికైతే అంతర్గత నిరంతరత (Intrinsic continuity) ఉంటుందో అది విద్య అవుతుంది.

2. **ఇదో సమైక్య ప్రక్రియ (Education is an integrating process):-** సమగ్రమైన వ్యక్తులను తయారుచేయటమే విద్యావిధి. అట్టి మనుషులే వ్యక్తిగత, ఉమ్మడి సమస్యలను పరిష్కరించగలిగే తెలివిని, సత్తాను కలిగి ఉంటారు.

3. **శాశ్వత విలువలను కనుగొనడానికి దోహదపడుతుంది (Helps to discover lasting values):-** కలకాలం ఉండే శాశ్వత విలువలను కనుగొనుటలో విద్య దోహదపడుతుంది. జాతీయ, సామాజిక అడ్డంకులను తొలగించడంలో ఇది మనకు తోడ్పడాలి.

4. **ఇది జీవితాంత ప్రక్రియ:-** విద్య జీవితాంత ప్రక్రియ. పుట్టినప్పటి నుంచి చనిపోయేవరకు వ్యక్తి ప్రవర్తనలను ప్రభావితం చేసేది విద్య.

5. **ప్రవర్తన మార్పు (Modification of behaviour):-** వ్యక్తి ప్రవర్తనను మార్చటమే విద్య. మానవ అనుభవాన్ని ఇది ఆలోచన, సంవేదన, చర్య వంటి వాటి ద్వారా విస్తృత పరచి వ్యక్తి ప్రవర్తనలో మార్పుతెస్తుంది.

6. **విద్యే జీవితం (Education is life):-** జాన్ డ్యూయీ ప్రకారం విద్యంటే జీవితానికి సన్నాహం కాదు, అసలు విద్యే జీవితం. టి. రేమాంట్ (T.Raymont) ప్రకారం నిజంగా జీవితమే విద్య గరపుతుంది. వృత్తి, కుటుంబ జీవితం, స్నేహం, పెళ్ళి, వినోదం, ప్రయాణం ఇలా వ్యక్తికి తారసపడే ప్రతిదాన్నుంచి విద్యనొందుతాడు. ఇలా స్వీయ సంస్కృతి కూడా విద్యే అవుతుంది.

ఇలా విద్య బహుముఖ స్వభావాన్ని కలిగి ఉందని చెప్పవచ్చు. మానవ సామాజిక జీవితం మారుతూ యుంటుంది. దానితో విద్య అర్థం, స్వభావం కూడా మారుతుంది. మానవ పరిణామం లాగానే విద్య స్వభావం కూడా పరిణామ ప్రక్రియలోనే ఉంటుంది.

**సమాజము:**

ఒక నిర్ణీత ప్రదేశములో “మనము” అనే భావనతో కలసిమెలసి జీవించు సామాజిక వ్యక్తుల సముదాయాన్ని సమాజము అంటారు.

సమాజము అంటే కొన్ని ప్రమాణాలు, ఆచారాలు, ధర్మాలు, విధానాలు ఉన్న వ్యవస్థ. ఇది మనిషి ప్రవర్తనను, స్వేచ్ఛను అదుపులో పెడుతుంది. ఇలాంటి వ్యవస్థను సమాజమంటారు.

**కోలిన్ ఉడ్:**

"ఒక ప్రదేశములో నివశించు సభ్యులు ఒకే విధమైన లక్ష్యాలు, విలువలు కలిగి కలిసి కట్టుగా జీవించు ప్రజల సమూహాన్ని సమాజమంటారు". అని చెప్పారు.

**మైకోవర్ ప్రకారము** సమాజములో ఉండే సంస్థలు, వ్యవస్థలు, సంఘాలు, సముదాయాలు సమాజానికి అంగాలు. సమాజములో వ్యక్తులు, వారి పరస్పర చర్యలు, సాంఘిక సంబంధాలు, ప్రమాణాలు, విలువలు, వ్యవహారాలు ఇవన్నీ ఇమిడి ఉన్నాయి.

ప్రజాస్వామ్య ప్రభుత్వాలు వెలసిన ఈనాటి ప్రపంచములో విద్యలో సామాజిక విధులు ప్రాముఖ్యతను సంతరించుకొన్నాయి. అవి :

1. సామాజిక అవసరాల పట్ల వ్యక్తి ఆసక్తి కనపరచడం.
2. స్వయం సమృద్ధి, వస్తుసంపదను పెంచడం, శక్తివంతమైన సామాజిక వ్యవస్థను సాధించడం.
3. సామాజిక విలువలపట్ల అవగాహన.
4. సత్ప్రవర్తన పెంచడం.
5. పరిసరాలతో సర్దుబాటు, వాటిని వ్యక్తికి అనుగుణంగా మార్చుకోగలగటం.
6. జాతీయ సమైక్యత, అంతర్జాతీయ అవగాహన పెంచుట.

**సమాజము–విద్యపాత్ర**

1. సమాజ సభ్యుల కొరకు నియత మరియు అనియత విద్యా సంస్థలను ఏర్పాటు చేసి నిర్వహించాలి.
2. సమజంలోని సభ్యులతో సంప్రదించి పిల్లలను బడికి పంపేలా ప్రోత్సహించి బడి మానకుండా చూడాలి.
3. భౌతిక సౌకర్యాలైన స్థల సేకరణ భవన నిర్మాణం, నిర్వహణ బోధనోపకరణాలను ఏర్పాటు చేయాలి.
4. అవసర సమయాలలో సమాజములోని విద్యావంతులు స్వచ్ఛందంగా బోధించడానికి ముందుకు రావాలి.
5. కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అందరు విద్యనార్జించే అవకాశాన్ని కల్పించాలి.
6. వయోజనులకు విద్యావకాశాలను కల్పించాలి.
7. విద్యనభ్యసించుటకు అనువైన వాతావరణమును కల్పించాలి.
8. విద్యాకార్యక్రమాల అభివృద్ధికవసరమైన ఆర్థిక సదుపాయాన్ని అందించాలి.
9. వృత్తి, ఉపాధి విద్యావకాశాలు కల్పించాలి.
10. సామాజిక గ్రంథాలయాన్ని, పఠణాలయాన్ని ఏర్పాటు చేయాలి.
11. పాఠశాల సిబ్బంది ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాలి.
12. ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మధ్య ఏర్పడే వివాదాలను పరిష్కరించి ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలి.

**సమాజ స్వభావం (Nature of Society) :**

సమాజం వ్యక్తులతోను, సంస్థలతోను, సమూహాలతోను, సముదాయాలతోను కూడుకొని ఉంటుంది. అయితే ఈ అంశాల మధ్యగల సామాజిక సంబంధాలను ప్రమాణాలు, విలువలు నియంత్రిస్తుంటాయి. సామాజిక సంబంధాలు మాత్రం ఎప్పుడూ స్థిరంగా ఉండక నిరంతరం పరివర్తనం చెందుతూ ఉంటాయి. సమాజం, సమాజ సభ్యుల ప్రయోజనాలను సంతృప్తిపరుస్తూ నిరంతరంగా కొనసాగుతుంటుంది.

మొత్తం సమాజాన్ని పరిశీలించినపుడు సమాజంలో ఆర్థిక, రాజకీయ, విద్య వ్యవస్థల్లాంటి అనేక ఉపవ్యవస్థలుంటాయి. ఇవి సమాజంలో వేరు వేరు విధులను నిర్వహిస్తూ సమాజ అవసరాలను తీరుస్తూ ఉంటాయి. విద్య అను సామాజిక వ్యవస్థలో ఒక ఉపవ్యవస్థగా భావించినపుడు ఆ సామాజిక వ్యవస్థ నిలకడగా ఉండటానికి, దాని అభివృద్ధికి, దాని అవసరాలు తీర్చడానికి విద్య కృషి చేయవలసి ఉంటుంది.

### 1.4.2 మానవ సమాజంలో విద్యావసరాలు

విద్యను మానవ సమాజములో పరివర్తన తెచ్చే కారకంగా పేర్కొనవచ్చు. నేడు విద్య సామాజిక వికాసానికి, పరివర్తనకు కారకంగా పేర్కొనవచ్చు. నేడు విద్య సామాజిక వికాసానికి, పరివర్తనకు ఒక బలమైన సాధనమనే దానికి సర్వత్రా గుర్తింపు లభించింది. విద్య సామాజిక సంబంధాలలో మార్పులను తెస్తూ సామాజిక పరివర్తనకు దోహదపడుతుంది. మనిషిని, అతని జీవన రీతులను మార్చడము విద్యా లక్ష్యాల్లో ఒకటి. మనిషిని మార్చటమంటే సమాజాన్ని మార్చడమే. సమాజానికి విద్య ఆవశ్యకత ఏమిటో తెలిసికొందాము.

1. విద్య సామాజిక సమస్యలను పరిష్కరించి, సామాజిక పరివర్తనకు దోహదము చేస్తుంది. ఉదాహరణకు నిరక్షరాస్యత, కులతత్వం, అంటరానితనం, బాల్య వివాహాలు మొదలైన సమస్యలు.
2. విద్య ఆర్థిక వ్యవస్థలో మార్పులు తీసికుని రావటానికి దోహదపడుతుంది. ఉదా: ఉన్న వనరులను సద్వినియోగపరచడం. తక్కువ వనరులున్నా మేధాశక్తిని ఉపయోగించి భౌతిక సంపదను వృద్ధిచేయడం.
3. **విజ్ఞానం మరియు సంస్కృతి వ్యాప్తి –** విద్యా వ్యవస్థ తగిన యంత్రాంగం ద్వారా శాస్త్రసాంకేతిక ఫలాలను అభివృద్ధి చేస్తుంది. వాటిని సమాజములోని ప్రజల్లో విస్తృతంగా వ్యాప్తిచేయడానికి కృషి చేస్తుంది. విద్య సంస్కృతి, విలువలను ఒకతరం నుండి మరొక తరానికి అందిచుటకు తోడ్పడును.
4. **వృత్తి శిక్షణ –** సమాజములోని వ్యక్తి సామర్థ్యాలకు తగినట్లుగా వానిని వివిధ రంగాలకు పరిచయం చేసి వానిని వృత్తిపరంగా నిష్ణాతులను చేయడానికి విద్య అవసరం.
5. **ఆధునికీకరణం –** నూతన పరిశోధనలకు, నూతన కల్పనలకు ప్రోత్సాహం కల్పించడం ద్వారా విద్యా వ్యవస్థ మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణమైన, అవసరమైన అభివృద్ధిని తెస్తుంది. ఈ విధముగా సామాజిక పరివర్తన, ఆధునికీకరణకు విద్య అనేది ఒక సాధనముగా అవసరమవుతుంది.
6. **సామాజిక నియంత్రణ –** విద్య సమాజంలోని వ్యక్తులను సాంఘికీకరణం చేస్తుంది. వీరి ప్రవర్తనను నియంత్రించుటకు విద్య అవసరం.

7. విద్య స్వయం శక్తిని పెంపొందిస్తుంది. విద్య వ్యక్తి తన శక్తిని, లక్షణాలను అర్థం చేసుకుని తనలో గల నైపుణ్యాలను పెంచుకోగలిగినట్లు చేస్తుంది.

8. విద్య ఆర్థిక స్వావలంబనకు మరియు స్వయం ప్రతిపత్తికి దోహదపడుతుంది. ఆర్థిక స్వావలంబన గల వ్యక్తి సమాజాన్ని గౌరవించి, తాను గౌరవింపబడతాడు.

9. విద్య, ప్రణాళికా బద్ధంగా నిర్వహించే నైపుణ్యాన్ని మరియు ఉద్యోగ సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది.

10. ఉద్వేగ వికాసం, శీలనిర్మాణము, నైతిక వికాసము పెంపుదలకు విద్య తోడ్పడును. వ్యక్తి ప్రవర్తన ఆమోదయోగ్యంగా ఉంటే ఆ సమాజము కూడా ఆమోదయోగ్యమౌతుంది.

11. సామాజిక సేవాతత్పరతను పిల్లల్లో అభివృద్ధి చేయును. ప్రేమ, సోదర భావము, దయ, సహకారం, సహనం, సానుభూతి, త్యాగబుద్ధి వంటి లక్షణాలు గల పౌరులను అభివృద్ధి చేయును.

12. **జాతీయ భద్రత :–** జాతీయ భద్రతను కాపాడటం కోసం విద్య తోడ్పడును. విద్యవ్యక్తులలో దేశభక్తి, జాతీయతావాదం వంటి భావనలను అలవరచుటకు అవసరమైన శిక్షణనిస్తుంది.

విద్య మంచి పౌరులను సమాజ సంక్షేమం కోసం, జాతి ప్రయోజనాలకు ప్రాధాన్యత వహించే విధముగా తయారు చేయును.

"విద్య అనేది మహావృక్షం, వేళ్ళుచేదుగానూ, అది అందించే ఫలాలు మదురంగాను ఉంటాయి." – అరిస్టాటిల్

## 1.5 పాఠశాల విద్య మరియు విద్యలపై భారతీయ మరియు పాశ్చాత్య విద్యావేత్తల దృక్కోణము (Schooling and Education as visualized by different Indian and Western Thinkers)

భారతదేశము ప్రాచీన కాలంలో ప్రపంచానికి విద్యను అందించినది. భారతీయులు అనేకానేక విద్యాంశాలను ఆలోచన, అనుభవం, పరిశీలన, పరిశోధన ద్వారా విద్య, సాహిత్యం, శాస్త్రసాంకేతిక రంగాలలో ప్రపంచఖ్యాతి గావించారు.

విద్యాభివృద్ధి అనేక మంది ఆలోచనల ప్రతిరూపం. వ్యక్తిగత, సామాజిక అవసరాలను ఆదర్శాలను దృష్టిలో ఉంచుకొని కొత్తదనంతో విద్యాభివృద్ధి అనేది జరుగుతూ ఉంటుంది. విద్యను ఆశించిన మార్గంలో రూపొందించడానికి, ఉన్న స్థితి నుండి అభివృద్ధి పరచడానికి ఎంతోమంది కృషిచేశారు. అలాంటి వారిలో భారతీయ తత్వవేత్తలైన స్వామివివేకానంద, మహాత్మాగాంధి, రవీంద్రనాథ్ ఠాగూర్, జిడ్డుకృష్ణమూర్తి, గిజుభాయిబడేకా, జ్యోతిభాపూలే, పండిట్ మదనమోహన మాలవ్య, సర్వేపల్లి రాధాకృష్ణన్, అరవిందో, ది మదర్, సంత్ కబీర్, ప్రొ.జె.పి.నాయక్ మరియు ప్రొ.డి.యస్.కొఠారి పాశ్చాత్య తత్వవేత్తలైన జాన్ డ్యూయీ, ఫ్రోబెల్ మరియు మాంటిస్సోరిల గురించి తెలిసికొందాము. వీరు విద్యారంగానికి అందించిన అంశాలను అనగా విద్యాతత్వము, విద్యాలక్ష్యాలు, విద్యా ప్రణాళిక, బోధనాపద్ధతులు క్రమశిక్షణ, ఉపాధ్యాయుడు, విద్యార్థి మరియు ఇతరములు గురించి తెలిసికొందాం.

### భారతీయ విద్యావేత్తలు (Indian Educationists)

### 1.5.1 స్వామి వివేకానంద (1863–1902) (Swamy Vivekananda)

స్వామి వివేకానందుల వారు 12–1–1863న కలకత్తాలో జన్మించారు. వీరి తండ్రిపేరు విశ్వనాథ దత్త, తల్లి భువనేశ్వరి దేవి. ఆయన చిన్ననాటి పేరు నరేంద్రనాథ దత్త. వీరి కళాశాల జీవితంలోనే శ్రీరామకృష్ణ పరమహంసతో

పరిచయం ఏర్పడినది. ఆయన సహచర్యముతో ఆధ్యాత్మిక చింతన గల్గి స్వామి వివేకానందునిగా మారారు. శ్రీరామ కృష్ణ పరమహంస మరణముతో రామకృష్ణమిషన్ నిర్వహణా బాధ్యతలను స్వీకరించారు. సుమారు 15 సంవత్సరములు విశ్వమానవ కళ్యాణమునకు నిర్విరామంగా కృషి చేశారు. భారతదేశము, ఐరోపా ఖండం, అమెరికాలలో పర్యటించి ప్రజోద్ధరణకు పాటుపడ్డారు. 1893లో చికాగో నగరమున జరిగిన ప్రపంచ మతముల మహాసభలో హిందుమతం గురించి ఉపన్యసించి అంతర్జాతీయ ఖ్యాతిని గడించారు.

**విద్యాభావనలు:**

- మనిషిలో అంతర్గతముగా నిబిడీకృతమైన ఆధ్యాత్మిక విలువలను బహిర్గతము చేయునది విద్య.
- విద్యాసముపార్జనలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలి.
- విద్య కేవలం విషయముల నందించుటకు గాదు. జీవితాన్ని తీర్చిదిద్దుట, సత్ప్రవర్తనకు రూపకల్పన చేయుట, జీవితాదర్శాలను అవగాహన చేసుకొని మనిషిని, మనిషిగా తీర్చిదిద్దునదే విద్య.
- స్వయం కృషి ద్వారా విద్యార్థి నేర్చుకోగలిగేదే విద్య.

**విద్యాలక్ష్యాలు :**

- సత్ప్రవర్తనను పెంపొందించుట.
- ఆత్మవిశ్వాసము కల్గించుట.
- మానవసేవ చేయుట.
- సౌభ్రాతృత్వమును కల్గియుండుట.
- స్వయం సంసిద్ధతను సాధించుట.
- ఆధ్యాత్మిక జీవన విధానమును అనుసరించుట.
- శారీరక దారుఢ్యతకు కృషి చేయుట.

**విద్యా ప్రణాళిక:**

విద్యార్థులలో సేవాదృక్పథం పెంపొందించగల్గాలి. ఆంగ్ల భాష అవగాహనకు, శాస్త్రీయ జ్ఞానమునకు సంబంధించిన విజ్ఞానమును విద్యార్థులకు అందించాలి. చారిత్రక విషయాలు, అన్ని మతాల సారాంశాలు విద్యా ప్రణాళికలో భాగం కావాలి.

**బోధనా పద్ధతులు:**

స్వేచ్ఛా వాతావరణంలో, అనుభవాల మరియు ఆలోచనల ఆధారంగా బోధనకు అనుగుణమైన బోధనా పద్ధతులు అనుసరించాలి. బోధనోపకరణాలు తప్పనిసరిగా వినియోగించాలి.

**ఉపాధ్యాయుని పాత్ర:**

పవిత్రభావముతో వృత్తికి అంకితం కావాలి. ఆదర్శప్రాయుడిగా, పాపరహితుడిగా ఉండాలి. విద్యార్థులను ప్రేమించగల్గి వారి అభిరుచులకు తగ్గట్లు బోధించాలి. ఉపాధ్యాయుడు మంచి జ్ఞాపకశక్తి, నిగ్రహము, చాకచక్యము కలిగిఉండాలి.

**ప్రత్యేకతలు:**

విద్యార్థులకు అన్ని మతాల సారాంశాన్ని అందించాలి అన్నారు. సామాన్య ప్రజానీకానికి, స్త్రీలకు విద్యలో సమాన అవకాశాలు ఇవ్వాలని చెప్పిన మహానుభావుడు స్వామి వివేకానంద. పాశ్చాత్య సాంకేతిక పరిజ్ఞానాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందించే విద్యకు ప్రాధాన్యము ఇవ్వాలని సూచించారు.

### 1.5.2 మహాత్మాగాంధి (Mahatma Gandhi)

మోహన్ దాస్ కరమ్‌చంద్ గాంధి2-10-1869లో గుజరాత్ రాష్ట్రంలో పోర్‌బందర్ నందు జన్మించారు. ఈయన ప్రముఖ రాజకీయ వేత్త మరియు సంఘ సంస్కర్తే కాదు గొప్ప విద్యావేత్త గూడా. తల్లి పుత్లీభాయ్ తండ్రి కరమ్ చంద్ గాంధి. మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణుడైన వెంటనే 18 సం॥ల వయస్సులో న్యాయవాద శాస్త్రము చదువుటకు ఇంగ్లండు వెళ్ళారు. 1891లో న్యాయవాద శాస్త్ర పట్టా పుచ్చుకొని బొంబాయిలో న్యాయవాద వృత్తిని చేపట్టారు. 1893లో వృత్తిరీత్యా దక్షిణాఫ్రికాకు వెళ్ళారు. అక్కడే 20 సం॥లు ఉన్నారు. ఆ సమయంలో అక్కడ ఉన్న భారతీయులకు జరుగుచున్న అన్యాయాలకు, అవమానాలకు చలించి ఆయనలో రాజకీయ చైతన్యం కల్గింది. భారత జాతి స్వాతంత్ర్యాన్ని సాధించడానికి, ప్రజలను ఉత్తేజపరచడానికి గాంధీజి అహింస, సత్యాగ్రహమనే సాధనాలను ఉపయోగించారు. భారతీయులను బ్రిటీషువారి కబంధ హస్తాల నుండి రక్షించి బంధ విముక్తులను చేయడానికి నిర్విరామంగా పోరాడి "జాతిపిత"గా వెలుగొంది ప్రపంచ గౌరవాన్ని పొందారు. శాంతినికేతన్‌లోను, సబర్మతి సేవాగ్రామ్‌లోను కొంత కాలము తన విద్యా ప్రయోగాలను కొనసాగించారు. తదుపరి వార్ధాకు దగ్గరలో ఉన్నా సేవాగ్రామ్‌లో తాను స్వంత ఆశ్రమమును స్థాపించి తన నూతన విద్యావిధానానికి ఒక రూపం కల్పించారు.

**విద్యా భావనలు :**

- వ్యక్తిలో మంచిని వెలికితీసి, మానసికంగాను, శారీరకంగాను, నైతికంగాను, ఆధ్మాత్మికంగాను, సాంఘికంగాను తీర్చిదిద్దునది విద్య.
- విద్య కేవలం, భౌతిక శక్తినేగాక ఆధ్యాత్మిక శక్తిని గూడా ఇవ్వాలి.
- మానవుని సమగ్ర సంపూర్ణమూర్తి మత్వమును పెంపొందించుటకు విద్య దోహదం చేయాలి.
- సచ్ఛీలతకు, సహృదయతకు తోడ్పడాలి. క్రమశిక్షణతో గూడిన స్వేచ్ఛకు ప్రాధాన్యత నివ్వాలి.
- మాతృభాషలో విద్యాబోధన జరగాలి.
- చేతి పనుల ద్వారా జ్ఞానము పెంపొందునట్లు చేయవలెను. ప్రతీది కంఠస్థము చేయవలెనని బలవంతం చేయరాదు.
- నిస్వార్థ సేవ, త్యాగం, అహింస మొదలైన ఉత్తమ లక్షణములను పెంపొందించుటకు, ఆధ్యాత్మిక, నైతిక శిక్షణలకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- విద్య నేర్చుకొనుటకు పురుషులకు ఏ అవకాశాలున్నాయో, స్త్రీలకు కూడా అవే అవకాశాలుండాలి. అవసరమైన చోట ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి.
- విద్య సాంఘిక సమర్థతకు, సంస్కరణకు సాధనము కావాలి.
- ధనిక, పేద హెచ్చుతగ్గులు లేని స్వేచ్ఛా సమానత్వం గల సర్వోదయ సమ సమాజ స్థాపన విద్యాలక్ష్యం కావాలి.

**బేసిక్ విద్య :**

- ఈ విద్య మానవుని జీవితానికి, జాతి మనుగడకు, దేశ సంపదకు పునాది వంటిది. అందువల్లే దానిని ప్రాతిపదిక విద్య అని అంటారు.
- 7–14 సం॥ మధ్య వయసుగల పిల్లలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను ఆంగ్లము లేకుండా నేర్పాలి.
- విద్య వృత్తి ప్రధానమైనదిగా, చేతి వృత్తిలో సామర్థ్యాన్ని పెంపొందించేదిగా ఉండాలి.
- బోధన యాంత్రికంగా ఉండక, క్రమబద్దంగాను, శాస్త్రీయంగాను ఉండాలి.
- 14 సంవత్సరాలకు విద్యపూర్తి చేసుకొని విద్యార్థులు బాహ్య ప్రపంచంలో అడుగుపెట్టేసరికి తమ కాళ్ళమీద తాము నిలబడి స్వయం పోషణ చేసుకోగలగాలి.
- విద్యార్థులలో అవగాహన పెంపొందుటకు, వారి భావాలను స్పష్టంగా వ్యక్తపరచుటకు మాతృభాషలో బోధన జరగాలి.
- పిల్లలకు విద్యతోపాటు అహింసాతత్వమును అలవాటు చేయాలి.
- వ్యక్తి అభివృద్ధికి, సహకార జీవనమునకు అవసరమైన అనుభవాలను విద్య ద్వారా గడించాలి.

**విద్యా ప్రణాళిక :**

ప్రాథమిక వృత్తులైన, వ్యవసాయము, వడ్రంగం మరియు గణిత బోధన, సాంఘిక శాస్త్రం, జీవశాస్త్రం, మానవ శరీర శాస్త్రం, భౌతిక రసాయన శాస్త్రములు, ఆరోగ్య శాస్త్రములు , గృహశాస్త్రం (Home Science) లుండాలి.

చిత్రలేఖనం, సంగీతం, హిందీ భాష కూడా విద్యాప్రణాళికలో చేర్చాలన్నారు. బోధనలో సహసంబంధము తీసుకొని రావాలన్నారు.

### 1.5.3 రవీంద్రనాథ్ ఠాగూర్ (1861–1941) (Ravindranath Tagore)

అభ్యుదయ భావాలుగల ఉన్నత కుటుంబంలో 1861 సంవత్సరం కలకత్తాలో జన్మించాడు ఠాగూర్. తండ్రి మహర్షి దేవేంద్రనాథ్. తల్లి శారదాదేవి. ఠాగూరు తండ్రి దగ్గర ఉపనిషత్తులు, సంస్కృతం, ఖగోళశాస్త్రం (Astronomy) నేర్చుకొన్నారు. స్వతహాగా ఈయనకు సంగీతం అన్నా, పద్యాలన్నా ప్రకృతి సౌందర్యమన్నా మక్కువ ఎక్కువ. కొంత వయస్సు వచ్చిన తరువాత కలకత్తాలోని సెయింట్ జేవియర్ పాఠశాలలో చేర్పించారు. అయితే అక్కడి జీవంలేని, అర్థంలేని, వ్యర్థమైన బోధన నచ్చక పాఠశాల మానివేశారు. అతని ఉపాధ్యాయులు, ఈతడు చదువుకొనుటకు పనికిరాడని నిర్ధారించారు. అయితే ఉపాధ్యాయుల అంచనాను తారుమారు చేస్తూ ప్రపంచ ప్రఖ్యాతి గల వ్యక్తిగా రూపొందారు.

1901లో బోల్‌పూర్‌లో ఒక పాఠశాలను స్థాపించారు. ఆ పాఠశాలే 1921లో విశ్వవిఖ్యాతిగల "విశ్వభారతి"గా రూపుదిద్దుకొంది. 1909లో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన 'గీతాంజలి' అనే పద్యకావ్యాన్ని రచించారు. ఈ రచనకు 1913లో నోబెల్ పురస్కారం లభించినది.

**విద్యాతత్వము :**

- ఈయన ప్రకారం జీవితాన్ని అన్నిటితోను సమన్వయ పరచగలిగేదే విద్య. సమన్వయమనగా ప్రకృతితో, పరిసరాలతో మరియు అంతర్జాతీయ అంశాలతో సమన్వయం. విద్యాతత్వం ప్రధానంగా నాలుగు అంశాలతో కలగలిసి ఉంటుంది. అవి ప్రకృతివాదం, మానవతావాదం, భావవాదం, ఆధ్యాత్మిక వాదం.
- విద్యలో స్వేచ్ఛకు ఎంతో ప్రాధాన్యతనిచ్చారు. మానసిక, భావ సంబంధ, సామాజికపరమైన స్వేచ్ఛ అవసరం. శిశువుకు పూర్తి స్వేచ్ఛనిచ్చినప్పుడే అతడిలోని మానసిక శక్తుల వికాసానికి అవకాశం లభిస్తుంది.
- చిత్రలేఖనం, నాటకాలు మొదలగు కళలను విద్యా అంశంగా చేర్చినట్లయితే సృజనాత్మకత, సంస్కృతి అవగాహన, ఆధ్యాత్మికత సాధ్యమవుతాయి.
- ఠాగూర్ విద్యాతత్వంలోని ముఖ్యసూత్రాలు ఏవనగా స్వేచ్ఛ, సృజనాత్మక, స్వీయవ్యక్తీకరణ, ప్రకృతి మరియు మానవునితో క్రియాత్మక భావప్రసారము, అంతర్జాతీయ దృక్పథం.
- ఠాగూర్ మానవజాతి ఐక్యత, ప్రపంచ శాంతి, సోదర భావం పెంపొందించుకున్ననాడే విశ్వమానవ సౌభ్రాతృత్వం సాధ్యమని అంటారు. అటువంటి విశ్వమానవ సౌభ్రాతృత్వ పునాది విద్యా ప్రణాళికలోనే ఏర్పరచాలన్నారు.

**విద్యాలక్ష్యాలు :**

శారీరక వికాసము, బౌద్ధిక వికాసం, నైతిక, ఆధ్యాత్మిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, అంతర్జాతీయ అవగాహన, విశ్వమానవ సౌభ్రాతృత్వం లక్ష్యాలుగా గల్గిన విద్యను అభిలషించారు ఠాగూరు.

**విద్యాప్రణాళిక :**

ఠాగూర్ సాంప్రదాయిక విద్యకు పూర్తిగా వ్యతిరేకి, సమాజంలోని కట్టుబాట్లు అన్నీ విద్యార్థికి అనుభవాల ద్వారా అవగాహన కావాలి. భాషలు, సాహిత్యం, విజ్ఞాన శాస్త్రం, భౌగోళిక శాస్త్రం, చరిత్ర, కళలు, సంగీతం మొదలైన సబ్జెక్టులుండాలన్నారు.

శిశువుకు తల్లిపాలు ఎలాంటివో విద్యార్థికి మాతృభాషలో బోధన అలాంటిదని చెప్పిన ఠాగూర్ ప్రాథమిక స్థాయిలో మాతృభాషలోనే బోధన జరగాలని అభిలషించారు. ఉన్నత స్థాయిలో ఆంగ్లబోధనకు మాత్రం వ్యతిరేకి కాదు.

విద్యా ప్రణాళికలో భాగంగా విద్యార్థులను సేవాకార్యాక్రమాల్లో చురుకుగా పాల్గొనేటట్లు చేయాలన్నారు.

**బోధనా పద్ధతులు :**

ఠాగూర్ దృష్టిలో విద్య విద్యార్థులను క్రియాత్మక రంగంవైపు మళ్ళించే ప్రక్రియ. పిల్లల అభిరుచులు, సామర్థ్యం అనుభవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకే విద్యాబోధన యదార్థ పరిస్థితులలో జరగాలని వాదించారు.

"వారి స్వేచ్ఛకు అడ్డురాకండి, వారికి ఎదురయ్యే చిన్న చిన్న ఇబ్బందులే వారి మార్గాలను సవరిస్తాయి" అని అంటారు ఠాగూర్. తెలిసిన విషయాల నుండి తెలియని విషయాలకు విద్యార్థిని ప్రోత్సహిస్తూ నడిపించ గలిగేదే అసలైన విద్యాబోధన. తరచుగా వినోద యాత్రలను ఏర్పాటు చేసిన విద్యార్థులు తమ ఇంద్రియాల ద్వారా ప్రత్యక్షంగా పరిశీలించి తమ అభిరుచులకు తగినట్లు నేర్చుకొంటారు. ఇవేగాక ఠాగూర్ అన్వేషణ, స్వీయ వ్యక్తీకరణను బోధనలో వినియోగించాలన్నారు.

**ఉపాధ్యాయుడు :**

ఉపాధ్యాయుడు పిల్లవానికి ఒక నమూనాగాను, మార్గదర్శకుడిగాను ఉండాలి. పిల్లలు, ఇతరులు చెప్పింది సరిగా వినేతత్వాన్ని కలగజేయాలి. పిల్లల్లో పిల్లవాడిగా ఉండాలి. నిరంతర అభ్యాసకుడుగా యుండాలన్నారు. ఉపాధ్యాయుడు ఇంకా నేర్చుకొంటూ ఉంటే తప్ప నిజంగా బోధించలేడు. "ఒక దీపం నిరంతరం వెలుగుతుంటే తప్ప అది మరో దీపాన్ని వెలిగించలేదు" అని చెప్పి గురుదేవ్ ఉపాధ్యాయుల్ని తట్టిలేపుతున్నారు.

### 1.5.4 జిడ్డు కృష్ణమూర్తి (1895–1980) :

జిడ్డు కృష్ణమూర్తి పేరొందిన ఆధునిక భారతతత్వవేత్త. ఈయన ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లిలో 1895 సం॥ మే నెల 11వ తేదిన జన్మించారు. అనిబిసెంటు వీరిని దత్తత తీసుకోవడంతో వీరి జీవితంలో ప్రాముఖ్యత ఏర్పడింది. వీరు విద్యపై అభిప్రాయాలను వ్యక్తం చెయ్యడానికి 1973లో 'విద్య–జీవితం యొక్క ప్రాముఖ్యత' అనే గ్రంథాన్ని వ్రాసారు. ఈయన ఆలోచనకు అనుగుణంగా వివిధ దేశాలలో పాఠశాలలు ప్రారంభించారు. మన దేశంలోని చిత్తూరు జిల్లాలోని ఋషివ్యాలీ, వారణాశిలోని రాజ్‌ఘాట్ పాఠశాలలు ఉదాహరణలు.

**తాత్విక విద్యావిధానంలోని ముఖ్యాంశాలు :**

1. జీవితాన్ని సమగ్రంగా తెలుసుకొని సంపూర్ణ మూర్తిమత్వముగల వ్యక్తులను తయారు చెయ్యడం విద్య యొక్క ముఖ్య కర్తవ్యం.
2. హృదయ పరివర్తన కలిగించలేని విద్య వలన మానవాళికి సుఖశాంతులు ఉండవు.
3. మానవత్వం, వ్యక్తిత్వం, గల వ్యక్తులను తయారు చేసి కొత్త సంస్కృతిని నెలకొల్పాలి.
4. స్వయం పరిశీలనను ప్రోత్సహించి జీవిత సత్యాలను తెలుసుకొనేటట్లు చెయ్యాలి.
5. అనుభవాల ద్వారా మానవ జీవిత సత్యాలను తెలుసుకోవాలి.
6. విద్య కేవలం ఉపాధినందించే యంత్రం కారాదు.
7. వ్యక్తిలో నిబిడీకృతమైన అంతర్గత శక్తులను బహిర్గతం చెయ్యాలి.
8. కేవలం ఉపాధ్యాయునిపై ఆధారపడకుండా, విద్య అనేది విద్యార్హత, విద్యార్థి సమర్థతలను పెంచేదిగా ఉండాలి.

6RK577

ప్రస్తుత విద్యావిధానంలోని లోపాలను జిడ్డు కృష్ణమూర్తి ఈ విధంగా తెలిపారు.

1. పుస్తక పఠనం, విషయ సేకరణకు పరిమితమైంది.
2. సృజనాత్మక శక్తులను పెంపొందించుట లేదు.
3. జీవించటానికి కావలసిన నైపుణ్యాలను, సాంకేతికతను మాత్రమే అందిస్తున్నది.
4. విద్యార్థి ధ్యేయాలను, అభిరుచులను అణచివేయుటయేగాక సమగ్ర మూర్తిమత్వాన్ని పెంపొందించుటలేదు.
5. పిల్లవానికి స్వేచ్ఛలేదు.
6. అధికారుల ఆజ్ఞలకు తలాడించే గంగిరెద్దు లాంటి వాడిని తయారుచేస్తున్నది.

**ఉపాధ్యాయుని పాత్ర :**

ఉపాధ్యాయుడు మంచి వ్యక్తిత్వం కలిగి, విద్యార్థులు తమ సమస్యలను తామే ప్రతిభావంతంగా సాధించుకొనుటకు కావలసిన వాతావరణాన్ని కల్పించగల అనుభవజ్ఞులై ఉండాలి. ఆ వాతావరణాన్ని, ఆలోచనలను ప్రేమతో జాగ్రత్తగా సృష్టించాలి. ఇవి సాధించుటకు ఉపాధ్యాయుడు తనను తాను తెలుసుకొనగలగాలి. విద్యార్థులను తీర్చిదిద్దుటకు అవసరమైన సహనం, అవగాహన ఉండాలి. బోధనే జీవిత మార్గంగా కలిగినవాడు నిజమైన ఉపాధ్యాయుడు. నిరంతర విద్యార్థిగా యుండాలి, విద్యార్థులు, తాను వేరు కాదు అన్న భావన ఉండాలి.

క్రమ శిక్షణ విషయములో స్వీయ క్రమశిక్షణ విధానమును అమలు చేయాలి. ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం అన్నారు.

**ఋషివ్యాలీ పాఠశాల :**

- తను సూచించిన పై అంశాలన్ని ఋషి వ్యాలీ పాఠశాలలో అమలు పరచబడుచున్నవి.
- నగరానికి దూరంగా ప్రకృతి ఒడిలో పాఠశాల నిర్మించబడినది.
- విద్యార్థులు ఉపాధ్యాయులందరూ కలిసి జీవిస్తారు.
- పాఠశాలల పరిశుభ్రత, హాస్టల్సు, వడ్డనశాలలో పనులు అన్నీ విద్యార్థులే చూసుకొంటారు.
- విద్యార్థులందరూ సమానము. తమ పనులు తాము చేసుకుంటారు.
- పనిపట్ల గౌరవము పెంచుకొంటారు. సత్యాన్వేషణ ఎవరికి వారే చేయాలి.
- విద్యార్థుల సృజనాత్మక శక్తికి అపార అవకాశాలున్నాయి.
- శారీరక ఆరోగ్యము, మానసిక ఆరోగ్యం, ఆధ్యాత్మిక అంశాలపై ఉపన్యాసాలు ఇస్తుంటారు.
- పాఠశాలలో వ్యాయామము, సంగీతం, చిత్రలేఖనంలకు ఇతర పాఠ్యాంశాలతో పాటు ప్రాధాన్యత ఉన్నది.
- ఆటలు, పాటలు, నాటకాలు, నృత్యాలు ప్రక్రియలలో అందరూ పాల్గొంటారు.

**1.5.5 గిజూబాయి బదేఖా :**

**పరిచయం :**

మనదేశ విద్యారంగంలో గిజూబాయి ప్రముఖ విద్యావేత్త. వీరి పూర్తిపేరు గిరిజా శంకర్ బదేఖా. వీరు 1885 నవంబరు 15న సౌరాష్ట్రంలోని చిత్తల్ లో జన్మించారు. 1910లో బొంబాయిలో న్యాయశాస్త్రంలో పట్టభద్రులై 1913లో హైకోర్టు ప్లీడరుగా పనిచేశారు.

**విద్యాతత్వం :**

గిజూబాయి విద్యావేత్తగా సుప్రసిద్ధులు. వారు గుజరాత్‌లో దక్షిణామూర్తి అనే విద్యాసంస్థను స్థాపించి విద్యాబోధనకు సంబంధించిన నూతన పద్ధతులను నూతన ప్రయోగాలను కొనసాగించారు. అందువల్ల గుజరాత్ రాష్ట్రం ఆయనను ఒక ఉత్తమ విద్యావేత్తగా పరిగణించింది.

విద్య ప్రతిపిల్లవాడిలోని అంతర్గత శక్తులు వెలికితీయాలని గిజూబాయి తన విద్యావిధానంలో ప్రతిపాదించారు. పిల్లలకు స్వాతంత్ర్యం అవసరం అని, వారు పెరుగుతున్న విధానంలో ఉపాధ్యాయుడు తన వంతు పాత్రను పోషించాలన్నారు. విద్యా ప్రక్రియలో ఉపాధ్యాయుడు-విద్యార్థి మధ్య ప్రేమ వాతావరణం కల్పించడం ద్వారా అధ్యయనం వేగతరం అవుతుందని అభిప్రాయపడ్డారు.

జీవితంలోని ప్రతి అనుభవం అభ్యసనంలో ప్రధానమైనది. విద్యను నిత్యజీవితంతో అన్వయించడం ద్వారా విద్యార్థి బలోపేతుడు అవుతాడు. విద్యను సమగ్రంగా గ్రహించగలుగుతాడు. ప్రతి పిల్లవాడు ఒక ప్రత్యేకమైన మూర్తిమత్వాన్ని పొంది ఉంటాడు. అతని సహజ ప్రవర్తన ప్రకృతికి దగ్గరగా ఉన్నప్పుడు ఎదుగుతాడు. మంచిని గ్రహించగలుగుతాడు.

**విద్యా లక్ష్యాలు :**

1. ప్రతి పిల్లవాడిలో అనేక మంచి గుణాలు, శక్తులు ఉన్నాయి. విద్య వాటిని వెలికి తీయడానికి సరైన వాతావరణం కల్పించాలి. చక్కని బోధనోపకరణాలు ఉపయోగించాలి.
2. విద్య భయరహితమైన మనోవృద్ధిని పెంపొందించాలి. ప్రేమ వాతావరణం కల్పించాలి.
3. పాఠశాలలు కేవలం నియమాలకే కాకుండా విద్యార్థుల శీలనిర్మాణం కేంద్రాలుగా మారాలి.
4. స్వీయ క్రమశిక్షణ ప్రతి జీవికి అవసరమనీ అది విశ్వాసపూరితమైన అభ్యసనంలో భాగంగా అందివ్వాలి.
5. జీవితంలోని ప్రతి అనుభవాన్నీ అభ్యసనంలో చొప్పించేలా ఉండాలి.
6. ఉపాధ్యాయుడు తరగతి గదిలోకి ప్రవేశించే ముందు అవసరమైన సన్నాహాలు చేసికోవాలి.

**విద్యా ప్రణాళిక :**

వినోదం, విజ్ఞానంతో పాటు గంభీరమైన విషయాల వరకు వివిధ కోణాల్లో పుస్తకాలు ప్రచురించాలి. పిల్లలలో సహజంగా కుతూహలం రేకెత్తించి బయట ప్రపంచానికి దాన్ని అన్వయించేలా చేయడంలోనే విద్యకు సార్థకత లభిస్తుంది. అవసరాన్ని బట్టి దానికి సంబంధించిన విషయాన్ని అందుబాటులో ఉన్న సాధనాల ద్వారా తెలుసుకొంటాడు. పాఠ్యాంశాల్లో శుభ్రత కూడా ఒక అంశంగా ఉండాలన్నారు.

**బోధనా పద్ధతి :**

కథలంటే పిల్లలకు చాలా ఇష్టం. కథలకు ఇటు బోధనాపద్ధతుల్లోనూ అటు జీవితాల్లోనూ ఒక ప్రత్యేక స్థానం ఉంది. కథలు చెప్పేవారికి కేవలం చెప్పడంలో నైపుణ్యం ఉంటే చాలదు. ఆ కథలో సందేశం ఏమిటో తెలుసుకొని అది వివరించ గలిగే చాతుర్యం ఉండాలి. అందుకే బోధనా విధానం దృష్ట్యా సరైనవనిపించే కథలనే పిల్లలకు చెప్పాలి. పిల్లలను తప్పులు చెయ్యనివ్వాలి. దిద్దకూడదు. మాటిమాటికీ తప్పులేమిటో వారికి చెప్పకూడదు. వాళ్ల ముందు మంచి ఆదర్శాలను ఉంచాలి. ఇలా పిల్లలకు తెలియకుండానే వారి లోటుపాట్లను సరిచేయవచ్చు. ఇది సహజంగా జరుగుతుంది. కాని ప్రయత్న పూర్వకంగా కాదు. తనంతట తాను నేర్చుకోవడంలో ఆనందంతో పాటు విశ్వాసం కలుగుతుంది. అందుకే తప్పులెన్నకుండా సవ్యంగా ఎలా చేయాలో జాగ్రత్తగా వారికి చెప్పగలగాలి.

**ఉపాధ్యాయుడు – విద్యార్థి :**

ఉపాధ్యాయుడు పిల్లలను ఆదరించి, వారి వ్యక్తిత్వ వికాసానికి తగిన కృషి చేసేవాడిగా ఉండాలన్నారు. పిల్లలు తక్కువగా చదివినా, నెమ్మదిగా నేర్చుకొన్నా పరవాలేదు కానీ చదివి అలసిపోకూడదని అభిప్రాయపడ్డారు.

ప్రతి విద్యార్థి ఉన్నత వ్యక్తిగా రూపొందాలనుకుంటాడు. ఆ ప్రయత్నానికి ఉపాధ్యాయుడు సహకరించాలి. తప్పుదారి పట్టినప్పుడు వెనక్కి మళ్లించి, సరైన మార్గంలో వెళ్లేవిధంగా ప్రయత్నించాలి. ఆ సమయంలో ప్రేమ, సానుభూతి చూపించి సరియైన మార్గంలోకి మళ్లించే ప్రయత్నం చేయడమే ఉపాధ్యాయుడి ధర్మం.

**క్రమశిక్షణ :**

ప్రాథమిక పాఠశాలల్లో అపరిశుభ్రత, అల్లరి, గోల ఇవన్నీ ఎక్కువగా ఉంటాయి. అయితే ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే వీటన్నింటినీ రూపుమాపవచ్చు. గిజూబాయి గారి తరగతి గదిలో మనం పరిశుభ్రతను, క్రమశిక్షణను, ప్రశాంతతను చూడవచ్చు.

**ప్రత్యేకతలు :**

గుజరాతీ మహోపాధ్యాయుడు గిరిజాశంకర్ బదేఖా, పిల్లలకు ప్రయోగాత్మక శిక్షణా సంస్థ దక్షిణా మూర్తిని స్థాపించి మాంటిస్సోరీ పద్ధతిలో బోధనకు శ్రీకారం చుట్టాడు. ఇందులో తాను సూచించిన నూతన పద్ధతులు ప్రయోగాలు నేటి విద్యావ్యవస్థలో యంత్రాలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పగటికలలు గానే అనిపించవచ్చు. అయితే గిజూబాయి ఇవి పగటి కలలు కావని ఆయన తన బాలమందిరంలో వీటికి ఆచరణ రూపం ఇచ్చారు. ఈ విధంగా ప్రాథమిక పాఠశాలల్లో వీటిని విజయవంతంగా ప్రయోగించవచ్చని నిరూపించాడు.

కేవలం గుజరాత్ ఉపాధ్యాయులు మాత్రమే కాకుండా, దేశంలోని ఉపాధ్యాయులందరూ ఈ నూతన పద్ధతులనూ కొత్త ప్రయోగాలనూ పగటికలలుగా భావించకుండా వాస్తవాలుగా భావించి అమలుచేయాలని సూచించారు. అప్పుడు మాత్రమే ఈ పగటి కలలు తీయటి కలలుగా మారుతాయనడంలో సందేహం లేదన్నారు.

### 1.5.6 జ్యోతిభా పూలె

జోతిరావు పూలే మహారాష్ట్రలోని సతారా జిల్లాలోని కాట్గూన్ గ్రామంలో 1827 ఏప్రియల్ 11న గోవిందరావు మరియు చెమ్నాబాయిలకు జన్మించారు. తాతగారు పూనేలో పూలవ్యాపారిగా స్థిరపడటం వలన అక్కడే వున్న జ్యోతిరావు స్కాటిష్ మిషన్ హైస్కూల్‌లో చేరి 1847 నాటికి పాఠశాల విద్యని పూర్తిచేసారు. సావిత్రిబాయితో వివాహం అయినది. తన భార్యతో కలిసి 1848లో ఆడపిల్లల కోసం పాఠశాలను స్థాపించారు. 1954లో ఉన్నత కులస్థుల వితంతువుల కోసం ఒక శరణాలయాన్ని స్థాపించారు. ఆడపిల్లల భ్రూణహత్యలను, శిశుహత్యలను నిరసించారు. వేదాలను, విగ్రహారాధనను వ్యతిరేకించాడు. అంటరానితనాన్ని తొలగించడానికి అవిశ్రాంత కృషిసల్పారు. 1873 సెప్టెంబర్ 24న అణగారిన కులస్థుల హక్కులను కాపాడటానికి సత్యశోధక సమాజ్‌ను స్థాపించారు. బొంబాయిలోని సామాజిక కార్యకర్త విఠల్‌రావు కృష్ణాజి వడేకర్ 1888 మే 11 న మహాత్మ అనే బిరుదుతో జ్యోతిరావు పూలేను సత్కరించారు. 1871లో సత్యశోధక సమాజం తరపున దీనబంధు వారపత్రికను ప్రారంభించారు.

**ప్రత్యేకతలు :**

కులాల పేరుతో తరతరాలుగా అణచివేతకు గురైన బడుగు బలహీన వర్గాల ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని కల్పించడంతో పాటుగా వారి హక్కులకోసం పోరాడిన మహామనిషి జ్యోతీరావు పూలె. కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సామాజిక ఉద్యమకారుడు మరియు సామాజిక తత్వవేత్త.

స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని భావించి వారిని విద్యావంతులు చేయడానికి 1848లో బాలికల పాఠశాలను స్థాపించారు. వితంతువుల పునర్వివాహాల గురించి ప్రజల్లో చైతన్యం తెచ్చారు. 1864లో గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించి గర్భిణీ స్త్రీలకు అండగా ఉన్నారు. లింగవివక్షతకు వ్యతిరేకత చూపించాడు. సమానత్వం, స్వేచ్ఛ, ఐకమత్యంతో కూడిన సమాజాన్ని ఆశించారు.

**విద్యాతత్వం లేక విద్యాసూత్రాలు :**

1. పురుషులతో సమానంగా, స్త్రీలకు విద్య అందించబడాలి.
2. విద్యనభ్యసించేవారికి జీవితంలో స్థిరపడడానికి తగిన నైపుణ్యాలు విద్య ద్వారా లభించాలి.
3. విద్య స్వావలంబనానికి తోడ్పడాలి.
4. విద్య వ్యక్తిగతాభివృద్ధికి, సామాజికాభివృద్ధికి తోడ్పడాలి.
5. విద్య ద్వారా తార్కికత పెరిగి అంటరానితనం తొలగించబడాలి.

### 1.5.7 పండిట్ మదన్ మోహన్ మాలవ్యా

మాలవ్యా 1861 డిసెంబర్ 25న అలహాబాదులో పండిట్ బ్రిజ్‌నాథ్ మరియు మూనాదేవి దంపతులకు జన్మించారు. సంస్కృతంలో మంచి పాండిత్యం కలిగిన వీరి పూర్వీకులు మధ్యప్రదేశ్‌లోని మాల్వా (Malwa, ఇప్పుడు Ujjain) నుండి అలహాబాదు రావడంవలన వీరిని మాలవ్యాలు (మాలవీయులు) అని పిలుస్తారు. వీరి అసలు ఇంటిపేరు చతుర్వేది.

హరదేవ ధర్మజ్ఞానోపదేశ పాఠశాల మరియు విద్యావర్ధిని సభపాఠశాలలో ప్రాథమిక విద్యని పూర్తిచేసిన తర్వాత మాలవ్యా అలహాబాదు జిల్లా పాఠశాలలో మాధ్యమిక విద్యను పూర్తిచేశాడు. ఈ రోజుల్లోనే మకరంద్ అనే కలం పేరుతో పద్యాలు రాయగా అవి పత్రికల్లో ప్రచురితమవుతూ ఉండేవి. ప్రస్తుతం అలహాబాదు విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకొన్న ఆనాటి మెయిర్ సెంట్రల్ కాలేజి నుండి 1879లో మెట్రిక్యులేషన్ పాసయ్యారు. ఆ తర్వాత కలకత్తా విశ్వవిద్యాలయం నుండి బి.ఎ.లో పట్టభద్రులయ్యారు. ఎం.ఎ చదవాలనుకున్నప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితుల వలన చదవలేక తండ్రికి ఆయన పనిలో సహాయపడేవారు. ఆ తర్వాత 1884లో అలహాబాదులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సహాయ ఉపాధ్యాయునిగా చేరారు.

ఆ తర్వాత న్యాయవిద్యని అభ్యసించి 1887-1891 అలహాబాదు కోర్టులో, ఆ తర్వాత 1893లో అలహాబాదు హైకోర్టులో న్యాయవాద వృత్తిని కొనసాగించారు.

మాలవ్యా అనిబిసెంట్‌తో కలసి 1915లో ఆసియాలోనే అతిపెద్దదయిన రెసిడెన్షియల్ యూనివర్సిటీ అయిన బెనారస్ హిందూ విశ్వవిద్యాలయాన్ని స్థాపించగా అది 1916 నుండి పనిచేయడం ప్రారంభించింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి 1919 నుండి 1938 వరకు మాలవ్యా ఉపకులపతి (Vice-chancellor) గా ఆ తర్వాత సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపకులపతి అయ్యారు.

మాలవ్యా భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా నాలుగుసార్లు (1909, 1913, 1919, 1932) పనిచేశారు. ఆయన 1934లో కాంగ్రెస్‌ను విడిచిపెట్టారు. ఆయన హిందూ మహాసభలో ముఖ్యమయిన నాయకునిగా కూడా ఉన్నారు.

మాలవ్యా "భారతీయ స్కౌట్స్ మరియు గైడ్స్"కు ఒక వ్యవస్థాపకుడు. ఆయన 1909లో అలహాబాదు నుండి వెలువడుతున్న ఆంగ్లపత్రిక 'లీడర్' ను స్థాపించారు. ఆయన 1924 నుండి 1946 వరకు హిందుస్థాన్ టైమ్స్‌కు చైర్మన్‌గా ఉన్నారు. ఆయన సేవలు 1930లో హిందీ ఎడిషన్ ప్రారంభానికి ఉపయోగపడ్డాయి. వారి సేవలకు గుర్తింపుగా మరణానంతరం 2015 సం॥లో భారతరత్న పురస్కారం లభించింది.

**విద్యాతత్వం లేక విద్యాసూత్రాలు :**

1. విద్య అందరికీ అందించాలనేది మదన మోహన మాలవ్యా అభిప్రాయం.
2. విద్యద్వారా వ్యక్తుల్లో శీలం, సౌశీల్యం, సహనం లాంటి నైతిక విలువలను పెంపొందించాలని ఆలోచన.
3. విద్య ద్వారా వివిధ రకాల నైపుణ్యాలను పెంపొందించడం మూలంగా వ్యక్తులు జీవితంలో స్థిరపడి ఆర్థిక స్వావలంబనను సాధించగలగాలి.
4. విద్య ద్వారా మానసిక బుద్ధితో పాటుగా శారీరక దారుఢ్యాన్ని కూడా పెంపొందించబడినపుడు వ్యక్తులు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండి సుసంపన్నులు అవుతారు.
5. విద్య ఆర్థిక అసమానతలను, అంటరానితనాన్ని, సామాజిక అసమానతలను తొలగించాలి.
6. బోధనాభ్యసన ప్రక్రియ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందదాయకంగా జరగాలి.

### 1.5.8 శ్రీ అరవింద్ ఘోష్ (1877–1950) (Sri Aurobindo Ghosh)

అరవింద్ ఘోష్ భారతదేశములో ఒక ఋషిగా, కవిగా, తత్వవేత్తగా, గొప్ప విద్యావేత్తగా మరియు విప్లవ స్వాతంత్ర్య సమర యోధుడుగా గుర్తింపబడ్డారు. వీరు 5–8–1877న జన్మించారు. చదువు నిమిత్తం ఇంగ్లండు వెళ్ళి సామాజిక భాషలను నేర్చుకున్నారు. బరోడా సంస్థానములోని కళాశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. బెంగాల్ విభజన అరబింద్‌లోని రాజకీయ నాయకుడిని తట్టిలేపింది. తరువాత అలిపుర్ జైలు అతనిని 'యోగి' గా మార్చింది. 1910లో వీరు పాండిచ్చేరి చేరి ఆశ్రమాన్ని స్థాపించారు. 1943లో ఆశ్రమ పాఠశాలను స్థాపించారు. ఈ ఆశ్రమ పాఠశాలే అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగింది. 120 దేశాల నుండి మట్టిని తెచ్చి 1968 ఫిబ్రవరి 23న ఆరవిల్లిలో పునాది రాయి వేశారు. వీరు ప్రపంచానికి సమాకలన (Integral Education) విద్యనందించిన విద్యావేత్త.

**విద్యాతత్వము :**

- ఆత్మ మనస్సును ఎరుకపరచుకునే విద్య నిజమైన విద్య.
- జాతీయ విద్యావిధానము స్థాపించడం.
- మానవ సౌభాగ్యం కోసం పదార్థము మరియు ఆత్మ రెండూ అవసరమే కనుక విద్య ఈ రెండింటి సమతౌల్యానికి సహకరించాలి.
- విద్యార్థికి సంపూర్ణ స్వేచ్ఛనిచ్చి, అతని అవసరాలు, అభిరుచులు, ఆలోచనలు, సామర్థ్యాలు, నైపుణ్యాలు, పరిగణలోనికి తీసికోబడాలి.
- శిశువిద్య విషయంలో మాతృభాషను తప్పక వినియోగించాలి.
- పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడంలో తల్లిదండ్రులు చిన్నతనం నుండే ప్రధాన పాత్రవహించాలన్నారు.

**సమాకలన విద్య :**

మానవునికి సంబంధించిన భౌతిక (Physical), ప్రాణ (Vital), మానసిక (Mental), మానస (Psychic) మరియు ఆధ్యాత్మిక (Spiritual) అనే ప్రముఖ క్రియల్ని విద్య సంపూర్ణంగా అందించాలి. ఇవన్నీ జీవితాంతం వరకు ఒక దానితో ఒకటి కలిసిమెలిసి కొనసాగాలి. ఈ సమాకలన విద్య వ్యక్తి పరిణామానికే కాక జాతి, చివరికి మొత్తం మానవాళి పరిణామానికి ప్రాధాన్యతనిస్తుంది. భౌతిక అభివృద్ధికి వ్యాయామ ఆరోగ్య విద్య; ప్రాణఅభివృద్ధికి కళలు, సంగీతం, నాట్యం, నాటకం, వృత్తులకు; మానసిక అభివృద్ధికి భాషలు, గణితం, విజ్ఞానశాస్త్రం, సామాజిక శాస్త్రాలను; మానవ మరియు ఆధ్యాత్మిక అభివృద్ధికి విలువలను బోధించాలి. మానవాళిపరిణామానికి, అభివృద్ధికి సార్వత్రిక ప్రేమ, సోదర భావం, సానుభూతి, దయలను ప్రోత్సహించాలి.

**విద్యాలక్ష్యాలు :**

- భౌతిక అభివృద్ధి. దీనికోసం ఆటలు, పాటలు విద్యలో ఉండాలి.
- ఆధ్యాత్మికాభివృద్ధి.
- మానసికాభివృద్ధి.
- ఆత్మాభివృద్ధి.
- జీవశక్తి లేదా ప్రాణ అభివృద్ధి.
- జాతీయ విద్యా విధానం.
- గతం, ప్రస్తుతం, భవిష్యత్ విషయాలకు విద్యా విధానములో స్థానం కల్పించాలి. (Past is foundation, present is material, future is aim) అన్నారు.

**ఉపాధ్యాయుడు :**

సహాయకుడు, మార్గదర్శకుడు. సూచనలిచ్చే వాడే గాని బలవంతంగా తమ ఆలోచనలను పిల్లలపై రుద్దేవారు కాదు. పిల్లల మనసును పరిపూర్ణము చేసేవారిగా వ్యూహాత్మకంగా జ్ఞానము పొందేలా ఉపాధ్యాయుడు సహాయపడాలి. జ్ఞానాన్ని అందించేకన్నా ఆ జ్ఞానాన్ని పొందే మార్గాన్ని సూచించాలి. విద్యార్థిలో ఆత్మనిబ్బరతను పెంపొందించాలి. దేనిపైనైనా మనస్సును నిమగ్నం చేయగల శక్తిని పెంపొందించాలి. ప్రాపంచిక, జీవిత, భగవంతునికి సంబందించిన జ్ఞానాన్ని పొందడానికి మార్గదర్శకత్వాన్ని ఇవ్వాలి. తన బోధన తన తత్వానికి, మూర్తిమత్వానికి నిదర్శనం కావాలి.

**ఆరవిల్లిలోని అంతర్జాతీయ విద్యాకేంద్ర లక్ష్యాలు :**

- సమాకలన విద్యా వ్యవస్థాభివృద్ధి.
- భౌతిక, మౌలిక, బౌద్ధిక ఆధ్యాత్మిక శక్తుల వికాసానికి అనుగుణమైన పరిసరాల ఏర్పాటు.
- మానవ ఏకత్వాన్ని చాటి, అంతర్జాతీయ భావన పెంపొందించటం.
- జ్ఞానేకతను చాటి చెప్పి, శాస్త్రసామాజిక అంశాలను సన్నిహితం చేయడం.
- నైతిక వికాసాభివృద్ధికి బాటలు వేయడం.

**మిర్రా అల్ఫస్సా – అమ్మ (Mirra Alfassa - The Mother)**

అరవింద్‌కు ఆధ్యాత్మిక సహాయకురాలు “ది మదర్” అసలు పేరు Blambe Rachel Mirra Alfassa. తన అనుచరులచే “ది మదర్” అని పిలువబడతారు. వీరు 1878 ఫిబ్రవరి 21న ‘పారిస్’లో జన్మించారు. తండ్రి మాయిస్ మారిస్ అల్ఫస్సా, ఒక టర్కిష్ యూదు మరియు తల్లి మాదిల్డే ఇస్మాలన్, ఒక ఈజిప్ట్ యూదు. వీరు జన్మించడానికి ముందు సంవత్సరం వీరి కుటుంబం ఫ్రాన్స్‌కు వలస వచ్చింది.

ఈమె ఐదు సంవత్సరాల వయస్సులోనే అప్పుడప్పుడూ ఒక ట్రాన్స్‌లోకి వెళ్తూఉండేది. పదకొండు మరియు పదమూడు సంవత్సరాల మధ్య ఆమె కొన్ని వరుస అతీంద్రియ మరియు ఆధ్యాత్మిక అనుభవాలతో భగవంతుని యొక్క అస్థిత్వాన్ని మరియు అతనిలో ఏకము అయ్యే అవకాశాన్ని కనుగొన్నారు. 12వ సంవత్సరములో తాంత్రిక విద్యను అభ్యాసం చేసి భౌతిక శరీరం నుండి ఆత్మబయటకు ప్రయాణించేలా చేయగలిగారు.

కొంతమంది మిత్రుల సలహాలతో 1914లో మదర్ పాండిచ్చేరిలో శ్రీ అరవింద్‌ను కలిశారు. పదకొండు నెలలు గడిపిన తరువాత, మొదటి ప్రపంచ యుద్ధం రావటంతో ఫ్రాన్స్‌కు తిరిగి వెళ్ళారు. మరల ఏప్రిల్ 1920లో మదర్ మరలా పాండిచ్చేరిలో శ్రీఅరవింద్‌ను కలిశారు.

1927 నవంబర్‌లో శ్రీ అరవిందో ఆశ్రమం ఏర్పడినపుడు శ్రీ అరవింద్ మదర్ పై నమ్మకం ఉంచి ఆశ్రమ నిర్వహణ బాధ్యతలను మరియు శ్రీ అరబిందో తత్వ ప్రచార బాధ్యతను ఆమెకు అప్పగించారు. సుమారు 50 సంవత్సరాలు ఆమె మార్గదర్శకత్వంలో ఆశ్రమం అనేక విధాలుగా అభివృద్ధి చెందింది.

1952లో మదర్ శ్రీ అరబిందో ఇంటర్ నేషనల్ సెంటర్ ఆఫ్ ఎడ్యుకేషన్ మరియు 1968లో ఇంటర్నేషనల్ టౌన్ షిప్ “ఆరోవిల్లో” ను ఏర్పాటు చేశారు. 1973 నవంబర్ 17న మదర్ భౌతికాయాన్ని వదిలి వెళ్ళారు. విద్యపట్ల శ్రీ అరవింద్ ఆలోచనలతో దాదాపుగా అమ్మ ఆలోచనలు కూడా కలుస్తూ ఉండేవి. అందుకే ఒకరి ఆలోచనలు ఇంకొకరిని ప్రభావితం చేశాయి.

**1.5.9 డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ (1888–1975) (Dr.S. Radha Krishnan)**

రాధాకృష్ణన్ గారు 1888లో తమిళనాడులో జన్మించినారు. అక్కడే పాఠశాల మరియు కళాశాల విద్యను అభ్యసించారు. 1910లో ఫిలాసఫీ లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత కొన్ని భారతీయ విశ్వవిద్యాలయాల్లో తత్వశాస్త్ర ఆచార్యునిగా పనిచేశారు. అక్కడే ఆయన రచనావ్యాసాంగాన్ని ప్రారంభించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయము మరియు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయము ఉపకులపతిగా పనిచేసినారు. “హిందూ వే ఆఫ్ లైఫ్” అను అంశముపై ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయములో ఉపన్యాసములిచ్చినారు. యూనివర్సిటి గ్రాంట్సు కమీషన్ అధ్యక్షులుగా పనిచేసినారు. ఐక్యరాజ్య సమితి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంఘం (UNESCO) మొదటి భారతీయ జట్టు అధ్యక్షులుగా పనిచేసినారు.

రాజకీయంగా ఈయన జీవితమును రష్యాలో భారత రాయబారిగా ప్రారంభించినారు. 1952లో భారత ఉపరాష్ట్రపతిగా ఎంపికైనారు. 1962లో భారతదేశము రెండవ రాష్ట్రపతిగా పదవిని చేపట్టినారు. 1967లో ఆయనను ప్రభుత్వం “భారతరత్న” బిరుదుతో గౌరవించినది.

**విద్యాతత్వం – లక్షణాలు :**

ఆయన యొక్క జీవిత తత్వానికి ఆయన విద్యాతత్వం దగ్గరగా వుంది. ఆయన పేర్కొన్న ముఖ్య విద్యాలక్షణాలను క్రింద చూద్దాం.

**1.** **విద్య అర్థము:–** రాధాకృష్ణన్ ప్రకారం "మన సంస్కృతిలోని విలువైన అంశాలను పరిరక్షించి పనికిరాని వాటిని ఉపేక్షించే ప్రక్రియే విద్య. దీని సహాయంతో వ్యక్తులు ఈ దేశం యొక్క మంచి పౌరులుగా తయారవ్వటానికి దోహదపడుతుంది. ఒకప్పుడు అల్ప సమాజాల్లో కుటుంబం, మతాలు, రాజకీయ, సాంఘిక సంస్థలు ఏమి చేశాయో ఇవాళ విద్యా సంస్థలు అవే చేయాలి.

విద్య అనేది నిరంతరం సాగే అభివృద్ధి ప్రక్రియ. విద్యను ఉపాధ్యాయుడ్నించి, స్వీయ ప్రయత్నం నుంచి, తోటి వ్యక్తుల నుంచి, జీవితానుభవం నుంచి నేర్చుకుంటా మన్నమాట.

**విద్యా లక్ష్యాలు :**

1. ఉన్నత జీవితంలోకి, ఈ ప్రపంచంలోకి వ్యక్తిని పరిచయం చేయడం విద్య యొక్క ముఖ్య లక్ష్యముగా ఉండాలి.
2. అజ్ఞానాన్ని, పేదరికాన్ని, అనారోగ్యాన్ని తొలగించడం విద్యాలక్ష్యంగా ఉండాలి.
3. విద్యార్థులు సామాజిక పరిసరంలో సర్దుబాటు చేసుకోవడమేగాక, ఆ సామాజిక పరిసరాన్ని మెరుగుపరచడం కూడా విద్యా లక్ష్యంగా ఉండాలి.
4. సమగ్రమైన జీవితాన్ని అందించడం కూడా విద్యాలక్ష్యంగా ఉండాలి.
5. శీలవంతులైన వ్యక్తులను తయారుచేయడం.
6. బౌద్ధికాభివృద్ధి, సృజనాత్మకత, ఊహను పెంపొందించుట.
7. జాతీయ ఐక్యతను, సమగ్రతకు కృషి చేయడం కూడా విద్యా లక్ష్యంగా ఉండాలి.
8. పిల్లల్లో ప్రపంచ పౌరసత్వభావాన్ని, లౌకిక భావాలను విద్య పెంపొందించాలి.

**విద్యాప్రణాళిక :**

పై లక్ష్యాలను సాకారం చేయడానికి జాగ్రత్తగా విద్యా ప్రణాళికను యోచించాలని రాధాకృష్ణన్ అన్నారు. అధ్యయనం చేయాల్సిన అంశాలను ఆయన మూడు ప్రధానాంశాలుగా వర్గీకరించారు.

1. ప్రకృతి లేదా విషయాలతో సంబంధం గలవి.

2. మనుషులు లేదా సమాజాలతో సంబంధం కలవి.

3. ఆధ్యాత్మికత లేదా విలువలతో సంబంధం కలవి.

రాధాకృష్ణన్ అభిప్రాయం ప్రకారం ఈ మూడు అంశాలను బట్టి పొందాల్సిన జ్ఞానాన్ని లేదా అధ్యయనం చేయాల్సిన విషయ సామగ్రిని మూడు ప్రధాన సబ్జెక్టులుగా విభజించాలి. అవి. (1) విజ్ఞాన మరియు సాంకేతిక శాస్త్రాలు (Science and Technology) (2) సాంఘిక అధ్యయనాలు (Social Studies) (3) భాష, సాహిత్యం, కళలు, నీతిశాస్త్రం, తత్వశాస్త్రం మతంతో కూడిన మానవ శాస్త్రాలు (Humanities)

విద్యా ప్రణాళికలో సహపాఠ్య కార్యక్రమాలకు కూడా స్థానం ఉండాలని సూచించారు.

**బోధనా పద్ధతులు :**

1. విద్యార్థులకు చక్కని పఠనావకాశాలను కల్పించి పఠింపచేయడం.
2. ప్రతిరోజు కాసేపు నిశ్శబ్దాన్ని పాటించడం. దీనినే ధ్యానం అన్నారు.
3. ఉపన్యాస పద్ధతిని ఉపయోగించాలి.
4. సెమినార్లు ఏర్పాటు చేయడం వంటివి ఉపయోగించాలన్నారు.

**ఉపాధ్యాయుని పాత్ర :**

పిల్లల పట్ల ఎల్లలెరుగని ప్రేమను, శ్రద్ధను చూపాలన్నారు. ప్రవర్తన ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలి. విద్యార్థులలో సృజనాత్మకత, విమర్శనాత్మక శక్తులు వెలికి తీసేలా ఉపాధ్యాయులు వ్యవహరించాలని రాధాకృష్ణన్ అన్నారు.

**మత విద్య :**

పాఠాల రూపంలో మతాన్ని గురించి బోధించ కూడదని పాఠశాల, కళాశాల జీవితంలో తరగతి ప్రారంభానికి ముందు ప్రతి ఉదయం నిశ్శబ్ద ధ్యానాన్ని పాటించాలని సాధారణ సూచన చేశారు రాధాకృష్ణన్.

**స్త్రీ విద్య :**

జాతి అభివృద్ధి కావాలంటే స్త్రీ విద్య చాలా అవసరమని రాధాకృష్ణన్ అభిప్రాయం. సాధారణంగా విద్య స్త్రీలలో, పురుషులలో ఎవ్వరికో ఒక్కరికే పరిమితమవ్వాలనేటట్లయితే అది స్త్రీలకే పరిమితం కావాలని స్త్రీ విద్య ప్రాముఖ్యత చాటి చెప్పారు. రాధాకృష్ణన్ అభిప్రాయం ప్రకారం స్త్రీలకు కుటుంబం, గృహరక్షణకు అవసరమైన విద్యను అందించాలి. గృహ, ఎకనామిక్స్, నర్సింగ్, టీచింగ్, ఫైన్ ఆర్ట్స్‌వంటి కోర్సులను స్త్రీలకు అందించాలని వారు సూచించారు.

**విద్య విషయములో రాధాకృష్ణన్ గారి అభిప్రాయములు :**

1. విద్య మనస్సును, ప్రజ్ఞను, ఆత్మను తగు విధమున అభివృద్ధి చేయునది. మానవుల సంక్షేమమే విద్యాధ్యేయం.
2. విద్యవైజ్ఞానిక ధృక్పథమును పెంచాలి. నూతన భావాలకు, శాస్త్రీయ దృక్పథమునకు అవకాశముండాలి.
3. విద్య ప్రజాస్వామ్య దృక్పథమును పెంచాలి. పౌరులందరికీ విద్యావకాశములు సమానంగా ఉండాలి.
4. విద్య స్వీయ క్రమశిక్షణను ప్రోత్సహించాలి.
5. విద్య వ్యక్తిలో నిర్మలమైన మనస్సును రూపొందించాలి. దైనందిన అవసరముల అనుగుణంగా విద్య రూపొందించాలి.
6. విద్యలో స్త్రీలకు సమాన అవకాశములుండాలి.
7. విశ్వమానవతా దృక్పథమును పెంచాలి.
8. విద్య వ్యక్తిలో అన్ని శక్తుల సమగ్రతకు తోడ్పడాలి.
9. మంచి చెడులు గుర్తించుటకు విద్యసహాయపడాలి.
10. పరిశోధనా దృక్పథమును విద్య పెంచాలి.

డాక్టర్ రాధాకృష్ణన్ గారి యూనివర్సిటి గ్రాంట్స్ కమీషన్ 1948 నివేదిక అతను మన దేశ విద్యా విధానమునకు అందించిన విలువైన కానుక.

**1.5.10 భక్త కబీర్ (సంత్ కబీర్) :**

భక్త కబీరుదాసు భక్తి సామ్రాజ్యంలో ఆణిముత్యాలవలె వెలుగొందిన వారిలో అగ్రగణ్యుడు. కబీరుదాసు అంటే గొప్ప జ్ఞాని అని అర్థం. కబీర్ జన్మస్థలం కాశి. కబీరుదాసు చదువుకున్న విద్యాధికుడు కాదు. కాని ఆయన చెప్పిన ఉపదేశాలను ఆయన శిష్యులు గ్రంథస్థం చేశారు. దాని పేరు “కబీర్ బీజక్”.

కబీర్ శ్రీరాముని భక్తుడు. కబీరుదాసు గురువు రామానందుడు. అతని ద్వారా జ్ఞానోపదేశం పొంది జీవితాన్ని పావనం చేసుకున్నాడు కబీర్.

కబీర్ మరణించిన తరువాత అతని భౌతికకాయం కోసం హిందువులు మరియు ముస్లింలు వాదులాడుకున్నారు. కబీర్ ముస్లిం అని, కాదు హిందువు అని వారు పోట్లాడుకున్నారు. భౌతికకాయం మాయమై దానికి బదులుగా అక్కడ పుష్పాలు వెలిశాయట. ఈ నిదర్శనం వల్ల వారికి భక్త కబీరు ఎంతటి మహిమాన్వితుడో తేటతెల్లమయింది.

**సాహిత్యం :**

కబీర్ దాసు దోహాలు ప్రసిద్ధి చెందాయి.

**సూక్తులు :**

మతాల పేరిట సామరస్యం చెడగొట్టుకోవడం అవివేకం.

“రామ్ రహీమ్ ఏక్ హై” (రాముడు మరియు అల్లా ఒక్కడే).

భగవంతుని కొరకు అక్కడ–ఇక్కడ వెతకవలసిన పనిలేదు. అతను నీలోనే ఉన్నాడు. నీలో వున్న ఆత్మారాముని కనుగొనలేక కస్తూరి మృగం చందంబున అక్కడక్కడ వెదకులాడిన ఏమి లాభం? పూవులోని వాసనలా దేవుడు నీలోనే ఉన్నాడు. తన నాభి నుండి బయటపడుతున్న కస్తూరి గంధాన్ని తెలుసుకోలేని జింక, దాన్ని బయట గడ్డిలో వెతుకుతుంది. అలాగే నీలోని భగవంతుణ్ణి బయట వెతక వద్దు.

**విద్యాతత్వం లేక విద్యా సూత్రాలు :**

- కబీర్‌దాసు విద్య గురించి ప్రత్యేకంగా చెప్పకపోయినప్పటికీ ఆయన దోహాలలో విద్య వలన మంచి జరుగుతుందనే విషయం తెలుస్తుంది.
- దేవుడు ఒక్కడే కనుక విద్య, మతాల మధ్య సామరస్యాన్ని తీసుకురావాలి.
- విద్య ద్వారా మతాలు అందరికీ అందించబడి సమాజంలో సామరస్యం తీసుకురాబడాలి.
- అందరూ విద్యను పొందినప్పుడు మూఢాచారాలు పోయి అందరూ సుఖజీవనాన్ని గడపగలుగుతారు.
- విద్య ద్వారా సమాజ శ్రేయస్సు నిర్మించబడుతుంది.

## 1.5.11 పాశ్చాత్యావిద్యావేత్తలు (Westren Educationists)

### జాన్ డ్యూయీ (John Dewey) (1819–1952)

జాన్ డ్యూయీ 1859లో న్యూ ఇంగ్లండులోని వెర్‌మాంట్‌లో జన్మించారు. 1879లో వెర్‌మాంట్ యూనివర్సిటీలో పట్టభద్రుడై 2 సంవత్సరాలు తత్వశాస్త్రం చదివి కొంతకాలం ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాడు. అనంతరం జాన్ హాప్ కిన్స్ విశ్వవిద్యాలయంలో పి. హెచ్. డి. చేసి మిచిగాన్ యూనివర్సిటిలో ఉపన్యాసకుడిగా చేరి 1894 వరకు అక్కడే పని చేశారు. అనంతరం చికాగో యూనివర్సిటిలో పనిచేశారు. 1892లో ఒక ప్రాథమిక పాఠశాల స్థాపించి దానిలో పని చేశారు. ఆ పాఠశాలే అతనికి ఎనలేని పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టింది. వారి సిద్దాంతాలు అన్నింటిని ఈ పాఠశాలలోనే పరీక్షించుకొని ప్రచారంలోకి తెచ్చారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో 1940లో తత్వశాస్త్ర శాఖలో ఆచార్యునిగా చేరి 1952 వరకూ ప్రపంచ దేశాలలో ఉపన్యాసాలు ఇచ్చారు.

ఇతను ప్రఖ్యాత తత్వవేత్త, విద్యావేత్త, మనో విజ్ఞానశాస్త్ర వేత్త. విద్యా సమస్యల మీద కృషి చేసిన గొప్ప మేధావి.

**వివిధ విద్యాంశాలపై డ్యూయీ అభిప్రాయాలు :**

**1. విద్యా లక్ష్యాలు :**

- భవిష్యత్ కంటే ప్రస్తుత శిశువు అవసరాలను తీర్చడానికే విద్యా లక్ష్యంగా చేసికోవాలని చెప్పారు.
- విద్యార్థిలో సాంఘిక నైపుణ్యాలను, సామర్థ్యాలను విద్య అభివృద్ధి చేయాలి.
- శారీరకాభివృద్ధికి సంబంధించిన అవగాహన విద్యార్థికి కలిగించాలి.

**2. విద్యాతత్వము :**

- విద్యయే జీవితం. విద్య జీవితానికి ప్రారంభ కృషి కాదు. అది నిరంతరం మానవుని తుది దశ వరకు నిరాటంకంగా సాగిపోతూనే ఉంటుంది.
- విద్య విద్యార్థిని అనుభవాలకు దగ్గరగా తీసుకుని వెళ్ళాలి.
- విద్య మానవుల అవసరాలను తీర్చేదిగా ఉండాలి.
- సాంఘిక, భౌతిక వనరులను ప్రాతిపదికగా తీసుకొని విద్యావిధానాన్ని రూపొందించుకోవాలి.

**3. విద్యాప్రణాళిక :**

- డ్యూయీ ప్రకారం పిల్లల స్థాయిలు, సామర్థ్యాలనుబట్టి, అవసరాలను బట్టి విద్యాప్రణాళిక ఉండాలి అన్నారు.
- విద్యా ప్రణాళికకు నమ్యత (Flexible) లక్షణం యుండాలన్నారు.
- ప్రాథమిక విద్యలో విద్యా ప్రణాళిక పిల్లల 4 విధాలైన అభిరుచులను బట్టి యుండాలి. (1) సమాచార ప్రసారం, సంభాషణలో వారి అభిరుచి, (3) అన్వేషణలో వారి అభిరుచి, (3) చేయడంలో లేదా నిర్మాణంలో వారి అభిరుచి, (4) కళాత్మక అభివ్యక్తులు (Artistic expression)లో అభిరుచి.
- పఠనం, రాయడం, లెక్కించడం, చేతిపని, డ్రాయింగ్ వంటి విషయాలు ప్రధానంగా ఉండాలి.
- ముఖ్యమైన సబ్జెక్టులన్నిటి మధ్య సహసంబంధం (correlated) ఏర్పరచి బోధించాలి. (వేరుపరచి బోధించరాదు.)

- విద్యా ప్రణాళికలో భాషాజ్ఞానం, ఆరోగ్యం, చరిత్ర, భౌగోళిక శాస్త్రం, శారీరక వ్యాయామాలు, గణితం, విజ్ఞాన శాస్త్రాలను ఉంచాలన్నాడు.

**4. ఉపాధ్యాయుడు :**

- విద్యార్థికి మార్గదర్శి, దర్శకుడు, స్నేహితుడు. విద్య అనే పడవను నడిపేది ఉపాధ్యాయుడే.
- ఉపాధ్యాయుణ్ణి భగవంతుని దూతగా భావించాడు. దేవుని రాజ్యానికి దారి చూపేవాడు.
- పిల్లల సామాజిక జీవనానికి చక్కటి శిక్షణ ఇస్తూ తన బాధ్యతను తాను నిర్వహిస్తూ అలా సామాజిక క్రమశిక్షణకు, వృద్ధికి దారి చూపే వాడే ఉపాధ్యాయుడు.

**5. బోధనా పద్ధతులు :**

- విద్యార్థి స్వీయ అభ్యసనానికి అవకాశం ఇవ్వడం జరిగింది.
- శిశు కేంద్రీకృత విద్య, క్రీడా పద్ధతి. పరికల్పనా పద్ధతి (Project method) ని మొదట సూచించినది డ్యూయీనే.
- చేస్తూ నేర్చుకోవడం, కృత్యం, పిల్లవాని జీవనానికి ప్రయోజనం సహసంబంధం వంటి మూల సూత్రాల మీద బోధనా పద్ధతి ఆధారపడి యుండాలి.

**6. జాన్ డ్యూయీ ఆదర్శ పాఠశాల :**

ఇందులో 4-14 సంవత్సరాల వయస్సు బాలబాలికలను చేర్చుకొని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా ప్రణాళికను అమలు చేశాడు. దీనిని విశ్వవిద్యాలయ పాఠశాల అనే వారు. బోధనాభ్యసన విషయంలో స్వతఃసిద్ధ మార్గాలను అన్వేషించేవారు. డ్యూయీ పాఠశాలను విస్తరించిన గృహం (enlarged home) గా పరిగణించారు.

ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు ఇంటిలో తల్లిదండ్రులు ఎలా ఉంటారో అలాగే ఉంటారు. అనగా సహకారం, త్యాగగుణం, ఓర్పు, సోదరభావం లక్షణాలు కల్గి ఉంటారు.

ఇతని అభిప్రాయం ప్రకారం పాఠశాల ఒక చిన్నపాటి సమాజం. ఇందులో సమాజానికి అనుభవాలను చిన్న స్థాయిలో పిల్లలకు అందించడం జరుగుతుంది. ఈ పాఠశాలలో పిల్లవాడు చేస్తూ నేర్చుకోవడం మరియు ప్రయోజన పూర్వకమైన కార్యక్రమాల్లో పాల్గొంటారు. వంట చేయడం, బట్టలు కుట్టడం, వడ్రంగి పని, నేతనేయడం వంటి కార్యక్రమాలు ఇందులో చేరి ఉంటాయి. ఇలా పాఠశాల ఆచరణలో ఉపయోగకరంగా ఉండే రకరకాల సామాజిక, ఆర్థిక, నైతిక అనుభవాలను పిల్లలకు అందించడం జరుగుతుంది.

### 1.5.12 ఫ్రోబెల్ (Froebel) (1783-1852) :

ఫ్రెడరిక్ ఆగస్ట్ ఫ్రోబెల్ జర్మనీ దేశానికి చెందిన గొప్ప విద్యావేత్త. తన బాల్యంలో, యవ్వనంలో నిర్లక్ష్యానికి గురికాబడ్డాడు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తిరుగుతూ అనేక విషయాలను, వృత్తులను నేర్చుకున్నాడు. స్విట్జర్లాండ్, జర్మనీల్లో తన స్వంత పాఠశాలను ప్రారంభించినాడు. తగినంత డబ్బులేక ఆనాటి ప్రభుత్వ నిర్బంధాలవలన ఈ పాఠశాలలు అంతగా రాణించలేదు. అయితే ఈ కాలంలో ఆయన ఖాళీగా ఉండక విద్యపై గొప్ప పుస్తకాలు వ్రాశాడు. వీటిలో ముఖ్యమైనవి. 1. The education of man 2. Pedagosis of kindergarden 3. Mother plays and

Nursery songs 4. Education by development. ఈ పుస్తకాలలో 7 సం॥లలోపు పిల్లల విద్యా విషయాల గురించి వర్ణించాడు. ఇతను స్థాపించిన కిండర్ గార్డెన్ పాఠశాల 'ప్రీ స్కూలు' దశలోని పిల్లలకు విద్యలో నూతన శకాన్ని ప్రారంభించినది. చివరి దశలో చాలా కాలం కిండర్ గార్డెన్‌లో పనిచేయుటకు కావాల్సిన పద్ధతులు, బోధనోపకరణములు తయారు చేయుటలో కాలం గడిపాడు.

**విద్యాతత్వము :**

- సృజనాత్మక శక్తిని విద్యార్థులలో పెంపొందించుట విద్య యొక్క ముఖ్యవిధి.
- బాల్యదశలో ఉపాధ్యాయుడు పిల్లల అనుభవాలకు జీవిత సందర్భములకును పరస్పర సంబంధం (Inter relatedness to Education)ను తెలియజెప్పాలి.
- సహజ సిద్ధముగా అభివృద్ధి చెందుటకు స్వేచ్ఛా వాతావరణం ముఖ్యం అన్నారు.
- సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని స్వయం కృషి ద్వారా అభివృద్ధి చెందాలి.
- స్నేహ, సహకార జీవన విధానానికి శిక్షణ ఇచ్చి, ఆత్మసాక్షాత్కారమును, సాంఘికీకరణమును పెంపొందించాలి.
- క్రీడల ద్వారా, పాటల ద్వారా స్వేచ్ఛగా, ఆనందంగా విద్య నేర్చుకొనుటకు వీలు కల్పించాలి.

**కిండర్ గార్టెన్ :**

1837లో కిండర్ గార్డెన్ విధానాన్ని రూపొందించి ప్రపంచానికి బాగా పరిచయమయ్యాడు. 1839 లో జర్మనీలోని బ్లాన్ కెన్ దర్గ్ అనే గ్రామంలో మొదటి కిండర్ గార్టెన్ పాఠశాలను స్థాపించి, వివిధ బోధనోపకరణాలు రూపొందించడం జరిగింది.

ఈ పాఠశాలలో పిల్లలు ఉపాధ్యాయుల ద్వారా నేర్చుకొనే దానికంటే సామూహికంగా ఆడుట, పాడుట, బొమ్మలతో, ఆటవస్తువులతో కాలక్షేపం చేయుట, కథలను వినుట, బొమ్మలను తయారు చేయుట, ప్రకృతిని పరిశీలించుట, పెద్దలను అనుకరించుట ద్వారా ఎక్కువగా నేర్చుకొంటారు. ఈ విధానంలో ఉపాధ్యాయులు కేవలం పర్యవేక్షకులుగా ఉంటారు.

పిల్లలు స్వతహాగా అనేక కార్యక్రమాలను నిర్వహించగలరనే భావనతో తన విద్యాతత్వాన్ని ప్రకటించాడు. అంతగా పరిచయం లేని క్షేత్రగణిత బ్లాకులు (Geometric blocks) వంటి విద్యాపరికరాలను ఉపయోగించి పిల్లలకు రూపం (from), సంఖ్యా భావనలు (number concepts) చెప్పడం, సంగీతం మరియు ఆటల కార్యక్రమాలు నిర్వహించడం ఫ్రోబెల్ కిండర్ గార్డెన్ విధానంలోని ముఖ్యవిషయం.

వీరి కిండర్ గార్డెన్ సిద్ధాంతంలో 3 ముఖ్య లక్షణాలు కనిపించును. అవి :

1) స్వయం క్రియ (self activity)

2) సృజనాత్మకత (creativeness)

3) సామాజిక భాగస్వామ్యం (social participation)

**విద్యాప్రణాళిక :**

1. చేతిపని, 2. మతం మరియు మత శిక్షణ, 3. విజ్ఞానశాస్త్రం మరియు గణిత శాస్త్రం 4. భాషలు, 5. కళలు మరియు కళావస్తువులు.

**ఉపాధ్యాయుడు :**

ఈ విధానములో ఉపాధ్యాయుడు తోటమాలిగా వ్యవహరించాలన్నాడు. ఉపాధ్యాయుడనే ఈ తోటమాలి మొక్కల్లాంటి చిన్నారి మానవ మొక్కలను జాగ్రత్తగా కనిపెట్టుకొని సహజంగా అభివృద్ధి కావడానికి తోడ్పడాలి.

**1.5.13 మరియా మాంటిస్సోరి (1870–1952) :**

మాంటిస్సోరి 1870లో ఇటలీలో జన్మించారు. తాను మొదట ఒక నటికావాలనుకొని నాటక పాఠశాలలో చేరినది. కాని అది ఆమెకు సంతృప్తినివ్వలేదు. తరువాత తాను వైద్యురాలు కావాలనుకొని వైద్యవృత్తి నెన్నుకొన్నది. వైద్యవిద్య పూర్తి అయిన తరువాత రోమ్ విశ్వవిద్యాలయంలో మానవ శాస్త్రం (Anthropology) అధ్యాపకురాలిగా పనిచేసినది. ఆ సమయంలో ఆమెకు మందబుద్ధులైన పిల్లలను పర్యవేక్షించు అవకాశం కలిగింది. ఆ సమయంలో క్రింది విషయాలను కనుగొన్నారు.

1. మానసిక మాంద్యము, జ్ఞానేంద్రియాల్లోని మాంద్యము వలన (dullness) కలుగుచున్నది.
2. ఈ మాంద్యము తొలగించడానికి కొంత శిక్షణ ఇచ్చిన వీరిలో విద్యా విషయకంగా అభివృద్ధి గావించవచ్చు.
3. ఈ పద్ధతిని సాధారణ పిల్లలపై ప్రయోగించి మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.

ఇండియాకు 1939 మాంటిస్సోరి గారు వచ్చి మద్రాసులో మాంటిస్సోరి పాఠశాలలు పెక్కింటిని స్థాపించినది. ఆమె ప్రవచించిన శిశువిద్య ప్రపంచ వ్యాప్తంగా పేరు గాంచినది.

**విద్యాతత్వము :**

1. విద్య అంతర్గత శక్తుల నుండి ప్రారంభము కావాలి.
2. పాఠశాలలో అభ్యసనము విద్యార్థి స్వేచ్ఛకు అడ్డురాని శాస్త్రీయ పద్ధతులలో జరగాలి.
3. పిల్లలకు బహుమతులు, దండనలు ఇవ్వరాదు.
4. విద్యార్థులలో వైయక్తిక తేడాలుంటాయి. అందుకే ప్రతి శిశువును తన వేగము, అభిరుచిననుసరించి అభ్యసనం చేయు వీలు కల్గించాలి. సామూహిక బోధన అభిలషణీయం కాదు.
5. శిశువు చేయు అభ్యసనములో పెద్దల జోక్యం ఉండరాదు అంటారు. ఈమె కొన్ని పరికరాలు తయారు చేశారు. వాటి ద్వారానే పిల్లలు పనిలో మునిగి చదవడం, రాయడం, గణితం నేర్చుకోగలరు అంటారు.
6. ఇంద్రియాలు విషయ విజ్ఞానమందించు కవాటములు. వీటికి తగిన శిక్షణ ముఖ్యమని వీరి భావన.
7. ఉపాధ్యాయులు ఒక నిర్దేశకులు (Directors). విద్యార్థులనే ఎదగనివ్వాలి.
8. పూర్వప్రాథమిక విద్యలో వ్రాయుట, చిత్రలేఖనం, సంభాషణలకు ప్రాముఖ్యతనివ్వాలి. ఊహలతో విద్యార్థుల మనసులను నింపరాదు.

**మాంటిస్సోరి విద్యా విధానము :**

3–7 సంవత్సరముల మధ్యనున్న బాలబాలికలకు ఈ విద్యావిధానము వర్తిస్తుంది. విద్యనభ్యసించు సమయమున పిల్లలందరూ పనిలో నిమగ్నమై యుంటారు. ఈ విద్యా విధానములో క్రమశిక్షణ తనంతట తానే అలవడుతుంది. స్నేహము, ఆత్మీయత అనుబంధాలు విద్యార్థుల మధ్య నెలకొంటాయి.

విద్యార్థులు తమ పనులు తాము చేసికొనుటలో శిక్షణ పొందుతారు. దుస్తులు తొడుగుకొనుట, పదిలపరచుకొనుట వారే చేసికొంటారు. మాంటిస్సోరి పద్ధతిలో తమకు ఇష్టం వచ్చిన విషయాలను ఎన్నుకొని నేర్చుకుంటారు. ఈ విద్యా విధానములో విద్యను 4 దశలలో బోధిస్తారు.

**మొదటి దశ :–** ఇంద్రియముల శిక్షణ. స్పర్శ, దృష్టి, శ్రవణంల శిక్షణ కొరకు వివిధ రకాల ఆటలు, వ్యాపకాలు ఏర్పాటు చేయబడ్డాయి. వీటికి తగిన వస్తువులను ఉంచడం జరిగినది.

**రెండవ దశ :–** ఈ దశలో తేడాలను గుర్తింపచేస్తారు. ఉదా: రంగులు, పరిమాణాలు, ఆకారాలు మొదలైనవి విస్తరించడం. లేఖనం ముందు, పఠనము తరువాత అని మాంటిస్సోరి అభిప్రాయం. పేర్ల వారిగా వస్తువులను సర్దుట నేర్చుకొంటారు.

**మూడవ దశ :–** విడి విడి భాగాలను కలిపి వస్తువులను నిర్మించడం. ఇందులో దృష్టి స్పర్శ జ్ఞానాలు అభివృద్ధి చెందడమే కాక కండరాలకు వ్యాయామం లభిస్తుంది. ఈ దశలో చదవడం ప్రారంభించాలి. చదవడం అంటే అక్షర గుర్తింపేకాక పదములకు అర్థము అవగాహన కావాలి.

**నాలుగవ దశ :–** ఈ దశలో జీవితావసరముల శిక్షణకు ప్రాధాన్యతనిస్తారు. దైనందిన జీవితంలో శారీరక శుభ్రత, పరిసరాల శుభ్రత, గృహాలంకరణము మొదలైన విషయాల గురించి శిక్షణ ఇవ్వడం జరుగును. చదవడం, రాయడం, గణితం (3 Rs) నేర్పబడుతుంది. పిల్లలు స్వయంగా లెక్కపెట్ట గలుగుతారు. శాస్త్రీయమైన బోధనోపకరణములు ఇందుకు సహాయపడతాయి.

### 1.5.14 జె.పి.నాయక్ :

జయంత్ పాండురంగ నాయక్‌ను జె.పి. నాయక్ అని పిలుస్తారు. ఈయన ప్రముఖ భారతీయ విద్యావేత్త. గొప్ప మానవతా వాది, స్వాతంత్ర్య సమరయోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి మరియు సామ్యవాద తత్వవేత్త. UNESCOచే గుర్తించబడిన ముగ్గురు మార్గదర్శక విద్యావేత్తలలో వీరు ఒకరు. ప్రజలంతా ఈయనను నిజమైన కర్మయోగిగా పిలుస్తూ ఉంటారు.

జె.పి.నాయక్ 1909 సెప్టెంబర్ 5న మహారాష్ట్ర, కొల్హాపూర్ జిల్లాలోని బహిరవాడి అనే చిన్న పట్టణంలో జన్మించారు. ఆయన ఒక పేద గ్రామీణ కుటుంబం నుండి వచ్చారు. ఆయన గొప్ప విద్యాజీవితంను కలిగియున్నారు. జె.పి.నాయక్‌కు సాహిత్యం, చరిత్ర మరియు గణితశాస్త్రంపట్ల ఎక్కువ ఆసక్తి ఉండేది.

నాయక్ మొదటి డిగ్రీ అందుకొనే సమయంలోనే భారతదేశంలో గాంధీజీ నాయకత్వంలో స్వాతంత్ర్య సమరం మొదలైంది. దానికి ఆకర్షితుడైన నాయక్ గ్రామీణ ప్రాంతాలలో ఒక మంచి గాంధేయవాదిగా నిర్మాణాత్మక పాత్రను పోషించారు. ఇలా భారతీయ విద్యావేత్తల్లో విభిన్నమైన పాత్రలు పోషించిన అతికొద్ది మందిలో జె.పి.నాయక్ కూడా ఒకరు. ఒక గ్రామీణ ప్రాథమిక ఉపాధ్యాయుడి స్థాయి నుండి కేంద్ర విద్యామంత్రిత్వ శాఖకు ఒక సలహాదారునిగా మరియు విభిన్నమైన పాత్రలు పోషించారు.

ఆయన విద్యాకార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక పాఠశాలలను స్థాపించడం ద్వారా మొదలైందని చెప్పవచ్చు. అలాగే సామూహిక విద్య, అక్షరాస్యత, వయోజన విద్య, బేసిక్ విద్య లాంటి వాటికి ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చి వాటికోసం ఎంతో కృషిచేశారు.

బ్రిటీష్ కాలం నుండి ఉన్న భారతీయ విద్యా చరిత్రను కొన్ని భాగాలుగా రచించారు. బొంబాయిలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ను స్థాపించడంలో ముఖ్యపాత్ర పోషించారు. అలాగే కొల్హాపూర్ దగ్గర గ్రామీణ విశ్వవిద్యాలయం స్థాపించి దానిని సమర్థవంతంగా నిర్వహించాడు.

కేంద్ర విద్యామంత్రిత్వ శాఖకు ముఖ్య సలహాదారుగా సేవలందించాడు. ఎటువంటి జీతం తీసుకోకుండా NCERT, NIEPA లాంటి ముఖ్య సంస్థలకు సహాయం అందించారు. 1964–66లో వచ్చిన మొదటి విద్యా కమీషన్కు మెంబర్ సెక్రటరీగా పనిచేశారు. అంతర్జాతీయ సంస్థ UNESCO లాంటి వాటితో కలిసి పనిచేశారు.

అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన అనేక కమిటీలలో, కమీషన్లలో చాలా చురుకుగా పనిచేశారు. విద్యాపరమైన అనేక విషయాలు పై రచనలు చేశారు.

ICSSR లో సెక్రటరీగా పనిచేస్తున్నపుడు యువశాస్త్రవేత్తలకు తగిన ప్రోత్సాహం ఇచ్చేవారు. కావలసిన సహాయం చేసేవారు. అలాగే వివిధ పరిశోధనా సంస్థలను పర్యవేక్షిస్తుండేవారు. భారతదేశంలోని బలహీన వర్గాల సాంఘీక అంతస్థును పెంచడానికి చాలా కృషిచేశారు.

**విద్యారంగంలో కృషి :**

జె.పి.నాయక్ యొక్క విద్యా ఆలోచనలను వర్ణించడం, విశ్లేషించడం అనేవి అంత సులువైన పనికాదు. కేవలం విద్యాపరమైన పుస్తక రచనలు 35 టైటిల్స్ కంటే ఎక్కువ ఉన్నాయి. పుస్తకాలతోపాటు అతను పాల్గొన్న కమీషన్లు మరియు కమిటీల నివేదికలను కలిపి చూస్తే భారతీయ విద్యకు సంబంధించిన ఆయన ఆలోచనలను విశదీకరించవచ్చు. భారతీయ విద్యకు సంబంధించిన ప్రతి అంశంలోను ఆయనికి గొప్ప అవగాహన ఉండేది. ఆయన రచనలను ముఖ్యంగా కొన్ని భాగాలుగా విడగొట్టవచ్చు. అవి :

ఎ) చరిత్రకు సంబంధించిన రచనలు:– భారతీయ విద్యకు సంబంధించిన చరిత్ర.

బి) బేసిక్ విద్యకు సంబంధించిన రచనలు:– SUPW మరియు పని అనుభవనకు సంబంధించినవి.

సి) సామూహిక విద్యకు సంబంధించిన రచనలు:– వయోజన విద్య మరియు అనియత విద్య వంటి వాటికి సంబంధించినవి.

డి) విద్యాప్రణాళిక మరియు పరిపాలన :– రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, స్థానిక సంస్థల పరిపాలనకు సంబంధించినవి.

ఇ) విద్య మరియు జాతీయాభివృద్ధి :– విద్య కమీషన్కు సంబంధించిన రిపోర్టు.

ఎఫ్) విద్య మరియు సమాజానికి సంబంధించిన ఇతర రచనలు.

అంతర్జాతీయంగా విద్యాప్రణాళికలో సాంఘీక, ఆర్థిక మరియు రాజకీయ సంబంధాల ప్రాముఖ్యతను తెలియజేసిన మొదటి భారతీయ విద్యావేత్త జె. పి. నాయక్. ఈయన విద్యకు సంబంధించిన విభిన్న రంగాలలో పరిశోధనలు చేసారు. ఉపన్యాసాలు ఇచ్చారు మరియు వివిధ సంస్థల స్థాపనలో ముఖ్యపాత్ర పోషించారు. విద్యా కమీషన్ వచ్చిన తర్వాత భారతదేశంలోని విద్యా వ్యవస్థను పునర్నిర్మించారు. జాతీయంగా, అంతర్జాతీయంగా విద్యా ఆలోచనలోని అభివృద్ధితో నిరంతరంగా మెలుగుతూ విద్యా సంస్కరణలను తీసుకువచ్చారు. ఆఫ్రికా, మధ్య తూర్పు దక్షిణ ఆసియా దేశాలలో విద్యా ప్రణాళికలను తయారుచేయడానికి UNESCO ప్రతినిధిగా ఆ దేశాల విద్యాభివృద్ధికి కూడా దోహదపడ్డారు.

వారు గ్రామీణప్రాంతం నుండి వచ్చినవారు కావడంతో గ్రామాల పట్ల ఎక్కువ మక్కువ ఉండేది. అందుకే సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిపాదించిన గ్రామీణ విశ్వవిద్యాలయాల భావనను అర్థంచేసుకొని భారతదేశంలో కొల్హాపూర్ దగ్గర మొదటి గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు దోహదం చేశారు.

1950–51లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంను ప్రారంభించిన మొదటి వ్యక్తి జె.పి.నాయక్. ఈ విధంగా ప్రతి సంవత్సరం డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ కృషిని స్మరించుకోవడానికి కారణం ఆయనే. విద్యామంత్రిత్వ శాఖలో ఉపాధ్యాయుల సంక్షేమ నిధిని ప్రారంభించారు.

నాలుగు దశాబ్దాలకు పైగా భారత విద్యారంగంలో కీలక వ్యక్తిగా ప్రముఖపాత్ర వహించిన జె.పి.నాయక్ 1981 ఆగష్టు 30న మరణించారు.

**1.5.15 ప్రొ.డి.ఎస్.కొఠారి :**

దౌలత్ సింగ్ కొఠారి ఒక ప్రముఖ భారతీయ శాస్త్రవేత్త మరియు విద్యావేత్త. కొఠారి రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్‌లో 1906 జూలై 6న జన్మించారు. ఈయన తండ్రి ఫతేలాల్ కొఠారి, ఒక స్కూల్ టీచర్. 1922లో మెట్రిక్యులేషన్‌ను, 1924 ఇంటర్ పరీక్షలో ప్రథమ ర్యాంక్‌లో ఉత్తీర్ణుడయ్యారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితంలో డిస్టింక్షన్స్‌ను పొందారు. ఆయన సాధించిన ప్రతిభకు నెలకు 50/–ల స్కాలర్‌షిప్ రావడంతో పై చదువులను కొనసాగించగలిగాడు. 1926 బి.యస్.సి., 1928లో యం.యస్.సి.ని మేఘనాథ్ సాహో యూనివర్సిటీ నుండి పట్టాను పొందాడు.

యం.యస్.సి.లో మెరిట్ పొందడం వలన అదే అలహాబాద్ యూనివర్సిటిలో ప్రదర్శకుడిగా (డిమాన్‌స్టేటర్‌గా) ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇచ్చారు. రెండు సంవత్సరాలు ప్రదర్శకుడిగా ఉద్యోగం చేసిన తర్వాత ఇంగ్లాండ్‌కు పై చదువులకోసం వెళ్ళారు. ఎర్నెస్ట్ రూథర్‌ఫర్డ్ ఆధ్వర్యంలో కేవండిష్ లేబరేటరీ, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి. చేసిన కొఠారి భారతదేశం తిరిగి వచ్చిన తర్వాత 1934 మేలో ఢిల్లీ యూనివర్సిటీలో రీడర్‌గా మరియు ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా చేరారు. ఢిల్లీ యూనివర్సిటీని తరువాత కాలంలో ఎంతో అభివృద్ధి చేశారు. తన డిపార్ట్‌మెంట్ గొప్ప గొప్ప భౌతిక శాస్త్రవేత్తలను ఆకర్షించేలా చేశారు. నీల్స్‌బోర్, పాల్ డిరాక్, సి.వి.రామన్, కె.యస్.క్రిష్టన్ లాంటివారు కొఠారి ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌ను సందర్శించిన వారిలో ప్రముఖులు. ప్లాస్మా ఫిజిక్స్, క్వాంటం ఫిజిక్స్, ఆస్ట్రోఫిజిక్స్ లాంటి విభాగాలలో పరిశోధనా పత్రాలను పబ్లిష్ చేశారు. యూనివర్సిటీలో లైబ్రరీ సదుపాయాలు లేకుండా పరిశోధనలు సరిగా జరగవని గుర్తించిన కొఠారి యూనివర్సిటి లైబ్రరీలను అభివృద్ధి చేయడంలో ముఖ్యపాత్రను పోషించారు.

విద్యపట్ల నిబద్ధత కలిగిన కొఠారిని భారత ప్రభుత్వం 1964లో విద్యా కమిషన్‌ను చైర్మన్‌గా నియమించింది. దానినే కొఠారి కమీషన్‌గా కూడా పిలుస్తున్నారు. కొఠారి కమీషన్ ప్రతిపాదనలు భారత విద్యావ్యవస్థలో ఒక విప్లవాన్ని తీసుకువచ్చాయని చెప్పాలి. భారతదేశ విద్యలో ఆధునీకరణ మరియు ప్రామాణీకరణ కోసం సంస్కరణలు చేశారు. ప్రాథమిక విద్య, సెకండరీ విద్య, విశ్వవిద్యాలయ విద్య, వొకేషనల్ విద్యలాంటి వాటి అభివృద్ధికి సూచనలు చేశారు. ఎన్.సి.ఈ.ఆర్.టి. యొక్క పాత్రను, విధానాలను నిర్ణయించడంలో కొఠారి కమీషన్ దోహదం చేసింది. ఎన్.సి.ఈ.ఆర్.టి. వారి నేషనల్ టాలెంట్ సెర్చ్ ప్రోగ్రామ్ ప్రారంభానికి కారణం కొఠారి.

హోమి జె.బాబాతో కలిసి రచించిన న్యూక్లియర్ ఎక్స్‌ప్లోజివ్స్ అండ్ దెయిర్ ఎఫెక్ట్స్ అనే పుస్తకం జర్మన్, రష్యన్, జపనీస్ భాషలలోకి అనువదించబడింది.

జాతీయ విద్యా విధానాన్ని సమూలంగా పరిశీలించి దాని అభివృద్ధికి తగిన సూచనలు చేయడం కోసం దేశవిదేశ ప్రముఖులతో డి.యస్.కొఠారి అధ్యక్షతన 1964లో భారత ప్రభుత్వం జాతీయ విద్యా కమీషన్ (National Education Commission)ను నియమించింది. ఈ కమీషన్ 1966 జూన్ 29న ప్రభుత్వానికి సమర్పించిన తన Education and National Development అనే రిపోర్టులో అనేక సూచనలను చేసింది.

**కమీషన్ నివేదికలోని ముఖ్యాంశాలు :**

1. ఉత్పాదకతను పెంచడం, సామాజిక జాతీయ సమగ్రతను సాధించడం, ఆధునీకరణ ప్రక్రియను వేగవంతం చేయడం, సామాజిక ఆధ్యాత్మిక విలువలను పెంపొందించడం జాతీయ విద్యా లక్ష్యాలుగా ఉండాలి.
2. విద్యావిధానం 10 + 2 + 3 గా ఉండాలి.
3. విజ్ఞానశాస్త్ర విద్య విద్యలో అంతర్భాగంగా ఉండాలి.
4. బోధనా రంగానికి ప్రజ్ఞ కలవారిని ఆకర్షించడానికి తగిన అవకాశాలు ఉండాలి.
5. విద్యలో పని అనుభవానికి ప్రాధాన్యత ఉండాలి.
6. అన్ని విద్యా స్థాయిలో సామాజిక సేవ, జాతీయ సేవ అంతర్భాగంగా ఉండాలి.
7. దిగువ ప్రాథమిక స్థాయిలో మాతృభాష బోధనా భాషగా ఉండాలి. ఉన్నత ప్రాథమిక స్థాయిలో రెండు భాషలు బోధించవచ్చు.
8. విద్యను వృత్తిపరం చేయడం ఎంతైనా అవసరం.
9. విద్య సార్వత్రీకరణ కొరకు సామాన్య పాఠశాల వ్యవస్థ (Common School System)ను ప్రవేశ పెట్టాలి.
10. వికలాంగులకు, వెనుక బడిన వర్గాల వారికి మెరుగైన విద్యా సౌకర్యాలను అధిక సంఖ్యలో అందించాలి.
11. విద్యా విస్తరణ మానవ శక్తుల అవసరాల కనుగుణంగా జరగాలి.
12. నిరక్షరాస్యతను నిర్మూలించుటకు వయోజన విద్యా పథకాలను చేపట్టాలి.
13. బోధనలో నూతన విధానాల్ని వినియోగించుకోవడంతోపాటు ప్రాక్టికల్స్‌కు తగిన స్థానాన్ని ఏర్పరచాలి.
14. విద్యావకాశాలు అందరికీ సమాన స్థాయిలో అందుబాటులోకి రావాలి.
15. ఉచిత పాఠ్యపుస్తకాలు అందించాలి.
16. ప్రాథమిక విద్యా సౌకర్యం 1 మైలు లోపు, ఉన్నత ప్రాథమిక విద్య సౌకర్యం 3 మైళ్ళలోపు ఉండాలి.
17. ప్రాథమిక స్థాయిలో ట్యూషన్ ఫీజు విధించరాదు.
18. ప్రాథమిక స్థాయిలో ఒక భాష, గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘీకశాస్త్రం, పని అనుభవం, ఆరోగ్య విద్య, సృజనాత్మక కృత్యాలు కరిక్యులంలో ఉండాలి.
19. ఉన్నత ప్రాథమిక స్థాయిలో మాతృభాష లేదా ప్రాంతీయ భాషతో పాటు హింది లేదా English భాష, గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘీకశాస్త్రం, కళలు, పని అనుభవం, వ్యాయామ విద్య, నీతి విద్య కరిక్యులంలో ఉండాలి.

## మూల్యాంకనం

### వ్యాసరూప ప్రశ్నలు

1. భారత రాజ్యాంగం పేర్కొన్న విద్యా ధ్యేయాలు తెలపండి?
2. 1986 జాతీయ విద్యా విధాన ఆశయాలు, లక్ష్యాలు, విలువలు తెలపండి?
3. APSCF – 2011లో చర్చించిన ముఖ్యాంశాలేవి?
4. సమాజ లక్షణాలు వివరించండి?
5. విద్యకు సంబంధించి మహాత్మాగాంధీ భావనలు తెలపండి?
6. జిడ్డు కృష్ణమూర్తి విద్యా విధానాన్ని వివరించండి?
7. గిజూబాయి బగేఖా విద్యా భావనలు తెలపండి?
8. జాన్ డ్యూయీ విద్యా విధానాన్ని వివరించండి?
9. కొఠారి కమీషన్ నివేదికలలోని ముఖ్యాంశాలు తెలపండి?

### లఘు ప్రశ్నలు

1. "విద్య – త్రివిధ ప్రక్రియ" – వివరించండి?
2. కుటుంబ, సమాజ విద్యావిధులు తెల్పండి?
3. NCF – 2005 యొక్క మౌలికాంశాలు తెలపండి?
4. అభ్యసనం గూర్చి ప్రాథమిక భావనలు తెల్పండి?
5. విద్యా ధ్యేయాల ప్రాముఖ్యతను వివరించండి?
6. స్వామి వివేకానందుని విద్యా భావనలు, లక్ష్యాలు తెలపండి?
7. అరవిందఘోష్ విద్యాతత్వం, విద్యాలక్ష్యాలు తెలపండి?
8. విద్యకు సంబంధించి రాధాకృష్ణన్ అభిప్రాయాలు తెలపండి?
9. కిండర్‌గార్డెన్ విద్యా విధానాన్ని వివరించండి?
10. మాంటిస్సోరి విద్యా విధానాన్ని గూర్చి రాయండి?

### సంక్షిప్త ప్రశ్నలు

1. త్రిధృవ ప్రక్రియ అనగానేమి?
2. కోలింగ్‌ఉడ్ ప్రకారం సమాజమనగానేమి?

### లక్ష్యాత్మక ప్రశ్నలు

1. సోషియాలజి అనే ఆంగ్లపదం ............ పదముల కలయిక
2. సాంప్రదాయక విద్యకు పూర్తి వ్యతిరేకి అయినవారు .............
3. ఋషివ్యాలీ పాఠశాలను స్థాపించినవారు

   1) ఠాగూర్ 2) గిజుభాయి 3) ఫ్రోబెల్ 4) జిడ్డుకృష్ణమూర్తి
4. "The principles of Educational Sociology " గ్రంధ రచయిత

   1) ది మదర్ 2) మాంటిస్సోరి 3) జార్జిపేనె 4) రూసో

# 2 విద్య - రాజకీయాలు మరియు రాజ్యము (ప్రభుత్వం)
# (Education, Politics and State)

2.1. విద్య యొక్క రాజకీయ స్వభావము: విద్యాధ్యేయాల నిర్మాణంలో అధికారము మరియు సిద్ధాంతాల ప్రభావము.

2.2 విద్యలో రాజ్యం (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) పాత్ర : విద్యా సంస్థల స్థాపన, విద్యా ప్రణాళికాభివృద్ధి, మరియు పాఠ్య పుస్తకాలు, బోధనపద్ధతులు మరియు మదింపు ఆచరణలు, పాఠశాలవిద్యాసంస్కృతి, ఉపాధ్యాయుల తయారీ మరియు నియామకం.

2.3 సమాజంలో ఉపాధ్యాయుని స్థాయి : ఉపాధ్యాయుని అంతస్తు గురించి ప్రజల అభిప్రాయాలు, విధానపరమైన అంశాలు, అధికార వ్యవస్థీకరణం.

2.4 విద్యలో సమాజం మరియు పౌరసమాజ సంస్థల పాత్ర : నిశిత విశ్లేషణ.

## 2.0 యూనిట్ లక్ష్యాలు:

- విద్య యొక్క కాలానుగుణ రాజకీయ స్వభావాన్ని తెలుసుకొనుట.
- విద్యాధ్యేయాలను అధికారం మరియు సిద్ధాంతాల ద్వారా నిర్మాణము చేయడాన్ని అవగాహన చేసుకొనుట.
- విద్యలో ప్రభుత్వం యొక్క పాత్రను గుర్తించుట.
- విద్యాసంస్థల స్థాపన గురించిన జ్ఞానాన్ని పొందుట.
- విద్యా ప్రణాళికల అవసరాన్ని అవగాహన చేసుకొనుట.
- పాఠ్య పుస్తకాల తయారీలో ప్రభుత్వం ఎలా దోహదపడునో విశ్లేషించుట.
- పాఠశాల విద్యాసంస్కృతిలోని అంశాలను తెలుసుకొనుట.
- ఉపాధ్యాయుని గత, ప్రస్తుత స్థాయిల తారతమ్యాలను గుర్తించుట.
- ఉపాధ్యాయుని స్థాయి గురించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకొనుట.
- అధికార వ్యవస్థీకరణ యొక్క ప్రభావాలను అవగాహన చేసుకొనుట.
- విద్యాపరంగా సమాజం యొక్క పాత్రను అవగాహన చేసుకొనుట.

## 2.1. విద్యయొక్క రాజకీయ స్వభావం:విద్యా ధ్యేయాల నిర్మాణంలో అధికారం మరియు సిద్ధాంతాల ప్రభావం

" విద్య అంటే జీవించడానికి తయారుచేయడం కాదు. జీవితమే విద్య – జాన్‌డ్యూయి."

**పరిచయము:**

" విద్యలేనివాడు వింత పశువు " అన్నాడు ఒక మహాశయుడు. విద్య జీవనవిధానములో మనిషికి పశువుకు మధ్యగల వ్యత్యాసాన్ని తెల్పుతుంది. అనాదినుంచి వ్యక్తి జీవతావసరాలకు అనుగుణంగా సామాజిక అవసరాలకు తగినట్లుగా కొన్ని రకాల విద్యలు పెద్దలనుంచి పిల్లలకు సంక్రమిస్తూనే వున్నాయి. శారీరక, మానసిక, వైజ్ఞానిక, సామాజిక, ఆధ్యాత్మిక విషయాలలో బోధనద్వారా, క్రమశిక్షణద్వారా కూడా ఎదిగిన వ్యక్తి ఎదగని వ్యక్తిపై తీసుకొనివచ్చే మార్పును విద్య అని చెప్పవచ్చు.

విద్య అనేది ' విద్ ' అనే దాతువు నుంచి ఉత్పత్తిఅయ్యింది. విద్య అంటే తెలుసుకోవడం అని అర్థం. విద్యకు సమాన అర్థం ఉన్న ఆంగ్ల పదం " ఎడ్యుకేషన్ ". లాటిన్ బాషలో "ఎడ్యూకేర్ " ఎడ్యూసిరె అనే పదాలనుంచి ఆవిర్భవించిందని భావిస్తారు. ఎడ్యుకేషన్‌లో 'e' అంటే 'out of' అని 'duco' అంటే 'వృద్ధిలోకి తీసుకురావడం' (to bring up) అనే అర్థం వస్తుంది. అంటే ముందుకు తీసుకువెళ్లడం లేదా దారిచూపించడం (to lead forth) అనే భావాన్ని ఇస్తుంది.

" మానవుడు జన్మించినప్పటి నుంచి మనిషిగా తయారయ్యేవరకు ఇంద్రియాలు, మేధ, హృదయం ఒకదానితోనొకటి ప్రదర్శించే అభిరుచులను స్థిరపరిచేది విద్య " అని ఒకరు అభిప్రాయపడితే శరీరంలోను, మనస్సులోను, ఆత్మలోను నిక్షిప్తమైన అత్యున్నత శక్తులను బయటకు తీయడమే విద్య అని మరొకరు అభిప్రాయపడ్డారు. మానవుడు నిర్మలంగా వుండడానికి మార్గం చూపించేది విద్య అని ఒకరు అంటే జీవితమే విద్య అని మరొకరు అన్నారు.

నాగరిక ప్రపంచంలో విద్య అందరికి అవసరం. సాధారణంగా విద్య అనే పదానికి ఒక నిర్ణీత అర్థం ఇవ్వడం సాధ్యంకాదు. ఎందుకంటే విద్య గురించి ఒక్కొక్కరు ఒక్కొక్కరకంగా అభిప్రాయపడ్డారు. వివిధ రంగాలకు చెందినవారు, తత్వవేత్తలు, రాజకీయవేత్తలు, మత గురువులు సందర్భానుసారంగా, కాలానుగుణంగా జీవిత అవసరాలను బట్టి విద్యను గురించి తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. వ్యక్తి సామాజిక జీవితం మారుతూ వుంటుంది. దానితో విద్య అర్థం, స్వభావం కూడా మారుతుంది. మానవ పరిణామంలాగానే విద్య స్వభావం కూడా పరిణామ ప్రక్రియలోనే ఉంటుంది.

**విద్య – పరిధి :**

విద్య స్వభావం అపరిమితమైంది. దీని పరిధి విశ్వమంత విశాలమైనది. వ్యక్తి చరిత్రలో ఇది పురాతనమైనది. మరియు పురోగమనమైనది. వ్యక్తి సాంఘీక జీవనం అలవర్చుకొన్నప్పటి నుంచి అతని అభివృద్ధికి సామాజిక అభివృద్ధికి విద్య ప్రధాన సాధనంగా ఉపయోగపడింది. దేశ కాల పరిస్థితులనుబట్టి విద్యావేత్తలు, తత్వవేత్తలు విద్యను నిర్వచిస్తూ అది నిర్వహించవలసిన పనుల గురించి చర్చించారు. ఈ చర్చను బట్టి దీని పరిది అర్థం అవుతుంది. విద్య వ్యక్తి సంపూర్ణమూర్తిమత్వాభివృద్ధికి తోడ్పడుతుంది. దీనిలో భౌతిక, మానసిక, సామాజిక, సౌందర్య, నైతిక, ఆధ్యాత్మిక అంశాలు వుంటాయి. స్వామి వివేకానంద అన్నట్లు " మానవున్ని తయారుచేయడమే విద్య " దీనిద్వారా శీలం ఏర్పడుతుంది. మానసిక శక్తి పెరిగి బుద్ధి వికసిస్తుంది. తద్వారా వ్యక్తి తనకాళ్ళమీద తాను నిలబడగలుగుతాడు.

### 2.1.1 విద్య – రాజకీయాలు :

ప్రపంచ దేశాలన్నిటిలో భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రాచీనకాలంలోనే మనదేశం ప్రపంచంలోని ఇతర దేశాలకు అపారమైన జ్ఞానాన్ని అనర్గళంగా అందించింది. విదేశీదండయాత్రల వల్ల మధ్యయుగాల్లో కొంత ఒడిదుడుకులకు లోనైనా మన సమాజంలోని విశిష్ట లక్షణాలు వాటిని తొందరగానే అధిగమించేలా చేసాయి. ప్రపంచీకరణ జరిగిన నేటి పరిస్థితులను కొంత ఆలస్యంగానైనా తనకు అనుకూలంగా మార్చుకొని తన ప్రత్యేకతను కోల్పోకుండా వాటినుంచి విద్యార్జన పొందుతోంది. భారతీయ సమాజంలోని విశిష్ట లక్షణాలైన సహనం, సర్దుబాటుతత్వం, మేదోసంపత్తి, సాంస్కృతిక వారసత్వం, భిన్నత్వంలో ఏకత్వం, సమైఖ్యతాభావం, పటిష్టమైన కుటుంబ వ్యవస్థ, సాంఘీక కట్టుబాట్లు మరియు ఆదర్శాలు, వసుదైక కుటుంబభావన, నమ్రత, పౌరస్పృహ వంటి విశాల ఆదర్శాలను విద్యద్వారా ముందు తరాలవారికి అందించవలసిన బాధ్యత అటు ప్రభుత్వంపైన అలాగే మనందరిమీద వుంది.

ప్రాచీన మధ్య యుగాల్లో మనదేశంలో రాచరిక వ్యవస్థ అమలులో వుండేది. అనేకమంది స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా బ్రిటీష్ వారి వలస పాలన నుంచి స్వాతంత్ర్యం లభించినది. మన పాలనా వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచడానికి లిఖిత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాము. వివిధ ప్రజాస్వామ్య దేశాల్లో విజయవంతంగా అమలులోనున్న రాజకీయ వ్యవస్థలోని గొప్ప అంశాలను సేకరించి భిన్నసంస్కృతులు గల మన సమాజానికి అందించాము. భారత ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేయవలసి వుంటుంది.

భారత రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్న విధంగా మనకు విశాల రాజకీయ లక్షణాలు వున్నాయి. అవి

1) ప్రజాస్వామ్య ఆదర్శాలు (2) స్వామ్యవాద ఆదర్శాలు (3) లౌకివాద ఆదర్శాలు (4) హక్కులు–బాధ్యతలు (5) సమాన విద్యావకాశాలు.

**విద్యావకాశాల కల్పనకు ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలు :**

రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వం సాధించడానికి మరీ ముఖ్యంగా విద్యావకాశాలను కల్పించడానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. వాటిలో చాలావరకు సత్ఫలితాలను ఇచ్చాయి. అవి

1. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల ప్రజలకు పాఠశాలలను ఏర్పాటుచేయడం.
2. 6 నుంచి 14 సంవత్సరాల బాల బాలికలందరికి ఉచిత నిర్భంద ప్రాథమిక విద్యనందించడం.
3. యస్.సి., యస్.టి., బి.సి., మైనార్టి, స్త్రీలకు విద్యావకాశాలు కల్పించడం.
4. పేదరిక బాలికలకొరకు మధ్యాహ్న భోజనపథకాన్ని అమలు చేయడం.
5. సర్వశిక్షా అభియాన్ పథకం ద్వారా నిధుల మంజూరు, అమలు చేయడం.
6. బాలబాలికలకు ఉపకారవేతనాలు, ఉచిత పాఠ్య పుస్తకాలు, వసతి గృహాలను ఏర్పాటుచేయడం.
7. దేశవ్యాప్తంగా విద్యకు దూరమైన వారికి దూరవిద్యను డా॥ అంబేద్కర్, ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయాలద్వారా అందించడం.
8. తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న బాలలకు ప్రత్యేక విద్యను ఏర్పాటు చేయడం.
9. వివిధ వర్గాల వారికి వేరు వేరుగా ప్రత్యేక వసతులు, వనరులతో అందరికీ విద్యావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవచూపుతోంది.

'అందరికి విద్య ' అనే ఆలోచనను సాకారం చేయడానికి ప్రభుత్వం తీసుకోవల్సిన చర్యలన్ని తీసుకుంటుంది, ఆ అవకాశాలను వినియోగించుకుని అందరూ విద్యావంతులై జ్ఞాన సమాజ నిర్మాణం జరగాలి. మన సామాజిక, రాజకీయ ఆదర్శాలు మిగతా ప్రపంచ దేశాలకు స్పూర్తినిచ్చేవిగా వున్నాయి. అయితే ఈ ఆదర్శాలను ఆచరణలోకి తేవడంలో ఇంకా కొన్ని అడ్డంకులను అధిగమించవలసివుంది. ప్రతి వ్యక్తి సమాన గుర్తింపు, సమాన అవకాశాలు, హక్కులు, గౌరవం లభించాలని కోరుకుంటారు. సమాన విద్యావకాశాల సాధనకొరకు రాజకీయ పక్షాలు, ప్రభుత్వం సామాజిక మార్పును విద్యద్వారానే సాకారం చేయగలుగుతాయి.

విద్య తరగతి గదికీ పాఠశాలకూ పరిమితం కాదు. విద్య అనేది ఒక నిర్దిష్ట జీవనకాలప్రమాణానికి కూడా పరిమితం కాదు. ఇది ఒక నిరంతర ప్రక్రియ. ఇది తల్లి గర్భం నంచి మృత్యువు వరకు సాగుతూనే వుంటుంది. ఇది ఒక నిరంతర ప్రక్రియ. వ్యక్తి జీవితంలో జరిగే అవిరామమైన కృషిగా చెప్పవచ్చును.

ఎడ్వర్డ్ థింగ్, జాన్‌స్టూవర్ట్ మిల్ ల అభిప్రాయాల ప్రకారం విద్యలో వ్యక్తి ఉయ్యాల నుంచి అంటే పుట్టినప్పటి నుంచి గిట్టేవరకు (from womb to tomb) ప్రబావితం చూపించే అంశాలన్ని వుంటాయి. వ్యక్తి జీవితంలోని ప్రతి అనుభవం కూడా విద్యాపరమైన విలువలతో వ్యక్తి ప్రవర్తనను పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పుచేసేందుకు ఉపయోగపడుతుంది. విస్తృతార్థంలో చెప్పాలంటే వ్యక్తిమీద ప్రభావం చూపించే అంశాలన్ని విద్యలో వుంటాయి. వ్యక్తి ప్రవర్తన, ధీసంపత్తి, సాంఘీకజీవితం, కుటుంబ జీవితం, మతాచార వ్యవహారాలు, సహజపరిసరాలు, ప్రచార సాధనాలు మొదలైనవన్ని కూడా విద్యలో ప్రక్రియలే.

వ్యక్తి సంఘజీవి. తన సుఖవంతమైన జీవనంకోసం వ్యక్తులచే నిర్మితమైనది. రాజ్యం లేదా ప్రభుత్వం. ప్రాచీన కాలంలో గ్రీకులు రాజ్యాన్ని "పోలీస్ " అనేవారు. గ్రీకు భాషలో పోలీస్ అంటే నగరరాజ్యం అని అర్థం. ఆధునిక కాలంలో 16వ శతాబ్దానికి చెందిన ఇటలీ శాస్త్రవేత్త ' మాకియావెల్లీ ' తాను రాసిన ప్రిన్స్ గ్రంథంలో "రాజ్యం" అనే పదాన్ని మొదటిసారిగా, రాజనీతి శాస్త్ర పితామహుడైన అరిస్టాటిల్ "వ్యక్తి సంఘజీవే కాక రాజకీయ జీవి" అనికూడా పేర్కొన్నాడు." వ్యక్తి యొక్క అవసరాలను తీర్చి వారికి సుఖవంతమైన జీవితం ప్రసాదించడానికి రాజ్యం ఏర్పడి కొనసాగుతుందని అరిస్టాటిల్ అభిప్రాయపడ్డారు.

**రాజ్యం – నిర్వచనాలు:**

1. "ఒక నిర్ణీత భూభాగంలో శాసన బద్దులై జీవించే ప్రజలేరాజ్యం" – ఉడ్రోవిల్సన్
2. "ఒక శక్తివంతమైన ప్రభుత్వానికి చట్టరీత్యా విధేయత కల్గివుండి ఒక నిర్ణీత ప్రదేశంలో స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న సామాజిక వ్యవస్థగల ప్రజాసముదాయమే రాజ్యం". – ఆర్.యమ్.మెకైవర్.
3. " ఒక నిర్దిష్ట ప్రదేశంలో స్థిర నివాసులై ఉంటూ వ్యవస్థాపితమైన ప్రభుత్వానికి విధేయులుగా వుండే ప్రజా సముదాయమే రాజ్యం" – గార్నం.
4. "ఒక నిర్ణీత భూభాగంలో నివశిస్తూ, రాజకీయంగా వ్యవస్థాపితమైన ప్రజా సముదాయమే రాజ్యం" – బ్లంట్‌ష్లీ

విద్య, రాజ్యం మరియు రాజకీయాలు ఒక దానిలో ఒకటి అంతర్భాగాలు మరియు విడదీయరాని అనుబంధాన్ని కలిగివున్నాయి. సమున్నత విద్య వలన సమాజం, రాజకీయాలు రాణించడం జరుగుతుంది. విద్య ద్వారానే సమాజానాకి చక్కటి ప్రభుత్వమూ, చక్కని పాలన అందుతాయి. ప్రభుత్వపాలన ఆదర్శవంతంగా నడిపించగలిగితే అందరికీ గుణాత్మక విద్య సమానంగా అందుతుంది.

**2.1.2 విద్య యొక్క రాజకీయ స్వభావం: అధికారం మరియు సిద్ధాంతములు విద్యాధ్యేయాలను ఎలా నిర్మాణం చేస్తాయి?**

ఏదేశమందైనా రాజకీయ చైతన్యం విద్యార్థి దశ నుంచే ప్రారంభమౌతుంది. భారత దేశ స్వాతంత్ర్య పోరాట సమయములో గాంధీజి పిలుపునందుకొని విద్యార్థిలోకం కదిలివచ్చింది. ఎందరో విద్యార్థులు దేశంకోసం స్వాతంత్ర్యం సిద్దించడంకోసం అశువులుబాసారు. దేశానికి విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు, అత్యవసరమైనప్పుడు విద్యార్థులు, రాజకీయ రంగ ప్రవేశం చేయడం సముచితమే. నేటి విద్యార్థులు రేపటి పౌరులై ప్రజా ప్రతినిధులై, దేశాధినేతలై రాజ్యచక్రాన్ని తిప్పవలసి వుంటుంది. కనుక విద్యార్థులు రాజకీయాలలో ప్రవేశించుట తప్పుగా భావించరాదు. కానీ అనవసర రాజకీయాలలో ఎప్పటికి తలదూర్చరాదు.

విద్యకు రాజకీయంతో విడదీయరాని అనుబంధం వున్న విషయం జగమెరిగిన సత్యం. విమానానికి రెక్కలు ఏవిధంగా దోహదపడునో విద్యకు రాజకీయం కూడా అలాగే తోడ్పడుచున్నవి. ప్రస్తుత మనదేశరాజకీయ పార్టీలన్నీ అనుబంధ విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలను కల్గివుండటమే దీనికి నిదర్శనం ఉదాహరణకు భారతీయ జనతాపార్టీకి అనుబంధంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎ.బి.వి.పి), ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమితి (ఎ.పి.యు.యస్.) అనే ఉపాధ్యాయ సంఘం వున్నవి. అలాగే కాంగ్రెస్ పార్టీకి నేషనల్ స్టూడెంట్ యూనియన్ (ఎన్.యస్.యు.ఐ.) అనే విద్యార్థి సంఘం, కమ్యూనిస్ట్ పార్టీలకు ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఎ.ఐ.యస్.ఎఫ్) మరియు స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యస్.ఎఫ్.ఐ.) అనే విద్యార్థి సంఘాలు, అలాగే యు.టి.ఎఫ్., యస్.టి.యు., ఎ.పి.టి.ఎఫ్. అనే ఉపాధ్యాయ సంఘాలు కూడా అనుబంధంగా నడుస్తున్నవి.

విద్యను అర్జించువారు విద్యార్థులు, విద్యను ఆర్జించటమంటే విద్యార్థుల పరమావధి, లక్ష్యము, రాజ్యమునకు సంబంధించిన వ్యవహారాలను నేర్చుకోవడం. విద్యార్జన కాలంలో విద్యార్థి తన సర్వ శక్తులు కేంద్రీకరించి ఏకాగ్రతతో విద్యాభ్యాసం చేయవలసి ఉంది. నేటి విద్యార్థి రేపటి పౌరుడు. దేశ భవిష్యత్తు, ప్రగతి, క్రమశిక్షణ, సత్ప్రవర్తన కలిగిన పౌరులపై ఆధారపడిఉంది. అందువలన విద్యార్థి దశ మానవజీవితంలో అతికీలకమైన మలుపువంటిది. ఏదేశమందైనా రాజకీయ చైతన్యం విద్యార్థి దశనుంచే ప్రారంభమవుతుంది.

ఈనాటి విద్యార్థులలో అధికశాతం, రాజకీయాలకు అంకితమై పతనం కావడం మిక్కిలి విచారకరం. పరిపాలనా సంబంధమైన విషయాలు, విద్యాప్రణాళికలు, విద్యాసంబంధ అవసరాలను, విద్యా విధానాలను, సంస్కరణలను నిర్ణయించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి. కానీ స్వార్థపరులైన రాజకీయవాదుల చేతిలో కీలుబొమ్మలై కొందరు బలిపశువులవుతున్నారు. స్వార్థపరులైన నేటి రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనాలకోసం నిస్వార్థులైన విద్యార్థులను వారి విద్యాభ్యాసాన్ని రాజకీయ రొంపిలోకి లాగి నిర్వీర్యం చేస్తున్నారు. అందువలన విద్యార్థులు జాగరూకతతో మెలిగి విద్యకే పరిమితం కావడం శ్రేయస్కరం.

విద్యార్ధి దశనుంచే పౌరహక్కులు, బాలల హక్కులు–విధులు, దేశ విదేశ వ్యవహారములు, వర్తమాన పరిస్థితులు, దేశభవిష్యత్తును, ప్రజా ప్రతినిధుల కర్తవ్యం ఇత్యాది విషయములను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవలసియున్నది. విద్యార్జనలో ఇది ఒక భాగమే. రాజ్యాంగ విషయాల్లో పాల్గొనడానికి, రాజ్యచక్రం త్రిప్పడానికి ఓటు హక్కున్న ప్రతి పౌరుడికి అవకాశం అర్హతలున్నాయి.

వ్యక్తుల సముదాయం సంఘం మనిషి సంఘజీవి. సంఘం యొక్క ఔన్నత్యానికి, శ్రేయస్సుకు కృషి చేయవలసిన భాద్యత అందరిదీ సర్వకాల సర్వావస్థల్లో మనిషి జీవితం సమాజంతో ముడిపడివుంది. పుస్తకాలను వల్లించుటే విద్యకాదు. అనుభవజ్ఞానం సమాజ సహకారం కూడా విద్యనందిస్తాయి.

గమ్యం లేదా లక్ష్యం లేని విద్య చుక్కానిలేని నావ వంటిది. గమ్యం లేని విద్య నిరర్ధకం కనుక దేశకాల పరిస్థితులను బట్టి విద్యాధ్యేయాలు, విద్యాగమ్యాలు, విద్యాలక్ష్యాలు రూపుదిద్దుకొంటూ వుంటాయి. ఒక సమాజంలో ఉపయుక్తమయ్యే గమ్యాలు మరొక సమాజానికి మరొక సమయంలో ఉపయుక్తం కాకపోవచ్చు. కనుక విద్యాగమ్యాలు మారుతున్న కాలాలకు, అవసరాలకు అనుగుణంగా మార్పు చెందుతూ వ్యక్తిని, తద్వారా సమాజ పురోభివృద్ధిని ఆకాంక్షిస్తాయి. అలాగే విద్యాగమ్యాలు, ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్య లాంటి విద్యాస్థాయిలను బట్టి, మనుష్య, శాస్త్రీయ, సాంకేతిక, వాణిజ్య, కళ, భాష, లాంటి విద్యను బట్టి వేర్వేరుగా ఉంటాయి.

కన్నింగ్‌హోమ్ అభిప్రాయంలో " విద్యా విలువలే విద్యాధ్యేయాలు / విద్యాగమ్యాలు అవుతాయి". అలాగే బ్రుబేచర్ అభిప్రాయం ప్రకారం " ఒకడు తన గమ్యాన్ని / ధ్యేయాన్ని చెప్పాలంటే ముందు అతను తన విద్యా విలువల్ని వివరించాల్సి ఉంటుంది." అంటే ఏ విద్యనభ్యసించినా అది కొన్ని విలువలకు లోబడి తన గమ్యాలతో సంపూర్ణ మానవున్ని తయారు చేస్తుందన్నమాట.

### 2.1.3 విద్యాధ్యేయాలు ప్రాధాన్యత

1. విద్యాధ్యేయాలు విద్యాప్రక్రియకు ఒక మార్గాన్ని చూపటం,
2. విద్యాప్రక్రియలో అర్థవంతంగా వ్యవహరించడానికి తోడ్పడటం.
3. సమర్థవంతమైన విద్యా పరిపానలనను నిర్దేశించటం.
4. పాఠ్య ప్రణాళికను నిర్ధారించటం.
5. బోధనా విధానాల్ని రూపుదిద్దటం.
6. విద్యా ఫలితాలను అంచనా వేయడానికి తోడ్పడటం.
7. విద్యార్థి మరియు సమాజ అవసరాలు తీర్చటం.
8. విద్యార్థి అర్ధవంతంగా పనిచేసేలా చూడటం.
9. విద్యా ప్రక్రియను కొనసాగించటం.

**వ్యక్తిగతంగా విద్యాధ్యేయాలు**

10. వ్యక్తి ఆత్మను చైతన్యపరచటం.
11. జీవన విలువలను రూపొందించి వాటిని సాధించేలా చేయటం.
12. వ్యక్తి పరిపూర్ణతను సాధించడంలో తోడ్పడటం.
13. వ్యక్తి మానసికాభివృద్ధిలో పాలుపంచుకోవటం.
14. వ్యక్తి శీల నిర్మాణంలో సహకరించటం.
15. వ్యక్తి యొక్క సంపూర్ణ సమగ్ర మూర్తిత్వాన్ని అభివృద్ధి చేయటం.
16. వ్యక్తి సరియైన ఆలోచనలు వివేచన కలిగివుండేలా చూడటం.
17. వ్యక్తి స్వీయ శైలిని ఏర్పరచటం.
18. వ్యక్తి సమాజంలో తన పాత్రను పోషించేలా చూడటం.

**సామాజికంగా విద్యాధ్యేయాలు**

19. సమాజంలో ఆచరణయోగ్యమైన విలువల్ని పెంపొందింపచేయటం.
20. సమాజ నిర్మాణం, పురోభివృద్ధిలో పాలుపంచుకోవటం.
21. సాంఘిక వైఖరుల్ని, విధానాల్ని, అభిరుచుల్ని పెంపొందించటం.
22. సమాజ అవసరాల కనువైన విద్యను, వృత్తుల్ని రూపొందించటం.

9QQCD6

**రాజకీయంగా విద్యాధ్యేయాలు**

23. దేశ, కాల పరిస్థితులలో పార్టీలు విద్యపై అభిప్రాయాలు వ్యక్తీకరించటం.
24. సార్వజనీన విద్యకై అన్ని రాజకీయ పార్టీలను మమేకం చేయటం.
25. అందరికి విద్య సాధనలో పార్టీలు, ప్రభుత్వాలు ప్రతిస్పందించేలా చూడటం.

చక్కని విద్యాధ్యేయాలు గల విద్యాకార్యక్రమాలు గమ్యం తెలిసిన నావికుడులాగా విద్యార్థుల్ని వారు ఆశించిన తీరాలకి చేరుస్తాయి. వ్యక్తి, సమాజం, మరియు విద్య మూడే విద్యాధ్యేయాల, లక్ష్యాల నిర్ణయకాలు.

### 2.1.4 విద్యాధ్యేయాలు (Aims of education):

"విద్యలేని వాడు వింతపశువు" అన్నాడు ఒక మహాశయుడు విద్య జీవన విధానంలో మనిషికీ, పశువుకూ మధ్యగల వ్యత్యాసాన్ని తెలుపుతుంది. వ్యక్తి జీవితానికి కొన్ని లక్ష్యాలు, గమ్యాలు అవసరం. గమ్యంలేని జీవితానికి అర్థం ఉండదు. పురాతన కాలం నుండి వ్యక్తి తన గమ్యాన్నీ, ఉద్దేశ్యాలనూ, నిర్ణయిస్తూ వచ్చాడు. కొన్ని సార్లు సమాజం, మరికొన్నిసార్లు వ్యక్తిగత జీవితం అతనికి లక్ష్యాలను నిర్దేశిస్తూవచ్చాయి. ప్రాచీన కాలంలో ఆధ్యాత్మిక విలువలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది తదనుగుణంగా విద్యాధ్యేయాల నిర్ణయం జరిగింది. కాలానుగుణంగా దేశాల పరిస్థితులను బట్టి పరిపాలించే రాజకీయ తాత్విక సిద్దాంతాలను బట్టి, విద్యాధ్యేయాలు మారుతూ వస్తున్నాయి. విద్యాధ్యేయాలను బట్టి విద్యా విధానం, విద్యా ప్రక్రియ, విద్యా బోధన, విద్యార్జన ఆధారపడి ఉంటాయి.

మన దేశంలో విద్య శీఘ్రగతిలో ఆధునీకీకరణకు తోడ్పాదాలి. 20వ శతాబ్ది ద్వితీయార్థం నుంచి జ్ఞానాభివృద్ధి విపరీతంగా పెరిగింది. ప్రజాస్వామ్య దేశాల్లో విద్యావిధానం లౌకికతత్వం ఆధారంగా అందరికీ సమాన అవకాశాలు: కల్పిస్తూ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. విద్యాధ్యేయాలను మరో దృక్పథంతో కూడా ఆలోచించాలి. ఎంత స్థిరమైన ధ్యేయాలు ఏర్పరచుకొన్నా దురదృష్టవశాత్తు విద్యా సంస్థలు కానీ విద్యావేత్తలు కానీ సరియైన ప్రయత్నాలు చేసి వాటి సాధనకు కృషి సల్పడంలేదని చెప్పాలి.

భారతదేశం ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్యదేశం. దీనికి సామాజికంగా బహుళత్వ లక్షణం ఉంది. ఇటువంటి దేశంలో విద్యాధ్యేయాలు ఎలా ఉండాలో అనేక మంది విద్యావేత్తలు, కమీషన్లు తెల్పడం జరిగింది. అందులో కొఠారీ కమీషన్ (1964–66), జాతీయ విద్యావిధానం (1986), జాతీయ పాఠ్యప్రణాళిక చట్రం (2005) లు ప్రధానమైనవి.

### 2.1.5 విద్యాధ్యేయాలు – ఆవశ్యకత

**కొఠారీ కమీషన్ (1964–1966) ప్రకారం విద్యాధ్యేయాలు**

శ్రీ డా॥ కొఠారీ అధ్యక్షతన ఏర్పాటైన జాతీయ విద్యా కమీషన్ విద్యా విషయంలో విస్తృతమైన సమగ్రమైన నివేదికను సమర్పించింది. ఈ కమీషన్ సూచనలను ప్రభుత్వం చాలా వరకు ఆమలు చేసింది. ఈ కమీషన్ ప్రాథమిక

విద్యపై సూచించిన విషయాలను వివరంగా తెలుసుకోవడానికి ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇచ్చింది. దీన్ని భారతీయ విద్యా కమీషన్ (1964–1966) అనికూడా అంటారు. ఈ కమీషన్ సూచించిన విద్యాధ్యేయాలు.

1. ఉత్పాదనాభివృద్ధి
2. సామాజిక, జాతీయ సమైఖ్యతా సాధన
3. ఆధునికీకరణ ప్రక్రియను వేగవంతం చేయడం
4. సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక విలువల అభివృద్ధి.

**2.1.6 జాతీయ విద్యావిధానం (1986) పేర్కొన్న విద్యాధ్యేయాలు:**

స్వాతంత్ర్య అనంతరకాలంలో అనేక రంగాల్లో మనదేశం చెప్పుకోదగిన అభివృద్ధి సాధించలేకపోయింది. ప్రజా జీవనానికి ఇబ్బందులు మొదలయ్యాయి. 1985లో నాటి ప్రభుత్వం, " విద్యాసవాళ్ళు – విధానదృక్పథం" అనే పత్రాన్ని ప్రజాభిప్రాయసేకరణ కోసం విడుదల చేసింది. దానిలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ఇతర సాంఘీక, రాజకీయ సమస్యలు, విద్యాభివృద్ధిపై వాటి ప్రభావం, నాటి విద్యా పరిస్థితి, భవిష్యత్‌లో ఎటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయి అనే అంశాలనుగురించి వివరంగా విద్యావేత్తల నుంచీ ఉపాధ్యాయ సంఘాల నుంచీ ప్రజల నుంచీ దేశం నలుమూలల నుంచీ సూచనలను సేకరించింది.

వాటన్నింటిని విశ్లేషించి, సమస్యలకు నివారణోపాయాలు అన్నీ క్రోడీకరించి 1986లో జాతీయ విద్యావిధానం అనే అధికారిక పత్రాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. అందులో సూచించిన విద్యాధ్యేయాలు.

1. సార్వత్రిక విద్యను సాధించడం.
2. సమాన విద్యావకాశాలను పెంపొందించడం.
3. జాతీయ సమైఖ్యత సాధించడం, అంతర్జాతీయ శాంతికి తోడ్పడటం.
4. శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడం.
5. ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద ఆశయాలను సాధించడం.
6. మానవ వనరులను సక్రమంగా వినియోగించడం.
7. సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందించడం.
8. జనాభాను నియంత్రించడం.

**2.1.7 జాతీయ ప్రణాళిక చట్రం (2005) – విద్యాధ్యేయాలు**

జాతీయ పాఠ్యప్రణాళిక చట్రం – 2005 ప్రొఫెసర్ యశ్‌పాల్ అధ్యక్షులుగా జాతీయ సారధ్య సంఘం ఏర్పడింది. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన " సివిలైజేషన్ & ప్రోగ్రెస్ " అనే రచనలోని వాక్యాలతో ఈ చట్రం ప్రారంభమయింది. సృజనాత్మక శక్తి, సహజమైన ఆనందం బాల్యానికి కీలకమైనవని ఇందులో పేర్కొన్నారు. దీని మొదటి అధ్యాయంలో స్వాతంత్ర్యానంతరం పాఠ్యప్రణాళికల, సంస్కరణలకోసం జరిగిన ప్రయత్నాలన్నీ పొందుపరిచారు.

జాతీయ విద్యావిధానం (ఎన్.పి.ఇ–1986) జాతీయ విద్యావ్యవస్థ రూపొందించేందుకు పాఠ్య ప్రణాళికా చట్రం ఒక సాధనంగా దోహదపడుతుందని పేర్కొంది. జాతీయ అభివృద్ధికోసం భారతరాజ్యాంగం నిర్దేశించిన కీలకాంశాలను

ఇందులో ప్రస్తావించింది. దీనికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక (పి.ఒ.ఎ) మన పాఠ్య ప్రణాళికలో సంఘతత్వం, పరివర్తనాశీలత, సమానత్వం, ప్రధానంగా ఉండాలని నొక్కిచెప్పింది. దీని ప్రకారం విద్యాధ్యేయాలు క్రింది విధంగా ఉన్నాయి.

1. ప్రజాస్వామిక విలువల పట్ల నిబద్ధత కలిగి ఉండటం.
2. స్వతంత్రంగా ఆలోచించి, విలువలకు కట్టుబడి నిర్ణయం తీసుకొని స్వతంత్రంగా పనిచేయడం.
3. ఇతరుల సంక్షేమం పట్ల, వారి అనుభూతుల పట్ల సున్నితంగా స్పందించడం.
4. నేర్చుకున్న అంశాలకు కొత్త సందర్భాలకు సరళంగా, సృజనాత్మకంగా ప్రతిస్పందించడం.
5. ప్రపంచం గురించిన జ్ఞానం, అవగాహన, విలువలకు కట్టుబడి హేతుబద్ధంగా ఉండటం.

**2.1.8 విద్యాధ్యేయాల వర్గీకరణ :** విద్యాధ్యేయాలను అనేకరకాలుగా వర్గీకరించవచ్చును.

**విద్యాధ్యేయాలు**

- ప్రత్యేకధ్యేయాలు
- సార్వజనీనధ్యేయాలు
- వ్యక్తిగతధ్యేయాలు
- సామాజికధ్యేయాలు

**ప్రత్యేక ధ్యేయాలు**: 1) ఇవి ఒక ప్రాంతానికి, కాలానికీ సంబంధించి ఉంటాయి (2) ఇవి పరిమితమైనవి (3) ఇవి మార్చడానికి వీలుకలిగి వుంటాయి, (4) వీటిని ప్రత్యేక పరిస్థితుల్లో నిర్ణయించడం జరుగుతుంది.

**సార్వజనీన ధ్యేయాలు:** ఇవి ప్రాంతీయ, రాజకీయ, ఆర్థిక పరిస్థితులతో సంబంధంలేకుండా సర్వకాలాల్లో అందరికీ ఉపయోగపడేలా ఉంటాయి. వాటివల్ల మొత్తం మానవజాతి లాభంపొందుతుంది. వ్యక్తి శారీరక, మానసిక, నైతిక అంశాల సంపూర్ణ అభివృద్ధి లక్ష్యంగా చెప్పవచ్చు.

**వ్యక్తిగత ధ్యేయాలు**: పలువురు విద్యావేత్తలు వ్యక్తిగత అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. వీరు సమాజం కంటే వ్యక్తి ముఖ్యమని భావిస్తారు. వ్యక్తి అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని విద్యాకార్యక్రమాలు రూపొందిస్తారు. వ్యక్తుల్లోని అంతర్గత శక్తులను అత్యంత ఉన్నతస్థాయికి వికసింపజేయాలంటే వ్యక్తిగత విద్యాధ్యేయాలు అవసరమని ప్రతిపాదించారు.

**సామాజికధ్యేయాలు:** సమాజం వ్యక్తికంటే ఉన్నతమైందనీ సమాజంతో సంబంధం లేకుండా వ్యక్తి అభివృద్ధి సాధ్యం కాదని కొందరివాదన. అందువల్ల విద్యా కార్యక్రమాలన్నీ సమాజాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రూపొందిస్తారు. రాస్ అభిప్రాయం ప్రకారం సామాజిక పరిసరానికి భిన్నంగా ఉన్న వ్యక్తిత్వానికి విలువ ఉండదు. సామాజిక సేవ ద్వారానే ఆత్మసాక్షాత్కారం సాధ్యమవుతుంది.

విద్యాధ్యేయాలు గురించిన చర్చ ప్రాచీన కాలం నుంచి ఈనాటి వరకు కొనసాగుతూనే ఉంది. విద్యాధ్యేయాలకు సంబంధించిన సాంప్రదాయ భావాలను, సమకాలీన అభిప్రాయాలను గురించి కొంత తెలుసుకోవడం అవసరం.

**జ్ఞానంకోసం విద్య**: ' జ్ఞానాభివృద్ధికి విద్య ' అనేది నిర్వివాదాంశం. వ్యక్తి జీవితంలోని సమస్యల పరిష్కారానికి జ్ఞానం అవసరమని సోక్రటీసు అంటాడు. సుఖమయ జీవితానికి మానసిక శిక్షణ అవసరం. అందువల్ల జ్ఞాన సంపాదన విద్యాధ్యేయంగా ఉండాలనికొందరు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. వ్యక్తి అభివృద్ధికి జ్ఞానం తోడ్పడుతుంది. వ్యక్తి గొప్పదనం అతడి ఆలోచనాశక్తిపై ఆధారపడి ఉంటుంది. అందరి సంపూర్ణజ్ఞానం కావాలని బెకన్ అంటాడు.

**శీలంకోసం విద్య:** విద్యావేత్తల్లో ఎక్కువమంది సత్యవర్తనను వృద్ధి చేయడమే విద్యాధ్యేయంగా భావిస్తారు. అటువంటి వారిలో జర్మనీ విద్యావేత్త హెర్బర్ట్ ముఖ్యుడు. సత్ప్రవర్తన ఉన్నవ్యక్తి తన వైఖరులకూ, ఆదర్శాలకూ అనుకూలంగా ఎప్పుడూ నడుచుకొంటాడు. నైతిక విలువలు, ఆధారాలు ఉన్న ప్రవర్తన సత్ప్రవర్తన అని హెర్బర్ట్ భావన. నైతిక ప్రవర్తనవల్లే వ్యక్తిలో గానీ, సమాజంలో గానీ అభివృద్ధి జరుగుతుంది. నైతిక విలువల భావనే విద్యాధ్యేయం.

వ్యక్తిలో గల సహజాతాలు, వైఖరులు సమాజంలో అల్లకల్లోలాలను ( Disorders) సృష్టిస్తూంటాయి. కాబట్టి విద్య సహజాతాలను అణచివేసి లేదా శుద్ధిచేసి నైతికమైన ఆలోచనలను, భావాలను, చర్యలను వ్యక్తి సమాజాభివృద్ధికి ఉపయోగపడేవిధంగా మార్చాలి. దీనికి విద్యను ఒక సాధనంగా వాడుకోవాలని సోక్రటీసు అభిప్రాయపడ్డారు. ప్లేటో అభిప్రాయంలో వ్యక్తి ప్రవర్తనకు మూలమైన సహజాత విలువలకు శిక్షణ ఇవ్వడమే విద్య. సత్ప్రవర్తన నిర్మాణమే విద్యాధ్యేయం అని గాంధీ అభిప్రాయం. విద్యధైర్యాన్నీ, బలాన్నీ, విలువలను అభివృద్ధి పరచడమే గాక ఉన్నత ఆదర్శాలను సాధించడానికి తోడ్పడుతుంది. సత్ప్రవర్తన పొందివుండటానికి సహజాతాలను అణచివేయవలసి వస్తుంది. ఇది కొన్ని సందర్భాల్లో మానసిక సంఘర్షణకు దారితీయవచ్చు. కాబట్టి సత్ప్రవర్తనాభివృద్ధినే ఏకైక విద్యాధ్యేయంగా భావించకూడదు.

**వృత్తికోసం విద్య :** గతంలో మానవ జీవితం చాలా నిరాడంబరంగా ఉండేది. తరువాతి సంతతివారు తమ తల్లిదండ్రుల వృత్తినే అనుసరించేవారు. కాబట్టి ప్రత్యేక శిక్షణ అవసరం వుండేదికాదు. ప్రస్తుతం శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతివల్ల పారిశ్రామికీకరణ ఎక్కువైంది. జీవితం చాలా సంక్లిష్టమై గృహంకానీ, సమాజంకానీ యువకులకు సాంకేతిక పరిజ్ఞానం అందించలేకపోతున్నాయి. విద్య అనేది వ్యక్తి జీవితావసరాలను తీర్చుకోవడానికి ఉపయోగపడాలి. తన జీవనోపాధిని తానే సంపాదించుకోవడం అనేది మానవ జీవితంలో మొదటి ధర్మం. అప్పుడే మానవుడు మరొకరిపై ఆధారపడకుండా స్వయంపోషకత్వం సాధించగలడు. ప్రతివ్యక్తి ఏపని చేసేందుకు ఇష్టపడతాడో తెలుసుకొని అందులో నిష్ణాతులను చేసి సామాజిక అవసరాలను సమన్వయంతో అభివృద్ధి చేసే వ్యక్తులుగా వారికి శిక్షణ ఇవ్వడం విద్య ద్వారా చేయవలసిన పని.

జాతీయ విద్యా కమీషన్ (1964-66) కూడా ఈ ఉద్దేశ్యంతోనే పాఠశాలలో పని అనుభవం ప్రవేశపెట్టాలని ప్రతిపాదించింది. వ్యక్తిలో సంతోషాన్ని కలిగించడమే విద్య నిజమైన ధ్యేయమని గాడ్విన్ అభిప్రాయపడ్డారు వ్యక్తి తన వృత్తికి అనుగుణంగా శిక్షణపొందినపుడు నిజమైన తృప్తిని పొందుతాడు. వృత్తికోసం వ్యక్తిని తయారుచేయడం విద్యాధ్యేయం అయినప్పటికీ విద్య సంపూర్ణమూర్తిమత్వాభివృద్ధికి తోడ్పడాలి.

**సాంస్కృతిక వారసత్వంకోసం విద్య:** సాంస్కృతిక అభివృద్ధిని ఒక విద్యాధ్యేయంగా కొంతమంది తత్వవేత్తలు అభిప్రాయపడ్డారు. పాశ్చాత్య సంప్రదాయం ప్రకారం సంస్కృతి అంటే సామాజిక ఆకర్షణ, ఉన్నతజ్ఞానం, సమన్వయంతో కూడిన అలవాట్లు సంప్రదాయ మానవుల సంప్రదాయ ప్రవర్తన మొదలైన వాటిని సంస్కృతిగా బోగార్డస్ అభిప్రాయపడ్డాడు. నాగరిక మానవుడు సంకుచిత భావాలను, సొంత అభిప్రాయాలను మానుకుని ఉన్నత విలువలనూ, ధ్యేయాలను సాధించేందుకు ప్రయత్నిస్తాడు.

**విరామకాల సద్వినియోగం కోసం విద్య:** ప్రస్తుతకాలంలో శాస్త్ర, సాంకేతికత అభివృద్ధి చెందడంవల్ల సమర్థవంతంగా వాటిని వినియోగించి తన దినచర్యలను పూర్తిచేసుకొని విరామ కాలాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కొందరు విద్యావేత్తలు విరామకాల సద్వినియోగం కూడా విద్యాలక్ష్యంగా అభిప్రాయ పడ్డారు. విరామకాల విద్య పిల్లల భావోద్రేకాలనూ, లలితకళలను అభివృద్ధి పరుస్తుంది. సృజనాత్మక కార్యక్రమాలలో పాల్గొనే విధంగా

చేస్తుంది. అయితే పనికీ, విరామానికి మధ్య సంబంధం ఉంది. విరామం లేకుండా పనిచేసేవారు యంత్రాలతో సమానం విరామం వల్లపని, పనివల్ల విరామం అవుతాయి.

**ఆత్మసాక్షాత్కారం కోసం విద్య:** ఆత్మ సాక్షాత్కారం అంటే ప్రకృతి, మానవుడు, దేవుడు, వీటి మధ్యనున్న అన్యోన్య సంబంధాలను గురించి సరైన అవగాహన పొంది వుండటం. కాబట్టి కొందరు విద్యావేత్తలు శిశువులో ఉన్నత నైతిక విలువలను పెంపొందించి, ఆధ్యాత్మిక భావాలను సాధించేటట్లు చేయడమే విద్యాధ్యేయంగా ప్రకటిస్తారు. ఆదర్శాలు, విలువల పేరుతో సహజాతాలను అణగదొక్కడం జరుగుతుంది. దీనివల్ల శిశువులో నేర వైఖరులు ఏర్పడటానికి అవకాశం వుంది. సహజాతాల స్వేచ్ఛ ప్రకటన శిశువుకు ఆనందాన్ని ఇస్తుంది. కాబట్టి వాటిని వ్యక్తీకరించేందుకు అనువైన సన్నివేశాలను కలుగజేయాలి.

ప్రాచీన భారతదేశంలో, మానవ జీవితంలో ఆదర్శాలకు, ఆత్మ వికాసానికి అత్యున్నత స్థానాన్ని కల్పించారు. శిశువు ఆత్మ వికాసానికి తగిన బోధన జరిగేది. శాంతి, సంతోషం, ఆనందాలు, మానవులకు ఆత్మ సాక్షాత్కారాన్ని అందజేస్తాయి. ఈ ధ్యేయం ప్రకారం సహజాతాలను తీర్చిదిద్దడం ద్వారా మానవుడిలో ఉన్నత, నైతిక, దైవిక విలువలను పెంపొందిచడానికి వీలవుతుంది.

**మానవత్వం కోసం విద్య:** వ్యక్తి సుఖమయ జీవనానికి ఆదర్శాలకు విలువలను మరచి, హంతకులుగా మారుతున్నారు. వీరు సమాజ మనుగడకు సహాయ పడరు సరికదా వినాశనానికి తోడ్పడుతున్నారు. ఇలాంటి స్థితిలో విద్య మానవుడిలో మానవతా విలువలను పెంపొందించాలి. మంచి చెడులను సమర్థవంతంగా గ్రహించి చెడును విడనాడి మంచిని పెంపొందించాలి. మంచిచెడులను సమర్థవంతంగా గ్రహించిచెడును విడనాడి మంచిని పెంచాలి దీనికి తార్కిక ఆలోచనాశక్తిని విద్య మానవుడిలో ప్రేరేపించాలి, అభివృద్ధిపరచాలి ఎదుటివారి సమస్యలను అర్థం చేసుకొని తన శక్తికొద్ది వాటిని పరిష్కరించే ప్రయత్నం చేయాలి. మానవతా విలువలైన దయ, క్షమ, ఓర్పు, సహనం, సహకారం లాంటి వాటిని వ్యక్తిలో అభివృద్ధి పరచాలి. ఇతరుల అభిప్రాయాన్ని గౌరవించి మానవ సేవే మాధవసేవగా భావించే తత్వాన్ని పెంపొందించాలి. ఒక్క మాటలో చెప్పాలంటే విద్య మానవులను మానవతా వాదులుగా తీర్చిదిద్దాలి.

### 2.1.9 విద్యాధ్యేయాలు – నిర్ణయాత్మక అంశాలు :

విద్య అనేది ఒక విస్తృతమైన భావన, ప్రపంచంలోనే పలువురు మేధావులు, తత్వవేత్తలు, రాజకీయ వేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, విజ్ఞాన శాస్త్రజ్ఞులు విద్యను వారి వారి కోణాల నుంచి పరిశీలించి విద్యకు అర్థం, ధ్యేయాలు మొదలైన అంశాలపై వారి వైఖరి తెలియజేశారు. అందువలన ఒకే అర్థం కానీ ఒకే ధ్యేయంకానీ నిర్ణయించడానికివీలులేదు. అదే విధంగా విద్యాధ్యేయాలు నిర్ణయించే ముందు ఏయే అంశాలు వాటిపై ప్రభావాన్ని చూపిస్తాయో తెలుసుకోవలసివుంది. అప్పుడు మాత్రమే విద్యాధ్యేయాలకు తగిన కారణాలు తెలుసుకుని సమన్వయ పరచుకుని, కాలానుగుణంగా వాటిని నిర్ణయించడానికి వీలవుతుంది. ప్రధానంగా విద్యాధ్యేయాలను రాజకీయాంశాలు ప్రభావితం చేస్తున్నాయి.

విద్యాధ్యేయాలను నిర్ధారించడం అనేది క్లిష్టమైన అంశం. అవి వ్యక్తి అభివృద్ధి ద్వారా సమాజాభివృద్ధిని కాంక్షిస్తాయి. నిరంకుశపాలనలో సమాజాభివృద్ధికి ప్రాధాన్యతనివ్వగా, ప్రజాస్వామ్యంలో వ్యక్తి అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తారు విద్యాధ్యేయాలను నిర్ణయించే సమయంలో అప్పటి జీవిత తత్వాన్ని దృష్టిలో వుంచుకోవాలి. జీవితతత్వం మారినప్పుడల్లా కాలానుగుణంగా విద్యాధ్యేయాలు కూడా మార్చుకోవలసి వస్తుంది.

### 2.1.10 విద్యాధ్యేయాలు – రాజకీయాంశాలు :

విద్యాలక్ష్యాలను సాధించేందుకు పాఠ్యప్రణాళిక అనే సాధనం ఉపయోగపడుతుంది. విద్యావిధానాన్ని నిర్ణయించడంలో సామాజిక అవసరాలు, ఆదర్శాలు, కోరికలకు తగిన ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంది. అంటే విద్య ద్వారా సామాజిక లక్షణాలను, భావాలను విద్యార్థుల్లో అభివృద్ధి పరచి సమాజంపట్ల వారి విధులను సక్రమంగా నిర్వహిస్తూ సమాజంలో సుఖమయమైన జీవితాన్ని గడుపుతూ తమ అభివృద్ధితో పాటు సామాజిక వృద్ధికి కూడా తోడ్పడే వ్యక్తులను తయారుచేయడమే విద్యాలక్ష్యంగా వుండాలి.

విద్యా విధానాన్ని నిర్ణయించడంలో తాత్విక, సామాజిక అంశాలతో పాటు రాజకీయాలు కూడా తగిన ప్రభావితాన్ని చూపిస్తాయి. కేవలం భౌతిక వాతావరణానికి బానిసగా గాకుండా అవసరానికి తగినట్లుగా పరిసరాలను తనకు అనువైన పద్ధతిలో మార్చుకునే శక్తి మానవుడికి వుంది. భారతదేశ చరిత్ర చూసినట్లయితే వేదకాలం నుంచీ నేటివరకూ విద్యావిధానం ఏయే మార్పులకు లోనయిందో తెలుస్తుంది. వేదకాలంలో ఋషులు, మునులు, సన్యాసులు విద్యను ప్రచారం చేసేవారు. గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులు కలసి జీవించేవారు. రాజకీయాలకు వీరితో ఎలాంటి సంబంధం వుండేదికాదు. తదనంతరం విద్యా విధానంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. బ్రిటీష్ కాలంలో ఈస్ట్ఇండియా కంపెనీ మొట్టమొదట భారతీయుల విద్యతో సంబంధం లేనట్లుగా వుండేది.

1813 వ సంవత్సరంలో చార్టరు నివేదికను అనుసరించి భారతీయుల విద్యాభారం కొంత బ్రిటీషు ప్రభుత్వం వారు తీసుకొన్నారు. లార్డ్‌మెకాలే, విలియం బెంటింగ్, మొదలైన వారు భారతీయులకు ఏ విధమైన విద్యా విధానంఅవసరమో నిర్ణయించారు. ఆ తరువాత విద్యారంగంలోని పాఠ్య ప్రణాళికలు, లక్ష్యాలు, బోధన మాధ్యమం, బోధన పద్ధతులను కూడా ప్రభుత్వం నిర్ణయించింది. 1882వ సంవత్సరంలో హంటర్ కమీషన్ ప్రైవేటు వ్యక్తులు విద్యాసంస్థలు నడపడానికి ఆర్థిక సహాయాన్ని అందించడానికి సంకల్పించింది. 1919వ సంవత్సరం నుంచీ విద్య రాష్ట్ర విధుల్లో ఒకటిగా మారింది. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగంలో విద్యను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో చేర్చడం జరిగింది. ధ్యేయాలు, విద్యాలక్ష్యాలు బోధనాంశాలను కూడా రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.

ప్రభుత్వ విధానం మారినప్పుడల్లా తగిన విధంగా విద్యలో కూడా మార్పులు చోటుచేసుకుంటాయి. రాచరిక పరిపాలన విధానంలో వ్యక్తి ఏరకమైన విద్యను అభ్యసించాలనే అంశంలో స్వేచ్ఛ ఉండదు. ప్రభుత్వ శ్రేయస్సు కోసం వ్యక్తి తన సర్వస్వాన్ని ఆఖరుకు తన జీవితాన్ని కూడా త్యాగం చేయవలసి వుంటుంది. విద్యావిషయక అంశాలన్నీ కూడా ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. రాజ్యంలో విద్య సంపన్నులైన కొందరికి మాత్రమే పరిమితమై సాధారణ జనంలో అణుకువను, సేవాతత్పరతను పెంపొందిస్తుంది. ఓర్పు, శ్రమ, ఆత్మత్యాగం మొదలైన లక్షణాలను సాధారణ ప్రజల్లో అభివృద్ధిపరచడానికి విద్యను ఉపయోగిస్తారు.

వీటికి భిన్నంగా ప్రజాస్వామ్యంలో పాలనా అధికారం వికేంద్రీకరించడం ద్వారా సంఘం, వ్యక్తి సమానంగా అభివృద్ధి చెందేందుకు కావలసిన పరిస్థితులు ఉంటాయి. సోదరభావం, సమానత్వం, స్వేచ్ఛతో కూడిన సహకారం సేవ, త్యాగం మొదలైన లక్షణాలను అభివృద్ధి పరచడానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. విద్యార్థుల మానసిక సామర్థ్యం పెరుగుదలకు అనువైన పరిస్థితులను ఉపాధ్యాయులు కల్పించవలసి వుంది. ప్రతి వ్యక్తి తనకు ఇష్టమైన, తన శక్తిసామర్థ్యాలకు అనువైన విద్యను పొందేందుకు ఆస్కారం ఉంటుంది. సామ్యవాద రాజ్యంలో సామాజిక అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. శాస్త్ర సాంకేతిక, వృత్తిపరమైన విద్యను పొందేందుకు వీలుంటుంది. విద్యను అభ్యసించడానికి అందరికీ సమాన అవకాశాలు ఉంటాయి. ఈ విధంగా రాజకీయాలు విద్యారంగాన్ని ప్రభావితం చేస్తాయి.

## 2.2 విద్యలో రాజ్యం పాత్ర (Role of State in Education)

- విద్యలో రాజ్యం యొక్క పాత్ర (Role of State in Education)
- విద్యా సంస్థల స్థాపన (Establishment of Institutions )
- పాఠ్య ప్రణాళిక అభివృద్ధి మరియు పాఠ్య పుస్తకాలు రూపొందించడం (Curriculum, Development & Text Books)
- బోధన మరియు మదింపు ఆచరణలు (Pedagogic and Assessment Practices)
- బోధనా సంస్కృతి (Culture of Pedagogic)
- పాఠశాల సంస్కృతి (Culture of Schooling)
- ఉపాధ్యాయుల శిక్షణ మరియు నియామకం (Training and Recruting Teachers)

జాతీయ ఆదర్శాలు, సాంప్రదాయాలను విడిచిపెట్టి ఏ విద్యా విధానమూ మనుగడ సాగించలేదు. జాతీయ సాంప్రదాయాలను పక్కకు నెట్టి పాశ్చాత్య విద్యా విధానాన్ని అవలంభించడంవల్ల మన విద్య ఆత్మనుకోల్పోయిన శరీరంలాగా తయారవుతుంది. మన సంస్కృతి, సంప్రదాయాలు భావధారను కొనసాగించిన సహజ పరిణామ క్రమంలో ఏర్పడిన విద్యా విధానాన్ని మనం అనుసరించడంలేదు. ఈ సంప్రదాయధార ఎల్లప్పుడూ కొనసాగాలి. మన విద్యా విధానంపై ఎప్పటికప్పుడు మనం పునరాలోచించుకోవాలి. పున:సమీక్షించుకోవాల్సిన అవసరం వుంది. మనకు కావలసిందేమిటో గుర్తించాలి. మన సొంత పద్ధతిలో ఆధునీకీకరించుకోవాలి. మన సమాజ అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకోవాలి. అప్పుడే వ్యక్తికి, సమాజానికి సమన్వయం జరుగుతుంది. ముందుగా ప్రాచీన భారతీయ విద్యా విధానం గురించి మననం చేసుకొంటూ నేటి మన విద్యావిధానంలో ఏ లక్షణాలు కొరవడ్డాయో, ఏలక్షణాలు పూరించుకోవాలో తెలుసుకుందాం.

**"ప్రజల అవసరాలకు, ఆశయాలకు తగినట్టుగా వున్నదే అసలైన విద్య" – కొఠారి**

విద్యా వ్యవస్థలోని నూతన పోకడలను, నేటి మారుతున్న పరిస్థితులకు అనుగుణమైన, తమ ముందున్న సవాళ్ళను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి పాఠశాల వ్యవస్థలో అవసరమైన మెళుకువలు, విద్యా ప్రమాణాలు సాధనకు అవసరమైన వ్యూహరచన, సమాజ భాగస్వామ్యం, మొదలగు ప్రధాన అంశాలను దృష్టిలో వుంచుకొని విద్యాగమ్యాలను రూపొందించడం జరుగుతుంది.

విద్యాప్రాముఖ్యతను గుర్తించిన మానవ సమాజాలు, అందరికీ విద్యనందించడం ద్వారా వ్యక్తిగత, సామాజిక, జాతీయ ప్రగతిని సాధించాలని కృషి సల్పుతున్నాయి. పరిమాణాత్మక, గుణాత్మక విద్యా విస్తరణకోసం విశ్వవ్యాప్తంగా జరుగుతున్న అనేకనేక ప్రయత్నాల ఫలితంగా నేటి విద్యా వ్యవస్థ ప్రతి నిత్యం ఏదో ఒక చోట ఏదో ఒక మార్పునకు లోనవుతూనే వుంది.

ఆధునిక నాగరిక ప్రపంచంలో అందరికీ అత్యంత అవసరమైనది విద్య అని మనందరకూ తెలిసినదే. విద్య అంతర్గత శక్తులను వెలికితీయడమే గాక, విశాల ప్రవర్తను వికసింపజేస్తుంది. విద్య సమగ్రమూర్తిమత్వాన్ని రూపొందిస్తుంది. విద్య, శారీరక, మానసిక సౌందర్యాన్ని పెంపొందిస్తుంది. విద్య ఆచరణ ద్వారా పరిణితిని ఏర్పరుస్తుంది. విద్య అంతిమంగా ఆటవిక మనిషిని ఆధునిక మానవుడిగా రూపుదిద్దుతుంది.

విద్య మానవ జీవితంలో ఒక విభాగమై విరాజిల్లుతోంది. విద్య మనిషికి సమాజంలో ఒక స్థాయిని కల్పిస్తోంది. విద్య ద్వారా మనిషి తన చుట్టూ వున్న పరిసరాలను ప్రభావితంచేస్తూ, ప్రభావితమవుతూ సామాజిక, రాజకీయ గమనంలో ప్రపంచ పురోభివృద్ధిలో తన వంతు పాత్రను నిర్వహిస్తోంది. దేశ కాల పరిస్థితులను బట్టి విద్యకూడా తనరూపాన్ని, దిశను, గమనాన్ని, గమ్యాన్ని, నిర్దేశించుకుంటుంది.

### 2.2.1 విద్యలో రాజ్యం యొక్క పాత్ర

భారత ప్రజాస్వామ్యదేశంలో కేంద్ర జాబితాలో కొన్ని ఉమ్మడి జాబితాలో కొన్ని, రాష్ట్ర జాబితాలో మరికొన్ని విద్య యొక్క అంశాలు ఉన్నప్పటికీ చాలా సందర్భాలలో రాష్ట్ర ప్రభుత్వానిదే ముఖ్య భూమిక అవుతున్నది. మన రాజ్యాంగంలో విద్య బాధ్యతలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటికి పంచడం జరిగింది. కేంద్ర జాబితాలో 97 అంశాలు రాష్ట్ర జాబితాలో 66 అంశాలు మరియు ఉమ్మడి జాబితాలో 47 అంశాలు పొందుపరిచారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి

↓

రాష్ట్ర మంత్రి మండలి

↓

విద్యాశాఖామాత్యులు / మానవవనరుల శాఖమంత్రి

↓

ప్రాధమికవిద్య | మాధ్యమికవిద్య | ఉన్నతవిద్య | సాంకేతికవిద్య | ఆరోగ్యవిద్య

↓

ముఖ్యకార్యదర్శి

↓

కార్యదర్శి

↓

కమీషనర్ / డి.యస్.ఇ.

↓

యస్.టి.వెల్ఫేర్ సొసైటీ | బి.సి.వెల్ఫేర్ సొసైటీ | ఆర్.యస్. ఓపెన్ సొసైటీ | లైబ్రరీలు | సి.జి.ఇ. | SIET | ప్రభుత్వ ముద్రణాలయం

↓

జె.డి /ఆర్.జె.డి. / ఐ.ఎ.యస్.ఇ.

↓

డి.ఇ.ఓ / డైట్ ప్రిన్సిపాల్

↓

డిప్యూటి ఇ.ఓ. / డి.ఐ.

↓

యం.ఇ.ఓ.

విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్యగరిపి అందరూ బాధ్యులైన సమాజం రూపుదిద్దుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తుంది. ఆకృషిలో భాగంగా అందరికీ విద్య, కెజి నుండి పీజి వరకు ఉచిత విద్య, బి.సి., యస్.సి., యస్.టి.,, మైనారిటీలకు రెసిడెన్షియల్ పాఠశాలలు వంటి అనేక సంక్షేమ పథకాలు చేపడుతోంది. నాణ్యమైన విద్యను అందించే ప్రక్రియలకు అవసరమైన విద్యాసంస్థలు అందరికీ అందుబాటులో నుండేటట్లు క్రొత్త సంస్థలు స్థాపించడం, పాఠ్యప్రణాళిక అభివృద్ధిని మరియు పాఠ్యపుస్తకాలను రూపొందించడం, బోధనా ప్రక్రియలలో ఉపాధ్యాయులకు తర్ఫీదు నందించి, అభ్యసన, అంచనా వేయడం, నూతన పోకడల అనుభవాల ప్రక్రియను, పాఠశాల సంస్కృతిని, పెంపొందించే వాతావరణం కలిగించడం. ఉపాధ్యాయులను బోధన ప్రక్రియపై మక్కువ కలిగేటట్లు తయారు చేయడం, ఉపాధ్యాయులను నియమించడం వంటి కార్యక్రమాలలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ నిరంతరం శిక్షణలు, పరిశోధనలు, సమావేశాలు, సర్వేలు, సమీక్షలు జరుపుతూ అభ్యుదయ పాఠశాలలు, ప్రాథమిక విద్యా ప్రాజెక్టులు, జిల్లా ప్రాథమిక / మాధ్యమిక / ఉన్నత విద్యా ప్రాజెక్టులు, సర్వశిక్ష అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక విద్యా సమితులను అలాగే కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆర్.యు.యస్.ఎ. (రాష్ట్రీయ ఉచ్చతరన్ శిక్షా అభియాన్) వంటి పథకాలను ఏర్పాటు చేయడమే కాకుండా, విద్యోన్నతికై అహర్నిశలూ శ్రమిస్తున్నవి.

### 2.2.2 విద్య – రాష్ట్ర అధికారాలు (Education - State Powers)

- విద్యాలయాల స్థాపన, పరిపాలన.
- గుర్తింపు పొందిన విద్యాసంస్థలకు గ్రాంట్లు (ఎయిడ్) మంజూరు చేయుట.
- పాఠశాలల పర్యవేక్షణ, తనిఖీ ఏర్పాట్లు చేయుట.
- పాఠశాలలకు గుర్తింపును, గ్రేడింగ్‌ను ఇచ్చుట.
- పాఠ్యపుస్తకాల తయారీ, పాఠ్యప్రణాళికా రచన.
- బోధనోపకరణాల తయారీలో శిక్షణ ఇచ్చుట.
- విద్యా ప్రమాణాల పెరుగుదలకు కృషి చేయుట.
- ఉపాధ్యాయుల ఎంపిక మరియు నియామకం.
- విద్యాగణాంకాల తయారీ
- విద్యాలయాల విస్తరణలో స్వచ్ఛంద సంస్థల పాత్రను ప్రోత్సహించుట.
- విద్యావ్యాప్తికి, విద్యా ప్రణాళికాభివృద్ధికి తోడ్పడుట.
- సమాజంలో ఉపాధ్యాయుని స్థాయి పెంపొందించుట.

### 2.2.3 విద్యాసంస్థల స్థాపన (Role of State in Establishing Educational Institutions)

విద్యాసంస్థలు సామాజిక వ్యవస్థలో సాంఘికీకరణకు తోడ్పడుతాయి. సమాజంలోని మానవుల అవసరాలు తీర్చడానికి ప్రతి సమాజంలోను కొన్ని యంత్రాంగాలు వుంటాయి. వాటినే సంస్థలంటారు.

“విద్యా సంస్థ అంటే సక్రమంగా రూపొందిన విద్యావిధానాల ద్వారా ప్రజల అవసరాలు తీర్చడానికి ఏర్పడిన సామాజిక నిర్మితి” – బోగార్డస్

"ఒక భావనతో, నిర్మితితో కూడినదే సంస్థ" – నమ్మర్

విద్యాసంస్థ అనగా కొన్ని నిర్ధిష్ట లక్ష్యాలు, సిబ్బంది సమూహాలు, ప్రయోజనకరమైన భౌతిక సామాగ్రి, సాంస్కృతిక ప్రతీకలు మొదలగు లక్షణాలు కలిగిఉంటుంది. అంతేగాకుండా ప్రతి సంస్థ కొన్ని నిర్దిష్ట ప్రమాణాలు, ప్రవర్తనా సంహితులు, విలువలు, ఆదర్శాలు, భావనల కొరకు కృషి చేస్తుంది. ప్రతి విద్యాసంస్థ ఒక వ్యవస్థాపనను నిర్మించుకుంటుంది. తన కార్యకలాపాలను ఒక నిర్ణీత ప్రాంతంలో, పరిధిలో నిర్వర్తిస్తుంది.

### 2.2.4 విద్యా సంస్థల వర్గీకరణ (Types of Educational Institutions)

విద్యా సంస్థలను మూడు విధాలుగా వర్గీకరించవచ్చు.

విద్యా సంస్థలు

- నియత విద్యాసంస్థలు
  - పాఠశాలలు
  - కళాశాలలు
- అనియత విద్యాసంస్థలు
  - పాఠశాల ఆవలవున్న విద్యాసంస్థలు
  - స్వేచ్ఛ పాఠశాలలు
  - ఓపెన్‌యూనివర్శిటి (సార్వత్రిక విశ్వ విద్యాలయంజ
- యాదృచ్ఛిక విద్యా సంస్థలు
  - కుటుంబం
  - ఇరుగుపొరుగు
  - సమవయస్కుల సమూహాలు
  - సముదాయం
  - సాంఘికీకరణ సాంస్కృతిక సంస్థలు
  - మతవిశ్వాస సంస్థలు
  - రాజ్యం-ప్రభుత్వేతర సంస్థలు
  - ప్రజాబాహుళ్య ప్రసార సంస్థలు

**నియత విద్యా సంస్థలు (Formal Educational Institutions)**

సమాజ అవసరాలను బట్టి ప్రణాళికాయుతంగా నిర్ధిష్ట లక్ష్యాలతో వీటిని ఏర్పాటు చేస్తారు. ఇవి క్రమబద్ధమైన నియమనిబంధనలతో నడుస్తాయి. ఉదా॥ పాఠశాలలు, కళాశాలలు, పాలిటెక్నిక్ వంటి వృత్తివిద్యా కళాశాలలు

**అనియత విద్యా సంస్థలు ( Non Formal Educational Institutions)**

నియతకళాశాలలకు భిన్నంగా పనిచేసే విద్యాసంస్థలు, ఇవి యాదృచ్ఛిక విద్యా సంస్థలకు గానీ, నియత విద్యా సంస్థలకు గానీ చెందక మధ్య రకంగా వుంటాయి. వీటిల్లో కఠినమైన, నిర్దిష్టమైన నియమ నిబంధనలుండవు. వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యములు కలిగి తనకిష్టమైన అవసరమైన విద్యా విషయాలను వీలుకలిగినపుడు నేర్చుకోవడానికి అవకాశాలుంటాయి.

ఉదా।। స్వేచ్ఛా పాఠశాలలు (ఓపెన్ స్కూల్స్), సార్వత్రిక విశ్వవిద్యాలయాలు, (ఓపెన్ యూనివర్సిటీ)లు.

**యాదృచ్ఛిక విద్యాసమూహాలు (Informal Institutions)**

కొన్ని సామాజిక సంస్థలు సాంఘికీకరణ, విద్యా ప్రకార్యాలను ప్రణాళికా రహితంగా, యాదృచ్ఛికంగా తమంతట తామే చేపడతాయి. కట్టుదిట్టమైన నియమ నిబంధనలుండవు. కుటుంబం, ఇరుగుపొరుగు, తోటివారి సమూహం, సముదాయం, సాంఘిక, సాంస్కృతిక, మత, రాజకీయ, జనబాహుళ్య భావప్రసార సాధనాలు ఈ వర్గంలో చేరుతాయి. వ్యక్తి ఎన్నోవిషయాలను తనకు తెలియకుండానే నేర్చుకొంటాడు. విద్యాప్రక్రియలో యాదృచ్ఛిక విద్యా సంస్థల ముఖ్యపాత్రలను తెలుసుకొందాం.

**కుటుంబం :** కుటుంబం ద్వారా ఆహార నియమాలు, ఆరోగ్య పారిశుద్ధ్య అలవాట్లు, భాష, మాట్లాడేతీరు, ఆచార వ్యవహారాలు మొదలైన ఎన్నో విషయాలు నేర్చుకొంటారు.

**ఇరుగుపొరుగు :** ఇరుగు పొరుగు వారు పాటించే క్రమశిక్షణ, మానసిక ప్రవృత్తి, స్థానిక ఆటలు, క్రీడలు, వినోదవసతులు మొదలైన అన్నీ సాంఘికీకరణకు తోడ్పడుతాయి.

**సమవయస్కుల సమూహాలు:** ఇవి మంచి గతిశీల సమూహాలు. ఎక్కువ విషయాలు ఇందులో నేర్చుకుంటారు. ఇవి విద్య మీద ఎక్కువ ప్రభావం చూపుతాయి.

**సముదాయం:** అనగా కొన్ని కుటుంబాల సమూహం. దాదాపు ఒకే రకమైన జీవన విధానాన్ని అనుసరించే ప్రజా సమూహాన్ని సముదాయంగా చెప్పవచ్చును. " ఏదైనా ఒక ప్రాంతంలో సామాజిక ఐక్యతతో జీవనాన్ని గడిపితే, ఆ ప్రాంతమే సముదాయం " – మెకైవర్

" నిర్ణీత ప్రాంతంలో సహభావంతో నివశిస్తున్న సామాజిక సముహాన్ని సముదాయం అంటారు" – బోగార్డస్

పాఠశాల, సముదాయ సమగ్ర అభివృద్ధికి కేంద్రంగా రూపొందింపబడాలి.

**మతం:** మతం విద్యార్థులలో ఆధ్యాత్మిక భావాలను, విలువలను పెంపొందిస్తుంది. పరస్పర అవగాహనతో, సమహనంతో, గౌరవంతో ఎవరి మతాన్ని వారు ధృఢమనస్కులై అవలంబించాలి.

**సామాజిక సాంస్కృతిక సంస్థలు – విద్య:** సామాజిక సాంస్కృతిక విద్యాసంస్థలలో పాల్గొనడం ద్వారా వ్యక్తులు సామాజిక జీవనం, సంఘసేవ, సాంస్కృతిక ఆసక్తులు, అభిరుచులు పెంపొందించుకుంటారు.

**రాజ్యం – విద్య:** రాజకీయ పక్షాలు, జనసంబంధ భావ ప్రసార సాధనాలు, సంఘ సంస్కర్తలు, ప్రజాభిప్రాయాన్ని సామాజిక లక్ష్యాలకు అనుకూలంగా మార్చడంలో ఎక్కువ కృషి సల్పి విద్యాభివృద్ధిలో పాల్గొంటారు.

విద్యాపరమైన ఏ సంస్థ స్థాపించాలన్నా రాష్ట్ర ప్రభుత్వపు అనుమతి అవసరముంటుంది. రాష్ట్ర విద్యా శాఖ నుండి ప్రాంతీయ విద్యాశాఖకు, ప్రాంతీయ విద్యాశాఖ నుండి జిల్లా విద్యాశాఖకు, జిల్లా విద్యాశాఖ నుండి మండల విద్యా శాఖకు అధికారాలు వికేంద్రీకరించినా, రాష్ట్ర ప్రభుత్వం పేరుమీదనే అనుమతి అభిస్తుంది. విద్యాపరమైన ఏ సంస్థలైనా ప్రాధమిక పాఠశాల, మాధ్యమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, కళాశాల వంటి సంస్థలే కాకుండా శిక్షణాసంస్థలు, వృత్తి విద్యా సంస్థలు స్థాపించడానికి వేర్వేరుగా నియమాలు, అధికారులు వున్నప్పటికీ రాష్ట్ర అనుమతితోనే సంస్థలు స్థాపించాల్సి వుంటుంది.

ఒక సంస్థ ఏర్పాటు చేయాలంటే, దాని అవసరం, ఆ ప్రాంత ప్రజల అభిమతం, ప్రభుత్వ నియమనిబంధనలు, సంస్థ ఆధీనంలో నున్న వసతులు, ఆర్థిక స్థోమత, ఇతర వనరులను పొందుపరచి, సంబంధిత అధికారికి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను పరిశీలించిన అధికారులు సంస్థ యాజమాన్యం పొందుపరచిన విషయాలను సమీక్షించడానికి ఒక నిపుణుల కమిటీని నియమిస్తుంది. ఈ కమిటీలో సాధారణంగా ఆ సంస్థ ఎవరి ఆధీనంలో వుంటుందో ఆ కార్యాలయపు అనుమతి అధికారి, ప్రాంతీయ అధికారి మరియు విషయనిపుణులు వుంటారు. వీరు ఆ సంస్థ ప్రారంభించడానికి అవసరమగు నియమనిబంధనలను, వనరులను, సంస్థ స్తోమతను పరిశీలించి, సంస్థకు అవసరమగు భౌతిక వసతులు, మానవ వనరులు, బోధనాభ్యాసన వసతులు, ఆర్థిక వనరులు, ప్రాంతీయ పౌరుల అభిమతం వంటి సంబంధిత విషయాలన్నీ భౌతికంగా పరిశీలించి, వాటిని అంచనావేసి, సంబంధిత అధికారికి ఒక నివేదిక పంపిస్తారు. సంబంధిత అధికారి, ఆరిపోర్టును క్షుణ్ణంగా పరీక్షించి, అన్ని వసతులు, నియమనిబంధనలు అనుకూలంగా నున్న వాటికి సంస్థను స్థాపించుకోవచ్చునని అనుమతి పత్రం జారీచేస్తారు. కొన్ని వసతులు ఉన్నప్పటికీ మిగతా వసతులు సమకూర్చుకోవడానికి సిద్ధంగానున్న వాటికి నిబంధనలతోకూడిన అనుమతి పత్రం జారీ చేస్తారు. ఈ రెండు కేటగిరీలకు కాకుండా 3వ కేటగిరీ అనగా వసతులు పొందుపరచుటలో విఫలమైన యాజమాన్యానికి సంస్థను ప్రారంభించడానికి అనుమతి నిరాకరిస్తూ పత్రం జారీచేస్తారు.

ఇలా ప్రతి విద్యాసంస్థకు అవసరమైన వసతులతో రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో నున్న జి.ఓ.లకు అనుకూలంగా నున్న యాజమాన్యానికి నూతన సంస్థలు స్థాపించడానికి అనుమతి లభిస్తుంది. ప్రభుత్వ అనుమతులు లభించడం వారి నియమనిబంధనలు అమలుపరిచే విధంగా, చేర్పులు, మార్పులకు అవకాశం కల్పిస్తారు.

### 2.2.5 విద్యా పాఠ్యప్రణాళికాభివృద్ధి మరియు పాఠ్యపుస్తకాలు రూపొందించుట:
(Curriculum Development and Preparation of Text Books)

విద్యా కార్యక్రమాల ప్రక్రియ పాఠశాల విద్యా కమీషనర్ గారి ఆధీనంలో ఉన్నప్పటికీ విద్యాపరమైన ప్రక్రియలన్నీ రాష్ట్ర పరిశోధనా శిక్షణా సంస్థ (SCERT) కు అప్పజెప్పడం ఆనవాయితీ. తెలుగు రాష్ట్రాలలో విద్యాపరమైన సంస్థలు స్థాపించడం, పాఠ్యప్రణాళిక మరియు పాఠ్య పుస్తకాల రూపకల్పన, బోధనా మరియు అభ్యసనానుభవాలు, పాఠశాల సంస్కృతి, ఉపాధ్యాయుల ఎంపిక, శిక్షణ వంటి కార్యక్రమాలు, పాఠశాల కమీషనర్‌తో పాటు SCERT సంస్థ చూసుకొంటుంది.

**విద్యాపాఠ్యప్రణాళిక (Curriculum Frame Work):** పాఠ్యప్రణాళిక రూపొందించడానికి SCERT బాధ్యత వహిస్తుంది. ఈ రూపకల్పనలో జాతీయ, రాష్ట్రీయ నిపుణులతో సంప్రదించి వారి సూచనలతో, రాష్ట్రంలోని నియమ నిబంధనలు అనుసరించి విద్యా శాఖాధికారులు, విషయనిపుణులు, విశ్వవిద్యాలయ ప్రతినిధులు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, సంఘసంస్కర్తలు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు పాల్గొంటారు. పాఠ్యపుస్తకాల ఆవశ్యకతపై రూపకల్పనపై చాలా మంది నిపుణులు చాలా రకాల అభిప్రాయాలను వెల్లడిస్తూ వస్తున్నారు. పాఠ్య పుస్తకాలే అవసరం లేదని కొందరు, ఒకవేళ పాఠ్యపుస్తకాలుంటే అవి విద్యార్థులకే పరిమితం కావాలని కొందరు పాఠ్యపుస్తకాలంటే అవి సమాజావసరాలను ప్రతిబింబించాలని మరికొందరు అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. పాఠ్యప్రణాళిక, పాఠ్య పుస్తకాలు అమలులోనికి రాకపూర్వం ఉపాధ్యాయులే అన్నీ చేసుకుంటుండేవారు.

అప్పుడు విద్య ఉపాధ్యాయుని పరిధిలోనే సంకుచితంగా నుండేది. పాఠ్యప్రణాళిక, పాఠ్యపుస్తకాలు అమలులోనికి వచ్చిన తరువాత కొంచెం కొంచెం మార్పులు, చేర్పులతో పాఠ్యప్రణాళిక సమగ్రంగా రూపొందుతుందే గానీ, విపరీత మార్పులతో పాఠ్య ప్రణాళిక రూపొందడంలేదు. ఈ అభిప్రాయాన్ని జాతీయ పాఠ్య ప్రణాళికా చట్రం (NCF-2005)

మరియు రాష్ట్రీయ పాఠ్యప్రణాళికచట్రం (SCF-2011) లు కూడా వ్యక్తపరిచాయి. పాఠ్యప్రణాళిక, పాఠ్యపుస్తకాలు రూపొందించేటపుడు కోఠారీ కమీషన్ (1964–66), జాతీయ విద్యావిధానం (1986)లో పొందుపరచిన 10 ముఖ్యాంశాలను సామాజిక పరిసరాలను, ఆర్థికస్థోమతను, వనరుల లభ్యతను, విద్యార్థుల స్థాయి, ఉపాధ్యాయుల నిబద్ధతను దృష్టిలో వుంచుకోవాలని సూచించారు.

NCTE నుండి వచ్చిన సమాచారం, విషయనిపుణులు ఇప్పటి వరకు అమలులో నున్న పాఠ్య ప్రణాళికల సమాచారంతో భవిష్యత్తులో రానున్న సాంకేతిక, సామాజిక మార్పులు వంటివి జోడిస్తారు. ఉపాధ్యాయ ప్రతినిధులు, మేధావులు, విద్యావేత్తలు పాఠ్యప్రణాళిక అమలులో తీరుతెన్నులనుచర్చిస్తారు. పాఠ్యప్రణాళిక స్థాయిని విద్యార్థుల స్థాయికి అనుకూలంగా మలుస్తారు. అవసరమైతే దానిని సరళీకృతం చేస్తారు. అందరి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు విన్న తర్వాత భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు సరియగు మార్పులు చేర్పులు రంగరించి అనుకూలమైన పాఠ్యప్రణాళికను రూపొందిస్తారు.

BFJVGT

### 2.2.6. పాఠ్యపుస్తకాల రూపకల్పన (Preparation of Text Books):

పాఠ్యప్రణాళిక రూపొందించిన వెంటనే దీని కనుగుణంగా పాఠ్యపుస్తకాల రూపకల్పన జరుగుతుంది. ఈ ప్రక్రియ ప్రారంభదశలో ప్రాథమిక తరగతుల పాఠ్యపుస్తకాలు తరువాత మాధ్యమిక, ఉన్నత తరగతుల పాఠ్యపుస్తకాల రూపకల్పన జరుగుతుంది. పాఠ్యపుస్తకాల రూపకల్పనకు ముందుగా ఏయే తరగతులకు, ఏయే పాఠ్యాంశాలు అమలులోనున్నవి, ఏయే పాఠ్యాంశాలు రూపకల్పన జరగాలో ఎప్పటిలోగా జరగాలి వంటి అంశాలతో ప్రభుత్వ అధికారుల నుండి ఆదేశాలు రావాలి.

పాఠ్యపుస్తకాల రూపకల్పనలో సంపాదకులను, రచయితలు, చిత్రకారులు, సాంకేతిక నిపుణులు, అధికారులతో కలసి చర్చించి వివరాలను క్రోడీకరించి, పాఠ్యపుస్తకంలో విద్యార్థుల భాషాస్థాయి, సామాజిక, వైజ్ఞానికస్థాయి వంటి అంశాలు దృష్టిలో పెట్టుకొని పాఠ్యాంశ రచయిత రచన ప్రారంభించాలి. ఆ సబ్జెక్టులో విద్యార్థులకున్నటువంటి జ్ఞానం, మిగతా పాఠ్యాంశాలకున్న సంబంధం, స్వయం అభ్యసనానికి అనుకూలత అంశాలు, ఉదాహరణలు, దృష్టాంతాల (Illustrations) తో విద్యార్థులకు ఉపయోగపడేలా రచన సాగించాలి. తాను రచించిన పాఠ్యాంశాన్ని ఎప్పటికప్పుడు సంపాదకునితో, విషయనిపుణులతో, విద్యావేత్తలతో చర్చిస్తూ చిత్రకారుల ద్వారా అవసరమైన చిత్రాలు వేయిస్తూ రచన పూర్తిచేయాలి.

రచయిత రచించిన పాఠ్యాంశాన్ని సంపాదకునితో పాటు ఎడిటోరియల్ బోర్డు సభ్యులు పరిశీలించి దానిలో విషయ స్పష్టత, నవ్యత ఎంతవరకు వుందో గమనిస్తారు. చిత్రాలను, పట్టికలను, గుర్తులను, సరియైన స్థానంలో వుండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. పాఠ్యపుస్తక రచనలో పాఠ్యాంశంలో కృత్యాలు, ప్రయోగాలకు ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యతనివ్వాలి. ఆ పాఠ్యంశానికి కేటాయించిన సమయం, ఆ పాఠం ప్రాముఖ్యత, నేపథ్యం వంటి అంశాలు దృష్టిలో పెట్టుకొని పాఠ్యాంశాలు రూపకల్పన చేస్తారు.

ఇలా అనేక ప్రాధాన్యతలు, ప్రమాణతలు, విశిష్టతలతో రచింపబడిన పాఠ్యపుస్తకాన్ని ప్రభుత్వ ముద్రణాలయంలో డి.టి.పి.చేసి అందులోని విషయం, చిత్రాల, తప్పొప్పులను సవరించి పాఠ్యపుస్తక విభాగానికి పంపిస్తే వారు విషయనిపుణుల ద్వారా సవరణలు చేసి చివరకు ముద్రణగావిస్తారు.

**పాఠ్యపుస్తకాలపై రాష్ట్ర ప్రణాళికా చట్రం 2011 సూచనలు:**

- పిల్లల అభ్యసన పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకూడదు.
- విద్యార్థుల అంతర్గత శక్తులను వెలికి తేసే విధంగా వుండాలి.
- సామాజిక విలువలు, నమ్మకాలు, సంస్కృతి ఆచార వ్యవహారాలపై శాస్త్రీయదృక్పథాన్ని పెంపొందించేలా పాఠ్యపుస్తకాల రూపకల్పన జరగాలి.
- విద్యార్థి కేంద్రితమై, స్వయం అభ్యసనకు కృత్యాధార బోధనకు అనువుగావుండాలి.

**2,2,7 బోధన మరియు మదింపు ఆచరణలు (Pedagogic and Assessment Practices)**

విద్యార్థుల స్థాయిని అంచనా వేయడం బోధనాభ్యసన ప్రక్రియలో ఒక అంశమని, విద్యార్థులకు మార్కులు, గ్రేడులు కేటాయించడానికి మదింపు అవసరమనే స్థాయికి మన ఉపాధ్యాయులు, విద్యాధికారులు ఆలోచిస్తున్నారు. దానికి రాతపరీక్షలు ముఖ్యమని, వాటి ద్వారానే విద్యార్థుల స్థాయిలను మదింపు చేయవచ్చునంటున్నారు

ప్రస్తుత నిరంతర సమగ్ర మూల్యాంకన (CCE) విధానంలో బోధించే విషయాలు వాటి లక్ష్యాల సాధనపై ఆలోచనలు, అంచనాలను మదింపు చేస్తున్నారు. ఈ పరీక్షా విధానం, ఉపాధ్యాయుల ఆచరణకు కొలబద్దవంటిదని, పాఠ్యాంశాల బోధనాస్థాయికి నిలువుటద్దమని గ్రహించాలి. అంతేకాకుండా విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించేదిగా మదింపు పరీక్షలుండాలి. పరీక్షా విధానం బోధనలో అంతర్భగమే కానీ వేరుకాదు. ఇది సమగ్రమూ మరియు సంచితమై సంపూర్ణమై వుండాలి.

**బోధనాతీరు (Pedagogy)**

విద్యార్థులలో ప్రశ్నించే తత్వం, సవాళ్ళను, నమ్మకాలను, అనుభవాలను ఎదుర్కొనేతత్వం పెంపొందించడమే అభ్యసన ప్రక్రియ అంతరార్థం. విద్యార్థి మూసధోరణిలో పొందుతున్న వివేకం, ఆ సమాచారానికి అతీతంగా ఆలోచిస్తాడు. ప్రతిచర్యకు, ఘటనకు, ప్రక్రియకు, అనుభవాలను జోడించి పాఠ్యాంశానికి, విధానానికి గల అంతరార్థం, మూలం, సామాజిక సందర్భం వంటి పరిణామాలను విద్యార్థులు అవగాహన చేసుకుంటారు. అదే విధంగా అభ్యసన ప్రక్రియ, బోధనా ప్రయోజనాలు వుండేటట్లు బోధనాభ్యాసన ప్రక్రియ కొనసాగాలి. బోధనలో స్థానికవనరులు, పరిసరాల వినియోగం చేసుకుని నూతనత్వంతో జరపాలి. అభ్యసనా ప్రక్రియ ద్వారా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు విద్యను ఆవరించియున్న రాజకీయం అర్థమవ్వాలి. ఉపాధ్యాయనిపై రాజకీయాభిప్రాయాలను, శాస్త్రీయ విజ్ఞానానికి ఇచ్చే రాజకీయ విలువలను, అవగాహన చేసుకొనే సామర్థ్యాన్ని, విద్యార్థులలో కలిగించేలా బోధనాభ్యాసన ప్రక్రియ వుండాలి. బోధన జ్ఞానాన్ని నిర్మించుకునే విధంగా విద్యార్థి ఆలోచనా నైపుణ్యాలు ప్రతిబింబించేలా, గతితార్కిక ఆలోచనల నైపుణ్యాలు సృజనాత్మక నైపుణ్యాలు బోధనలో ఉండాలి.

**మదింపు ప్రక్రియలు (Process of Assessment)**

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని అంచనావేయడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనం ఎంతైనా అవసరం. అది

- విద్యార్థులలో పరీక్షల వలన కలిగే మానసిక ఒత్తిడి మరియు పరీక్షల భయాన్ని పోగొట్టాలి.
- ఉపాధ్యాయుల ప్రణాళిక ద్వారా, బోధనాభ్యసన ప్రక్రియలోనే అంచనాలను అంతర్భాగం చేస్తే విద్యార్థుల అవగాహన పెరుగుతుంది.

- బోధనా సమస్యలను, అభ్యసనా సమస్యలను గుర్తించి, దానికనుగుణమైన పరిష్కారానికి తావివ్వాలి.
- ఉపాధ్యాయులకు బోధన మరియు అంచనాలపై స్పష్టతవుండాలి.
- అభ్యసనా సమస్యలున్న విద్యార్థులను గుర్తించి వారిపై ఏకగ్రాతతో అనువైన బోధన సాగించాలి.
- మదింపు ప్రక్రియ నిర్మాణాత్మక మూల్యాంకనం ద్వారా నిరంతరం కొనసాగించాలి. అది ఉపాధ్యాయుడికి సరియైన బోధనాభ్యసన వ్యూహాలు చేపట్టేందుకు సహాయపడుతుంది. ఉపాధ్యాయుడు వెనుకబడిన విద్యార్థులకు నివారణా బోధన జరిపేందుకు, అంచనాలు వేసేందుకు వీలుకలుగుతుంది.

**పాఠశాలలో ఎలా అంచనాలు వేయాలి (How to Assess in Schools)**

- ఇంటిపనులు (Assignment), ప్రాజెక్టులు (Projects), ఎనక్డోట్స్ (Enectodes)లకు సరియైన మార్కులు/గ్రేడులు కేటాయించి, విద్యార్థులు ప్రతిస్పందించే తీరును డాక్యుమెంట్ల ద్వారా విద్యార్థులకు తెలియజేయడం.
- విద్యార్థులలో ఆలోచనాశక్తిని పెంపొందించేందుకు విశ్లేషణాత్మక ప్రశ్నలకు ఎక్కువ అవకాశం కల్పించడం.
- పాఠ్యాంశాల అంచనా ప్రక్రియలో సహపాఠ్యాంశాల ప్రభావమెంతైనా వుంటుంది. అందుకై సహపాఠ్య కృత్యాల ద్వారా అంచనాలు వేయడం. ఉదా॥ క్రీడలు, ప్రయోగాలు, ప్రదర్శనలు, ప్రాజెక్టులు మొదలగునవి.

**విద్యాహక్కు చట్టం 2009 సూచనలు (Right to Education-2009) Suggestions**

- ప్రాథమికోన్నత తరగతుల వరకూ విద్యార్థులకు బోర్డు పరీక్షలు వుండరాదు. ఉన్నత పాఠశాలానంతరం నిరంతర సమగ్ర మూల్యాంకనానికి అనుగుణంగా పరీక్షలుండాలి,
- పరీక్షల సంస్కరణలు విద్యార్థులకు ఒత్తిడిగానీ, భయాన్ని గానీ కల్గించేవిగా వుండరాదు.
- ప్రాజెక్టులు, ప్రయోగాలు, ఇంటిపని, సహపాఠ్య కార్యక్రమాల వంటి అంశాలకు 50% మార్కులు కేటాయించాలి.
- వ్రాత పరీక్షకు 50% మార్కులు కేటాయించాలి.
- ఆరోగ్యం, భౌతికకళలు, చేతిపని, పని అనుభవం, విలువలు వంటి సృజనాత్మక అంశాలకు బోధనాభ్యసన మరియు అంచనాలలో ప్రాముఖ్యమివ్వాలి.
- మార్కులు విధానానికి బదులుగా గ్రేడింగ్ విధానాన్ని అమలుచేసి విద్యార్థులలో అభ్యసనా యోగ్యతను పెంచాలి.
- పాఠ్య, సహపాఠ్య అంచానాలలో కూడా గ్రేడింగ్ విధానాన్ని అమలు చేయాలి.
- పరీక్షా విధానంలో పుస్తకాలు చూసి రాసే విధానాన్ని (Open Book System) ప్రారంభించాలి.
- పుస్తకాలు చూసి రాసే విధానం ప్రాథమికస్థాయి అనంతరం అమలులో వుండాలి.
- పుస్తకాలు చదివి రాసే విధానం, విద్యార్థులలో ఆలోచనాశక్తిని పెంపొందిస్తూ విశ్లేషణాత్మక, పరిశోధనా సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది.

### 2.2.8. పాఠశాల సంస్కృతి (School Culture)

CPVJJ5

పాఠశాలకు సంబంధించిన నమ్మకాలు, సంబంధాలు, అవగాహనపై వైఖరులు, లిఖిత, అలిఖిత నియమాలు పాఠశాల నిర్వహణపై ఎంతో ప్రభావాన్ని చూపిస్తాయి. పాఠశాల నిర్వహణలో చూపే పెనుమార్పులు, విద్యార్థుల మానసిక, భౌద్ధిక, మౌళికవసతులు, క్రీడామైదానం, కుల, మత, జాతి వైవిధ్యం లేకుండా పాఠశాల నిర్వహణను పాఠశాల సంస్కృతి అంటారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పరిపాలనాధికారులు మరియు సిబ్బంది కలసికట్టుగా కార్యక్రమాలను నిర్వహించడమే గాక, పాఠశాల స్థానిక ప్రజలను ప్రభావితం చేసేటట్లు పాఠశాల పురోగతి చెందడం కూడా పాఠశాల సంస్కృతిలోకి వస్తుంది.

పాఠశాల ధనాత్మక సంస్కృతి పాఠశాల పురోగతికి, పాఠశాల ఋణాత్మక సంస్కృతి పాఠశాల అధోగతికి మార్గాలు చూపిస్తాయి. ఉపాధ్యాయులు వృత్తిపరమైన సంతృప్తి, విద్యార్థులకు అభ్యసనానందం, మౌళికవసతులు, ఆటస్థలం పాఠశాల సంస్కృతిపై ప్రభావాన్ని చూపిస్తుంది. విద్యార్థుల శ్రేయస్సుకు, అభ్యసనా పురోగతికి సహాయపడేదే పాఠశాల సంస్కృతి.

**పాఠశాల సంస్కృతిలో కొన్ని లక్షణాలు (Characterstics of School Culture)**

- విద్యార్థుల, ఉపాధ్యాయుల విజయాన్ని గుర్తించి, ప్రశంసిస్తుంది.
- నిష్కపటం, నమ్మకం, గౌరవం, సంబంధాలను, సంస్కృతిని గౌరవిస్తుంది.
- సిబ్బంది సంబంధాలు, సహకారం, చాతుర్యత ఉత్పాదకతవైపు నడిపిస్తాయి.
- ఉపాధ్యాయులు, సిబ్బంది అంతా వృత్తి నైపుణ్యం కలవారైయుంటారు.
- విద్యార్థులు, ఉపాధ్యాయులు, మరియు సిబ్బంది మానసికభద్రత కలిగియుంటారు.
- పాఠశాల విధానాలు, మరియు సౌకర్యాలు మౌళిక వసతులు విద్యార్థులలో మరింత నమ్మకం, ఆత్మవిశ్వాసం, భద్రతను పెంచుతాయి.
- పాఠశాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల సంస్కృతికి నమూనాగా వుంటారు.
- విద్యార్థులు ఆరోగ్యకరంగా, ఆహ్లాదకరమైన ప్రవర్తనను కల్గివుంటారు.
- పొరపాట్లకు తప్పులకు, వైఫల్యాల క్రింద శిక్షించడం కాక, అభ్యసనావకాశంగా భావిస్తారు.
- ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరంతర విద్యా అంచనాలను ముఖ్యమైన నిర్ణయాలలో ఉపయోగిస్తారు.
- నిర్మాణాత్మకమైన విమర్శలను స్వీకరించి స్వీయ ఆలోచనలను పాటిస్తారు.
- విద్యావకాశాలను, అవసరాలను సమానంగా అందరికీ అందుబాటులో వుంచుతారు.
- విద్యార్థులందరికీ విద్యాసౌకర్యాలను, ప్రయోజనాలను అందుబాటులో వుంచి అందరి విజయానికి బాటలు వేస్తారు.

### 2.2.9 పాఠశాల సంస్కృతిని అభివృద్ధి పరచుకొనే మార్గాలు (Ways to Develop School Culture)

- ఉపాధ్యాయుల ప్రేరణకు నైపుణ్యాల బదలాయింపును ప్రోత్సహించాలి.
- మంచి ఫలితాలకై అందరూ కలసికట్టుగా పనిచేయాలి.

- వృత్తి అభ్యసనా కమ్యూనిటీస్‌ను ఏర్పాటు చేయాలి.
- భిన్న సంస్కృతులను, పండుగలను, ప్రాంతాలవారీగా, అన్ని వర్గాల వారిని గౌరవించాలి.
- విద్యార్థులు తల్లిదండ్రులు, సమాజంలోని వ్యక్తులు పి.టి.ఎ., యస్.ఇ.సి., లకు సముచిత స్థానం కల్పించి వారితో ఒక సలహామండలిని ఏర్పాటుగావించాలి.
- సలహామండలితో సదస్సులు, సమావేశాలు తరచూ నిర్వహిస్తూ వుండాలి.

**పాఠశాల సంస్కృతిని పెంపొందించుటలో భాగస్వాములు (Partners in Shapy School culture)**

పాఠశాల సంస్కృతి అభివృద్ధి చెందాలంటే ఏ ఒక్కరివల్లా కాదు. అలాగే పాఠశాల సంస్కృతిలో నమ్మకాలు,వైఖరులు, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, వేషబాషలు, సమాజ పరిస్థితులు మొదలగు అంశాలెన్నో ముడిపడి వుంటాయి. అలాంటప్పుడు పాఠశాల సంస్కృతి అంటే పాఠశాల పనితీరు, పాఠశాల వసతులు, పాఠశాల వనరులు, పాఠశాల సంబంధాలు, పాఠశాల అవసరాలు పాఠశాల పురోగతి ఇంకా ఎన్నో అంశాలు ఇమిడి వున్నాయి. ఇవన్నీ మెరుగుపడాలంటే ఏ ఒక్కరి వల్ల కానిపని అని అందరికీ తెలుసు. ఎందరి భాగస్వామ్యం వలన పాఠశాల సంస్కృతి వృద్ధి చెందుతుందో అందులో కొందరు విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయుడు, నిర్వాహకులు, అధికారులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు, గ్రామ విద్యాకమిటీ (వి.ఇ.సి.), పాఠశాల విద్యాకమిటీ (యస్.ఇ.సి), తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కమిటీ (పి.టి.ఎ), ప్రాంతీయాధికారులు, రాష్ట్రీయాధికారులు, జిల్లా అధికారులు, ప్రభుత్వం, ఇతర శాఖాధికారులు, వృద్దులు, ప్రౌఢులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, పాఠశాలల్లో సేవా విభాగాలు ఎన్.సి.సి. ఎన్.యస్.యస్. స్కౌట్స్& గైడ్స్, ఎన్.జి.సి., ఎకోక్లబ్‌లు, సైన్స్‌క్లబ్‌లు, గణితక్లబ్‌లు, మాక్ అసెంబ్లీ, మాక్‌పార్లమెంట్, ఎథిక్స్ కమిటీల వంటివి పాఠశాలల్లో సంస్కృతిని మెరుగుపరుస్తాయి.

**2.2.10 ఉపాధాయ్యయుల శిక్షణ మరియు నియామకం (Preparing and Recruiting Teachers)**

విద్యావ్యవస్థలో అందరూ బాధ్యులే. ఎందరు బాధ్యులున్నా విద్యను గ్రహించే విద్యార్థి, విద్యాదాత ఉపాధ్యాయుడు ముఖ్యమైనవారు. వీరిలో ఉపాధ్యాయుడే ముఖ్య భూమిక, కేంద్ర బిందువు. అటువంటి కేంద్ర బిందువైన ఉపాధ్యాయునికి శిక్షణ ఇవ్వటం మరియు నియమించడం రాష్ట్ర ప్రభుత్వపు ఆధీనంలో బాద్యతాయుతంగా జరుగుతుంది.

**2.2.11 ఉపాధ్యాయులను తయారు చేయడం (Preparation of Teachers)**

విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు తప్పనిసరి. తెలుగు రాష్ట్రాలలో అందరికీ విద్య అవసరమని, ఎన్నో పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పాఠశాలకూ పిల్లల నమోదుకనుగుణంగా ఉపాధ్యాయులు అవసరం. పాఠశాలలను మెరుగు పరచడం ద్వారా నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయునికి నిబద్ధత ఎంతో అవసరం. నిబద్దత గల ఉపాధ్యాయులు నవ్యసమాజాభివృద్ధికి తోడ్పడతారు. అటువంటి ఉపాధ్యాయులను సిద్ధం చేయడం రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య లక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ శిక్షణాంశం వుంది. తొలిరోజుల్లో రాష్ట్ర ప్రభుత్వమే ఉపాధ్యాయ శిక్షణా సంస్థలను కూడా నిర్వహిస్తూ వుండేది. రాను రాను శిక్షణ పొందిన ఉపాధ్యాయుల కొరత వలన, ప్రజా ప్రైవేటు భాగస్వామ్యం (పి.పి.పి) నకు తావిచ్చి ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు నిర్వహించుకోవడానికి ప్రైవేటు సంస్థలను కూడా అనుమతించారు. ఇప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు శిక్షణాసంస్థలలో కూడా ఉపాధ్యాయులను సిద్దం చేయడానికి స్థాయికి తగిన

శిక్షణా సంస్థలున్నవి.  అవి

**2.2.12 పూర్వ ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (Pre Primary Teacher Training Institute)**

ఇది పూర్వ ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణనిస్తుంది. ఈ ఉపాధ్యాయులు పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను తీర్చిదిద్దుతారు. ఈ పాఠశాలలో చిన్నపిల్లలకు ఆటపాటలతో ఆటల ద్వారా అభ్యసనం అనే పద్ధతిలో (ప్లేవే) లోయర్ కిండర్‌గార్డెన్ (ఎల్.కె.జి) అప్పర్‌కిండర్‌గార్డెన్ (యు.కె.జి) తరగతుల పిల్లలు నమోదు అయివుంటారు, వీరికి రాయడం, చదవడం వంటివి కాకుండా ఆటలు, పాటలు, ఇతర పిల్లలతో కలిసి ఆడుకోవడం, మాట్లాడుకోవడం, పంచుకోవడం వంటి ప్రవర్తనలు, అలవాట్లు పై ఆచరణలో శిక్షణనిస్తారు ఈ పాఠశాలలు ప్రైవేటు యాజమాన్యాలే.

**2.2.13 ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణా సంస్థ** (Primary Teacher Training Institute)

ఈ సంస్థలలో ప్రాథమిక తరగతులకు శిక్షణనిస్తారు ఈ పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు వుంటాయి. ప్రతి తరగతికీ పాఠ్యప్రణాళికలో పొందుపరచిన అంశాలతో పాఠ్య పుస్తకాలుంటాయి. ఈ ఉపాధ్యాయ శిక్షణాకాలం రెండు సంవత్సరాలుంటుంది. ఇందులో సిద్ధాంతం (థియరీ) ఆచరణాత్మకం (ప్రాక్టికల్) లో ఉపాధ్యాయ శిక్షణార్థులకు D.El.Ed. అనే కోర్సులో బోధిస్తారు. ఇందులో ఉత్తీర్ణత పొందినవారు ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్ 1) వ్రాసి అందులో అర్హత మార్కులు సాధించిన పిమ్మట డి.యస్.సి (District Selection Committee) జిల్లా ఎంపిక కమిటి నిర్వహించే పరీక్ష ద్వారా ఎంపిక చేయబడినవారు ప్రాథమిక ఉపాధ్యాయులుగా నియమింపబడతారు. లేదా జాతీయ స్థాయిలో నిర్వహించే CTET ద్వారా కూడా ఎంపికచేయబడుతారు. గతంలో ఇంటర్వ్యూలను కూడా నిర్వహించేవారు ప్రస్తుతం రాతపరీక్షకే పరిమితమవుతున్నారు.

**2.2.14 ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (Teacher Training Institute)**

ఈ శిక్షణా సంస్థలు ఉన్నత తరగతుల (6–10) విద్యార్థులకు బోధించేందుకు ఉపాధ్యాయులను సిద్ధం చేస్తున్నవి. వీరికి కనీస అర్హత డిగ్రీ పాసైవుండాలి. వీరికి విశ్వవిద్యాలయాలు పాఠ్య ప్రణాళికలు సిద్ధంచేసి పంపిస్తే ప్రభుత్వ ఆధ్వర్యంలో శిక్షణా సంస్థలు అమలు పరుస్తారు. ఈ సంస్థల ద్వారా విద్యా వ్యవస్థపై వృత్తిపరమైన భావాలుగల విద్యార్థులను తీర్చిదిద్ది మంచి నాణ్యమైన విద్యనందించే ఉపాధ్యాయులుగా శిక్షణనిస్తారు.

ఈ ఉపాధ్యాయ శిక్షణా సంస్థలే కాక, శారీరక విద్యా ఉపాధ్యాయుల శిక్షణాసంస్థలు, భాషా పండితుల ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు కూడా నిర్వహించబడుతున్నవి. ఇవి కూడా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలే నిర్వహిస్తున్నాయి. ఇవేకాక ఇంకా ఎన్నో అంశాలలో ఉపాధ్యాయుల కొరకు శిక్షణ సంస్థలు ఏర్పాటు కాబడుచున్నవి. వాటికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పకుండా అవసరం.

**2.2.15. ఉపాధ్యాయ శిక్షణకై ఎంపిక (Selection of Teacher Training)**

నాణ్యమైన, మెరుగైన ఉపాధ్యాయుల కొరకు, బోధనపై అనుకూలవైఖరి కలిగివున్న వారే ఉపాధ్యాయ శిక్షణలో రాణిస్తారు. ఈ ఉపాధ్యాయ శిక్షణార్థుల ఎంపిక కొరకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష (Common Entrance Test) నిర్వహించి అందులో ప్రతిభావంతులనే ఎంపిక చేస్తారు. ఈ ఎంపిక కొరకు D.E.E.C.E.T., Ed.Cet, LP CET అనే వివిధ రకాల ఉమ్మడి ప్రవేశపరీక్షలు నిర్వహించి వివిధ శిక్షణా సంస్థలకు కేటాయించడం జరుగుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ రాతపరీక్షలను ఆన్‌లైన్ లోనే నిర్వహిస్తుండటం గమనార్హం. ఇలా శిక్షణానంతరం వేర్వేరు యజమాన్యాలు నిర్వహించే

పరీక్షల ద్వారా డి.యస్.సి., ఎ.పి.పి.యస్.సి. గురుకుల, మున్సిపల్, నవోదయ, కస్తూరిభా, మోడల్ స్కూల్ లాంటి పరీక్షల ద్వారా ఉపాధ్యాయులను ప్రతిభ ఆధారంగానే ఎంపికచేస్తారు.

**2.2.16 ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపిక** (Recruiting of Teachers)

ఉపాధ్యాయ వృత్తి పరమ పవిత్రమైనది సమాజంలో అత్యంత గౌరవప్రదమైనది. ఈ వృత్తికై ఎన్నికైన వారికి విద్యార్థులతో, అధికారులతో, సమాజంతో సత్సంబంధాలు మెండుగా వుండాలి. అలాగే ఉపాధ్యాయ శిక్షణలో ఉత్తీర్ణులైన వారు అన్ని అంశాలలో పట్టు సాధించి అర్హత మార్కులు సాధించి, నియామక పరీక్షల ద్వారా ఎంపిక కాబడ్డ వారు కావున బోధనాంశాలు, బోధనావృత్తికి న్యాయం చేయగలరని ప్రభుత్వ ఉవాచ. కానీ ఇటీవల కాలంలో ఉపాధ్యాయ శిక్షణలో నాణ్యత లోపించడమో లేక పరీక్షల నిర్వహణలో లోపభూయిష్టమో గానీ ఉత్తీర్ణులైన వారందరూ ఉపాధ్యాయ వృత్తిలో ఆశించిన మేరకు రాణించలేకపోతున్నారు. దీని కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుంభిగించి అర్హతా పరీక్షను కట్టుదిట్టం చేశారు, వృత్యంతర శిక్షణలతో పాటు పరీక్షా విధానంలో మార్పులు తీసుకొని వచ్చారు.

**2.2.17 ఉపాధ్యాయ అర్హత పరీక్ష (Teacher Eligibility Test-TET)**

'మంది ఎక్కువైతే మజ్జిగ పలుచనవుతుందనే ' సామెతను గుర్తుచేస్తున్నట్లుగా వుంది మన ఉపాధ్యాయల తీరు. ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు ప్రైవేటు రంగంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తుండటం దీనికి మరింత ఊతమిస్తుంది. ఉపాధ్యాయ శిక్షణ సంస్థలలో ప్రైవేటు యాజమాన్యం నియంత్రణ సరిగా లేకపోవడం వలన సమాజంలో విలువలు దిగజారుతుండటం, సంస్థల నిర్వహణ తీరు బాగలేకపోవడం తద్వారా ఉపాధ్యాయ శిక్షణలో నాణ్యత కొరవడుతున్న విషయం జగమెరిగిన సత్యం.

ఉపాధ్యాయ విద్యలోను, ఉపాధ్యాయ ఎంపికలోను ప్రతిభావంతులను ఎంపిక చేయాలన్న సత్సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అర్హత పరీక్షల నిర్వహణను తప్పనిసరి చేశాయి. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు టెట్ పరీక్ష ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగానికి అర్హులను జల్లెడపడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షలలో ఎంపిక కాబడిన వారు మాత్రమే ఉపాధ్యాయ ఎంపిక పరీక్షకు అర్హులుగా గుర్తిస్తున్నారు. వీరికి నిర్ణీత గడువులోపల ఎంపిక పరీక్ష ద్వారా ఉపాధ్యాయుల నియామకం చేపడుతుంటారు.

**2.2.18 ఉపాధ్యాయుల ఎంపిక (Selection of Teacher Post)**

ఉపాధ్యాయ విద్యలో ప్రవేశంపొంది, ఉపాధ్యాయ శిక్షణలో ఉత్తీర్ణులైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) లలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగానికి అర్హులు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరు యాజమాన్యాలలో నిర్వహించబడుతున్న ఉపాధ్యాయ ఖాళీలకు వేర్వేరు ప్రకటనలను సబ్జెక్టుల వారీగా, జిల్లాల వారీగా, జోనల్ వారిగా, రిజర్వేషన్‌ల వారీగా, పోస్టుల వారీగా ఖాళీలను నింపేందుకు ప్రభుత్వాలు ప్రకటిస్తాయి. అందులో విద్యార్హతలతో పాటుగా ఉపాధ్యాయ అర్హత పరీక్షలో మార్కులను కూడా పరిగణనలోనికి తీసుకుంటారు. ఈ ప్రకటనలలో అన్ని వివరాలు క్షుణ్ణంగా వుంటాయి. అర్హతలు, ఆసక్తివున్నవారు ఉపాధ్యాయ ఉద్యోగానికి ప్రకటనలలో సూచించిన విధంగా దరఖాస్తు చేసుకోవాలి దరఖాస్తు చేసుకున్న వారికి నిర్ణీత గడువులో ప్రభుత్వం నియమించిన అధికారులు పరీక్ష నిర్వహించి మెరిట్ ఆఫ్ రోస్టర్ (Roaster-cum-Merit) ప్రాతిపధికన ఉద్యోగులను ఎంపిక చేసి కోరుకొన్న ఖాళీలలో నియమిస్తారు.

ఉపాధ్యాయుల శిక్షణ, ఉపాధ్యాయుల అర్హత పరీక్ష, ఉపాధ్యాయుల ఎంపిక, వంటి ప్రక్రియలు ప్రభుత్వ ఎయిడెడ్

పాఠశాలలకే పరిమితమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకంటే ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల సంఖ్య పెగురుతూ వస్తున్నది. అక్కడ విద్యార్థుల చదువులలోనాణ్యత కంటే పరిమాణానికి ప్రాధాన్యత నిస్తున్నారు. ఉపాధ్యాయ శిక్షణలో కూడా పరిమాణమే ముఖ్య లక్షణంగా నాణ్యత కనుమరుగవుతున్న సంగతి కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రైవేటు ఉపాధ్యాయ శిక్షణా సంస్థలతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణాసంస్థలను మెరుగుపరచి పని సంస్కృతిని పెంచగలిగేందుకు ప్రభుత్వం, మేధావులు, నిపుణులతో సబ్జెక్టుఫోరం, నాణ్యతాఫోరం లాంటి పర్యవేక్షక కమిటీలను నియమించాలి.

ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల ఎంపికలో కూడా ప్రభుత్వం చొరవ తీసుకొని మంచి ఉపాధ్యాయులను ఎన్నుకొనే ఆలోచనకు నాందిపలకాలి. ప్రభుత్వం గిరిజనుల దగ్గరకు విద్యను చేరువగా తీసుకొని రావడానికి తెలంగాణ రాష్ట్రంలో అదిలాబాద్ జిల్లాలోను, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం జిల్లాలలో సబ్‌డైట్‌లు ఏర్పాటు చేసి గిరిజనులకు ఉపాధ్యాయ శిక్షణ నివ్వాలని నిర్ణయించింది. వీటన్నింటిని సరిదిద్ది మంచి ఉపాధ్యాయుల ఎంపికకై అందరూ శ్రమించాలి.

ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాలలో సరియైన మౌళిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ల్యాబ్‌లు, లైబ్రరీలు, తరగతి గదులు, ఏర్పాటు చేసి కావాల్సినంత మంది సిబ్బందిని నియమించాలి. అలాగే వీటిపై ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షణ వుండేలా చూడాలి. శాటిలైట్ ద్వారా డిజిటల్ క్లాస్ రూములు , ఇంటర్నెట్ సౌకర్యం, వీడియో కాన్ఫరెన్స్‌లు, మన టివి క్లాసుల ద్వారా ఇతర డైట్‌లతో అనుసంధానం చేయడం ద్వారా మరింత బోధనా అభ్యసన కార్యక్రమాలను, నూతన ఆవిష్కరణలకు అవకాశమేర్పడుతుంది. డైట్‌లలో శిక్షణకు వెబ్‌సైట్‌ల ఏర్పాటు బయట వ్యక్తుల సూచనలకు, సలహాలకు అవకాశమివ్వాలి. దేశ విదేశాలలోని అత్యున్నత విద్యా సంస్థలను గురించి వారు నిర్వహించే కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించే ఏర్పాటు , అనుసరణ జరగాలి. విద్యాశాఖ కమీషనర్ కార్యాలయంలో అన్ని డైట్ కేంద్రాలకు అనుసంధానత వుండాలి. ప్రస్తుతం పర్యవేక్షణాలోపం, సిబ్బంది కొరతతో డైట్‌లు నత్తనడకన శిక్షణనిస్తున్నాయి. వీటిని మెరుగుపరచి సమస్యలును పరిష్కరిస్తే మరింత మెరుగైన నాణ్యమైన విద్యాభ్యాసాన్ని అందించవచ్చును.

DZ78LG

## 2.3 సమాజంలో ఉపాధ్యాయుని స్థితి (Teacher's status in Society)

**గురుబ్రహ్మ: గురుర్విష్ణు : గురుద్దేవో మహేశ్వర : !**

**గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మైశ్రీ గురువే నమ:**

అన్నారు పెద్దలు. అనాదిగా గురువుకు ఎనలేని గౌరవాన్ని తెచ్చిపెట్టిన భారతదేశంలో గురువు స్థాయి అజరామరం. గురువుని సృష్టి, స్థితి, లయ కారకుడైన భగవంతునికన్నా మిన్నగా గౌరవిస్తున్నారు. సనాతన భారతీయ సంప్రదాయం, సంస్కృతిలో ఉపాధ్యాయునికి ఉన్నతస్థానం కల్పించబడింది. మన విద్యావ్యవస్థకు ఉపాధ్యాయుడు నాటికి నేటికీ వెన్నుముక లాంటివాడు. మానవజాతి నిర్మాత, సృష్టికర్త, సమాజపు వాస్తుశిల్పి, రూపశిల్పి ఉపాధ్యాయుడే. ఏదేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీజాతి నిండుగౌరవము నిలుపరా నీ ఖ్యాతి మంచి ఉపాధ్యాయులచే. కావున ఏదేశమైనా సరే సుఖశాంతులతో ఉన్నత స్థాయిలో వుండాలంటే ఆదేశపు ఉపాధ్యాయల సుఖశాంతులు, ఉన్నతస్థాయితోనే సాధ్యమవుతుందని అర్థమవుతుంది.

ఉపాధ్యాయుని వ్యక్తిగత లక్షణాలు, విద్యార్హతలు, శిక్షణ, పాఠశాలలో తనస్థానం, దాని ప్రభావం, పాఠశాల ఖ్యాతిని పెంపొందిస్తుంది. దాని ప్రభావం అక్కడి ప్రజల జీవితాలపై స్థిరంగా వుంటుంది. అంతేగాక దాని ప్రభావం ఉపాధ్యాయుడు పనిచేసే తీరుపైనే ఆధారపడి వుంటుంది. అందుకు ఉపాధ్యాయుని స్థాయికి సంబంధించిన అన్ని

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత నివ్వాలని సెకండరీ విద్యాకమీషన్ (1952-53) వివరించినది. కొఠారి కమీషన్ సిఫార్సుల ప్రకారం, భారత ప్రభుత్వం ఉపాధ్యాయుని స్థాయిపై స్పష్టతనిచ్చింది.

- నాణ్యమైన విద్య మరియు దేశాభ్యుదయ సహకారానికి తోడ్పడే అంశాలలో నిస్సందేహంగా మొదటి వాడు ఉపాధ్యాయుడే.
- విద్యాపరమైన ప్రయత్నాలలో ముఖ్యమైనవి ఉపాధ్యాయుని వ్యక్తిగత లక్షణాలు మరియు వృత్తిపరమైన సామర్థ్యాలు.
- ఉపాధ్యాయునికి సమాజంలో సముచిత స్థానం కల్పించాలి. అతని అర్హతలు మరియు బాధ్యతలకు సంతృప్తినిచ్చి, చాలినంత జీత భత్యాలు, సేవా పరిస్థితులను కల్పించబడాలి.
- ఉపాధ్యాయ విద్య ముఖ్యంగా వృత్యంతర విద్యకు ప్రాధాన్యతనివ్వాలి. ( భారతీయ విద్యావిధానం (ఎన్.పి.ఇ) 1986 ప్రకారం).
- సమాజం యొక్క సాంస్కృతిక ధర్మాలను ప్రతిభించింపజేసేది ఉపాధ్యాయుని స్థాయే. ఏ వ్యక్తీ తన ఉపాధ్యాయుని స్థాయిని అధిగమించలేడు.
- నిర్మాణాత్మకంగా మరియు సృజనాత్మకంగా వుండేందుకు ఉపాధ్యాయులలో స్ఫూర్తి నింపేందుకు, వారిని చైతన్యపరచేందుకు, పరిస్థితులను అధిగమించిడానికి ప్రభుత్వం మరియు సమాజం తప్పక ప్రయత్నించాలి.
- నూతన ప్రసార పద్దతులు కనుగొనేందుకు ఉపాధ్యాయులకు స్వేచ్ఛ వుండాలి. వారి జీతభత్యాలు పెంచి వారి అవసరాలను గుర్తించాలి.

**యునెస్కోవారి (ILO) మాటల్లో:**

- ఉపాధ్యాయుని స్థాయి అతని విద్యలో పురోగతి, విద్యార్హత మరియు సామర్థ్యం, ముఖ్యంగా వారి మానవత్వం, వ్యక్తిత్వం, బోధన మరియు సాంకేతిక లక్షణాలపై ఆధారపడి ఉంటుంది.
- ఉపాధ్యాయుని స్థాయి, ప్రాముఖ్యతను గుర్తించి విద్యా వేత్తలు, పరిపాలనాధికారులు, సామాజిక వేత్తలు, తల్లిదండ్రులు మరియు విద్యతో సంబంధమున్న అందరూ ఉపాధ్యాయుని వృత్తి స్థాయిని మరింత ఇనుమడింపజేయాలి.

**ఉపాధ్యాయుని స్థితి అంటే :** ఏదైనా ఒక వృత్తిలోనున్న వారికి సమాజం ఇచ్చే గౌరవం లేక ప్రతిష్టను ఆ వృత్తికిచ్చే స్థాయి అంటారు. ఉపాధ్యాయుని స్థితి అంటే ఉపాధ్యాయుడు నిర్వహించే విధుల ప్రాముఖ్యతను దాని ప్రతిభను గుర్తించి, సేవా పరిస్థితులు, జీతభత్యాలు, ఇతర ప్రయోజనాలతో కలిపి సమాజం అతనికిచ్చే కితాబు లాంటిది.

ఉపాధ్యాయుని స్థితి నిర్ణయించడానికి అనేక కారకాలు, కారణాలు, గుణాలున్నప్పటికి ఉపాధ్యాయుని స్థాయిని 4 రకాలుగా వర్గీకరించవచ్చు. అవి

1. అకడమిక్ స్థితి 2. వృత్తి స్థితి 3. ఆర్థిక స్థితి 4. సామాజికస్థాయి

అకడమిక్ స్థితి అంటే వృత్తిపై సాధారణ అవగాహన మరియు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించడానికి అవసరమైన అర్హతలలో కనీస విద్యార్హతలు, వాటితోపాటు వృత్యంతర శిక్షణ మరియు వృత్తిలో అర్హతలు పెంచుకోవడం.

ఆర్థిక స్థితి అంటే జీతభత్యాలు, వైద్య సదుపాయాలు, వసతి సదుపాయాలు, విశ్రాంతి సౌకర్యాలు, ఉపాధ్యా

సంక్షేమ నిధులు వంటి ఆర్థిక లావాదేవీలతోపాటు బడిపంతులు బ్రతకడానికి అవసరమయ్యే అన్ని ఆర్థికాంశాలను మెరుగుపరచుకోవడంలో ఉపాధ్యాయుని స్థాయి కనిపిస్తుంది.

వృత్తిస్థితి అంటే సేవాపరిస్థితులు, సర్వీసు వివరాలు, ఉపాధ్యాయవృత్తి పని స్వభావం, సంఘాలతో సత్సంబంధాలు, పదోన్నతులు, హెూదాలాంటి వారిలో ఉపాధ్యాయుని స్థాయిని అంచనావేయవచ్చును.

సామాజికస్థితి అంటే ఉపాధ్యాయులు సమాజానికి అందించే అన్ని రకాల సేవలకు ప్రజల నుంచి లభించే నిజమైన గుర్తింపు.

### 2.3.1 భారతదేశంలో ఉపాధ్యాయుని స్థితి (Teachers Status in India)

భారత దేశంలో ఉపాధ్యాయునికి ఎంతో గౌరవముండేది. స్వతంత్ర్య భారతావనిలో శిక్షణపొందిన వారికంటే శిక్షణ పొందని ఉపాధ్యాయులే ఎక్కువగా వుండేవారు. కాలానుగుణంగా విద్యా సంస్థలు పెరిగి, విద్యార్థులు పెరగడంతోపాటు ఉపాధ్యాయులు కూడా పెరగడంతో వారికి శిక్షణనిచ్చే సంస్థలు కూడా పెరిగినాయి. ఎ.పి.పి.ఇ.పి., డి.పి.ఇ.పి., యస్.యస్.ఎ. వంటి ప్రాజెక్టులే కాకుండా ఎన్నో ఎజెన్సీల సహకారంతో పాఠశాల భవనాలు నిర్మించడమే గాకుండా వాటికి అన్ని వసతులు కల్పించబడ్డాయి.

చాలా రాష్ట్రాలలో ఉపాధ్యాయుల జీతభత్యములు పెరిగాయి. జీతభత్యాలే గాకుండా ఉపాధ్యాయుల ఆరోగ్య సదుపాయాలు, ఇంటి అద్దె సదుపాయాలు, గిరిజన, పట్టణ, ప్రాంతాలలో ప్రత్యేక సేవలు, ఉపాధ్యాయులకు అవసరమైన అన్ని రకాల వసతులను, సదుపాయాలను సమకూర్చుతున్నారు. ఉపాధ్యాయుల పిల్లల చదువులోను, వివాహ సమయంలోను, సంతాన పాలనలో, ఆర్థిక సహాయం చేస్తుంది. అంతేగాక వారి సమాజ సేవలను కూడా గుర్తించి ప్రతిభావంతులకు రాష్ట్ర మరియు జాతీయ అవార్డులతో సత్కరిస్తున్నారు.

- ఆవిష్కరణలకు, ప్రయోగాల నిర్వహణకు ఉపాధ్యాయులకు పురస్కారాలిస్తున్నారు.
- ఉపాధ్యా దినోత్సవ వేడుకలను జరుపుకొని ఉపాధ్యాయులను సత్కరిస్తున్నారు.
- ముఖ్యమైన విధులు–ఓటర్ల నమోదు, పల్స్‌పోలియో, ఎన్నికల విధులలోను ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకుంటున్నారు.
- ఉపాధ్యాయ సంఘాల నిర్మాణం, విస్తరణ, సేవలకు అవకాశమిస్తున్నారు.
- చాలా ఉపాధ్యాయ సంఘాలు వారు వార పత్రికలు, మాసపత్రికలు, బులిటెన్లు మరియు వార్తలను ప్రచురిస్తున్నారు.
- చాలా సంఘాలు ఉపాధ్యాయ సంక్షేమ సమస్యలు మరియు బోధనాభ్యాసన అంశాలపై చాలా కృత్యాలను, సదస్సులను, సమావేశాలను సిర్వహిస్తున్నారు.
- పరిపాలనా విధానంలో పాలుపంచుకోవడానికి కొన్ని రాష్ట్రాలలో ఉపాధ్యాయ యం.ఎల్.సీలను కూడా కేటాయిస్తున్నారు.

జాతీయ విద్యావిధానం 1986 సిఫార్సుల అనంతరం ఉపాధ్యాయుని స్థితిని పెంచడానికి భారత ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది.

## 2.3.2 ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం (Orientation Programme to Teachers)

వృత్తి పూర్వక, వృత్త్యంతర శిక్షణల ద్వారా చాలామంది ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. అంతేగాక జాతీయ విద్యావిధానం 1986 ప్రకారం ఉపాధ్యాయుల్లో నైపుణ్యాల అభివృద్ధి కొరకు యస్.ఓ.పి.టి., ఎ.పి.పి.ఇ.పి., ద్వారా బోధనా మెళుకువలు పెంపొందించడం, డి.పి.ఇ.పి. ద్వారా బోధనాభ్యసన సామాగ్రిని రూపొందించడం, ఓ.బి.బి. ద్వారా బోధనా కిట్‌లను అందజేయడం, వాటిని వినియోగంచడంలో నైపుణ్యాల్ని పెంపొందించడం లాంటి వృత్త్యంతర (ఇన్‌సర్వీస్) శిక్షణాకార్యక్రమాలు ఉపాధ్యాయుల స్థాయిని పెంపొందించడంలో ఎంతగానో తోడ్పడ్డాయి. అదేవిధంగా చాలా పాఠశాలలకు యస్.యస్.ఎ. ద్వారా ఆటవస్తువులు, సైన్స్‌కిట్స్, మ్యాథ్స్‌కిట్, పిల్లలకు నచ్చే కథలు, ఇతర పుస్తకాలను సమకూర్చడం జరిగింది. ఈ పథకం ద్వారా ఎక్కువ పాఠశాలలు నిర్మించి, కనీస వసతులు కల్పించబడినది.

ఉపాధ్యాయ వృత్తి స్థాయిని పెంచడానికి DIET, SCERT, ELTC వివిధ కార్యక్రమాలను ప్రతిఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. QUIP, CLAP లాంటి వాటితో పాటు ప్రస్తుతం సిసి.ఇ (నిరంతర సమగ్ర మూల్యాంకనము) పై అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేసి గ్రేడింగ్ విధానాన్ని, మెళుకవుల్ని పెంపొందిస్తున్నారు. అలాగే ఉపాధ్యాయుల్లో యోగ, ధ్యానం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచి తద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని ఇనుమడింపజేస్తున్నారు. భాషాసామర్థ్యాలను, గణిత, సైన్సు, కంప్యూటర్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా క్రమానుగతంగా అందజేస్తున్నారు. కేంద్రస్థాయిలో ఎన్.సి.ఇ.ఆర్.టి. రాష్ట్ర స్థాయిలో యస్.సి.ఇ.ఆర్.టి. జిల్లా స్థాయిలో డైట్స్ అనేక వృత్తిపూర్వక, వృత్త్యంతర శిక్షణాకార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయుల సామర్థ్యాలను మెరుగుపరుస్తూ వారి స్థితిని పెంపొందిస్తున్నారు.

**విధానపూర్వక సమస్యలు**

ఉపాధ్యాయుల స్థాయిని ఎంత గొప్పగా చెప్పినా, ఎన్నికమీషన్లు ఎంత గొప్పగా సిఫార్సులు చేసినా వ్యవస్థలో మాత్రం ఉపాధ్యాయుని స్థితి దినదినానికి దిగజారుతోందని చెప్పుకోవాలి. కొన్ని దశాబ్దాల నుండి పరిశీలిస్తే, నానాటికీ దిగజారుతున్న ఆనవాళ్ళు, దిగజారిన ఉపాధ్యాయ సేవాపరిస్థితులు, తగ్గుతున్న గౌరవ మర్యాదలు, విపరీతంగా పుట్టగొడుగుల్లా పెరిగిపోతున్న ప్రైవేటు విద్యా సంస్థలు, వ్యవస్థలు, ఉపాధ్యాయ శిక్షణలో నాణ్యత లోపించడం, విధులపట్ల నిర్లక్ష్యం, పర్యవేక్షణాలోపం, ఉపాధ్యాయ సంఘాల పేరిట వృత్తి విలువలకు తిలోదకాలివ్వడం వలన, వ్యక్తిగత లాభాలకే పోరాడుతుండటం, మరియు ప్రాధాన్యమివ్వడం, విద్యా వ్యవస్థనంతా కొందరి గుత్తాదిపత్యంలో నడుపబడటం, అభివృద్ధి పేరిట విద్యార్థులకు మార్కులు, గ్రేడులు సంపాదించడానికి అడ్డదారులను సహితం ప్రోత్సహించడం, స్వేచ్ఛ ముసుగులో వ్యక్తిగత ప్రయోజనాల కోసం అనేక సంఘాలు ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయ సంఘాలు వృత్తిపై ఏర్పడ్డ మచ్చల్ని వేరే వారిపైన బురదజల్లడం లాంటి కార్యక్రమాలతో ఉపాధ్యాయ వృత్తిని మరింత దిగజార్చుతున్నారు. ఉపాధ్యాయ సంఘాలు ఏర్పాటు చేయడం ఒక ఉద్దేశ్యమైతే ఆచరణలో అవి మరోకోణంలో పనిచేయడం వలన పరస్పర వాదనలతో, వృత్తిపైనే

చిన్నచూపు చూసేందుకు అవకాశం కల్పించడం వంటి అనేక అంశాలు ఉపాధ్యాయునికి సమాజంలో విలువలు తగ్గిస్తూ వస్తున్నవని అంగీకరించాల్సివుంది. అదే స్థాయిలో ఉపాధ్యాయ వృత్తిస్థాయి కూడా దిగజారుతోందని చెప్పాలి.

**2.3.3. ఉపాధ్యాయ వృత్తి స్థాయిని పెంచడానికి కొన్ని సూచనలు**

- ఉపాధ్యాయ శిక్షితులను విద్యార్హతతో పాటు, ఉపాధ్యాయ వృత్తిపై నమ్మకం, గౌరవం, అభిమానం వుండేలా ధనాత్మక దృక్పథం వుండేవారిని ఉపాధ్యాయ శిక్షణకై ఎంపిక చేయాలి.
- ప్రత్యేక మరియు క్రియాత్మక అవసరాలకు ప్రాధాన్యాతనిస్తూ నిష్పాక్షికంగా నిర్ణయాలు తీసుకోవాలి.
- ఉపాధ్యాయ పదోన్నతి మరియు ఉద్యోగాభివృద్ధికి అవకాశాలు కల్పించాలి. అప్పుడే కావలసినంతమంది నైపుణ్యం మరియు అంకిత భావం గల అభ్యర్థులు వృత్తిపట్ల ఆకర్షితులౌతారు. వారికి నాణ్యతగల ఉపాధ్యాయ శిక్షణను అందించవచ్చును.
- అన్ని విద్యాసంస్థలకు మరుగుదొడ్లు, నీటివసతి, ఫర్నీచర్, టి.ఎల్.యం. విద్యుత్ సౌకర్యం వంటి మౌళిక వసతులు కల్పించడం తప్పనిసరి.
- ఉపాధ్యాయులకు బోధనతో సంబంధం వుండే కార్యకలాపాలలో భాగస్వామ్యం కల్పించబడాలి.
- అవసరానుగుణ్యంగా విషయ సామర్థ్యాలను, నైతిక విలువల్ని, సాంకేతిక నైపుణ్యాల్ని పెంచుకునేందుకు అవకాశం కల్పించాలి.
- నిర్ణీత కాలంలో చేయవలసిన కార్యకలాపాలను సక్రమంగా చేసేలా ఉపాధ్యాయుల్ని ప్రోత్సహించాలి.
- ఉన్నత అధ్యయనానికి వేతనంతో కూడిన సెలవులను మంజూరు చేయాలి.
- ఉన్నత చదువులకు, విలువలకు, అభివృద్ధి మార్గాలకు అవకాశమివ్వాలి.
- ఉపాధ్యాయ కుటుంబాలకు చేయుతనివ్వాలి, వారిక్షేమాన్ని కాంక్షించాలి.
- ప్రభుత్వ విద్యాపరమైన పాలనకు సంబంధించిన ఉద్యోగాలకు పాఠశాలల్లో ప్రత్యక్ష అనుభవం వున్న వారికి అవకాశమిస్తే వారు వృత్తికి తగిన న్యాయం చేయగలరు.
- ఉపాధ్యాయుల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ మెరుగులు దిద్దుతూ అన్ని రంగాల్లో వారికి నైపుణ్యాల్ని అవకాశాల్ని కల్పించబడటం ద్వారా వారి స్థాయిని మరింత ఇనుమడింపజేయవచ్చు.

**2.3.4 అధికారకత్వం**

విద్యావ్యవస్థలో అధికారికత్వం లేకపోతే ఏ కార్యక్రమం సాఫీగా జరగదు. అలాగే ఉపాధ్యాయ వృత్తి స్థాయి కూడా. ఉపాధ్యాయ వృత్తి స్థాయిని పెంపొందించడానికి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సమాజం, సంఘాలు ప్రభుత్వాలు అనుకూలమైన సూచనలివ్వడం మనం గమనించాం. ఈ సూచనలను అమలు చేయాలంటే అధికారికత్వపు ఆమోదముద్ర తప్పనిసరి. అందుకు తగిన సూచనలు.

- ఉపాధ్యాయ వృత్తి స్థాయి పెరిగేందుకు అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలి. దీనికై ఉపాధ్యాయ శిక్షణ నాణ్యత, నైపుణ్యాలతో వుండాలి. అందుకు ఉపాధ్యాయ విద్యార్థులకు శిక్షణిచ్చే అధ్యాపకుల సామర్థ్యం నిబద్ధత ఎంతో అవసరం.

- 20 సంవత్సరాలుగా డైట్ కళాశాలల్లో బోధనా సిబ్బందిని నియమించాలి.
- ఉపాధ్యాయులకిచ్చే బహుమతులు నిబద్ధతతో ఇవ్వాలి.
- డైట్ కళాశాలలను సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించాలి.
- ఉపాధ్యాయ సంఘాలు పరిమితంగా ఉంటూ చిత్తశుద్ధితో పనిచేసేలా చూడాలి.
- సర్వశిక్షా అభియాన్ నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలి. అధికారుల మధ్య సమన్వయం ఉండాలి.
- హెడ్మాస్టర్, యం.ఇ.ఓ., డిప్యూటి డి.ఇ.ఓ, డి.ఇ.ఓ., ఆర్.జె.డి., జె.డి., డైరెక్టర్ లాంటి గెజిటెడ్ పోస్టులలో కీలకమైన నిజాయితీపరులకు పదోన్నతి లభించేలా చూడాలి. వారిపై అజమాయిషీ వుండాలి.
- అధికారుల కార్యకలాపాలను ఆన్‌లైన్‌లో వుంచుతూ ప్రధాన కార్యాలయల్లో సి.సి. కెమెరాలను ఏర్పాటు చేయాలి.
- విద్యాశాఖను మొత్తం ఆధునిక వసతులతో అభివృద్ధిపరిస్తే అవినీతి రహిత పాలనను, అధికారికత్వాన్ని చవిచూడవచ్చును.

## 2.4 విద్యలో సమాజం మరియు పౌరసమాజ సంస్థల పాత్ర – సంక్లిష్ట విశ్లేషణ (Role of Community and Civil Society Organizations in Education-A Critical appraisal)

అందరికి విద్య (ఎడ్యుకేషన్ ఫర్ ఆల్) భావన ప్రబలిన తరువాత అన్ని రకాల ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంఘాలు విద్యతో సంబంధాలు పెంచుకోవాలని పౌర సమాజంలో అవగాహన ఏర్పడింది. ఈ నినాదాన్ని ఉపాధ్యాయ సంఘాలు, మత సంస్థలు, ధార్మిక సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కుల సంఘాలు, పరిశోధనా సంస్థలు, తల్లిదండ్రుల కమిటీలు, వృత్తి సంఘాలు, విద్యార్థి సంఘాలు, సామాజిక ఉద్యమకారుల వంటి వారందరూ సాకారం చేయడంలో పాల్గొనుటం శ్రేయస్కరం.

### 2.4.1. విద్యలో పౌరసమాజపు పాత్ర (Role of Civil Society in Education)

డాకార్ ముసాయిదా ప్రకారం జాతీయస్థాయిలో ప్రభుత్వాలు, పౌర సమాజం మరియు అందరికీ విద్య భాగస్వాములతో కలసి విధానపర నిర్ణయాలకై చర్చోపచర్చలు జరగాలి. రాష్ట్రం ఏ అంశాలలో నైతే సేవలందించడానికి విఫలమవుతుందో ఆ అంశాలను మరీ పట్టుబట్టి చర్చించడానికి, అట్టడుగు ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్థానిక సంస్కృతి తెలిసిన పౌరసమాజం అనువైన నిర్ణయాలు తీసుకోగలదు. సాధికారత, సమాజ పాఠశాలలు, పునరుత్పత్తి– ఆరోగ్యం, పూర్వ బాల్య విద్య (Early Childhood Education) వంటి అంశాలలో సమాజం పాలుపంచుకోవడం ఎంతైనా అవసరం. దీనికి పౌరసమాజం సమర్థవంతంగా విలువనివ్వగలదు, నిర్వహించగలదు.

సేవాతత్పరులు, సేవలందించేవారు, నూతన భావాలు ఆవిష్కరించే వారు, వాటిపై అనుభవం గలవారు, అందరికీ విద్య మద్దతుదారులు, సద్విమర్శకులు, విభిన్న రకాలకు చెందిన వారు అందరూ కలసికట్టుగా సమన్వయంతో అందరికీ విద్యాభివృద్ధి సమస్యలపై ప్రభుత్వంతో మంతనాలు జరిపి, అందరికీ ఉచిత నిర్బంద, నాణ్యమైన విద్యపై మద్దతు ప్రకటిస్తున్నారు.

### 2.4.2 అందరికీ విద్యపై ప్రభుత్వేతర సంస్థల సముదాయం – విస్పష్టపాత్ర (Collective consultation of NGO's on Education for all)

అందరికీ విద్య ప్రాధాన్యం అమూల్యమైనది. ఒక దేశంలో పౌరులందరు విద్యావంతులయినప్పుడే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సాంస్కృతికంగా ఆ సమాజం పురోగమిస్తుంది. ఏ సమాజమైనా సర్వతోముఖంగా వికసించాలంటే దానికి మొదటి మెట్టు ఆ సమాజంలో అందరూ విద్యావంతులై ఉండాలి. మన రాజ్యాంగ నిర్మాతలు విద్య ప్రాముఖ్యాన్ని సరిగా గుర్తించారు. కనుకనే రాజ్యాంగం ప్రారంభమైన పదేళ్ళకే 14 సం॥ల లోపు బాలబాలికలందరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య నందించాలని పేర్కొన్నారు. నేటికీ ఆ లక్ష్యం నెరవేరలేదు.

దేశవ్యాప్తంగా 6-14 సం॥ల పిల్లలందరికీ ప్రాథమిక విద్య హక్కుగా సంక్రమింపజేస్తూ రాజ్యాంగాన్ని 86వ సారి ప్రభుత్వం సవరించింది. ఈ సవరణ మేరకు “ పిల్లలందరికీ చదువు ” కోసం రాష్ట్రాల భాగస్వామ్యంతో “ సర్వశిక్షా అభియాన్” కార్యక్రమం రూపొందించింది. సంపూర్ణ అక్కరాస్యత సాధించడానికి చాలావరకు దోహదపడింది. అయిననూ ఇంకా చాలామంది నిరక్షరాస్యులుగా మిగిలిపోయారు.

EEQ3MS

1948 డిసెంబర్ 10 నాటి మానవ హక్కుల ప్రకటన “ ప్రతి పౌరుడికి విద్యాహక్కు ” ఉందని ఘోషించింది. పౌరులందరినీ విద్యావంతుల్ని చేయడం ప్రభుత్వాల బాధ్యత అని కూడా ఐక్యరాజ్యసమితి ఆ డిక్లరేషన్‌లో స్పష్టం చేసింది. అన్ని కమిటీలు నివేదికలు సూచించినా “అందరికీ విద్య” అందని మామిడిపండుగానే మిగిలిపోయింది.

అందరికీ విద్య నందించడంలో ప్రభుత్వాలు విఫలమైన మాట వాస్తవం. పౌరులను విద్యావంతులుగా చేసే భాధ్యత ప్రభుత్వానిదే అనడమూ నిర్వివాదమే. అయితే కేవలం ప్రభుత్వాన్ని నిందించినంత మాత్రాన ప్రయోజనం సిద్దించదు. ప్రభుత్వేతర వ్యక్తులు, స్వచ్ఛంద సేవా సంస్థలు ఇలా ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే మనం సంపూర్ణ అక్షరాస్యతా లక్ష్యాన్ని చేరుకోగలం.

“Education is an ornament in prosperity and a refuse in adversity”. - Aristotle.

### 2.4.3 అందరికీ విద్య సాధనలో ఎన్.జి.ఓ.ల పాత్ర

- అందరికీ విద్యను సాధించడానికి విద్య ఆవశ్యకతపై విసృతంగా ప్రచారం చేయాలి. అందరికీ అర్థమయ్యే విధంగా వివరించి చెప్పాలి.
- అందరికీ విద్య లో పౌర సమాజపు పాత్రను గుర్తించి నెరవేర్చాలి.
- పర్యవేక్షణ, మూల్యాంకనంలో పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహింపజేయాలి.
- ప్రాంతీయ, రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ, విద్యావిధానాలు మరియు కార్యక్రమాలపై అవగాహన కల్గించాలి.
- ప్రతి గ్రామంలోను అక్షరాస్యతా కేంద్రాలను ఏర్పాటుచేయాలి.
- చదువుకున్న, చదువుకుంటున్న బాలబాలికల ద్వారా సాక్షరతా మిషన్‌ను విజయవంతంగా నిర్వహించాలి.
- వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా విద్య ఆవశ్యకతను ఆవిష్కరిస్తూ ప్రచారం చేయాలి.
- బడిమానివేసిన పిల్లల కుటుంబనేపథ్యాలను తెలుసుకొని వారిని ప్రోత్సహిస్తూ ప్రాథమిక విద్య వరకు దత్తత తీసుకోవాలి.
- పిల్లల చదువు గురించి పెద్దవారికి అర్థమయ్యే రీతిలో ప్రచారంకల్పించాలి.
- ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ విద్యను అందిస్తూ సాంఘీకీకరణకు దోహదం చేయాలి.

- విద్యార్థులకు సామాజికాంశాలు, సహజీవనం, సమాజసేవ వంటి విషయాలు నేర్పాలి.

ఇవేగాక మత సంస్థలు, కుటుంబం, సంఘాలు, సాంఘికక్లబ్‌లు, సినిమాలు, రేడియో, టెలివిజన్, దినపత్రికలు, గ్రంథాలయాలు, మ్యూజియంలు, వినోదకేంద్రాలు, సాంస్కృతిక సంస్థలు, యువజన సంఘాలు, మహిళాసంఘాలు, డ్వాక్రా సంఘాలు, బహుళ ప్రసారమాధ్యమాలు, పాఠశాలేతర సంస్థలు, సార్వత్రిక పాఠశాలలు, వయోజన కేంద్రాలు అక్షరాస్యతా కేంద్రాలు, అనియత సంస్థలు, యాదృచ్ఛిక సంస్థలు, వాలంటీర్ల కేంద్రాలు మొదలైనవి కూడా సార్వజనీన విద్యకు దోహదపడుతున్నాయి.

### 2.4.4 ప్రభుత్వం అవలంభించవలసిన వ్యూహాలు (Government can implement the Strategies)

ప్రభుత్వం క్రింద కనపరచిన కార్యక్రమాలను వ్యూహాత్మకంగా అమలుపరచాలి. అపుడు ఉపాధ్యాయుని స్థితిని పెంపొందించినవారమవుతాము

- స్వేచ్ఛా వాతావరణ విధానాన్ని అనుసరించాలి.
- సామరస్యపూర్వక సంబంధాల మేళవింపు విధానాన్ని అవలంభించాలి.
- ప్రాపక, క్రియాశీలక నిశ్చయాలను ప్రకటించాలి.
- పౌర సమీకరణ విధానం, పౌర అవగాహన కార్యక్రమాలను చేపట్టాలి.
- ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సాంప్రదాయాలను కలుపుకొని పోవాలి.
- మంచి సమాజాన్ని కుటుంబం యూనిట్‌గా అభివృద్ధి పరచాలి.
- విద్యార్జనతో పాటు, సాంఘికీకరణాన్ని చైతన్యపరచాలి.
- నాగరికతను పెంపొందించి సామాజిక వ్యవస్థలను మెరుగుపరచాలి.
- విద్యాశయాలైన పౌరసత్వ లక్షణాలతోపాటు మంచి కుటుంబ లక్షణాలు పెంపొందించాలి.
- పిల్లల అభివృద్ధి, వికాసాలకు కుటుంబం, సమాజం సరైన రీతిలో స్పందించేటట్లు వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి.
- స్వేచ్ఛాయుత కుటుంబాలలో పిల్లలకు చక్కటి ప్రోత్సాహం, స్వేచ్ఛలభించేటట్లు ప్రేరేపించి మనోధైర్యాన్ని నింపి తద్వారా చక్కటి ప్రగతిని సాధింపజేయాలి.
- పిల్లల ప్రగతిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలి.
- పాఠశాలల్లోకి పిల్లలు ఉత్సాహంతో వచ్చేలా అందరినీ భాగస్వాముల్ని చేయాలి.
- పాఠశాలల్లో జరిగే అన్ని కార్యక్రమాల్లో తల్లిదండ్రులను బాధ్యతగా ఆహ్వానించాలి.
- పి.టి.ఎ., యస్.యం.సి., లను ఏర్పాటు చేయాలి. వాటిని సక్రమంగా నిర్వహించాలి.

పై విధంగా అనేక కార్యక్రమాలను వినూత్నంగా చేపట్టడం ద్వారా సమాజంలో విద్యాభివృద్ధిని సాధించవచ్చునని గట్టి నమ్మకం. అటు ప్రభుత్వాధికారులకు, పౌరసమాజాలకూ, ఎవరి వ్యూహాలు వారికున్నప్పటికీ విద్య అందరికీ

అవసరమని, వాని పురోగతికి ఉపాధ్యాయుని స్థాయిని పెంచేందుకు కృషి జరగాలి. నూతన విధాన ప్రక్రియలో సామాజిక జవాబుదారీతనానికి, పారదర్శక ప్రభుత్వాల ఏర్పాటుకు అధికారత్వం, పౌరసమాజం కలసికట్టుగా ముందుకు సాగితే ఉపాధ్యాయుని స్థాయి అన్ని అంశాలలో తప్పక వృద్ధి చేయవచ్చును.

## మూల్యాంకనము

1. విద్యా లక్ష్యాలపై రాజకీయ కారకాలను వివరించి, విద్యారాజకీయ స్వభావాన్ని సోదాహరణంగా వివరించండి?
2. పాఠశాల సంస్కృతిని ఉదాహరణపూర్వకంగా వివరించండి.
3. ఉపాధ్యాయుల శిక్షణ మరియు నియామకం గురించి రాయండి.
4. సమాజంలో ఉపాధ్యాయుని నేటి స్థితిని వివరిస్తూ, ఉపాధ్యాయ వృత్తి స్థితిని మెరుగుపర్చడానికి గల ఆటంకాలను తెల్పండి.
5. విద్య – సమాజం మరియు పౌరసమాజం యొక్క పాత్రను సమీక్షించండి.

### లఘుసమాధాన ప్రశ్నలు

1. విద్యాధ్యేయాలను గురించి రాయండి.
2. పాఠ్యపుస్తకాల రచనలో పాటించవలసిన నియమాలు తెల్పండి.
3. విద్యలో రాజ్యం పాత్రను తెల్పండి.
4. సమాజంలో ఉపాధ్యాయుని స్థాయిని ప్రభావితం చేసే అంశాలేవి?
5. విద్యలో పౌర సమాజం పాత్రను తెల్పండి.

### ప్రాజెక్టు పని

1. విద్యా గమ్యాల నిర్మాణంలో అధికారం మరియు సిద్ధాంతాల ప్రభావాలను, ఇతర అంశాలను క్రోడీకరించి సేకరించమనడం.
2. సమాజంలో ఉపాధ్యాయుని స్థాయి గురించి విభిన్న రంగాలలో వుండే వ్యక్తుల అభిప్రాయాలను సేకరించమనడం.

### సెమినార్

1. విద్యాధ్యేయాల రకాలను, కారకాలను ప్రాగుక్తీకరించమనడం.
2. సమాజంలో ఉపాధ్యాయుని స్థాయి నాడు, నేడు సరిపోల్చడం.

# 3 జ్ఞానము మరియు అవగాహన
# (Knowledge and understanding)

3.1 జ్ఞాన నిర్మాణం, vs జ్ఞానము సమాచారం

3.2 నమ్మకం, సమాచారం, జ్ఞానం మరియు అవగాహన భావనలు: జ్ఞానం సమాచారానికి భిన్నమైనది, జ్ఞానం అనుభవాల నిర్మాణం, విచారణ పద్ధతులు.

3.3 జ్ఞాన శాఖలు : వివిధ రకాల జ్ఞానం – వాటి నిజనిర్ధారణ ప్రక్రియలు

3.4 జ్ఞానం మరియు శక్తి : పరస్పర ఆధిపత్యం పుస్తక జ్ఞానం vs అనుభవ జ్ఞానం

3.5 పిల్లల జ్ఞాన నిర్మాణం : ఏమిటి? ఎలా? పిల్లల ఆలోచనలకు ప్రత్యామ్నాయ చట్రం

3.6 జ్ఞాన రకాలు మరియు సమస్యా సాధన, గణితం, సైన్సు, సోషల్ స్టడీస్, చరిత్ర, భాష, తత్త్వశాస్త్రం మొదలైనవి – ఉపాధ్యాయుని పాత్ర

**లక్ష్యాలు :**

1. జ్ఞానం
2. జ్ఞాన నిర్మాణం గూర్చి అవగాహన చేసుకొనడం
3. జ్ఞానానికి, సమాచారానికి మధ్యగల పోలికలు, భేదాలు తెలుసుకోవడం
4. వివిధరకాలైన విచారణ పద్ధతులను గూర్చి తెలుసుకోవడం
5. వివిధరకాల జ్ఞానం వాటి నిజనిర్ధారణ ప్రక్రియలను అవగాహన చేసుకొనడం
6. పిల్లల్లో జ్ఞాననిర్మాణం జరుగువిధానాన్ని అవగాహన చేసుకొనడం
7. పిల్లల ఆలోచనల ప్రత్యామ్నాయ చట్రం గురించి అవగాహన చేసుకొనడం
8. వివిధ జ్ఞానరకాలను అవగాహన చేసుకొనడం.

**పరిచయం :**

జ్ఞానము అనే పదాన్ని నిర్వచించడం చాలా కష్టంతో కూడినది. ఎందుకంటే జ్ఞానము అనే దానిని ప్రతిఒక్కరూ వారివారి పద్ధతిలో అన్వయించుకోవడం జరుగుతుంది. ఒక చిన్న పిల్లవాడు కొన్ని పద్యాలను కంఠస్తం చేయడం, ఒక విద్యార్థి కొన్ని గణిత సూత్రాలను తెలుసుకోవడం, ఒక పండితుడు ఒక కావ్యాన్ని చదివి దానికి భాష్యం చెప్పగలగడం మొదలైనవన్నీ జ్ఞాన సముపార్జనలోకే వస్తాయి. గురువు అనే శబ్దాన్ని అర్థాన్ని పరిశీలిస్తే చీకటి అనే అజ్ఞానాన్ని పారద్రోలి వెలుగు అనే జ్ఞానాన్ని ప్రసాదించేవాడు అని అర్థం. అయితే ఏది అజ్ఞానం, ఎవరు అజ్ఞాని అనేవి నిర్ణయించడం కష్టం. ఎవరి ఆలోచనలను బట్టి వారి అభిప్రాయాలు ఉంటాయి. ఏది ఏమైనప్పటికీ జ్ఞానం అనేది సంకుంచిత విషయాల నుండి వ్యక్తులను విముక్తులను చేసేది అని చెప్పవచ్చు.

ప్లాటో ప్రకారం జ్ఞానం అనేది వివేచనతో కూడిన నిజమైన అభిప్రాయం. కానీ జ్ఞానం, అభిప్రాయం కంటే భిన్నమైనది. జ్ఞానం కొన్ని సత్యాలను ఆవిష్కరిస్తుంది. అభిప్రాయం అనేది ఆవిధంగా చెయ్యలేదు.

జ్ఞానమనేది సమగ్రమైనది. విస్తృతమైన భావనతో కూడినది. దీనిని వివిధ విభాగాలు లేదా సబ్జెక్టుల పేరుతో విడదీయడం కృత్రిమమైనది. జ్ఞాన సాధన అనేది జీవితాంతం జరిగే ప్రక్రియ, నిజమైన జ్ఞానం ఉద్వేగాలకు అతీతమైనది. జ్ఞానాన్ని నిర్మించడంలో భాగంగా వ్యక్తిలో స్వీయ అన్వేషణను, సత్యాన్వేషణను పెంపొందించే ప్రయత్నాన్ని పాఠశాల చెయ్యాలి. విద్యార్థులలో జ్ఞానాన్ని పెంపొందించడంలో భాగంగా ఉపాధ్యాయుని బోధన చర్చా పద్ధతిలో కొనసాగాలి, అధికారయుత విధానంలో ఉండకూడదు. జ్ఞాన సాధనలో ఫలితాల కంటే కూడా వాటిని పొందే ప్రక్రియలను పరిపుష్టం చేయడానికి ప్రాధాన్యతనివ్వాలి.

ఈ అధ్యాయంలో జ్ఞానం అంటే ఏమిటి? అవగాహన అంటే ఏమిటి? వాటి మధ్య ఏవిధమైన సంబంధం ఉంది? జ్ఞానానికి, సమాచారానికి మధ్య తేడాలేమిటి? సమాచారం కంటే జ్ఞానం ఏవిధంగా ఉన్నతమైనది? వంటి వివిధ అంశాలను చర్చిస్తారు. వివిధ జ్ఞానశోధన పద్ధతులను గురించి తెలుసుకుంటారు. జ్ఞానం మరియు శక్తి ల గురించి తెలుసుకోవడమే కాకుండా వాటి పరస్పర ఆధిపత్యాన్ని గురించి అవగాహన చేసుకొనడం జరుగుతుంది. జ్ఞాన నిర్మాణం అంటే ఏమిటి? పిల్లల్లో జ్ఞాన నిర్మాణం ఏవిధంగా జరుగుతుంది. పిల్లల ప్రత్యామ్నాయ ఆలోచనల చట్రం ఏవిధంగా రూపొందుతుంది అనే అంశాలపై చర్చించడం జరుగుతుంది. వివిధ జ్ఞానరూపాలు మరియు సమస్యాసాధనల గురించి తెలియజేయడమే కాకుండా అందులో ఉపాధ్యాయుని పాత్రను వివరించడం కూడా జరిగింది.

**3.1**

జ్ఞాన నిర్మాణం, ఏదైనా సమాచారాన్ని అవగాహన చేసికొని దానిని కోరినరీతిలో వ్యాఖ్యానించగల నైపుణ్యం ఏర్పడినట్లయితే జ్ఞాన నిర్మాణం జరిగినట్లు భావించవచ్చు. జ్ఞానమనేది జ్ఞానాత్మక సామర్థ్యాలతో కూడినది. ఒక అంశాన్ని వివిధ లక్ష్యాల సాధనలో, సామాజిక స్పృహను పెంపొందించడానికి, తార్కిక ఆలోచనలను వృద్ధి పరచడానికి, విశ్లేషణలు మరియు నిర్మాణాలు చేయడానికి వినియోగించవచ్చు.

జాతీయ విద్యాప్రణాళికా చట్రం – 2005, విద్యార్థుల జ్ఞాన నిర్మాణం జరగవలసిన అవసరాన్ని స్పష్టం చేసింది. తరగతి గదిలో జ్ఞాన నిర్మాణం జరగడానికి అవసరమైన వాతావరణాన్ని ఉపాధ్యాయుడు కల్పించాలి. అనుభవాల ప్రాతిపదికంగా జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. కాబట్టి, విద్యార్థులస్థాయికి అనుగుణమైన అభ్యసనానుభవాలను కల్పించి, వాటిలో వారు

చురుకుగా పాల్గొని కొత్త జ్ఞానాన్ని నిర్మించుకొనేలా చూడాలి. విద్యార్థిని సమాచారాన్ని సేకరించి, దానిని మెదడులో నిల్వఉంచుకునే వ్యక్తిగా భావించకూడదు. అతడు అందుబాటులోని సమాచారాన్ని విశ్లేషణ చేయడం, అవసరమైన ఇతర రూపాలలోకి మార్చుకుని వినియోగించగల సామర్థ్యాన్ని పొందగలగాలి. అప్పుడే అతడిలో జ్ఞాన నిర్మాణం జరిగినట్లు అవుతుంది.

జ్ఞాన నిర్మాణ భావనను ఈ క్రిందివిధంగా నిర్వచించవచ్చు. పూర్వజ్ఞానాన్ని ఆధారం చేసుకుని సహజమైన రీతిలో సందర్భానికి తగినట్లుగా నిర్మాణాత్మక సన్నివేశాలలో చురుకుగా పాల్గొంటూ తామే స్వయంగా విషయాలను అవగాహన చేసుకుంటూ నూతన జ్ఞానాన్ని నిర్మాణం చేసుకొనడమే జ్ఞాన నిర్మాణం.

జ్ఞాన నిర్మాణం వల్ల విద్యార్థి స్వయంగా కొత్త ఆలోచనలను పొందగలుగుతాడు. విధానాలను రూపొందించగలుగుతాడు. నూతనత్వం మరియు సృజనాత్మకత చోటుచేసుకుంటాయి.

**జ్ఞాన నిర్మాణం జరిగే పద్ధతి: (Process of Constructing Knowledge)**

జ్ఞాన నిర్మాణం జరగడానికి ఉపాధ్యాయుడు విద్యార్థులలో తగిన ప్రేరణను, ఆసక్తిని కలిగించాలి. అప్పుడు విద్యార్థులు తమలోని అంతర్గత శక్తులను వినియోగించుకుని జ్ఞానాన్ని నిర్మించుకొంటారు.

మేయర్ తన జ్ఞాననిర్మాణ నమూనాలో మూడు ముఖ్యాంశాలను సూచించారు. అవి

1. తగిన సమాచారాన్ని ఎంపిక చేయడం (Selecting Relevant Information - S)
2. ఎంపిక చేసిన సమాచారాన్ని వ్యవస్థీకరించడం (Organising Selected Information - O)
3. వ్యవస్థీకరించబడిన సమాచారాన్ని సమైక్యపరచడం (Integrating Organized Information - I)

జ్ఞాన నిర్మాణంలో ఫలితానికి ఎంత ప్రాధాన్యముంటుందో విధానానికి కూడా అంతే ప్రాధాన్యముంటుంది.

**సమాచారం Vs జ్ఞానం:**

FP1RQ4

సమాచారం అనేది కొన్ని విషయాల సమాహారం. ఉదాహరణకు ఒక నిఘంటవును తీసుకుంటే అందులో ఆ భాషకు సంబంధించిన ఎంతో సమాచారం ఉంటుంది. గూగుల్‌లో శోధన చేసినపుడు ఏదైనా ఒక చిన్న పదాన్ని టైప్ చేస్తే దానితో సంబంధమున్న ఎంతో సమాచారం మన కళ్లముందుంటుంది. పూర్వం ముద్రణామాధ్యమం (పుస్తకాలు) మాత్రమే ప్రధాన సమాచార సాధనాలుగా ఉండేవి. కానీ, ఆధునికయుగంలో సాంకేతికత పెరగడం వల్ల సమాచార సేకరణ అనేది సులభతరం అయింది. ప్రసారమాధ్యమాల ద్వారా కానీ, అంతర్జాలం ద్వారా గానీ మనకు కావలసిన సమాచారం లభ్యమవుతోంది. సమాచారాన్ని ఒక దత్తాంశంగా భావించవచ్చు. సమాచారాన్ని ఒక వ్యక్తి నుండి గానీ, పుస్తకం నుండి గానీ లేదా ఇతర పద్ధతుల ద్వారా గానీ పొందవచ్చు. సమాచారం జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకొనడానికి ఉపకరిస్తుంది. అంతేకానీ సమాచారమే జ్ఞానం కాదు. అది జ్ఞానంలో ఒక అంతర్భాగం. సమాచారాన్ని ఉపయుక్తమైన రీతిలో వినియోగించుకోగలగడం జ్ఞానానికి దారితీస్తుంది.

జ్ఞాన అభివృద్ధిలో కేవలం సమాచారాన్ని భద్రపరచుకోవడం అవసరమైనప్పుడు వెలికితీయడమే కాకుండా వివిధ నిర్దిష్ట విషయాల్ని, మానసిక భావనల్ని రకరకాలుగా ఉపయోగించుకోగల్గడం కూడా ఉంటుంది. వైఖరులు, ఉద్వేగాలు,

నైతికత మొదలగునవి పిల్లల జ్ఞానం అభివృద్ధి చెందడంలో అంతర్భాగంగా ఉంటాయి. జ్ఞానం అంటే నిజాల రూపంలో ఉండే సమాచారము. ఇది కూడా న్యాయసమ్మతమైన, హేతుబద్ధమైన విశ్వాసము. జాన్‌డ్యూయీ (John Dewey) ప్రకారం, జ్ఞానం అనేది సాక్ష్యం నుండి అనుమతిని తెలియజేస్తుంది. (Knowledge denotes an inference from evidence) సమాచారం అనేది ఒక ముడిసరుకు. జ్ఞానం అనేది ఆ సమాచార వినియోగంతో ముడిపడిన ప్రక్రియ. సమాచారాన్ని తాత్కాలికంగా గుర్తు పెట్టుకోవడం, బట్టీపట్టడం జ్ఞానంగా పరిగణించబడవు.

సమాచారమనేది ఒక భౌతికమైనది. జ్ఞానం మానసిక ప్రతిమలను తెలియజేస్తుంది. సమాచారం, ఎవరు? ఎక్కడ? ఏమిటి? ఎప్పుడు? వంటి వాటికి సమాధానాన్నిస్తే, జ్ఞానం 'ఎలా' అనేదానికి సమాధానమిస్తుంది. క్రమబద్ధమైన విషయం సమాచారం అయితే, క్రమబద్ధమైన అనుభవం జ్ఞానం అవుతుంది. సమాచారాన్ని బదిలీ చేయడం సులభం, జ్ఞానం బదిలీకి అభ్యసన అవసరమవుతుంది.

## 3.2 సమాచారం, జ్ఞానం మరియు అవగాహన, నమ్మకం, విశ్వాసం, భావన:

**నమ్మకం (Believe):**

నమ్మకం అనేది ఒకరకమైన అంగీకారము. దీనికి ప్రయోగ ఫలితంలో, శాస్త్ర విషయాలలో సంబంధం ఉండవచ్చు, ఉండకపోవచ్చు. నమ్మకాన్ని మనం అన్నిసార్లు ప్రశ్నించలేము. ఆధారాన్ని చెప్పలేము మరియు చూపలేము. ఉదాహరణకు దేవుడు ఉన్నాడు అనేది చాలామంది ప్రజల నమ్మకం. ఈ నమ్మకం ప్రశ్నించజాలనిది. వ్యక్తి యొక్క సాంస్కృతిక నేపథ్యం, పూర్వ అనుభావాలతో ముడిపడినది. నమ్మకం అనేది ఒక మానసిక స్థితి. ఇది ఒక ధనాత్మక వైఖరిని (Positive attitude) సూచిస్తుంది. విశ్వాసాన్ని కలిగియుండడం వల్ల వ్యక్తి తన ఇష్టరంగంలో ముందుకుపోయే అవకాశం ఎక్కువ.

నమ్మకం అనే దానిని ఈ క్రిందివిధంగా నిర్వహించవచ్చు. 'యదార్ధతను నిరూపించడానికి అవసరమైన వాస్తవ సాక్ష్యం కలిగియున్న లేదా కలిగిలేని ఒక విషయం గుర్తించిన వ్యక్తి యొక్క మానసిక స్థితే నమ్మకం.

(Belief is the state of mind is which a person thinks something to be the care with or without any empirical evidence to prove that some thing is the case with factual certaining)

**సమాచారం (Information):**

ఏదో ఒక విషయాన్ని గురించి తెలియజేయడం సమాచారం అనబడుతుంది. ఇది ఒక దత్తాంశం. దీనిని ఆధారం చేసికొని జ్ఞానమనేది ఏర్పడుతుంది. సమాచారం అనేది శాబ్ధిక రూపంలో, అశాబ్ధిక రూపంలో ఉండవచ్చు. బొమ్మలు, పట్టికలు, సంకేతాలు, చిహ్నాలు మొదలైనవి సమాచారంలో భాగం. సమాచారమనేది ఒక ముడి పదార్ధంలాంటిది. దీనిని పుస్తకాల నుండి గానీ, ప్రసారమాధ్యమాల నుండి గానీ సేకరించవచ్చు.

**జ్ఞాన భావన (Concept of knowledge)**

విషయం అనేది సమాచారమైతే, దానిని అవసరమైన రీతిలో అన్వయం చేస్తే అది జ్ఞానమవుతుంది. జ్ఞానానికి సమాచారం మూలం. సమాచారాన్ని తగినరీతిలో విశ్లేషించగలిగితే అది జ్ఞానంగా మారుతుంది. సమాచారాన్ని విశ్లేషణ చేయడం, వ్యాఖ్యానించడం, అన్వయం చేయడం మొదలైనవన్నీ జ్ఞానాన్ని ఉత్పత్తి చేయడంలో ఉపకరిస్తాయి.

'అనుభవం లేదా విద్య ద్వారా మనం పొందే సమాచారం, అవగాహన, నైపుణ్యాలను జ్ఞానం' అని నిర్వచించవచ్చు. అనుభవాల సారాంశాన్ని జ్ఞానంగా భావించవచ్చు.

**అవగాహన భావన (Concept of Understanding)**

ఏదైనా సమాచారాన్ని అవగాహన చేసుకుని దానిని కోరిన రీతిలో వ్యాఖ్యానించగల నైపుణ్యం ఏర్పడినట్లయితే జ్ఞాననిర్మాణం జరిగినట్లు భావిస్తాము. జ్ఞానము అంటే ఒక విషయాన్ని లేదా సమాచారాన్ని తెలుసుకోవడం మాత్రమే కాదు దానిని విశ్లేషించగల, వినియోగించగల, తద్వారా కొత్త విషయాలను నిర్మాణం చేయగల సామర్థ్యం.

ఒక పద్యాన్ని దాని అర్థం తెలియకుండా బట్టీపట్టినట్లయితే ఆ పద్యాన్ని సంబంధానికి జ్ఞానం ఏర్పడినట్లు కాదు. అవగాహనతో కూడిన జ్ఞానం వల్ల తార్కికంగా ఆలోచించగల సామర్థ్యం, సమాజాన్ని వివిధ అంశాల ద్వారా అర్థం చేసుకోగల్గడం, ఇతరుల పట్ల స్పందన, సౌందర్యారాధన, తార్కికంగా ఇతరులతో కలిసి పనిచేయడం లాంటివి వ్యక్తిలో ఏర్పడతాయి. పాఠ్య ప్రణాళిక జ్ఞానపునాదిని ఏర్పరిచే అనుభవాలతో నిండి వుండాలి. విద్యార్థులలో ఈ జ్ఞాన సంపదను తమకుతాము పునరుత్పత్తి చేసుకోగలగాలి. ఉదాహరణకు విద్యార్థి ఒక ఆకును చూసినపుడు అతడు దానియొక్క రంగు, ఆకారం, పరిమాణాన్ని ఉపయోగం గురించి పలు ఆలోచనలను పొందగల్గుతాడు. అంటే కొత్త జ్ఞానం ఏర్పడిందన్నమాట. జ్ఞానాన్ని సరైనరీతిలో అవగాహన చేసికొనడం వల్ల, జ్ఞానాన్ని ఒక ఉత్పత్తిగా చూడకుండా అది ఎలా సృష్టింపబడుతుందో, ఎలా క్రమవికాసం చెందుతుందో, దానిని ఎలా ఎవరికోసం వినియోగిస్తున్నామో తెలుసుకొంటాం. పిల్లలు కేవలం సమాచారాన్ని జ్ఞాపకముంచుకోవడం కంటే, వాటిని అర్థవంతంగా పొందడం, విశ్లేషించడం వంటి అవగాహనల వల్ల కొత్త సందర్భాలకు అన్వయించగల్గుతారు.

ఒక విషయం లేదా అంశం గురించిన అవగాహనతో వ్యాఖ్యానించడం, పోలికలు లేదా తేడాలు చెప్పగలగడం, దత్తాంశాన్ని కొన్ని సమూహాలుగా వర్గీకరించడం, నూతన భావనలను, పదాలను, గుర్తులను వివరించగల్గడం, ఉదాహరణలివ్వగల్గడం, వివేచన చేయడం, కార్యాకారణ సంబంధాన్ని గుర్తించగల్గడం మొదలైనవన్నీ అవగాహనలోకి వస్తాయి.

**జ్ఞానం, సమాచారం కంటే భిన్నమైనది:**

సమాచారం భౌతిక విషయాలకు సంబంధించినట్లైతే జ్ఞానం మానసిక ప్రతిమలకు సంబంధించినది. సమాచారం ఎటువంటి వ్యాఖ్యానాన్ని చెయ్యదు, కానీ జ్ఞానంలో వ్యాఖానం ఇమిడియుంటుంది. జ్ఞానం 'ఎలా' అనే ప్రశ్నకు సమాధానం ఇస్తుంది. జ్ఞానమనేది ఆలోచనలకు, అంతఃదృష్టికి సంబంధించినది. జ్ఞానోత్పత్తి కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు కలిగే అనుభవాలు అభ్యసనానికి ఎంతగానో తోడ్పడతాయి.

**విచారణ పద్ధతులు(Methods of Enquiry):**

విచారణ యొక్క అర్థం లోతైన పరిశీలన. జ్ఞానానికి సంబంధించిన కొన్ని విచారణ పద్ధతులను పరిశీలిద్దాం.

1. పరిశీలనా పద్ధతి (Observation Method): ఏదైనా విషయాన్ని సంపూర్ణంగా పరిశీలించి తద్వారా అందులోని సమాచారాన్ని సేకరించడం, ఫలితంగా జ్ఞాన నిర్మాణం సాధ్యమవుతుంది.
2. లోతుగా ప్రశ్నించడం (Deep Questioning): ఒక విషయం గురించి లోతుగా ప్రశ్నించడం ద్వారా ఆ విషయం గురించి చక్కని అవగాహన ఏర్పడడం వలన జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.
3. శాస్త్రీయ పద్ధతి (Scientific Method): సమస్యల సాధనలో లేదా సత్యాన్వేషణలో శాస్త్రజ్ఞులు అనుసరించే ఈ పద్ధతి మూలంగా జ్ఞాననిర్మాణం శాస్త్రీయంగా జరుగుతుంది.

4. ప్రయోగపద్ధతి (Experinental Method): విషయసేకరణకు, సమస్యా పరిష్కారానికి లేదా వాస్తవాల నిరూపణకు ప్రయోగాలను నిర్వహించడం జరుగుతుంది. తద్వారా జ్ఞాననిర్మాణం జరుగుతుంది.

5. విశ్లేషణ పద్ధతి (Analytical Method): ఒక విషయాన్ని లేదా సమస్యను విశ్లేషించడం జరిగినపుడు దాని గురించిన సమగ్రమైన జ్ఞానం ఏర్పడుతుంది.

6. తార్కిక పద్ధతి (Logical Method): ఒక విషయాన్ని తార్కికంగా ఆలోచించడం వల్ల దానియొక్క మంచి చెడులు కూలంకుషంగా తెలుస్తాయి. ఫలితంగా నూతన జ్ఞానం వెలువడుతుంది. విచారణ అనేది ఏ పద్ధతిలోనైనా జరగవచ్చు. అవసరాన్నిబట్టి, సందర్భాన్ని బట్టి విచారణ పద్ధతి మారుతూ ఉంటుంది కానీవిచారణ సరిగా జరిగితే మాత్రం దానివల్ల లభించే సమాచారం ఆధారంగా యదార్థ జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.

## 3.3 జ్ఞానశాఖలు : వివిధరకాల జ్ఞానం – వాటి నిజనిర్ధారణ ప్రక్రియలు

పాఠశాలలో విద్యార్థి జ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగించేవి జ్ఞానశాఖలు(భాగాలు). ఇవి విద్యార్థి యొక్క అవగాహనను, నైపుణ్యాన్ని పెంచుతాయి. పాఠ్యప్రణాళికను రూపొందించే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు లేదా విద్యావేత్తలకు ఈ జ్ఞానశాఖలపై అవగాహన ఉండాలి. ఈ జ్ఞానశాఖలలో కొన్నింటిని పరిశీలిద్దాం.

1. ఊహకల్పిత జ్ఞానం (A Priatic Knowledge): ముందరి జ్ఞానం. ఇది ఎటువంటి అనుభవం లేకుండా కేవలం తార్కికవాదంలో పొందే జ్ఞానం. దీనిని వివేచనతో పొందే జ్ఞానంగా కూడా చెప్పవచ్చు.

2. అనుభవిక జ్ఞానం (A Posterioric Knowledge): తదుపరి జ్ఞానం ముందు అనుభవాల నుండి కొంత విషయాన్ని గ్రహించి ఆ తర్వాత దానిని తర్కం లేదా వివేచనకు గురిచేసి అవగాహన చేసుకోవడం మూలంగా తదుపరి జ్ఞానం లభిస్తుంది. అందుచే దీనిని పరిశీలన ద్వారా పొందిన అనుభవాధారిత జ్ఞానం అని కూడా అంటారు. అనుభవాధారిత జ్ఞానానికి ముందరి జ్ఞానం అనేది ప్రాతిపదిక అవుతుంది.

3. ప్రతిపాదిత జ్ఞానం (Propositional Knowledge): జ్ఞానాన్ని ప్రతిపాదనల ద్వారా వ్యక్తపరచడమే ప్రతిపాదిత జ్ఞానం అనబడుతుంది. ప్రతిపాదిత జ్ఞానాన్ని ప్రకటిత వాక్యాల ద్వారా వ్యక్తపరుస్తారు. ప్రతిపాదిత జ్ఞానంలో దేని గురించైనా తెలుసుకోవడం జరుగుతుంది.

4. అప్రతిపాదిత జ్ఞానం (Non-Propositional Knowledge): ఇందులో చెయ్యడం ద్వారా జ్ఞానం పొందబడుతుంది. ఆపై ఏదైనా సందర్భంలో అన్వయించుకోబడుతుంది. శాస్త్రీయ పద్ధతిలో వాడే విధానాలనే దీనిలోనూ ఉపయోగిస్తారు. దీనిలో అనుభవానికి అధిక ప్రాధాన్యత ఉంటుంది.

### జ్ఞాన ప్రామాణిక ప్రక్రియ (Knowledge Validation Process)

భారతీయ, పాశ్చాత్య తత్త్వవేత్తలు వారివారి సిద్ధాంతాల ఆధారంగా ప్రామాణికతను పేర్కొనడం జరిగింది. ఇందులో నాలుగు రకాల ప్రామాణికతలను పరిశీలిద్దాం.

1. ప్రత్యక్ష ప్రమాణం (Perception): జ్ఞానేంద్రియాల ద్వారా మనం పొందే జ్ఞానాన్ని ప్రత్యక్షజ్ఞానం అంటారు. పంచేంద్రియాలకు బాహ్యపదార్థాలతో ఏర్పడే సంబంధం వల్ల ప్రత్యక్షజ్ఞానం కలుగుతుంది.

2. అనుమాన ప్రమాణం (Inference): పూర్వ అనుభవాల ఆధారంగా నూతన జ్ఞానాన్ని ఊహించడాన్ని అనుమాన ప్రమాణం అంటారు. అనుమానం అనేది ఒక మానసిక ప్రక్రియ.

3. శబ్ద ప్రమాణం (Testomony): అనుభవం ద్వారా పొందిన జ్ఞానాన్ని తరువాత తరాలకు నేరుగా అందించడం కోసం పుస్తకాలలో నిక్షిప్తం చేస్తారు. ఉదాహరణ వేదములు.

4. ఉపమాన ప్రమాణం (Comparison): పోలికను బట్టి ఒక పదార్థానికి, వేరొక పదార్థానికి మధ్యగల సంబంధాన్ని గ్రహించడాన్ని ఉపమానప్రమాణం అంటారు.

సత్యాన్ని ప్రమాణంగా తెలుసుకోవడానికి, ఉపాధ్యాయుడు విద్యార్థులకు అవకాశాన్ని కల్పించాలి. ఆ ప్రమాణం ఆధారంగా జ్ఞానం, ఏది కాదు అనే నిర్ణయానికి వారు రావడం జరుగుతుంది.

**జ్ఞానమార్గాలు (Ways of knowledge)**

- ఉపమాన ప్రమాణం (Senses)
- వివేచన (Reasons)
- అంతర్బుద్ధి (Intuition)
- ప్రత్యక్ష అనుభవం (Direct experience)
- అప్రత్యక్ష అనుభవం (Indirect experience)
- సంస్కృతి మరియు సాంప్రదాయాలు (Culture and Traditions)

HDVATR

## 3.4 జ్ఞానం మరియు శక్తి (మానసిక శక్తి): పరస్పర ఆధిపత్యం పుస్తకజ్ఞానం (Vs) అనుభవ జ్ఞానం

జ్ఞానమే శక్తి (Knowledge is Power) అనేవి అనేక మంది భారతీయ, పాశ్చాత్య మేధావులు తెలియజేసిన విషయం మనకు తెలిసిందే.

అసలు జ్ఞానం, శక్తి అనేవి రెండూ సంబంధంలేని విషయాలే. అయితే వాటి మధ్యనున్న సంబంధం ఏమిటి?

అదే విధంగా పుస్తక జ్ఞానానికి, అనుభవజ్ఞానికి మధ్య సారూప్యతలేంటి? భేదాలేంటి? అనే అంశాలను పరిశీలిద్దాం.

**జ్ఞానం:** ఒక విషయం యొక్క సిద్ధాంతపరమైన లేదా ఆచరణాత్మక అవగాహనే జ్ఞానం.

**శక్తి:** ఏదైనా ఒక పని చేయగల సామర్థ్యం శక్తి – భౌతికమైనది. జ్ఞానాన్ని నిర్మాణాత్మకంగా వినియోగించగల మానసిక సామర్థమే శక్తి.

**జ్ఞానం మరియు శక్తుల పరస్పర ఆధిపత్యం:**

ధనం, అధికారం, సంపాదించలేని ఆధిపత్యాన్ని జ్ఞానం సంపాదిస్తుంది. 'విద్వాన్ సర్వత్ర పూజ్యతే' అనే సుభాషిత జ్ఞానాన్ని సంపాదించిన పండితుని యొక్క గొప్పతనాన్ని తెలియజేస్తుంది. భారతదేశానికి చెందిన ప్రాచీన గురువులు ఉదా: ద్రోణాచార్యుడు, వశిష్ఠుడు, ఆధునిక భారతానికి గురువులు డా. రాధాకృష్ణన్, డా. ఎ.పి.జె. అబ్దుల్‌కలాం వంటివారు, అదే విధంగా పాశ్చాత్య మేధావులు సోక్రటీస్, అరిస్టాటిల్, ఐన్‌స్టీన్ వంటివారు తమ జ్ఞానంతో ఆనాటి వ్యవస్థలను శాసించడం మనకు తెలిసిందే. జ్ఞానం విస్తరణ / వ్యాప్తి ద్వారా అనేక భాషలు, గణితం, విజ్ఞానశాస్త్రం, కంప్యూటర్ రంగం,

కళలు మొదలగునవి అభివృద్ధి చెందడం జరుగుతోంది. ఈ రోజు శాస్త్ర సాంకేతిక రంగంలో అణుశక్తి నుండి అంతరిక్షం వరకు జ్ఞానం అనేది నిరంతరం విస్ఫోటనం చెందుతూండడం మనకు తెలిసిన విషయమే. జ్ఞానం అనేది భౌతిక రంగాలకు మాత్రమే పరిమితమైంది కాదు. స్వామి వివేకానంద వంటి వారు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సముపార్జించి మొత్తం ప్రపంచానికే జ్ఞాన సంపదను ప్రసాదించిన విషయం తెలిసిందే. జ్ఞానమనేది విస్తృతమైనది. సముద్రంలోని నీటి నుండి ఎంత నీటిని తోడినా, ఆ నీరు తరగనట్లే, జ్ఞానాన్ని తెలుసుకొనే కొద్దీ కొత్త జ్ఞానం ఉద్భవిస్తూనే ఉంటుంది. ఏ రంగంలోనైనా సముపార్జించవలసిన జ్ఞానం అనంతం. మనం మన అవసరాలు, సామర్థ్యాల మేరకు దానిని గ్రహించవలసిందే.

భౌతికశాస్త్రంలో పనిచేయగల సామర్థ్యాన్ని శక్తిగా నిర్వచిస్తారు. ఇక్కడ జ్ఞానాన్ని వినియోగించగల్గిన సామర్థ్యాన్ని మానసిక శక్తిగా భావించవచ్చు. వ్యక్తి వివిధ జ్ఞానరూపాల ద్వారా జ్ఞానాన్ని పొందుతాడు. అజ్ఞానం అతనిలో ఆలోచనా శక్తిని, వినియోగపు శక్తిని ఇంకా అనేక రకాల శక్తులను పెంపొందిస్తుంది. జ్ఞానం పెరిగేకొద్దీ మానసిక శక్తి కూడా పెరుగుతూనే ఉంటుంది. అయితే ఆ జ్ఞానాన్ని సమాజ కళ్యాణానికి వినియోగించగల ధనాత్మక శక్తిగా మార్చుకోవలసిన అవసరం వ్యక్తి మీద ఉంటుంది. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో అణుబాంబులను అమెరికా, జపాన్‌పై ప్రయోగించి విధ్వంసాన్ని సృష్టించడం అణుపరిజ్ఞానం వలన పొందిన శక్తిని దుర్వినియోగం చెయ్యడమే కదా!

మనిషిలో జ్ఞానం పెరిగేకొద్దీ శక్తి కూడా పెరుగుతూనే ఉంటుంది. శక్తి అనేది అనంతజ్ఞాన సమ్మిళితం. ప్రకృతిలోని శక్తి అనంతమైనది. అనేక రూపాలలో ఉన్నది. జ్ఞానం మరియు శక్తి ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. జ్ఞానం లేకుండా మానసిక శక్తి అనేది ఉద్భవించదు. ఉదాహరణకు ఒక సైనికుడు యుద్ధతంత్రాల జ్ఞానాన్ని పొందితేనే అతడు శక్తివంతుడౌతాడు.

అయితే జ్ఞానం మరియు మానసిక శక్తి ఒక్కొక్కసారి ఒకదానిపై మరొకటి ఆధిపత్యాన్ని ప్రదర్శించే పరిస్థితి ఏర్పడుతుంది. అన్వయించబడిన జ్ఞానమే మానసిక శక్తి. ఒకసారి శక్తి ఏర్పడినప్పుడు ఆ శక్తి కొత్త జ్ఞాన ఆవిష్కరణలకు దారితీస్తుంది.

జ్ఞానం, శక్తి అనేవి ఈ విధంగా ఒకదాని కారణంగా మరొకటి వృద్ధిచెందుతాయి. జ్ఞానం, మానసిక శక్తుల మధ్యలో ఒక వాహకునిగా వ్యక్తి వ్యవహరిస్తాడు. ఆ వ్యక్తి తను సంపాదించిన శక్తిని దుర్వినియోగం చేయాలనుకొన్నప్పుడు, అతడు పొందిన జ్ఞానం ఒక్కొక్కసారి వినాశకర ధోరణులకు ఉపయోగించబడుతుంది.

శక్తి అనేది మానసిక సంసిద్ధతను పెంచుతుంది. ఎటువంటి సమస్యలనైనా తన జ్ఞానాన్ని ఉపయోగించి పరిష్కరించుకునే సామర్థ్యాన్ని శక్తి ఇస్తుంది.

అందుచేత జ్ఞానం లేకుండా శక్తి ఉండదు. శక్తి లేని జ్ఞానం యొక్క వినియోగం పరిమితంగా ఉంటుంది. జ్ఞానం, శక్తి రెండు కలిసి విద్యార్థులను సరైన అభివృద్ధి మార్గంలో ఉంచడానికి తగిన కృత్యాలను పాఠ్యప్రణాళికలో పొందుపరచాలి.

**పుస్తక జ్ఞానం (Vs) అనుభవజ్ఞానం**

జ్ఞానం మనకు అనేక విధాలుగా ఏర్పడవచ్చు. అనేక పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానం ఏర్పడవచ్చు. ప్రయోగశాలలో ప్రయోగాలు చేయడంవల్ల జ్ఞానం ఏర్పడవచ్చు. జీవితంలో పొందే అనుభవాల ఆధారంగా జ్ఞానం ఏర్పడవచ్చు. ఇంకా ఎన్నో విధాలుగా జ్ఞానం ఏర్పడే అవకాశం వుంది. అయితే పుస్తకాలు చదవడం వల్ల ఏర్పడిన జ్ఞానం, అనుభవాల ద్వారా ఏర్పడిన జ్ఞానం రెండూ ఒకలాంటివేనా? దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం అవసరం? పరిశీలిద్దాం!

**పుస్తక జ్ఞానం:**

1. పుస్తకాల్లోని పదాలను, భావనలను, సిద్ధాంతాలను చదివి అవగాహన చేసుకొనడానికి ఉపయోగపడుతుంది.
2. పుస్తకంలోని సమాచారాన్ని చదవడంలోనే విద్యార్థి ఎక్కువ సమయాన్ని వెచ్చించటం వలన, తన సహజ అంతర్గత శక్తులను వినియోగించే వీలుండదు.
3. ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా అందరూ ఒకే సమాచారాన్ని చదవడం, అవగాహన చేసుకోవడం కూడా విసుగ్గా అనిపిస్తుంది.
4. విద్యార్థి స్వభావాన్ని గుర్తించకుండా ఒకే రకమైన అంశాలను అందరిమీద రుద్దడం వల్ల పిల్లలకు చదువుమీద అయిష్టత ఏర్పడుతుంది.
5. విషయాలన్నీ ఒక నియత క్రమంలో అమర్చబడతాయి. అదే క్రమాన్ని విద్యార్థి అనుసరించవలసి ఉంటుంది.
6. జ్ఞానానికి పరీక్షలలో ప్రాధాన్యతనివ్వడం జరుగుతుంది. విద్యార్థులు బట్టీ విధానానికి అలవాటుపడతారు.
7. నిజ జీవితంలో ఏర్పడే కొన్ని ప్రత్యేక సంఘటనలను అవగాహన చేసుకొనడానికి, సమస్యలను పరిష్కరించడానికి పుస్తక జ్ఞానం ఉపయోగపడకపోవచ్చును.
8. విద్యార్థి స్వంత ఆలోచనలతో సంబంధం ఉండదు.
9. వైయక్తిక భేదాలకు అనుగుణంగా ఉండదు.
10. విద్యార్థి నిష్క్రియాత్మకంగా ఉంటాడు.

**అనుభవ జ్ఞానం:**

1. విద్యార్థి అనుభవాలకు ప్రాధాన్యతనిస్తుంది.
2. నిజ జీవితంలో ఎదురయ్యే అనుభవాల ఆధారంగా స్వంత ఆలోచనలను ఏర్పరచుకొంటాడు.
3. తనకు అభిరుచి గల అంశాలకు సంబంధించిన అనుభవాలపై దృష్టి పెడతాడు.
4. విద్యార్థిలో ఆసక్తిని రేకెత్తిస్తుంది.
5. అనుభవాలకు క్రమం ఉండదు. కానీ కొత్త అనుభవాలు ఏర్పడినప్పుడు గత అనుభవాలను ఉపయోగించుకోగలుగుతాడు.
6. నిజజీవిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత, పరీక్షల ప్రాధాన్యత తక్కువ. బట్టీ విధానానికి అవకాశం ఉండదు.

7. అనుభవ జ్ఞానం వల్ల పుస్తకజ్ఞానంలో ఏర్పడిన సత్యాలు, సిద్ధాంతాలు మొదలైనవి బలపడతాయి.
8. విద్యార్థి క్రియాత్మకంగా ఉంటాడు.
9. కొత్త కొత్త ఆలోచనలు, నూతన పోకడలు విద్యార్థికి అలవడతాయి.
10. పుస్తక జ్ఞానానికి అనుభవ రూపాన్నిస్తుంది.

విద్యార్థులలో అనుభవ జ్ఞానాన్ని పెంపొందించడం కోసం క్షేత్ర పర్యటనలు ఏర్పాటుచేయడం, విద్యార్థుల స్థాయికి తగిన ప్రకల్పనలను ఇవ్వడం జరగాలి. అందుకనుగుణంగా విద్యాప్రణాళిక రూపకల్పన జరగాలి.

## 3.5 పిల్లల జ్ఞాన నిర్మాణం – ఏమిటి ? ఎలా? పిల్లల ఆలోచనలకు ప్రత్యామ్నాయ చట్రం

పిల్లల్లో జ్ఞానాన్ని పెంపొందించే ఒక వేదిక పాఠశాల. పాఠశాల పిల్లల్లో భయాన్ని కనిపించకుండా పిల్లలు స్వేచ్ఛగా ఆలోచించి తమ అభిప్రాయాలను వ్యక్తంచేస్తూ, కృత్యాలలో పాల్గొంటూ జ్ఞానాన్ని పొందడం ఎంతైనా అవసరం.

**పిల్లల జ్ఞాన నిర్మాణం:** పిల్లల జ్ఞాననిర్మాణం గురించి జాతీయ విద్యాప్రణాళికా చట్రం – 2005 విస్తృతంగా చర్చించింది. జ్ఞాన నిర్మాణం అంటే ఏమిటి? పిల్లల్లో జ్ఞాన నిర్మాణం ఎలా జరుగుతుంది? పిల్లలు స్వయంగా తాము కృత్యాలలో పాల్గొంటూ అవసరమైన జ్ఞానాన్ని నిర్మించుకుంటారు. క్రియాత్మకత అనేది నూతన జ్ఞాన నిర్మాణానికి ప్రాతిపదిక. పిల్లలు ప్రశ్నించడం, బడిలో నేర్చుకొన్నదాన్ని బయటి అనుభవాలతో అన్వయించుకోవడం, మూసపద్ధతిలో సమాధానం చెప్పకుండా పలు రూపాల్లో స్పందించడం ఇవన్నీ పిల్లల జ్ఞాన నిర్మాణానికి ఎంతగానో తోడ్పడతాయి. దీనిలో పరిశీలన, పరిశోధన, అన్వయించడం, చర్చించడం, దృక్పథాలు, నూతన ఆలోచనల ఆవిష్కరణ మొదలైనవి ఉంటాయి. ఉపాధ్యాయులు కూడా పిల్లల్ని సమాచారాన్ని నిల్వచేసుకొని, అవసరమైనప్పుడు బయటకు తీసే యంత్రాలుగా భావించకూడదు. ఆధునిక సాంకేతికత పెరిగిన ఈ రోజుల్లో సమాచారాన్ని విద్యార్థి మెదడులో నిల్వచేయడం అనేది అనవసరమైన ప్రయాస.

పాఠ్యపుస్తకాల్లో లేని జ్ఞానాన్ని వెలికితీసే విధంగా అభ్యసన లక్ష్యాల్ని రూపొందిస్తే పిల్లలు తమ స్వంత అనుభవాల నుంచి, కుటుంబంలోని, సమాజంలోని వ్యక్తుల అనుభవాల నుంచి గ్రంథాలయాల నుండి పరిసరాల నుంచి జ్ఞానాన్ని నిర్మాణం చేసుకొనే అవకాశం ఉంది. పిల్లలకు తమ అభ్యసన అనుభవాలకు తగిన ప్రశ్నలివ్వాలి. వాటి భావనలను అర్థంచేసుకొనడం ద్వారా జ్ఞానాన్ని స్వంతంగా నిర్మించుకోగలుగుతారు. సబ్జక్టులన్నీ వేటికవిగా కాకుండా, వాటి మధ్య సంబంధాన్ని నిరూపించేలా ఉన్నప్పుడు విద్యార్థి పొందే జ్ఞానం కూడా పరస్పరాధారితంగా ఉంటుంది.

పిల్లలు తమ సామాజిక అనుభవాలతో పాఠ్యపుస్తకాల జ్ఞానాన్ని అన్వయించుకోగలగాలి. అలాకాకపోతే జ్ఞానం కేవలం సమాచారంగానే మిగిలిపోతుంది. పిల్లల జ్ఞానం అర్థవంతంగా ఉండేటందుకు దానిని స్థానిక అంశాలతో, సందర్భాలతో అనుసంధానం చేయాలి. విద్యార్థులు స్వంత పరిశీలనల నుండి, ప్రతి చర్యల నుండి, వర్గీకరణ, విభజన సామర్థ్యాలను, ప్రశ్నల నుండి కొత్త జ్ఞానాన్ని పొందగలుగుతారు. పిల్లలు తమ జ్ఞానాన్ని సృజనాత్మకంగా కూడా ఆవిష్కరించే అవకాశాలను కల్పించినప్పుడు వారు జ్ఞానాన్ని నిర్మించుకోగలుగుతారు. పిల్లలు జ్ఞానాన్ని నిర్మించుకొనే క్రమంలో ఉపాధ్యాయులు క్రియాశీలకంగా భాగస్వాములు కాగల్గితే వారి పాత్రకు మరింత ప్రాధాన్యం పెరుగుతుంది. ఆధునిక కాలంలో సమాచార, ప్రసార సాంకేతికత (ఐ.సి.టి.) పిల్లల్లో జ్ఞాననిర్మాణం జరగడానికి ఎంతగానో వీలుకల్పిస్తున్నాయి. ప్రాథమిక స్థాయిలోని

విద్యార్థులు కూడా కంప్యూటర్ జ్ఞానాన్ని అలవాటుచేసుకొని, ఇంటర్నెట్‌ను ఉపయోగించగల్గుతున్నారు. తద్వారా విస్తృతమైన సమాచారం వారికి అందుబాటులోకి రావటంవల్ల నూతన జ్ఞాన ఆవిష్కరణకు వీలుకలుగుతుంది. టి.వి వంటి ప్రసార మాధ్యమాలు కూడా పిల్లలకు ఆసక్తిని కలిగించే ఎన్నో విజ్ఞానదాయకమైన, ఆలోచనాత్మకమైన కార్యక్రమాలను ప్రసారం చేస్తున్నాయి.వాటిని చూడడం వలన పిల్లల్లో కొత్త ఆలోచనలు ఏర్పడి నూతన జ్ఞాన ఆవిష్కరణ జరుగుతోంది. భాషకు సంబంధించిన, సైన్సుకు సంబంధించిన క్విజ్ కార్యక్రమాలు పిల్లల్లో వచ్చే ఈ ఆసక్తిని పెంపొందిస్తూ వారికి తగిన ప్రోత్సహాన్ని ఇవ్వాలి.

**జ్ఞానాన్ని ఎంపిక చేసుకోవడం:**

జ్ఞాన రంగాలు అనేకంగా పెరిగాయి. అందువల్ల మనకు, ఏది అవసరమో వాటిని మాత్రమే ఎంపిక చేసుకోవచ్చు. జ్ఞాన రంగాన్ని ఎంపిక చేసుకొనేటప్పుడు 1) సంగతత్వం (relevance) 2) అభిరుచి (interest) 3) అర్థవంతం (meaningfullness) అనే విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి.

**బాలల జ్ఞాన నిర్మాణం జరగాల్సిన విధానం:**

పిల్లల్లో జ్ఞాన నిర్మాణం ఏ విధంగా జరుగుతుందో పరిశీలిద్దాం! జ్ఞానం అనేది పిల్లల్లో సహజంగానే ఉంటుంది. దానిని నిర్మాణాత్మక దిశలోకి మళ్ళించడం అనేది ఉపాధ్యాయుని విధి. పిల్లవాని మెదడు శూన్యంతో నిండి ఉంటుంది అనే ఆలోచన సరికాదు. వారి ఆలోచనల్లో స్థిరత్వాన్ని, పరిపక్వతని కలుగజేయడం పాఠశాల బాధ్యత. విద్యార్థి జ్ఞాన నిర్మాణం అలవర్చుకొనే ప్రక్రియలో ఉపాధ్యాయుడు ఒక దార్శనికునిగా వ్యవహరిస్తాడు.

**జ్ఞాన నిర్మాణం అనేది ఎప్పుడు జరుగుతుంది?**

1. పూర్వజ్ఞాన భావన ఏర్పడడం
2. ప్రేమ, ఆసక్తి, తపన కల్గించడం.
3. వివిధ మానసిక ప్రక్రియలు చోటుచేసుకోవడం.
4. ఆలోచింపజేయడం.
5. అవకాశాలు కల్పించడం.

IN6YW3

**విద్యార్థుల్లో జ్ఞాన నిర్మాణం జరిగినట్లు ఏ విధంగా గుర్తిస్తాం**

1. సంభాషించేతీరు, ఉపయోగించే పదజాలం.
2. హావభావాల ప్రదర్శన
3. వ్యక్తి ప్రవర్తనలో మార్పుచోటుచేసుకోవడం.
4. వైయక్తిక, సామాజిక జీవన విధానంలో మార్పు, సర్దుబాటు.

పిల్లల ఆలోచనలు అన్ని సందర్భాలలోను ఒకేలా ఉండవు. పిల్లల ఆలోచనలు పెద్దల ఆలోచనలతో ఒక్కోసారి ఏకీభవించక పోవచ్చును. చాలా సందర్భాల్లో పిల్లల ఆలోచనలు చిత్రాలు, ఊహలు, భావనలతో కలిసి ఉంటాయి. పిల్లల ఆలోచనలు వివిధ రకాలుగా వర్గీకరింపబడ్డాయి. వాటిని పరిశీలిద్దాం.

1. కథల ద్వారా ఆలోచనలు: పిల్లలకు ఏదైనా చిత్రాన్ని చూపి దాని గురించి మాట్లాడుతున్నప్పుడు వారి ఆలోచనలు బయటకు వస్తాయి.
2. తార్కిక ఆలోచనలు: ఈ ఆలోచనలు సమస్యా పరిష్కారానికి దోహదం చేస్తాయి.
3. సృజనాత్మక ఆలోచనలు: ఒక విషయాన్ని గురించి వినూత్న పద్ధతిలో ఆలోచింపజేస్తాయి.
4. సమస్యా పరిష్కార ఆలోచనలు: సమస్యను నిర్వచించడం, అవగాహన చేసుకోవడం ద్వారా సమస్యా పరిష్కార ఆలోచన అభివృద్ధి చెందుతుంది.
5. సంక్లిష్ట ఆలోచన: పిల్లవానిని అత్యంత ప్రతిభావంతునిగా తీర్చిదిద్దడానికి ఈ ఆలోచన దోహదపడుతుంది.

**పిల్లల ఆలోచనలకు ప్రత్యామ్నాయ చట్రం – పాఠశాలల్లో చేపట్టవలసిన కార్యక్రమాలు**

1. పిల్లల భాష, సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యత కల్పించడం.
2. పిల్లలుసమస్యా సాధనలో స్వంతంగా ఆలోచించే స్వేచ్ఛను కల్పించడం.
3. పిల్లల అభ్యసనాన్ని, ప్రకల్పనలకు, క్షేత్రపర్యటనలకు, కృత్యాలకు జతచేయడం.
4. బట్టీ విధానాలకు ప్రాధాన్యత తగ్గించడం, పరస్పర చర్చలు, ప్రయోగశాల కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం.
5. పిల్లల్లో సృజనాత్మకత పెంచే విధానాలకు అవకాశం కల్పించడం.
6. పిల్లల జ్ఞానాన్ని పాఠశాల వెలుపలి జీవితంతో అనుసంధానం చేయడం.
7. సబ్జెక్టులను వివిధ విడి భాగాలుగా కాకుండా వాటి మధ్య సంబంధాన్ని ఏర్పరచే విధానాలకు ప్రాధాన్యత కల్పించడం.
8. విషయ ప్రణాళికలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి వీలుకల్పించే కృత్యాలను ఏర్పాటుచెయ్యడం.

## 3.6 జ్ఞాన రకాలు మరియు సమస్యా సాధన – గణితం, విజ్ఞానశాస్త్రం, సోషల్ స్టడీస్, చరిత్ర, భాష, తత్త్వశాస్త్రం మొదలైనవి – ఉపాధ్యాయుని పాత్ర

జ్ఞాన నిర్మాణం అనేది వివిధ సబ్జెక్టులలో వివిధ రకాలుగా జరుగుతుంది. సబ్జెక్టులకు సంబంధించిన సమస్యా సాధన ఆయా సబ్జెక్టుల తీరు మీద, ఆ సబ్జెక్టుకు సంబంధించిన ప్రత్యేక లక్షణాల మీద ఆధారపడి ఉంటుంది. సమస్యా పరిష్కారం జరగవలసిన విషయాన్ని బట్టి ఉత్పత్తి అయ్యే జ్ఞానం ఉంటుంది. వివిధ సబ్జెక్టులలో జరిగే జ్ఞాన నిర్మాణ విధానాలను పరిశీలిద్దాం.

**గణితం:** గణితంలో జ్ఞానం అనగా సూత్రాలు, సిద్ధాంతాలను అవగాహన చేసుకొనడం, విశ్లేషణ చెయ్యడం, సంబంధాలు సృష్టించడం, దత్తాంశం నుండి పాఠ్యాంశానికి కొన్ని నిర్థిష్టమెట్లు ద్వారా చేరుకోవడం, గణిత వాక్యాలను సమీకరణాలుగా మార్చడం, దత్తాంశాన్ని గణిత రూపంలో ప్రదర్శించడం, నిర్ధారణలు చేయడం, అంచనా వేయడం, సంశ్లేషణ, విశ్లేషణ విధానాల వల్ల గణిత జ్ఞానం సృష్టించబడుతుంది. సమస్యా పరిష్కారంలో నూతన పద్ధతుల్ని కనుగొనడం జరుగుతుంది.

**విజ్ఞానశాస్త్రం:** విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన సమస్యా పరిష్కారంలో భాగంగా పరిశీలించడం, అన్వేషించడం, ప్రయోగంలో భాగంగా పరిశీలించడం, అన్వేషించడం, ప్రయోగాలు చేయడం, తార్కిక నిరూపణలు చేయడం, చర్చించడం మొదలైన వానివల్ల జ్ఞాన ఉత్పత్తి జరుగుతుంది. విజ్ఞానశాస్త్రంలోని జ్ఞానం సూత్రాలు, నియమాలు, నిర్వచనాలు, భావనలు, సిద్ధాంతాలు మొదలైన వాటి రూపంలో ఉంటుంది.

**సాంఘికశాస్త్రం:** సాంఘికశాస్త్రంలో భూగోళం, చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం మొదలైన అంశాలు ఉంటాయి. దీనిలో జ్ఞానం ఆయా అంశాల స్వభావరీత్యా ఉంటుంది. ఒక ప్రాంతం యొక్క భౌగోళిక పరిస్థితులను అంచనావేయడం, ఏ పంటలు పండుతాయి వంటి వాటిని పరిశీలించడం, ప్రజల జీవన విధానం, ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలు, ఆర్థిక వనరులు, ఇతర ఆర్థిక అంశాలు, దేశ చరిత్ర, ప్రముఖ నాయకులు, సామాజిక కట్టుబాట్లను గౌరవించడం, సామాజిక విలువలను పెంపొందించుకోవడం మొదలగు అంశాల ద్వారా జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.

JXHMYE

**చరిత్ర:** చరిత్ర సాంఘిక శాస్త్రంలో భాగమైనప్పటికీ దీనికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఒక ప్రాంత చరిత్రను తెలుసుకోవడమంటే, అక్కడి పాలనా వ్యవస్థ, దానిని ప్రభావితం చేసిన ప్రముఖ వ్యక్తులు, ముఖ్యమైన దర్శనీయ స్థలాలు వంటి వాటి గురించిన జ్ఞానాన్ని పొందడం, గత చరిత్ర, భవిష్యత్తుకు బాటలు వేస్తుంది.

**భాష:** భాషను ఉపయోగించి సంభాషించడం, రాయడం, భాషలోని గ్రంథాలను పఠించడం, భాషకు సంబంధించిన వ్యాకరణాంశాలను,, వాక్య నిర్మాణ ప్రక్రియలను తెలుసుకోవడం, భాషను సుసంపన్నం చేసే గ్రంథాలను అధ్యయనం చేయడం వంటి వాటి ద్వారా జ్ఞాన నిర్మాణం జరుగుతుంది.

**తత్త్వశాస్త్రం:** తత్త్వశాస్త్ర నియమాలను, సిద్ధాంతాలను అవగాహన చేసుకొని వాటిని అన్వయం చేసుకోవడం ద్వారా వ్యక్తి జ్ఞానాన్ని పొందగలుగుతాడు. ప్రముఖ తత్త్వవేత్తల బోధనలను పరిశీలించడం ద్వారా జీవిత సత్యాలకు సంబంధించిన జ్ఞానం అలవడుతుంది.

## జ్ఞాననిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్ర:

విద్యార్థులు తమ అనుభవాలనుండి నూతన జ్ఞానాన్ని పొందగలుగుతారు. స్వంత అనుభవాలే జ్ఞాన నిర్మాణానికి పునాది. తరగతి గది ఈ అనుభవాలను పంచే వేదిక కావాలి. తరగతి గదిలో బోధనాభ్యసన సన్నివేశాలు జ్ఞాన నిర్మాణానికి దోహదపడాలి. ఉపాధ్యాయుడు కేవలం బోధకునిగా మాత్రమే కాక పిల్లలు జ్ఞానాన్ని స్వంతంగా నిర్మించుకొనేందుకు దోహదపడాలి.

జ్ఞాన నిర్మాణంలో ఉపాధ్యాయుని పాత్రకు సంబంధించిన కొన్ని అంశాలను పరిశీలిద్దాం.

- పిల్లలు స్వంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునేందుకు దోహదపడాలి.
- సౌకర్యకర్తగా ఉండి విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని ఇవ్వాలి.
- సమస్యా సాధనలో పిల్లల అనుభవాలు ఉపయోగపడేలా చూడాలి.
- విద్యార్థుల జ్ఞాన నిర్మాణంలో తానూ భాగస్వామి కావాలి.
- పిల్లలకు అవసరమైన సహకారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలి.

- పిల్లల జ్ఞాన నిర్మాణంలో భాగంగా ఎక్కడైనా ఒడిదుడుకులు (failures) ఏర్పడినా, వారిని నిరుత్సాహపరచకూడదు.
- పిల్లల బలాలు, బలహీనతలను గుర్తించి అందుకు అనుగుణంగా వారికి తగిన పనిని అప్పగించాలి.
- స్వయంగా మంచి పరిశోధకుడు కావాలి.

తరగతి గదిలో ఉపాధ్యాయుడు విద్యార్థులకు తగిన సహకారం, ప్రోత్సాహం ఇస్తేనే విద్యార్థుల జ్ఞాననిర్మాణ ప్రక్రియ వేగవంతమవుతుంది. పిల్లల్లో ఆశించిన మార్పు వస్తుంది.

# మూల్యాంకనం

## వ్యాసరూప ప్రశ్నలు

1. జ్ఞాన నిర్మాణ భావనను వివరించండి. జ్ఞానానికి, సమాచారానికి మధ్యగల భేదాలను ఐదింటిని రాయండి.
2. ఏవేని 3 జ్ఞాన విచారణ పద్ధతులను వివరించండి.
3. జ్ఞానం మరియు శక్తిల పరస్పర ఆధిపత్యాన్ని గురించి చర్చించండి.
4. పుస్తక జ్ఞానం కంటే అనుభవ జ్ఞానం భిన్నమైనది. ఎలా?
5. పిల్లల్లో జ్ఞాన నిర్మాణం ఎలా జరుగుతుందో వివరించండి.
6. పిల్లల ఆలోచనలకు ప్రత్యామ్నాయ చట్రాన్ని గురించి చర్చించండి.
7. ఈ కింది విషయాల అభ్యసనంలో జ్ఞాననిర్మాణం ఏ విధంగా జరుగుతుంది

   ఎ) గణితం బి) భాష సి) సాంఘికశాస్త్రం డి) తత్త్వశాస్త్రం

## సంక్షిప్త సమాధాన ప్రశ్నలు

1. సమాచారం కంటే జ్ఞానం ఏ విధంగా ఉన్నతమైనది?
2. పిల్లల జ్ఞాన నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను వివరించండి.
3. మేయర్ సూచించిన జ్ఞాననిర్మాణ నమూనాలోని మూడు అంశాలను తెల్పండి.
4. జ్ఞాననిర్మాణానికి అనుభవజ్ఞానం ఏవిధంగా దోహదపడుతుంది?
5. జ్ఞానం, శక్తి ఒక దాని మీద ఒకటి ఏవిధంగా ఆధారపడతాయి?
6. పిల్లల జ్ఞాన నిర్మాణానికి దోహదం చేసే అంశాలను తెల్పండి.

# 4 విద్యా ప్రణాళిక మరియు అభ్యసనం (Curriculum and Learning)

**విషయక్రమం**

4.1 విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళిక మరియు పాఠ్యపుస్తకాలు

4.2 విద్యాప్రణాళిక ఎంపికలో మరియు నిర్మాణంలో వినియోగించే మార్గదర్శకాలు మరియు ప్రక్రియలు

4.3 విద్యాప్రణాళిక మరియు పాఠ్యపుస్తకాల నిర్మాణంలో జ్ఞానం–ప్రాతినిధ్యం (Knowledge - Representation) సామాజిక సమూహాల జ్ఞానాన్ని మిళితం (Inclussion), తొలగింపు (Exclusion)

4.4 గుప్త విద్యాప్రణాళిక (Hidden Curriculum) : పాఠశాల సంస్కృతి, పాఠశాలీకరణ (Schooling) ప్రక్రియలు, ఉపాధ్యాయుల నమ్మకాలు మరియు ఆలోచనలు.

4.5 విద్యాప్రణాళిక, బోధనావిధానము (Pedagogy) మరియు పిల్లల అభ్యసన మదింపు : జ్ఞానము, విద్యాప్రణాళిక పాఠ్యపుస్తకాలు మరియు అభ్యాసకుల మధ్య సంబంధం, విలీన విద్య అభ్యాసకుని స్నేహపూరిత తరగతి గదులు, అభ్యసనం కొరకు నిరంతర మదింపు.

4.6 బహుళ సంస్కృతుల, బహుళ భాషల సమాజం కొరకు విద్యాప్రణాళిక రూపకల్పన మరియు అమలు : విద్యాలక్ష్యాల సాధన, ప్రజల భాగస్వామ్యంతో వైవిధ్యభరితమైన అవసరాలు తీర్చడం, అందరికీ అభ్యసనహామీ విద్యాప్రణాళిక అనుభవాల వ్యవస్థాపనం, బోధనాభ్యసన పద్ధతుల ఎంపిక, బోధనాభ్యసన సామాగ్రి మరియు మదింపు.

**యూనిట్ లక్ష్యాలు (Objectives of the Unit) :**

ఈ యూనిట్ చదివిన తర్వాత మనం క్రింది లక్ష్యాలు సాధించగలం :

1. విద్యాప్రణాళిక మరియు పాఠ్యపుస్తకాలకు సంబంధించిన భావనలు మరియు అర్థాలు తెలుసుకుంటారు.
2. విద్యాప్రణాళిక ఎంపిక విధానం, నిర్మాణప్రక్రియ సూత్రాలను గూర్చి అవగాహన చేసుకొనుట.
3. సమాజంలో వివిధ వర్గాలకు సంబంధించిన జ్ఞానాన్ని విద్యాప్రణాళికలో చేర్చడం ద్వారా విద్యాప్రణాళిక వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలుసుకొనుట.

4. గుప్త విద్యాప్రణాళిక అనే భావనను అవగాహన చేసుకొనుట దీనిలోని అంశాలైన పాఠశాల సంస్కృతి, పాఠశాల ప్రక్రియలు మరియు ఉపాధ్యాయుల నమ్మకాలు, ఆచరణలు అవగాహన చేసుకొనుట.
5. జ్ఞానం, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తకాలు మరియు అభ్యాసకుల మధ్య ఉన్న సంబంధాలను అవగాహన చేసుకొనుట.
6. సమ్మిళిత అభ్యాసకుని స్నేహపూరిత తరగతిగదులు, స్నేహపూరిత వాతావరణం అవసరతను తెలుసుకొనుట.
7. బోధన అభ్యసన ప్రక్రియలో అభ్యసనం కోసం నిరంతర మదింపు గూర్చి అవగాహన చేసుకొనుట.
8. ఛాత్రోపాధ్యాయుడు కాలానుగుణంగా మారుచున్న విద్యాలక్ష్యాలను తెలుసుకొనుట.
9. ప్రజల భాగస్వామ్యంతో వైవిధ్యభరితమైన అవసరాలను తీర్చడంలో విద్య పాత్రను అవగాహన చేసుకొనుట.
10. సమాజంలో వ్యక్తులందరికీ అభ్యసనానికి హామీ అనేది అవసరమని గుర్తించుట.
11. అభ్యసనానికి ముఖ్యకారణమైన విషయాలను, భావాలను క్రమబద్ధీకరించే విధానాన్ని తెలుసుకొనుట.
12. వివిధ బోధనాభ్యసన పద్ధతుల ఎంపిక విధానాన్ని అవగాహన చేసుకొనుట.
13. పాఠ్యాంశానికి అనుగుణంగా బోధనాభ్యసన సామాగ్రి వినియోగం తెలుసుకొనుట.
14. మదింపు, మూల్యాంకనం మధ్య గల తేడాను తెలుసుకొనుట.

**పరిచయం (Introduction)**

ఈ అధ్యాయంలో మనం విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళిక, పాఠ్యపుస్తకాలు మరియు అభ్యసనము గూర్చి కాబోయే ఉపాధ్యాయులుగా తెలుసుకొనవలసిన ఆవశ్యకత ఉన్నది. విద్యాప్రణాళిక నిర్వచనాలు, రూపకల్పన, తయారు చేయడానికి పాటించవలసిన నియమాలు, ప్రక్రియలు తెలుసుకోవాలి. విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళిక మధ్య గల తేడాలు, వివిధ ఉపగమాలు గురించి తెలుసుకోవాలి. విద్యాప్రణాళిక మరియు పాఠ్యపుస్తకాల నిర్మాణంలో విభిన్న సామాజిక సమూహాల జ్ఞానానికి ప్రాతినిధ్యం ఇవ్వాలి. ఆ జ్ఞానాన్ని ప్రణాళికలో మిళితం చేయాలి. పాఠశాల ప్రక్రియలలో అంతర్గతంగా (Hidden) అమలుచేయబడుతున్న ప్రణాళికలను అవగాహన చేసుకోవాలి. జ్ఞానము, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తకాలతో అభ్యాసకునికి గల సంబంధాన్ని తెలుసుకోవాలి. విలీనవిద్య అభ్యాసకుని స్నేహపూరిత తరగతిగదులు, వాతావరణం గూర్చి అవగాహన చేసుకోవాలి. విద్యార్థుల అభ్యసనం మెరుగుపర్చుకోవడానికి అవలంభించే నిరంతర మదింపు విధానాలు తెలుసుకోవాలి.

**విషయం (Content)** :

సమాజ పరిస్థితులు, అవసరాలు నిరంతరం మారుతూ ఉంటాయి. మారుతున్న సమాజానికి తగిన విధంగా వ్యక్తులను తీర్చిదిద్దవలసిన అవసరం విద్యకు ఎంతైనా ఉంది. నియత విద్య ద్వారా సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తయారుచేయడానికి ప్రణాళికాబద్ధంగా విద్యావ్యవస్థలు కృషిచేస్తున్నాయి. ఈ లక్ష్యసాధనకై విద్యాప్రణాళికలు రచించబడుతున్నాయి. విద్యాప్రణాళిక ఆశయాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళికలు, పాఠ్యపుస్తకాలు ద్వారా విద్యాలక్ష్యాలు నెరవేర్చే ప్రయత్నం జరుగుతుంది. విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళిక మరియు పాఠ్యపుస్తకాల భావనలు, విద్యాప్రణాళిక–పాఠ్యప్రణాళిక మధ్య తేడాలు ఈ పాఠంలో తెలుసుకుందాం.

**విద్యాప్రణాళిక భావన, నిర్వచనాలు:**

విద్యాప్రక్రియలో విద్యాప్రణాళిక అతికీలకమైనది. ఇది విద్యాప్రక్రియను తగిన బోధనాభ్యసన అనుభవాలతో క్రమమైన రీతిలో ప్రణాళికాబద్ధంగా వ్యవస్థీకరిస్తూ సరైన దిశలో వెళ్ళేలా మార్గనిర్దేశం చేస్తుంది. విద్యాప్రణాళికను ఆంగ్లంలో Curriculum అంటారు. కర్రిక్యులమ్‌ను లాటిన్ భాషలోని Currere అనే పదం నుంచి తీసుకోబడింది. Currereఅంటే పరుగుపందెంబాట అనే అర్థం. ఇది ధావనపదం A runway అనే అర్థాన్ని లేదా ఎవరైనా ఒక వ్యక్తి గమ్యస్థానానికి చేరుకోవడానికి పరిగెత్తే మార్గం A cource which one runs a goal అనే అర్థాన్ని కూడా సూచిస్తుంది. విద్యకు సంబంధించినంతవరకూ విద్యాప్రణాళిక అనే పదాన్ని సాధారణంగా విద్యార్థి పాఠశాలలో చేయవలసిన అంశాల జాబితా (విద్యా అంశాల సమాహారంగా) అనే అర్థంతో వాడతారు.

సంప్రదాయ పద్ధతులలో విద్యాప్రణాళికను క్రింది విధంగా నిర్వహించారు.

ఒక విద్యాసంస్థ ద్వారా అందచేయబడే అంశాల జాబితా (విద్యా అంశాల సమాహారంగా) అనే అర్థంలో వాడతారు. సంప్రదాయాల పద్ధతులలో విద్యాప్రణాళికను క్రింది విధంగా నిర్వచించారు.

1. ఒక విద్యాసంస్థ ద్వారా అందచేయబడే వివిధ కోర్సుల యొక్క స్వరూపం
2. వివిధ వృత్తివిద్యలను నిర్వహించడానికి ఆయా కోర్సుల స్వరూపం
3. ఒక కోర్సులో నిర్వహించే పనికి సంబంధించిన ప్రణాళిక

విద్యాప్రణాళికను ఒక కోర్సులో అందచేసే వివిధ విషయాలుగా పేర్కొన్నారు. అయితే విద్యాప్రణాళికపై ఆధునిక ఆలోచనలు సంప్రదాయ దృక్పథానికి భిన్నంగా ఉన్నాయి.

**నిర్వచనాలు :**

విద్యాప్రణాళికను గురించి కొంతమంది విద్యావేత్తల నిర్వచనాలు పరిశీలిద్దాం.

**ఎడ్వర్డ్ (1956):** విద్యార్థులకు నిర్దేశిత అభ్యసన అనుభవాలు పొందడానికి అన్ని అవకాశాలను పాఠశాలలు కల్పించడం.

**అండర్‌సన్ (1986):** పూర్తిస్థాయిలో ప్రతిచర్యలు జరుపుకునేందుకు వీలుగా పరిపూర్ణమైన పాఠశాల వాతావరణంలో విద్యార్థి పొందే అనుభవాలు.

**కింబల్‌వైల్స్:** విద్యాప్రణాళిక అనేది అమూర్తమైనది. వ్యక్తులుగా, తల్లిదండ్రులుగా, ఉపాధ్యాయులుగా, పాఠశాల సమాజపరంగా వేరువేరు అర్థాలు స్ఫురిస్తాయి.

**సైవిడన్:** ఒక వ్యక్తిని రోజువారీ కార్యక్రమ వాతావరణానికి, తర్వాత కాలంలో విస్తృత వాతావరణానికి సర్దుబాటు అయ్యేవిధంగా నిర్వహించే ప్రక్రియలకు కావలసిన కృత్యాల నిర్వహణ.

**పి. శామ్యూల్:** పాఠశాల, తరగతి గది, ప్రయోగశాల, కార్యశాల, ఆటస్థలం అనేక ఇతర సందర్భాలలో ఉపాధ్యాయుడు, విద్యార్థుల మధ్య జరిగే చర్య, ప్రతిచర్యలతో విద్యార్థులు స్వీకరించే మొత్తం అనుభవాల సమాహారం విద్యాప్రణాళిక.

**అల్బర్ట్ & అల్బర్ట్:** పాఠశాల తన విద్యాలక్ష్యాలను సాధించడానికి విద్యార్థి నిర్వహించే కార్యకలాపాల సమాహార రూపమే విద్యాప్రణాళిక.

**కన్నింగ్‌హామ్:** కళాకారులు (ఉపాధ్యాయులు) తన చిత్రాగారం (పాఠశాల) లో తమ ముడిసరుకు (విద్యార్థి) ని తమ ఆలోచనలకు అనుగుణంగా ఒక కళాఖండంగా తీర్చిదిద్దగల చేతిలోని పనిముట్టునే విద్యాప్రణాళిక అంటారు.

**Ster house. L:** Curriculum, is perhaps, best thought of as that set of planned activities which are designed to implement a particular educational aim. Set of such aims in terms of content of what is to be taught and the knowledge, skills and attitudes which are to be the liberality fostered (winch) together with statements of cirteria for selection of content, and choices in methods, materials and evaluation.

**మాధ్యమిక విద్యాకమిషన్:** విద్యాప్రణాళిక అంటే పాఠశాలలో సాంప్రదాయకంగా బోధించే విద్యాపరమైన విషయాలు మాత్రమే కాదు. పాఠశాలలోను, తరగతిలోనూ, గ్రంథాలయంలోనూ, ప్రయోగశాలలోనూ, వర్క్‌షాప్‌లోనూ, ఆటస్థలాలలోనూ విద్యార్థులు, ఉపాధ్యాయులు మధ్య ఏర్పడే వివిధ నియత, అనియత కార్యకలాపాలు జరుగుతాయి. వీటన్నింటి ద్వారా విద్యార్థి పొందే సమస్త అనుభవాలు ఈ ప్రణాళికలో చేరతాయి. ఈవిధంగా పాఠశాల జీవితం యావత్తూ విద్యాప్రణాళిక అవుతుంది. ఇది విద్యార్థుల జీవితంతో ఉన్న సంబంధం ఆధారంగా ఉంటుంది. అంతేకాకుండా ఇది వారిలో సంతులిత మూర్తిమత్వ వికాస పరిణామ క్రమానికి తోడ్పడుతుంది.

**క్రో & క్రో:** విద్యార్థుల మానసిక, శారీరక, భావావేశ, ఆధ్యాత్మిక, నైతిక రంగాలలో వికాసం చెందేటట్లు చేయగల పాఠశాల కార్యక్రమాల మొత్తాన్ని విద్యాప్రణాళిక అని పేర్కొన్నారు.

**కార్టర్ వి. గుడ్:** వృత్తి లేదా ఉద్యోగరంగంలో వ్యక్తులను పట్టభద్రులుగా చేయడం లేదా ధృవీకరణ నిమిత్తం కావలసిన అర్హత కలిగించేందుకుగాను విద్యార్థులకు పాఠశాల సమకూర్చే బోధనాంశాలు, అనుభవాలతో కూడిన సాధారణ సమగ్ర ప్రణాళిక.


**ముర్రే:** శిశువుకు ఏఏ అనుభవాలను పాఠశాల ఏవిధంగా అందిస్తుందో లేదా శిశువును ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తుందో అవన్నీ కలిసి విద్యాప్రణాళిక అవుతుంది.

**క్రోం. కేజివెల్:** విద్యాప్రణాళిక, పాఠశాల మార్గదర్శకంలో శిశువులు పొందే వాస్తవ అనుభవాల సంకలితంగా ఏర్పడుతుంది. పై నిర్వచనాలన్నీ తరగతి గదిలోపలి, వెలుపల విద్యార్థి ఎదుర్కొనే మొత్తం అనుభవాలను ప్రముఖంగా చర్చించాయి. అదేవిధంగా ఆయా స్థాయిలలోని లక్ష్యాలు, సాధించాల్సిన అంశాలను పేర్కొనడం జరిగింది. కోర్సు నిర్మాణ క్రమం, వివిధ విషయాలు, పాఠ్యాంశాలు, లక్ష్యాలు, బోధనాభ్యసన అనుభవాలు, మూల్యాంకనం, పాఠ్యపుస్తకాల రూపకల్పన మొదలైన అంశాలన్నింటిని కలిపితే విద్యా ప్రణాళిక అవుతుంది.

## 4.1 విద్యాప్రణాళిక ఆవశ్యకత – ప్రాముఖ్యత (Need and importance of the curriculum):

సమాజంలో జీవిత అవసరాలు నిరంతరం మారుతూ ఉంటాయి. విద్య జీవిత అవసరాలను తీర్చేదిగా ఉండాలి. కాబట్టి మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యావిధానాలు, విద్యాప్రణాళిక కూడా నిరంతరం మారుతూ ఉండాలి. విద్యార్థుల మానసికస్థాయి, వైయక్తిక భేదాలను దృష్టిలో ఉంచుకొని విద్యాప్రణాళిక ముందుగా నిర్ణయించబడుతుంది. కాబట్టి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇది మార్గదర్శకంగా ఉంటుంది. సమాజానికి కావలసిన ఉత్తమమైన పౌరులను తయారుచేయాలంటే దానికి కావలసిన జ్ఞానాన్ని, వైవిధ్యమైన అనుభవాలను పాఠశాలస్థాయిలో అందించాలి. ఇది మంచి విద్యాప్రణాళిక ద్వారానే సాధ్యమవుతుంది. పాఠశాల స్థాయిలో ఇది రాజ్యాంగం వంటిది. విద్యార్థులు అధ్యయనం చేయవలసిన విషయాలు, విధానాల క్రమాన్ని ఇది నిర్ణయిస్తుంది.

డబ్ల్యు.కె. జాకబ్సన్ (1970) విద్యాప్రణాళిక రూపొందించేటప్పుడు విద్యార్థి స్వభావం, సమాజ స్వభావం, విషయ స్వభావం అనే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.




పై అంశాలను మనం పరిశీలిస్తే విద్యావ్యవస్థలో విద్యాప్రణాళిక అనే ఒక ముఖ్యమైన అంశమని, విద్యావ్యవస్థకి అదే మూలాధారం అని మనం గ్రహించగలం.

**విద్యాప్రణాళిక లక్ష్యాలు :**

1. జ్ఞాన సమాజ నిర్మాణానికి కావలసిన స్ఫూర్తితో, నూతన ఆలోచనల ఆవిష్కారం, వాటి విశ్లేషణ, నిర్ణయం తీసుకునే నైపుణ్యాలు, పరిశోధనలు ప్రోత్సహించడం.
2. భవిష్యత్ జీవితంలో విజయవంతంగా జీవించడానికి కావలసిన జ్ఞానం, నైపుణ్యాలు, విలువలు, ఆసక్తులు, అభిరుచులు, అనుభవాలు, వైఖరులను విద్యార్థులలో కల్గించడం.
3. పిల్లలలోని అంతర్గత సామర్థ్యాలు వృద్ధిచెందేలా విద్యాత్మీక వాతావరణం ఏర్పరచడం.
4. విద్యా అనుభవాల నిర్మాణం క్రమపద్ధతిలో జరిగేలా చూడడం.
5. విద్యాలక్ష్యాలు, బోధనాలక్ష్యాలు, కోర్సు సంబంధ పాఠ్యాంశాలు, బోధనాభ్యసన ప్రక్రియలు, పాఠ్యపుస్తకాలు, ఇతర సహాయసామగ్రిని రూపొందించడం.

**ఎన్.సి.ఎఫ్-2005 నిర్దేశించిన సూత్రాలు:**

1. బడిబయట జీవనానికి జ్ఞానాన్ని అనుసంధానం చేయడం.
2. బట్టీపద్ధతుల నుంచి అభ్యసన దూరం.
3. పాఠ్యపుస్తక కేంద్రంగా కాకుండా పిల్లల్లో సమగ్ర వికాసానికి పాఠ్యప్రణాళికను పరిపుష్టి చేయడం.
4. పరీక్షలను మరింత సరళం చేసి తరగతి/గది జీవనానికి అనుసంధానం చేయడం.
5. దేశ ప్రజాస్వామిక నియమాలకు లోబడి పిల్లల ఆసక్తులు, అభిరుచులను అభివృద్ధి పరచడం.

**రాష్ట్ర దృక్పథం:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పిల్లలందరూ ఉన్నతస్థాయి గుణాత్మక విద్య పొందాలనేది రాష్ట్రప్రభుత్వ దృక్పథం. ఇతరులపట్ల స్పందించే వైఖరులను కలిగిఉండే బాధ్యతాయుతమైన పౌరులుగా విద్యార్థులు రూపొందాలి. తమ పరిసరాల పట్ల పరిజ్ఞానం కలిగిఉండి, విమర్శనాత్మకంగా పరిసరాల పట్ల ఆలోచించగలగాలి. జాగ్రత్తగా విని నిర్భయంగా మాట్లాడగలగాలి. విన్నదాన్ని, చదివినదాన్ని అవగాహన చేసుకోవాలి. ప్రశ్నించే మనస్తత్వం కలిగి ఉండాలి. ఈ నైపుణ్యాలను ఉపాధ్యాయుడు పెంపొందించాలి. పిల్లలు స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తీకరించగలిగి సందేహ నివృత్తి చేసుకునేందుకు వీలుగా స్నేహపూరిత అభ్యసన వాతావరణంలో బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. ఉపాధ్యాయుడు సమాజం నుండి నేర్చుకుని, నేర్చుకున్నదాన్ని తరగతి గదిలో ఆచరణలో పెట్టాలి. పాఠశాలను, సమాజాన్ని తనదిగా భావించి, పాఠశాల దైనందిన కార్యకలాపాల్లో పాల్గొనాలి. యాంత్రికత, భౌతికత, పోటీతత్వం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితులలో ప్రతిస్పందన, సహకార గుణాలకు పాఠశాల చోటు కల్పించాలి. మానవీయ, నైతిక విలువలను పెంపొందింపజేయాలి.

KD1HZQ

**రాష్ట్ర విద్యాప్రణాళిక చట్రం - 2011:**

1. పిల్లలంతా ఇతరుల భావాలను గౌరవించే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం.
2. ప్రకృతిని, పర్యావరణాన్ని గురించి నిశితంగా పరిశీలించడం, తులనాత్మకంగా ఆలోచించగలగాలి.
3. ప్రకృతివనరుల ప్రాధాన్యతను గుర్తించి వాటి పరిరక్షణకు బాధ్యత వహించాలి.
4. జంతు వృక్షజాలం పట్ల దయ, సహనం కలిగి జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు కృషిచేయాలి.
5. విన్న, చదివిన వివిధ అంశాలను అర్థం చేసుకొని స్పందించాలి.
6. నిర్భయంగా ప్రశ్నించాలి.
7. పాఠశాల విద్య ద్వారా సహానుభూతి, తదానుభూతి కలిగి సమభావనతో మెలుగుతూ మానవ విలువలు పాటించాలి.
8. ప్రేమ, దయ, శాంతి భావనలను అర్థంచేసుకొని అనుసరించాలి.
9. పరస్పరం సహకారం, సోదర భావం కలిగి వ్యవహరించాలి.
10. భౌతిక, మానసిక, జ్ఞానాత్మక వికాసాల మధ్య సమతుల్యత ఉండేవిధంగా పిల్లల అభివృద్ధి జరగాలి.
11. సమాజపు బహుళత్వాన్ని గుర్తించడం, గౌరవించడం ద్వారా తన ఉనికిని చాటుకోగలగాలి.
12. అంకితభావం కలిగిన పౌరులుగా రూపొందించాలి.

13. తోటి మానవుల పట్ల వారి కష్టసుఖాలతో పాలుపంచుకునేందుకు సిద్ధంగా ఉండడంతోపాటు సున్నితత్వం కలిగిన వ్యక్తులుగా రూపొందించడం.
14. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తూ ఇతరులతో కలిసి పనిచేయడంలో పరస్పరం సహకారం కలిగినవారుగా ఎదగాలి.
15. తాను చేస్తున్న పనిపట్ల, విషయాలపట్ల విశ్వాసంతో కుతూహలంతో కృషి చేయగలగాలి.
16. భిన్నత్వం మనకున్న గొప్ప సంపద. మన సమాజంలో ఉన్న విభిన్న సంస్కృతులను గుర్తించాలి. వాటిని గౌరవించాలి. ఆయా సాంస్కృతిక సమూహాలతో ప్రతిచర్య చేయగలగాలి. ఇచ్చిపుచ్చుకోవాలి.
17. పిల్లల్లో దాగివున్న విభిన్న నైపుణ్యాలు, కౌశలాలు వెలికితీసి వాటిని మరింతగా మెరుగుపరచాలి.

**4.1.1 పాఠ్యప్రణాళిక :**

విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళిక అనే రెండు పదాలను వ్యవహారంలో పర్యాయపదాలుగా వాడుచున్నారు. వాస్తవంగా విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళిక కంటే విశాలపరిధి కల్గిఉంటుంది. పాఠ్యప్రణాళిక అనేది విద్యాప్రణాళిక నుంచి ఉత్పన్నమవుతుంది. ఇది విద్యాప్రణాళికలో ఒక భాగం మాత్రమే. ప్రణాళికా కార్యక్రమాలు (Curriculum) సహపాఠ్య కార్యక్రమాలు (Co-curriculum) విద్యాప్రణాళికలో భాగంగా ఉన్నాయి. పాఠ్యప్రణాళిక (Syllabus) తరగతి గదిలో బోధించవల్సిన విషయం. దీనికి పరిమితులున్నాయి. దీనిద్వారా బోధన విషయం పరిధి తెలుస్తుంది. ఇది విద్యార్థుల మానసిక పరిపక్వత, శక్తిసామర్థ్యాల మీద ఆధారపడి ఉంటుంది.

**విద్యాప్రణాళిక–పాఠ్యప్రణాళిక మధ్యగల బేధాలు :**

| విద్యాప్రణాళిక | పాఠ్యప్రణాళిక |
|---|---|
| 1. విద్యాప్రణాళికలో పాఠ్యప్రణాళికతోపాటు అనేక అంశాలు ఇమిడి ఉంటాయి. | సిలబస్ అనేది విద్యాప్రణాళికలో ఒక అంశం మాత్రమే. |
| 2. విద్యాప్రణాళిక లక్ష్యప్రధానమైనది. | ఇది విషయ వస్తు ప్రధానమైనది. |
| 3. దీని పరిధి చాలా విశాలమైనది. | పరిధి చాలా తక్కువ. |
| 4. దీనికి సైద్ధాంతిక లక్షణం ఉన్నది. | ఇది ఆచరణాత్మక లక్షణం కలది. |
| 5. ఇందులో విద్యార్థి సంపూర్ణమూర్తిమత్వానికి ప్రాధాన్యత ఉన్నది. | ఇందులో జ్ఞాన, నైపుణ్యాలకు ప్రాధాన్యత ఉన్నది. |

**పాఠ్యపుస్తకాలు (Text Books) :**

విజ్ఞానశాస్త్రాభివృద్ధి వల్ల ముద్రణ కనిపెట్టినప్పటినుంచి మానవుడు తన జ్ఞానాన్ని పుస్తకరూపంలో తమ తర్వాత తరంవారికి అందించగల్గుతున్నాడు. ప్రస్తుతం ప్రతీ విషయంపై అనేక గ్రంథాలు లభ్యమగుచున్నవి. ప్రతి తరగతిని, ప్రతి విషయంలోను పాఠ్యప్రణాళికననుసరించి పాఠ్యపుస్తకాలు వివిధ రచయితలతో రచించబడి అందరికి అందుబాటులో ఉన్నాయి. అందువల్ల ఈనాడు పాఠశాలలో ఏ విషయాన్ని బోధించడానికైనా పాఠ్యపుస్తకం ప్రాథమిక పరికరంగా ఉన్నది.

**పాఠ్యపుస్తకం – నిర్వచనాలు :**

"పాఠ్యపుస్తకం అంటే ఒక ప్రత్యేకమైన అధ్యయనశాఖకు ప్రాథమిక అనుబంధంగా ఉండే ప్రామాణిక గ్రంథం" – లాంగ్

"తరగతి గది ఉపయోగానికి జాగ్రత్తగా బోధన సామగ్రితో విద్యా రంగంలోని నిపుణుడు తయారుచేసిన పుస్తకమే పాఠ్యగ్రంథం" – బేకన్ పాసిల్

పాఠ్యపుస్తకం ఒక శాస్త్ర విద్యా కార్యక్రమంలో నిర్దేశింపబడిన సిలబస్‌ను ఆచరణకు తీసుకురావడానికి ఉపయోగించే ఒక పరికరం. పాఠ్యపుస్తకం అనేది కేవలం ఏ విషయమో లేదా పాఠ్యాంశమో కాదు. ఇది పాఠ్యాంశాల ఎంపిక, నిర్వహణకు నియంత్రించే సూత్రాలతో ఎంపికచేసిన విద్యార్థి బృందానికి జాగ్రత్తగా విషయ ప్రధానంలోను, ఉపాధ్యాయుడు, విద్యార్థులకు సహకరించే యుక్తులను నిర్మాణం చేయడంలోనూ, ఇతర సాధారణ పుస్తకాలకంటే భిన్నమైనది.

**పాఠ్యపుస్తక లక్షణాలు :**

మన దేశ అవసరాలకు అనుగుణంగా జాతీయ విద్యాలక్ష్యాలు రూపొందించారు. జాతీయ విద్యా ప్రణాళికా చట్రం 2005 (NCF-2005) ఆధారంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రాన్ని APSCF-2011 రూపొందించారు. దీని ఆధారంగా మన రాష్ట్రంలో సిలబస్‌ను తయారుచేసి దానికనుగుణంగా పాఠ్యగ్రంథాలను తయారుచేశారు.

ఇప్పటివరకు రూపొందించిన పాఠ్యపుస్తకాలు సుమారు 10 సం॥లకొకసారి మార్పులు చేర్పులకు లోనైనవి. అయితే మౌళికమైన మార్పులు నామమాత్రంగానే చోటుచేసుకున్నాయని చెప్పవచ్చు. అట్లే పాఠ్యపుస్తకాల రూపకల్పనకు ఆధారమైన విద్యాప్రణాళిక చట్రం లేదా సబ్జెక్టులవారీగా ఆధారపత్రాలుగానీ గతంలో రూపొందించలేదు. దీనివల్ల పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలు మారినవేగాని, విషయ అమరికలో, అభ్యాసాలలో వైవిధ్యత చోటుచేసుకోలేదు. అట్లే పాఠశాల విద్యకు సంబంధించిన సబ్జెక్టుల ద్వారా ఆశించే లక్ష్యాలు లేదా సబ్జెక్టుల స్వభావం, పిల్లల స్వభావం వంటివి పాఠ్యపుస్తకాల రూపకల్పనలో పూర్తిగా పరిగణనలోకి తీసుకోలేదు. అట్లే పాఠ్యపుస్తకాల ప్రమాణాల పేరుతో అధిక సమాచారంతో నిండి బరువెక్కుతాయి. గణితం, సైన్సు వంటి సబ్జెక్టులలో పై తరగతులలోని అంశాలు కింది తరగతులలో చేరాయి. ఇది మానసికంగా పిల్లలకు భారమైనది. ఐతే మన రాష్ట్రంలో అమలు జరిపిన APPEP, DPEP వంటి కార్యక్రమాల వల్ల ప్రాథమిక తరగతుల పాఠ్యపుస్తకాలలో కొంతవరకు మార్పులు చోటుచేసుకున్నవి. ఇది NCF-2005, RTE-2009, APSCF-2011 ప్రకారం మరింత సమగ్రంగా మారాల్సిన అవసరం ఉంది.

రాష్ట్ర విద్యా ప్రణాళిక చట్రం APSCF-2011 వీటిని అధిగమించి అర్థవంతమైన పాఠ్యపుస్తకాలను రూపొందించడానికి క్రింది ప్రతిపాదనలు చేసింది.

1. భాష, గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం వంటి సబ్జెక్టులలో పాఠ్యపుస్తకాలు రూపొందించడానికి సబ్జెక్టువారీగా ఆధారపత్రాలు ఉండాలి.
2. పాఠ్యపుస్తకాలు పిల్లల్ని ఆలోచింపచేసేలా, పిల్లలు తమకున్న సహజమైన శక్తిసామర్థ్యాలు వినియోగించి నేర్చుకోవడానికి దోహదపడాలి.

3. పాఠ్యపుస్తకాలు సమాచారంతో బరువెక్కకుండా, పిల్లలే సమాచారాన్ని సేకరించేలా, ఆ సమాచారాన్ని విశ్లేషించేలా, నిర్ధారణచేసేలా అవకాశం ఉండాలి.
4. పిల్లలు జ్ఞానాన్ని నిర్మించుకోవడానికి పాఠ్యపుస్తకాలు తోడ్పడాలి. ఆ జ్ఞానాన్ని నిత్యజీవితంలో వినియోగించ డానికి అవకాశం ఉండాలి.
5. పిల్లలు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, అదనపు అభ్యసనం కోసం సంప్రదింపు గ్రంథాలు, మ్యాగజైన్స్, పత్రికలు, సామగ్రి, సమాజ సభ్యులతో పరస్పర ప్రతిచర్యలు జరిగేలా పాఠ్యపుస్తకాలు అవకాశం కల్పించాలి.
6. పాఠ్యపుస్తకాలలోని భాష సరళంగా మారాలి. నేర్చుకోవడానికి భాష ఒక అవరోధంగా ఉండరాదు. బహుభాషత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలి (Multi Linguality).
7. పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలు లింగ వివక్షతకు (Gender bias) తావివ్వరాదు. పిల్లల ఆత్మవిశ్వాసం పెంచేలా, ఆలోచింపచేసేలా, మానవహక్కుల పట్ల స్పృహ పెంచేవిగా ఉండాలి. ఇందుకోసం ఆలోచనానైపుణ్యాలు, అనగా ప్రతిస్పందించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడం, బహుకోణాల్లో ఆలోచించడం, సృజనాత్మకంగా ఆలోచించడం, భావప్రసార నైపుణ్యాలు వంటివి పెంపొందించాలి.
8. స్థానిక కళలు, సంస్కృతి, ఉత్పాదక కార్యకలాపాలు, స్థానిక అంశాలు మొదలగునవి పాఠ్యాంశాలుగా ఉండాలి.
9. ఆయా సబ్జెక్టులకు నిర్ధారించిన విద్యాప్రమాణాలు, ఆశించిన అభ్యసన ఫలితాలు సాధించడానికి వీలుగా అభ్యాసాలు ఉండాలి.
10. కృత్యాలు, ప్రాజెక్టుపనులు, అన్వేషణలు, ప్రయోగాలు, బహువిధాలైన సమాధానాలు వచ్చే ప్రశ్నలు, క్రీడలు, పజిల్స్ మొదలగువాటి రూపంలో ఆలోచింపచేసే అభ్యాసాలు ఉండాలి.
11. పిల్లలు వ్యక్తిగతంగా నేర్చుకునేలా, జట్టుపనుల్లో పాల్గొనేలా పూర్తి తరగతి ద్వారా నేర్చుకునేలా అభ్యాసాలు ఉండాలి.
12. పిల్లలు సహపాఠ్యాంశాలైన మానవతా విలువలు, నైతికత, కళలు, ఆరోగ్యం, పని-అనుభవం మొదలగు అంశాలను కూడా గ్రహించడానికి వీలుగా పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాలు మరియు అభ్యాసాలు ఉండాలి.
13. పాఠ్యపుస్తకాలు కింది తరగతులకు చెందిన కనీస సామర్థ్యాల పునశ్చరణకు అవకాశం కల్పిస్తూనే, తరగతి సామర్థ్యాలు సాధించడానికి మరియు పై తరగతులకు చెందిన అంశాలకు అనుసంధానించేలా ఉండాలి.
14. పాఠ్యపుస్తకాలు ఆకర్షణీయంగా, అందంగా ఉండేలా, నాణ్యమైన పేపరు, ముద్రణ, చిత్రాలతో కూడినదై ఉండాలి.

## ఉత్తమ పాఠ్యపుస్తక లక్షణాలు :

ఉత్తమ పాఠ్యపుస్తకం ఈక్రింది లక్షణాలను కల్గిఉండాలి.

**1. విషయం**

1. ఒక తరగతి పాఠ్యపుస్తకంలోని విషయం, ఆ తరగతి పాఠ్యప్రణాళిక ననుసరించి ఆధునికంగా ఉండాలి.
2. విషయం లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి.
3. విషయం శిశుకేంద్రంగా ఉండాలి.
4. విద్యార్థులను విషయ అధ్యయనానికి, సమస్యల సాధనకు ప్రేరేపించేదిగా ఉండాలి.
5. విషయం విద్యార్థుల అవసరాలు తీర్చేదిగా ఉండాలి.
6. ఒక మౌళిక భావనను అభివృద్ధిపరచ్చడంలో తగినంత విషయం ఉండాలి.
7. విషయం విద్యార్థుల స్థాయికి తగినట్లుగా ఉండాలి.
8. సాంస్కృతిక, సాంఘిక విలువలను అభివృద్ధిపర్చేదిగా ఉండాలి. సామాజిక అవగాహనకు వీలుండాలి.
9. విద్యార్థిలోని సృజనాత్మకతను బహిర్గతపర్చడానికి అవకాశం ఉండాలి.
10. సహపాఠ్య కార్యక్రమాలకు అవకాశం కల్పించాలి.

**2. భౌతిక లక్షణాలు**

1. పాఠ్యపుస్తకం చేతితో పట్టుకొని స్కూలుకు తీసుకువెళ్ళడానికి వీలుగా ఉండాలి.
2. పుస్తకం పై అట్ట రంగురంగుల చిత్రాలతో, విజ్ఞాన విషయాలతో ఆకర్షణీయంగా ఉండాలి. బైండింగ్ చేయాలి.
3. అక్షరాల సైజు, విద్యార్థుల మానసిక, వయోస్థాయిలకు తగినట్లుగా ఉండాలి.
4. ఉపయోగించే కాగితం నాణ్యతతో తెల్లగా ఉండాలి.
5. పాఠ్యపుస్తకంతోపాటు, ఉపాధ్యాయ దర్శినులను (Teacher moduals) రూపొందిస్తే మంచిది.

**3. రచయిత**

1. రచయితకు తగిన విద్యార్హతలు, తగిన అనుభవం ఉండాలి.
2. రాసే సబ్జెక్టును అతను ఎక్కువకాలం నుంచి బోధిస్తూ ఉండాలి.
3. పుస్తక రచయితకు తాను పనిచేసే సంస్థ స్థాయి కూడా కొంతవరకు ఉపయోగపడాలి.

**4. భాష**

1. ఉపయోగించే భాష నూతన పదాలు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉండాలి.
2. విద్యార్థులు జ్ఞాపకం ఉంచుకోవడానికి వీలుగా వాక్యాలు చిన్నవిగా ఉండాలి.
3. అక్షరక్రమాలు, పదాల తప్పులు లేకుండా రాయాలి.
4. కామాలు, ఫుల్‌స్టాప్‌లు, కొటేషన్ గుర్తులు సరిగా ఉండాలి.
5. భాషా విషయ గ్రంథాలలో వ్యాకరణ దోషాలు ఉండరాదు.

**5. దృశ్యపూర్వక వివరణ**

1. పాఠ్యాంశాలకు తగిన సందర్భోచితమైన ఉదాహరణలు ఉండాలి.
2. ఇచ్చిన ఉదాహరణలు ఉపయుక్తంగా ఉండి, పాఠ్యపుస్తకంలో తగినవిధంగా తగినచోట పొందుపరచాలి.
3. వివిధ రకాలైన అభ్యాసాలు కలిగిఉండాలి.
4. నిజజీవితానికి అన్వయం కలిగిఉండాలి.
5. అభ్యాసాలు విద్యార్థులలో ఆసక్తిని రేకెత్తించేవిగా ఉండాలి.

పాఠ్యపుస్తకాలు రూపొందించడంలో పైవిధమైన ఎన్నో సూత్రాలను, కావలసిన లక్షణాలను పరిగణనలోకి తీసుకోవాలి. అయినప్పటికీ ఏదో ఒక కారణం వల్ల పుస్తకాలు పరిపూర్ణంగా ఉండటం సాధ్యం కాకపోవచ్చు. నూతన జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పొందుపరుస్తూ ఉండటంలో ఏదో ఒక లోటు కనిపిస్తుంది. అయితే ఎన్ని పరిమితులున్నా పాఠ్యపుస్తకం తప్పనిసరి. దాని ప్రాధాన్యత దానిదే. అందుచే పాఠ్యగ్రంథాలను ఎప్పటికప్పుడు మూల్యాంకనం చేసుకుంటూ కావల్సిన మంచి లక్షణాలతో రూపుదిద్దాలి.

**పాఠ్యపుస్తకం ప్రయోజనాలు:**

పాఠ్యపుస్తకాన్ని అధ్యయనం చేయడం వల్ల క్రింది ప్రయోజనాలు నెరవేరతాయి:-

1. ఇది ఉపాధ్యాయుడికి ఒక సంప్రదింపు గ్రంథంగా ఉపయోగపడును.
2. ఇది విద్యార్థి అభ్యసనాన్ని నిర్దేశిస్తుంది.
3. సాంస్కృతిక వాహకంగా, మూఢాచారాలను తొలగించి నూతన సమాజ నిర్మాణానికి, నూతన సంస్కృతిని అందించడానికి ఉపయోగపడుతుంది.
4. అభ్యసనానికి ఉపయోగపడే అవసరమైన విజ్ఞానాన్ని ఒకేచోట అందిస్తుంది.
5. విద్యార్థుల అభ్యసనంలోని పాఠ్యప్రమాణాలకు ఏకరూపత ఉంటుంది.
6. విద్యార్థులకు తార్కిక అవగాహన, సమగ్ర అభ్యసనాలకు దోహదపడుతుంది.
7. ఉపాధ్యాయునికి, విద్యార్థికి తరగతి కార్యకలాపాల్లో ఒక ఆధారంగా ఉంటుంది.

పాఠ్యపుస్తకం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికి క్రింద తెల్పిన లోపాలు కూడా ఉన్నాయనే విషయాన్ని విస్మరించకూడదు.

**NCF-1975 లో తెల్పిన పాఠ్యపుస్తకాలలోని ప్రధాన లోపాలు :**

1. అవగాహన లేకుండా కంఠస్థం చేసే సమాచారాన్ని యివ్వడం.
2. కఠినమైన భాష వల్ల సమాచారం ఆసక్తికరంగా లేకపోవడం.
3. సమాచారాన్ని తరగతి స్థాయినిబట్టి వర్గీకరణ లేకుండా ఇవ్వడం.
4. పై తరగతుల్లోనూ జీవిత కథా దృక్పథంలోనే చరిత్రను బోధించడం మొదలైనవి.

## 4.2 విద్యాప్రణాళిక ఎంపికలో, నిర్మాణంలో వినియోగించే మార్గదర్శకాలు మరియు ప్రక్రియలు (Processes and Criteria for Curriculum selection and construction)

ఈ పాఠం చదివినతర్వాత మనం క్రింది లక్ష్యాలను సాధించగలం.

1. విద్యాప్రణాళిక ఎంపికలో మరియు నిర్మాణంలో వినియోగించే మార్గదర్శకాలు/సూత్రాలు పేర్కొనగలం.
2. విద్యాప్రణాళిక ఎంపికలోని ప్రక్రియలను గ్రహించడం.

**విషయం :**

గత విద్యాప్రణాళికలు సమాజానికి, నిత్యజీవితానికి దూరంగా ఉంటూ విద్యార్థి వైయక్తిక బేధాలు, శక్తిసామర్థ్యాలు, అభిరుచులు, ఆసక్తులు, సమస్యలకంటే విషయానికి ప్రాధాన్యం కల్పిస్తూ పరీక్షలే పరమావధిగా నిలచాయి. అందువల్ల సర్వజన ఆమోదం పొందకుండా విమర్శలకు గురయ్యాయి. ఈ లోపాలను దృష్టిలో ఉంచుకొని జీవిత కేంద్రీకృతమైన, అనుభవ ఆధార విద్యాప్రణాళికను రూపొందించవలసిన అవసరం ఏర్పడింది. కాబట్టి విద్యాప్రణాళిక రూపకల్పనలో ఈ సూత్రాలను (మార్గదర్శకాలు) పొందుపర్చడం జరిగింది. వీటిని గురించి సవివరంగా తెల్సుకుందాం.

### 4.2.1 విద్యాప్రణాళిక ఎంపిక మరియు నిర్మాణంలో వినియోగించే మార్గదర్శకాలు:

విద్యాప్రణాళికను ఎంపిక మరియు నిర్మాణంలో ఈక్రింద యిచ్చిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలి.

1. **శిశుకేంద్రీకృత సూత్రం (The principle of child centredness) :** విద్యార్థి అవసరాలు, అభిరుచులకు, వయస్సుకు తగ్గ విద్యాప్రణాళికను రూపొందించాలి. ఈ సూత్రం ప్రాతిపదికగా విద్యాప్రణాళిక ఉన్నట్లయితే అది విద్యార్థుల సహజప్రచోదనము, సహజాతాలను, స్వభావాలను ప్రేరేపించగలిగి, వాటిని చక్కగా ఉపయోగించుకోగలదు. ఇందులో పొందుపర్చిన అంశాలు విద్యార్థికి సమాజంలో సరైన స్థానాన్ని ఇవ్వగలిగే అనుభవాలకు సంబంధించిన జ్ఞానమై ఉండాలి. ప్రణాళికలో విద్యార్థి శారీరక, మానసిక, ఉద్వేగాత్మక, సామాజిక అంశాలకు ప్రాధాన్యత యివ్వాలి.

2. **సృజనాత్మక సూత్రం (Principle of Creativity) :** విద్యార్థిలోని సృజనాత్మక శక్తిని, నిర్మాణాత్మక శక్తిని అభివృద్ధి చేసేవిధంగా విద్యాప్రణాళిక ఉండాలి. విద్యార్థులలో ఉండే వైయక్తిక బేధాలను దృష్టిలో ఉంచుకోవాలి. విద్యార్థిలోని ప్రత్యేక సామర్థ్యాలను, అభిరుచులను వెలికితీసి వాటిని అభివృద్ధిపరిచేవిధంగా ఉండాలి.

3. **సమాజ కేంద్రీకృత సూత్రం (Principle of Community Centredness) :** విద్య అనేది వ్యక్తులను సామాజిక అభివృద్ధికోసం తయారుచేస్తుంది. అంటే వ్యక్తి అభివృద్ధి సమాజ అభివృద్ధితో ముడిపడి ఉండాలి. సమాజ అభివృద్ధికి ఉపయోగపడే అనుకూల వైఖరులు విద్యార్థిలో కలగచేయాలి. మారుతున్న సమాజ అవసరాలకు తగినట్లుగా ప్రణాళిక ఉండాలి.

4. **ఉపయోగితా సూత్రం (Principle of Utility) :** పాఠ్యప్రణాళిక విద్యార్థులకు ఆచరణాత్మకంగా ఉపయోగపడాలి. నిత్యజీవితంలో విద్యార్థికి ఎదురయ్యే సమస్యలు, అనుభవాలకు ప్రణాళికలు సముచిత స్థానం కల్పించాలి.

5. **విరామ సమయ సద్వినియోగ సూత్రం (Principle of utilisation of leisure) :** కౌమారదశలోని విద్యార్థులకు ద్విగుణీకృత శక్తులు, ఆసక్తులు వుంటాయి. వారికి తగిన పనులు లేకపోతే వారి సామర్థ్యాలు వృధా అవ్వడమో లేక అనవసర విషయాలకు కేటాయించడమో చేస్తారు. కావున విద్యార్థి తన విరామ సమయాన్ని చక్కగా సద్వినియోగ పర్చుకునేలా అనేక కార్యక్రమాలు ఉండాలి. స్టాంప్‌ల సేకరణ, నాణేల సేకరణ, స్క్రాప్‌బుక్ తయారుచేయడం, వివిధ సబ్జెక్టుల క్లబ్స్, గ్రీన్‌కోర్ కార్యక్రమాల్లో పాల్గొనడం మొదలైనవాటికి విద్యాప్రణాళికలో ప్రాధాన్యం యివ్వాలి.

6. **జీవిత కేంద్రీకృత సూత్రం (Principle of Life Centredness) :** ఈ సూత్రం ప్రకారం ప్రణాళిక సమాజ జీవితానికి అనుగుణంగా, స్వయం సమృద్ధి సాధించేవారిగా, శారీరకంగా తగినవిధంగా వృత్తిపరంగా తగిన సామర్థ్యాలతో సిద్ధపరిచేలా ఉండాలి.

7. **సరళతా సూత్రం (Principle of Flexibility) :** విద్యాప్రణాళిక సరళంగా గతిశీలమై ఉండాలి. మార్పులు అంగీకరించని ప్రణాళిక మారుతున్న సమాజానికిగాని, విద్యార్థులకుగాని అక్కరకు రాదు. అది ఎంతో విశాలంగా, మార్పులకు అనుగుణంగా ఉన్నప్పుడు అన్ని ప్రాంతాలకు, అన్నిరకాల సమాజాల బాలబాలికల అవసరాలకు అనుగుణంగా ఉంటుంది.

8. **పరిరక్షణ సూత్రం (Principle of Conservation) :** ప్రాచీనకాలం నుండి నేటివరకు సమాజంలో అనేక సాంప్రదాయాలు ఉన్నాయి. ప్రతి సమాజానికి తనదైన సంస్కృతి ఉంటుంది. దానిని రక్షించుకొని భావితరాలకు అందించవలసిన బాధ్యత విద్యాప్రణాళికపై ఉంటుంది. కాబట్టి మనం రూపొందించే విద్యాప్రణాళిక ఈ సూత్రప్రాతిపదికన జరగాలి.

9. **సమగ్ర అనుభవాల సూత్రం (Principle of Totality of Experiences) :** అనుభవాలు అన్నీ పాఠాలే. భావి జీవితానికి ఉపయోగకరమైన అనుభవాలు అందిస్తూ నిజజీవితానికి సంసిద్ధులను చేయడానికి ప్రణాళికలో అవకాశం ఉండాలి. విరామసమయ వినియోగం, కార్యనిర్వహణ, సామాజిక కృత్యం, సాంఘిక వ్యాసాంగాలు, క్రీడామైదాన అనుభవాలు మొదలైనవి అర్థవంతంగా, జీవిత కేంద్రంగా అభ్యసన సన్నివేశాలు సమకూర్చగల్గుతాయి.

10. **సమైక్యతా సూత్రం (Principle of Integration) :** విద్యార్థి వ్యక్తిగత వికాసం, సామాజిక వికాసం రెండింటినీ సమైక్యపరిచేవిధంగా విద్యాప్రణాళిక ఉండాలి. సమాజంలో వనరుల లభ్యత, వనరుల వినియోగం, సమాజ అభివృద్ధి వైవిధ్యంగా ఉన్నట్లే విద్యార్థుల వ్యక్తిగత అవసరాలు, వికాసం, అభిరుచులు, వైఖరులు వైవిధ్యంగా ఉంటాయి. ప్రతి ఒక్కరు వనరులను సద్వినియోగ పర్చుకొని సమాజాభివృద్ధికి తోడ్పడాలి. తద్వారా సమాజంలో సమైక్యత ఏర్పడుతుంది.

11. **కృత్యకేంద్రీకృత సూత్రం (Principle of Activity Centredness) :** వినడం ద్వారా కంటే చేయడం ద్వారా విద్యార్థి త్వరగా నేర్చుకుంటాడు. ఆసక్తిగా పాల్గొంటాడు. ఎక్కువకాలం గుర్తుంటుంది. బోధనలో కృత్యాలకు, ప్రత్యక్ష అనుభవాలకు, క్షేత్ర పర్యటనలు లాంటి అంశాలకు తగిన ప్రాధాన్యత యివ్వాలి.

**12. సమగ్ర వ్యక్తిత్వ వికాస సూత్రం (Principle of Integrated Personality Development):** విద్యాప్రణాళిక విద్యార్థులలో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అంశాలలో మార్పు తీసుకువచ్చి పరిపూర్ణులుగా తయారు అయ్యేటట్లు చేయాలి. దానికి కావలసిన అన్నిరకాల అనుభవాలను ప్రణాళిక అందించాలి.

**13. సమతుల్యతా సూత్రం (Principle of Balance):** విద్యాప్రణాళిక వివిధ విషయాలు, కార్యకలాపాలు, అనుభవాలు వంటి అంశాలకు అతిగా చోటు కల్పించకుండా చక్కని సంతుల్యత నెలకొల్పాలి. ఈ అంశాన్ని సఫయ, సైదా అనే రచయితలు ఇలా వివరించారు. "ప్రత్యక్ష-పరోక్ష అనుభవం మధ్య, వైయక్తిక-సామాజిక లక్ష్యాల మధ్య, అనివార్య-ఐచ్ఛిక విషయాల మధ్య విద్యాప్రణాళిక సముచిత సంతులినం నెలకొల్పాలి.

**14. పరిణామక్రమ ఆధారిత సూత్రం (Principle of Evolution):** సమాజం చలన రహితం కాదు. అది నిరంతర పరిణామశీలి. విజ్ఞాన, సాంకేతిక శాస్త్రం అభ్యున్నతిలో పరిణామం వేగంగా జరుగుతుంది. ప్రపంచీకరణం, స్వేచ్ఛాయుత, సరళీకృత వ్యవస్థలు, ప్రైవేటీకరణం మొదలయిన వాటి ప్రభావం వల్ల సమాజంలోను, కుటుంబంలోను అనేక సమస్యలు పరిణామ క్రమంలో భాగంగా జరుగుచున్నాయి. విద్యావిధానాలు ఈ పరిణామాల ఆధారంగా ఎప్పటికప్పుడు గతిశీలతను ప్రదర్శిస్తూ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండితీరాలి. అలాంటప్పుడే విద్యాప్రణాళికలకు నిజమైన అర్థం ఉంటుంది. కావున విద్యాప్రణాళికలు పరిణామక్రమ ఆధారిత సూత్రాన్ని అనుసరించి విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేటట్లు తయారుచేయాలి.

### 4.2.2 సెకండరీ విద్యాకమిషన్ సూచించిన సూత్రాలు/మార్గదర్శకాలు

సెకండరీ విద్యాకమిషన్ తమ నివేదికలో ఆనాటి నుండి సంప్రదాయకంగా వస్తున్న మన విద్యాప్రణాళికలలో గల లోపాలను చర్చించి, వాటిని సవరించడానికి క్రింది సూత్రాలను సూచించారు.

**1. అనుభవ సాకల్య సూత్రం:** నేటికాలంలో విద్యాప్రణాళిక అంటే సాంప్రదాయకంగా పాఠశాలలో బోధిస్తున్న పాఠ్యవిషయాలు మాత్రమేకాదు. పాఠశాలలో విద్యార్థి పొందే అనుభవాలన్నీ అందులో అంతర్గతం కావాలి. అనుభవాలు తరగతిగది, గ్రంథాలయం, ప్రయోగశాల, కార్యశిబిరం, ఆటమైదానం మొ॥ వాటిలో కొన్ని నియత పద్ధతులలో మరికొన్ని అనియత పద్ధతుల ద్వారా లభిస్తూ వుంటాయి. దీనిని పరిశీలిస్తే పాఠశాలలో లభించే మొత్తం అనుభవాలు కలిసి విద్యాప్రణాళిక అవుతుంది. విద్యార్థి జీవితానికి కావల్సిన అన్ని అనుభవాలు పాఠశాల అందించాలి అని సూచించారు.

**2. వైవిధ్యతా, సామ్యతా సూత్రం :** ప్రపంచంలో ఏ ఇద్దరు వ్యక్తులకు ఒకేరకమైన అభిరుచులు, సామర్థ్యాలు ఉండవు. ప్రతి వ్యక్తి వైవిధ్యమే. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థుల ఆశయాలు, అభిరుచులు, సామర్థ్యాలు భిన్నంగా ఉంటాయి. వైయక్తిక బేధాలను దృష్టిలో ఉంచుకొని విద్యాప్రణాళిక ఉండాలని సూచించారు. ఆసక్తి లేని అంశాలను విద్యార్థిపై బలవంతంగా రుద్దకూడదు. అలా చేస్తే నిరాశ, నిస్పృహలకు లోనై వారి సహజాభివృద్ధి కుంటుపడుతుంది. అయితే విద్యార్థులందరికి కావలసిన స్థూలమైన, జ్ఞానసేత్రాలు నైపుణ్యాలు కొన్ని ఉంటాయి. ఈ క్షేత్రాలకు కూడా విద్యాప్రణాళికలో చోటుఉండాలి. అయితే ఇవి కనీసస్థాయిలో విద్యార్థుల అవగాహన శక్తికి తగినట్లుగా పరిమితంగానే ఉండాలని సూచించారు.

3. **సామాజిక జీవితంతో సంబంధిత సూత్రం :** ప్రస్తుత కాలం, రాబోయే కాలాల్లో సమాజానికి కావల్సిన లక్ష్యాలు, అవసరాలకు అనుగుణంగా విద్యాప్రణాళిక కార్యకలాపాలు ఉండాలి. వ్యవస్థీకృతమైన మానవ జీవితానికి ఉత్పాదక కృషి వెన్నెముక లాంటిది. అటువంటి కృషికి విద్యాప్రణాళిక ప్రముఖస్థానం కావాలి. పాఠశాల అనేది సమాజంలో అవిభాజ్యమైన ఒక భాగం అని గుర్తించేలా చైతన్యవంతమైన భావన ఉపాధ్యాయుడు విద్యార్థికి కల్గించాలి.

4. **విరామకాల వినియోగ శిక్షణాసూత్రం :** ప్రతి విద్యార్థికి పని ఎంత అవసరమో దానికి తగినంత విరామం అంతే అవసరం. ఈ రెండింటిని సమన్వయపరుస్తూ విద్యాప్రణాళిక రూపొందించుకోవాలి. అందుకే సాంఘిక, కళాత్మక క్రీడావిషయాలు వారికి ఆహ్లాదకరం కావడమే కాకుండా వివిధ అభిరుచులు, అలవాట్లు, పెంచుకుంటూ విరామకాలంలో మంచి శిక్షణ పొందే అవకాశం కల్పించాలి. ఉపాధ్యాయుడు విరామకాల కార్యకలాపాలపట్ల తగిన అవగాహన కల్గివుండి విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందించాలి.

5. **విషయాల అంతఃసంబంధాల సూత్రం :** విద్యాప్రణాళికను తార్కికంగా చక్కగా విభజించాలి. వీలైనంతవరకు ప్రతి అధ్యాయాన్నీ విభాగాలుగా తీర్చి వాటిని నిత్యజీవితంలో సమ్మిళితం చేయాలి. లేకపోతే అనుకున్న విద్యావిలువలు సాధించలేం. ప్రణాళికా నిర్మాణం విషయాల అంతఃసంబంధాలను ప్రతిపాదించే పద్ధతిలో చేయాలి.

ఈవిధంగా సెకండరి విద్యాకమీషన్ విద్యార్థి సంపూర్ణ వికాసానికి, దానిని వారి భావిజీవితాలకు సక్రమంగా ఆయత్తం చేయడానికి తోడ్పడేటట్లు విద్యాప్రణాళిక నిర్మాణం ఉండాలని సూచించింది.

### 4.2.3 విద్యాప్రణాళిక ఉపగమాలు (Curriculum Approaches)

విద్యాప్రణాళిక తయారీలో అనేకరకాల ఉపగమాలు ఉన్నాయి. ప్రతి ఉపగమంలో కొన్ని సుగుణాలు, కొన్ని పరిమితులు ఉన్నాయి. ఛాత్రోపాధ్యాయులు వీటిని తెలుసుకోవల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ విషయ పరిజ్ఞానం ప్రస్తుత విద్యాప్రణాళికను మదింపు చేయడానికి, భవిష్యత్తులో విద్యాప్రణాళిక రూపకర్తలు సమకాలీన అవసరాలకు తగినవిధంగా ఏ రకపు ఉపగమాన్ని అనుసరించాలో తెలుసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి. విద్యాప్రణాళిక రూపకల్పనలో క్రింది ఉపగమాలు ప్రముఖంగా ఉన్నాయి.

LMC732

1. మనోవైజ్ఞానిక ఉపగమం (Psychological approach)
2. తార్కిక ఉపగమం (Logical approach)
3. ఏకకేంద్ర ఉపగమం (Concentric approach)
4. వర్తులాకార ఉపగమం (Spiral approach)
5. కాలానుగుణ ఉపగమం (Chronological approach)
6. సహసంబంధ ఉపగమం (Correlation approach)
7. అంశరీతి ఉపగమం (Topical approach)
8. యూనిట్ ఉపగమం (Unit approach)

1. **మనోవైజ్ఞానిక ఉపగమం :** పాఠ్యాంశాలను ఎల్లప్పుడూ విద్యార్థులస్థాయి, ఆసక్తులను అనుసరించి అమర్చాలి. విద్యార్థులకు ఆసక్తిని కల్గించడానికి ఉపయోగపడే పాఠ్యాంశాలను ఒక క్రమపద్ధతిలో అమర్చడానికి మనోవైజ్ఞానిక శాస్త్ర విధానం ఉపయోగపడుతుంది. ఈ పద్ధతిలో విద్యార్థి మానసిక సామర్థ్యాలకు, అవసరాలకు ప్రాధాన్యత ఉంటుంది. విద్యార్థుల పెరుగుదల, సామర్థ్యం, అభిరుచులు, వైఖరులు, సహజసామర్థ్యాల గూర్చి బాలల మనోవైజ్ఞానిక శాస్త్రం తెలుపుతుంది. మనోవైజ్ఞానికంగా చూస్తే ఏ ఇద్దరి వ్యక్తుల సామర్థ్యాలు, అభిరుచులు, మనస్తత్వం ఒకేలా వుండదు. వారిలో వైయక్తిక బేధాలను మనం స్పష్టంగా గమనించవచ్చు. కాబట్టి వివిధ రకాలైన బాలల శక్తిసామర్థ్యాలకు, అభిరుచులకు, భావోద్వేగ, కళాత్మక సామర్థ్యాలకు అనుగుణంగా విషయాన్ని వ్యవస్థీకరిస్తే దానిని మనోవైజ్ఞానిక ఉపగమం అందురు. ఇది విద్యార్థి కేంద్రంగా వుండి, అవసరమైనచోట విద్యార్థి కోసం ప్రణాళిక పరిధి దాటే అవకాశం ఉన్నది.

ప్రణాళిక ఒకేవిధంగా ఉండాలని వాదించే వారి వాదన సరైంది కాదని రైబర్న్ అనే విద్యావేత్త తెలిపారు. దీనివల్ల చైతన్యం, సృజనాత్మకత దెబ్బతింటుందని తెలియచేసారు. వివిధ వ్యక్తులకు తగినవిధంగా ప్రేరణ, సంసిద్ధత వ్యక్తపరిచే విధంగా వైవిధ్యాలకు ఆస్కారం ఉండేలా ప్రణాళిక అమరిక ఉండాలని సెకండరీ విద్యాకమీషన్ వారు సూచించారు. మనోవైజ్ఞానిక సూత్రాల ప్రకారం విద్యార్థులకు పరిసరాలలోని విషయాలను ముందుగా పరిచేయం చేసి తర్వాత దూరప్రాంతాలకు సంబంధించిన విషయాలను తెలియచేయాలి. అదేవిధంగా అనుభవ విషయాల నుంచి నూతన విషయాలు, భౌతిక విషయాల నుంచి అభౌతిక విషయాలు, మూర్త విషయాల నుంచి అమూర్త విషయాలకు, సులభం నుంచి కఠినమైన విషయాలు ఉండేలా ప్రణాళికలోని విషయాలను అమర్చాలి.

**గుణాలు (Merits) :**

1. విద్యార్థి కేంద్రీకృత విద్యావిధానంకు అనుగుణంగా ఉంటుంది.
2. మనోవైజ్ఞానిక సూత్రాల ప్రధానంగా రూపొందించబడుటవల్ల విద్యార్థులకు సులభంగా ఉంటుంది. విద్యార్థులు ఉత్సాహంగా అభ్యసించగల్గుతారు.
3. విద్యార్థుల అవసరాలు, సామర్థ్యాలను దృష్టిలోకి తీసుకోవడంవల్ల మానసికంగా అనువైన పద్ధతి అని చెప్పవచ్చు.
4. పునరభ్యసనానికి, పునశ్చరణకు అవకాశం ఉండుటవల్ల విద్యార్థులలో అభ్యసనం దృఢంగా చేకూరుతుంది.

**పరిమితులు (Demerits) :**

1. మనోవైజ్ఞానికంగా ప్రణాళికనంతటినీ రూపొందించడం కష్టతరమైనది.
2. వైయుక్తిక భేదాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవడం కష్టమవుతుంది.

2. **తార్కిక ఉపగమం (Logical Approach) :** ఏ అంశాన్ని తెలుసుకోకపోతే మరొక అంశం సరిగా అవగాహన చేసుకోవడం సాధ్యంకాదో ఆ అంశాన్ని మొదట చేర్చి దాని జ్ఞానం ఆధారంగా నేర్చుకోదగిన అంశాన్ని తర్వాత అమర్చడం తార్కిక క్రమం అవుతుంది. అలాగే కార్యకారణ సంబంధాలకు విషయంలోని

కాఠిన్యతను, విద్యార్థుల స్థాయిని దృష్టిలో ఉంచుకొని హేతుబద్ధంగా పాఠ్యప్రణాళికను వ్యవస్థీకరించడాన్ని కూడా తార్కిక క్రమం అంటారు. ఏ క్రమపద్ధతిలో అమర్చినప్పటికి అర్థవంతంగా, ప్రయోజనకరంగా ఉండే దానిని కూడా తార్కిక క్రమం అనిచెప్పవచ్చు.

అభ్యసనా నియమాల ఆధారంగా చెప్పుకుంటే తార్కికక్రమం అంటే "సరళం నుండి క్లిష్టతకు", "తెలిసిన విషయాల నుంచి తెలియని విషయాలకు" ఇలా చెప్పవచ్చు. అయితే ఇందులో విషయ క్లిష్టతకు ప్రాధాన్యత ఉండదు. పాఠ్యాంశాల క్రమం నిర్ణయించడానికి మనోవైజ్ఞానిక విధానం, కారణనిర్ణయానికి తార్కిక విధానం ఉపయోగపడటం ఈ రెండు విధానాలు ఒకదానికొకటి పరస్పరాధారితాలు. కావున విద్యాప్రణాళిక రూపకల్పనకు ఈ రెండు పద్ధతుల మేలుకలయిక ఉత్తమమైనది.


**గుణాలు (Merits) :**

1. బోధనాభ్యసన క్రమబద్ధంగా కొనసాగించుట వల్ల విద్యార్థులకు చక్కగా అవగాహన కల్గుతుంది.
2. తెలిసిన విషయాలు నుంచి తెలియని విషయాలు వైపుకు అభ్యసనం సాగటం వల్ల విద్యార్థులు ఇంకా ఎక్కువ జ్ఞానం పొందడానికి ప్రేరణ కల్గుతుంది.
3. విద్యార్థులలో ఆలోచనాశక్తి, వివేచనాశక్తి అభివృద్ధి చెందుతాయి.
4. విద్యార్థులలో హేతువాదశక్తి పెరుగుతుంది.

**పరిమితులు (Demerits) :**

1. ఒకరు తార్కికంగా పొందుపర్చిన విషయాలు వేరొకరికి తార్కికంగా అనిపించక పోవచ్చు.
2. ప్రతి విషయాన్ని తార్కికంగా పొందుపర్చాలంటే వీలుకాకపోవచ్చు.
3. సంక్షిప్తమైన విషయాలను తార్కికంగా అమర్చడం కష్టం.
4. వివిధ సామర్థ్యాలున్న విద్యార్థులందరికీ తగినవిధంగా ఉండకపోవచ్చు.

**3. ఏకకేంద్ర ఉపగమం (Concentric Approach) :** ఇది మనోవైజ్ఞానిక సూత్రాలపై ఆధారపడి రూపొందింది. ఈ పద్ధతిలోని ముఖ్యసూత్రం "ఒక అంశానికి చెందిన అన్ని విషయాలను సూక్ష్మంగా చెప్పడం". వివిధ రకాలైన శీర్షికల్ని అంచెలంచెలుగా పాఠ్యప్రణాళికలో అభివృద్ధిచెందించే పద్ధతిని ఏకకేంద్ర ఉపగమం అంటారు. ఈ పద్ధతిలో ప్రాథమిక భావనలు, విషయాలను దిగువ తరగతిలో బోధిస్తారు. క్లిష్టమైన భావనలను పైతరగతిలోనూ, ఇంకా క్లిష్టమైన భావనలను ఆపై తరగతులలోనూ బోధించడం జరుగుతుంది. అంటే ఒక పాఠ్యాంశం ముఖ్యభావనలను విద్యార్థుల వయస్సు, మానసికస్థాయి, సామర్థ్యాలు ఆధారంగా బోధించడం జరుగుతుంది. అంటే విద్యార్థి వయస్సు, సామర్థ్యాలు ఆధారంగా పాఠ్యాంశం ముఖ్యభావనల స్థాయి కూడా పెరుగుతూ వెళుతుంది. తరగతిస్థాయి పెరిగేకొలదీ విషయం పరిజ్ఞానం విస్తరిస్తూ ఉంటుంది. సరళమైన ప్రాథమిక భావనలు ప్రాథమికస్థాయిలోనూ క్లిష్టమైన అంశాలు పై తరగతులలోనూ ప్రవేశపెడతారు. అభ్యసనాక్రమ సరళత నుంచి క్లిష్టతవైపు ప్రయాణిస్తుంది.




ఒక్కొక్క వలయం ఒక తరగతిని సూచిస్తుంది.

ప్రతి త్రికోణం ఒక సబ్జెక్టు పరిధిని సూచిస్తుంది.

**ఏకకేంద్ర ఉపగమ ప్రయోజనాలు:**

1. ఈ పద్ధతి సరళత నుంచి క్లిష్టతకు దారితీస్తుంది. కాబట్టి ఇది విద్యార్థుల మానసిక స్థాయికి సరైంది.
2. విద్యార్థులు నిరంతరాయంగా కొన్ని సంవత్సరాలపాటు విని పాఠ్యాంశపు లోతుల్లోకి వెళ్ళడం వల్ల విద్యార్థులకు చక్కని అవగాహన ఏర్పడి ఎక్కువకాలం గుర్తుంటుంది.
3. విద్యార్థి ఏ దశలో పాఠశాల మానివేసినప్పటికీ కనీస ప్రాథమిక భావాలపట్ల అవగాహన ఉంటుంది.
4. ఒక తరగతిలోని పాఠ్యాంశ భావాలకు క్రింది తరగతిలో నేర్చుకున్న భావాలు పునాది కాబట్టి సులభంగా అవగాహన ఏర్పడుతుంది.
5. అధ్యయన అంశం ప్రతీ స్థాయిలోను మొత్తంగా (Holistics) చెప్పడం జరుగుతుంది.
6. పాఠ్యాంశాలలో గల విషయం ఏ తరగతిలోకి వెళ్ళినప్పటికీ సుపరిచితమే కావున పరిచయం లేని విషయాలను నేర్చుకున్నామనే భావన ఉండదు.
7. ప్రతీ తరగతిలో అనేక విషయాలు చేర్చడం వల్ల వివిధ విషయాలకు సంబంధించిన మౌలిక జ్ఞానాన్ని విద్యార్థులు పొందగల్గుతారు.
8. పాఠ్యాంశాల కాఠిన్యత విద్యార్థుల వయస్సు, పరిపక్వత, మనోవైజ్ఞానిక సూత్రాల ఆధారంగా నిర్మించడం వల్ల విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారు.
9. విద్యార్థులలో ఆసక్తిని పెంచుతుంది, పునశ్చరణ సులభమవుతుంది.

**పరిమితులు :**

1. ఒకే పాఠ్యాంశాన్ని అనేక సంవత్సరాలు చదవడం వల్ల విద్యార్థులకు విసుగు కలుగుతుంది. నూతనత్వం లోపిస్తుంది.

2. ఒకే పాఠ్యాంశాన్ని అనేక సంవత్సరాలపాటు వినడం అంటే విలువైన సమయం వృధా అయినట్లేనని కొందరి అభిప్రాయం.

3. విద్యార్థుల వయస్సు, పరిపక్వత, వైయుక్తిక భేదాలకు అనుగుణంగా ఒక పాఠ్యాంశాన్ని భాగాలుగా చేసి ఆయా భాగాలను అనేక సంవత్సరాలు సర్దుబాటు చేయడం కూడా చాలా కష్టమైన పని.


4. ఏ అంశాన్ని విద్యార్థులు ఒక తరగతిలో పూర్తిగా నేర్చుకోవడానికి అవకాశం లేదు.

5. ఉపాధ్యాయుడు విద్యార్థులకు ప్రతీ సంవత్సరం బోధించవలసివచ్చినపుడు ప్రతి ఏడాది కొత్త ఉదాహరణలతో, నూతన దృష్టాంతాలతో బోధించడం కష్టమవుచున్నది.

6. ఒకే విషయం అనేక పర్యాయాలు ప్రతి తరగతిలో అభ్యసించడం విసుగు కల్గిస్తుంది.

**4. వర్తులాకార ఉపగమం (Spiral Approach) :** ఏ శాస్త్రమైనా ప్రథమ స్థాయిలోనే సమగ్రంగా బోధించకూడదనే సూత్రంపై వర్తులాకార పద్ధతి ఆధారపడి ఉంది. అంశపద్ధతిలోని లోపాలను వర్తులాకార పద్ధతి తొలగిస్తుంది. ఈ పద్ధతిలో ప్రతి పాఠ్యాంశాన్ని వాటి కాఠిన్యత ఆధారంగా విభజించడం జరుగుతుంది. “సులభమైన వాటినుండి కష్టమైన వాటికి” అనే ఉపగమం ఆధారంగా ఆయా భాగాల క్రమాన్ని అమరుస్తారు. విద్యార్థుల మానసిక స్థాయినిబట్టి వివిధ తరగతులలో ప్రతీ భాగాన్ని సరైన దిశలో ప్రవేశపెట్టడం జరుగుతుంది. అయితే ఈ పద్ధతిలో ఒక ముఖ్యమైన జాగ్రత్త తీసుకోవల్సి ఉంది. అంశాన్ని భాగాలుగా చేసేటపుడు, కొన్ని భాగాలు మరీ పెద్దవిగానూ, కొన్ని భాగాలు మరీ చిన్నవిగా కాకుండా చూడాలి. అంశభాగం మరీ పెద్దదైతే అధ్యయనానికి ఎక్కువకాలం పట్టి విద్యార్థికి ఆసక్తి లేకపోవచ్చు. అంశభాగం మరీ చిన్నదైతే అభ్యసనానికి తక్కువకాలం పట్టి విద్యార్థిపై ప్రభావం కలుగచేయలేదు. ఈ విధానం ఒక తరగతిలో బోధించబడదు. పాఠ్యవిషయం కూడా అవిచ్ఛిన్నంగా ఒక కొననుంచి చివరివరకూ అంటే ఒక తరగతి నుంచి పైతరగతుల వరకూ వ్యాపించి ఉంటుంది. తరగతి పెరుగుతున్నకొలదీ పాఠ్యాంశాల స్థాయి కూడా అవిచ్ఛిన్నంగా పెరుగుతుంది.

ఉదాహరణకు భారతదేశ చరిత్రను అధ్యయనం చేసేటపుడు ప్రాథమిక దశలోని చిన్న తరగతులలో మన చారిత్రక వీరులలో కొంతమంది జీవిత గాధలను, వారు సాధించిన విజయాలు, వాటివల్ల మన దేశానికి, ప్రాంతాలకు చేకూరిన ప్రయోజనాలను బోధించడం మంచిది.



**గుణాలు :**

1. దీనిలో మనోవిజ్ఞానశాస్త్రరీత్యా విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉన్న పాఠ్యాంశాల కూర్పు జరుగుతుంది.
2. దీనిలో సరళమైన వాటినుంచి సంక్లిష్టదశకు, సర్వస్వం నుంచి భాగాలకు కొనసాగుతుంది.
3. ఈ విధానం ద్వారా విద్యార్థులు పాఠ్యప్రణాళికలోని సంక్లిష్టమైన భావనలను చక్కగా అవగాహన చేసుకోవడం సాధ్యమే.
4. ఈ పద్ధతి ద్వారా విద్యార్థులలో ఆసక్తిని రేకెత్తిస్తుంది. సవరణ కూడా సులభతరమవుతుంది.
5. ఈ పద్ధతి సామాన్య మార్గాన్ని అనుసరిస్తుంది.
6. ఈ పద్ధతిలో నిరంతర పునరుక్తి జరుగుతూ ఉంటుంది. విద్యార్థులు విషయాన్ని ఎక్కువకాలం గుర్తుంచుకుంటారు.
7. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా పాఠ్యాంశ కాఠిన్యత ఉంటుంది. అభ్యసన ప్రక్రియ ఫలవంత మవుతుంది.

**పరిమితులు:**

1. ఈ పద్ధతి అమలుచేయాలంటే నిష్ణాతులైన ఉపాధ్యాయులు అవసరం.
2. ఒకే విషయం పదే పదే బోధించడం వల్ల విద్యార్థులకు విసుగుపుట్టవచ్చు.
3. పాఠ్యాంశాల్లో కొత్తదనం లోపించడం, సంకుచిత మార్గాన్ని అవలంభించడం వల్ల విద్యార్థులు కోరిన సంఘటనలు గూర్చి తెలుసుకోవడం జరుగదు.
4. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇది తగిన ఉపగమనం కాదు.
5. విద్యార్థుల దృష్టిని ఆకర్షించడంలో విఫలమవుతుంది.
6. ఈ విధానంలోని పాఠ్యాంశాలపై విద్యార్థులకొక సుపరిచిత భావన ఏర్పడుతుంది. కానీ తమకు ఇంకా సంపూర్ణ జ్ఞానం రాలేదనే భావం విద్యార్థులలో ఏర్పడుతుంది.

5. **కాలానుగుణ ఉపగమం (Chronological Approach):** ఈ పద్ధతిలో కాలానికి ప్రాధాన్యత ఉంటుంది. ముందు జరిగిన విషయాలు ప్రణాళికలో ముందుగా ఉంటాయి. ఆతర్వాత జరిగిన విషయాలు క్రమంగా వివరించడం జరుగుతుంది. కాలనిర్ణయశాస్త్రాన్ని సాధారణ వాడుకలో ఉన్న విధానం ప్రకారం గతం నుంచి వర్తమానానికి వర్తింపచేస్తే అతిస్పష్టమైన, తర్కబద్ధమైన, ఆమోదయోగ్యమైన కార్యక్రమాన్ని మనకు సమకూరుస్తుంది. దీనివల్ల మనకు ఏదైనా ఒక సంస్థ, ఒక ప్రక్రియ, ఒక ఉద్యమం, ఒక ఆచారం ప్రారంభమై పురోగమించి ఈనాటికి ఎలా రూపుదిద్దుకుందో తెలుస్తుంది.

   విషయాలను సంఘటితపరిచే పద్ధతిని అవలంభించి వాటిని అమర్చినప్పుడు బోధన సులభతరమవుతుంది. అంతఃసంబంధాన్ని కనుక్కోవడం వల్ల అది ప్రేరణకు, అభ్యసనానికి దోహదపడుతుంది. విద్యాబోధనను కాలక్రమానుగత శ్రేణిలో బోధించడమే ఈ ఉపగమం ప్రధాన ఉద్దేశం. ఒకసారి బోధించిన దానిని

పునరావృతం చేయడం జరగదు. మొత్తం కోర్సును కొన్ని నిర్ణీత దశలలో విభజించాలి. ఉదాహరణకు భారతదేశ చరిత్రను క్రిందివిధంగా విభజించవచ్చు.

ప్రాచీనయుగం

మధ్యయుగం

మొఘలాయి యుగం

స్వాతంత్ర్యానంతర యుగం

ఈ ఉపగమం ప్రాథమిక స్థాయికి అంత ప్రయోజనకరం కాదు. ఇది మాధ్యమిక స్థాయిలో ఉపయోగించదగిన ఉపగమం. చరిత్ర పాఠ్యాంశాలు బోధించడానికి ఇది చక్కగా ఉపయోగపడుతుంది. ఎందుకంటే చరిత్ర యావత్తు కాలమానానికి సంబంధించి ఉంటుంది. ఒక చరిత్ర సబ్జెక్టునేగాక ఈ పద్ధతిని మిగతా సబ్జెక్టులకు కూడా అన్వయించవచ్చు.

**గుణాలు :**

1. జరిగిపోయిన కాలానికి (గతకాలం) సంబంధించిన విషయాలు తెలుసుకోవాలనే తృష్ణ విద్యార్థులలో కల్గుతుంది.
2. మన జాతి, సంస్కృతి, ఆచార సంప్రదాయాలు గురించి విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుంది.
3. ప్రతి సంవత్సరం కొత్త విషయాన్ని బోధించడం వల్ల వైవిధ్యం ఉంటుంది. దానివల్ల విద్యార్థులు అభ్యసనం పట్ల మక్కువ చూపుతారు.
4. దేశభక్తి, జాతీయతాభావం విద్యార్థులలో పెరగడానికి ఉపయోగపడుతుంది.
5. విద్యార్థుల వైయుక్తిక భేదాలకు అనుగుణంగా అభ్యసనం జరుగుతుంది.
6. ఒక అంశం పట్ల సమగ్ర అవగాహన విద్యార్థులకు కల్గుతుంది.

**పరిమితులు :**

1. నిరంతరం కాలాలకు సంబంధించిన విషయాలు ఉండుట వల్ల విద్యార్థులకు విసుగు ఏర్పడవచ్చు.
2. విద్యార్థులు చరిత్రలో ఒక యుగం గురించి చదవడం ప్రారంభించేసరికి అంతకుముందు నేర్చుకున్న విషయాలు మర్చిపోవచ్చు.
3. మధ్యలో బడి మానివేసిన విద్యార్థులు కొన్ని విషయాలు తెలుసుకునే అవకాశం కోల్పోతారు.
4. ఇది మనస్తత్వపరమైన సూత్రానికి అంటే సర్వస్వం నుంచి భాగాలకు వెళ్ళాలనే సూత్రానికి పరిమితమైనది.

**6. సహసంబంధ ఉపగమం :** ఒక విషయాన్ని బోధిస్తున్నప్పుడు ఆ విషయానికి సంబంధించిన అనేక ఇతర సబ్జెక్టులతో అంతఃసంబంధాన్ని నెలకొల్పుతూ బోధన చేయడాన్ని సహసంబంధ ఉపగమం అంటారు. ఉపాధ్యాయుడు వివిధ విషయాలకు సంబంధించిన పాఠ్యాంశాలను పూర్తిగా తెలుసుకోగలిగితే, సాదృశ్యాలను, బేధాలను, సంబంధాలను రూపొందించే నేర్పు పొందితే చక్కని సహసంబంధం తయారుచేయగలడు.

ఉదాహరణకు జనాభా అనే పాఠ్యాంశం విద్యార్థులకు చెప్పేటపుడు జనాభా పెరుగుదల గురించి, జనాభా తరుగుదల గురించి, వాటి లాభ నష్టాలు గురించి, జనాభా సంక్షేమానికి గల చర్యలు విద్యార్థులకు వివరించడం. జనాభా పెరుగుదల వచ్చే సమస్యలు చెప్పాలంటే సామాజికశాస్త్ర పరిజ్ఞానాన్ని జోడించాలి. ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల ఒకే రకంగా లేకపోవడం చెప్పాలంటే భౌగోళిక శాస్త్ర జ్ఞానం అవసరం అవుతుంది. జనాభా పెరుగుదలకు తలసరి ఆదాయ తగ్గుదలకు కారణాలు చెప్పాలంటే ఆర్థికశాస్త్ర పరిజ్ఞానం అవసరమవుతుంది. ఈవిధంగా జనాభా అనే పాఠ్యాంశాన్ని చెప్పేటప్పుడు వివిధ విషయాల దానికి గల సంబంధాన్ని వివరిస్తూ బోధించడమే సహసంబంధ బోధన అని చెప్పవచ్చు.

**గుణాలు :**

1. విడివిడిగా బోధించడం కంటే సహసంబంధం ఏర్పరచి బోధించడం వల్ల పాఠ్యాంశాలకు ఒక సమగ్రత ఏర్పడుతుంది.
2. సహసంబంధం చేయడం వల్ల పాఠ్యవిషయాలు ఆసక్తికరంగా తయారు అవుతాయి.
3. సహసంబంధం చేసి బోధించడం వల్ల విద్యార్థులలో సృజనాత్మకత, వైజ్ఞానిక ఆలోచనలు వృద్ధి చెందుతాయి.
4. ఈ విధానం విద్యార్థి నిత్యజీవితంలో చక్కగా ఉపయోగపడుతుంది.

**పరిమితులు :**

1. సహసంబంధం వల్ల పాఠ్యవిషయాల మధ్య నిర్బంధంగా, అసహజంగా ఉండే సహసంబంధానికి దారితీయవచ్చు.
2. బలవంతంగా ఏర్పరచే పరస్పర సంబంధం వల్ల ఆయా విషయాలకు నిర్దేశించిన విద్యాలక్ష్యాలు కుంటుపడతాయి.
3. సరైన సంబంధం ఏర్పరచకపోతే అనుకున్న లక్ష్యాలు నెరవేరవు.
4. ఉపాధ్యాయులు ఈ పద్ధతి కోసం అతిగా ప్రయత్నిస్తే అనవసరమైన, అక్కరలేని సంబంధాలు ఏర్పడతాయి.

**7. అంశరీతి ఉపగమం (Topical Approach) :** ఈ పద్ధతిలో ఒక అంశాన్ని తీసుకొని దానికి సంబంధించిన అన్ని విషయాలను ఒక తరగతికి చెందిన విద్యాప్రణాళికలో పొందుపరుస్తారు. ఒక అంశానికి చెందిన అన్ని విషయాలను ఒక తరగతిలోనే బోధిస్తారు. ఇదే అంశం మరే తరగతి ప్రణాళికలోనూ కనిపించదు.

అంశపద్ధతి అనేక రూపాలలో ప్రవేశపెట్టవచ్చు. ముందుగా ఉపాధ్యాయులు అంశం పేరును ప్రకటించి తర్వాత చర్చాకార్యక్రమం నిర్వహించి తర్వాత వివరణ యిస్తారు. దీనివల్ల విద్యార్థుల్లో ప్రేరణ కలిగి అభ్యసనం స్వతఃసిద్ధంగా జరుగుతుంది. లేదా ఉపాధ్యాయులు ఏదైనా బోధనోపకరణం సహాయంతో కూడా ప్రవేశపెట్టవచ్చు. సాధారణంగా నిజజీవిత సన్నివేశాలు, దైనందిన కార్యక్రమాలు, పరిసరాలకు సంబంధించినవి తీసుకొనబడతాయి.

**గుణాలు :**

1. బోధనలో విద్యార్థుల పాత్ర కూడా ఉంటుంది. వారి ఆసక్తులను, ప్రేరణలను పెంపొందిస్తుంది.
2. అభ్యసనం విద్యార్థి నిజజీవిత సన్నివేశాలకు, దైనందిన కార్యకలాపాలకు సంబంధించినదిగా ఉంటుంది. విద్యార్థులు ఉత్సాహంగా అభ్యసన కార్యక్రమంలో పాల్గొంటారు.
3. ఈ పద్ధతి వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, చొరవ పెరుగుతాయి.
4. బోధనాభ్యసన కార్యక్రమాలు జీవంతో తొణికిసలాడతాయి.
5. ఏదైనా ఒక విషయం పట్ల ఒకేసారి సంపూర్ణ అవగాహన ఏర్పడును.

**పరిమితులు :**

1. ఈ పద్ధతి ఆచరణాత్మకంగా చాలా కష్టమైనది.
2. ఈ పద్ధతి విజయవంతమవ్వాలంటే చక్కటి గ్రంథాలయం అవసరం.
3. ఈ పద్ధతి అమలుచేయాలంటే సమర్థులైన ఉపాధ్యాయులు అవసరం.
4. ఈ పద్ధతి అమలుచేయాలంటే తగిన బోధనాభ్యసన సామాగ్రి అందుబాటులో ఉండాలి.
5. ఈ ఉపగమం అన్ని అంశాలకు వీలు కుదరదు. కొన్ని అంశాలకు మాత్రమే ఉపయోగపడుతుంది.
6. ఈ ఉపగమం చాలా అసహజమైంది, అసాధ్యమైంది.
7. ప్రతి అంశంలోను కొన్ని విద్యార్థుల స్థాయికి అందుబాటులో ఉండే విషయాలు, భావాలు, సూత్రాలు మొదలైనవి ఉంటాయి. అదేవిధంగా విద్యార్థుల స్థాయికి అందుబాటులో లేనివి, కఠినమైనవి కూడా ఉంటాయి.
8. ఒక తరగతిలో ప్రవేశపెట్టిన అంశం పాఠశాల స్థాయిలో మరలా ఏ తరగతిలోనూ బోధించనందువల్ల ఆ అంశాన్ని విద్యార్థులు పూర్తిగా మర్చిపోయే అవకాశం ఉంది.
9. ఒక అంశాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవాలంటే అనేక అంశాలు తోడ్పడతాయి. ఈ ఉపగమంలో విద్యార్థులకు ఒక విషయం మీద సంపూర్ణ అవగాహన ఏర్పడే అవకాశం తక్కువగా ఉంటుంది.

8. **విభాగ ఉపగమం (Unit Approach) :** విభాగ ఉపగమం గెస్టాల్ట్ మనస్తత్వశాస్త్రం ఆధారంగా రూపొందించ బడింది. గెస్టాల్ట్ మనస్తత్వ శాస్త్రవేత్తలు మానవ ప్రవర్తన, ప్రవృత్తులను ఏకమొత్తంగా పరిశీలించాలనే వాదాన్ని ప్రతిపాదించారు. వీరి శాస్త్రప్రకారం విద్యావిషయంలో కూడా ఏకత్వాన్ని అన్వయించారు.

ఈ ఉపగమంలో ఒక సబ్జెక్టుకు సంబంధించిన విషయాన్ని కొన్ని విస్తృతమైన భాగాలుగా విభజించడం జరిగింది. ఒక్కొక్క భాగాన్ని ఒక యూనిట్ అంటారు. ప్రతీ యూనిట్‌లో నైపుణ్యాలు, అలవాట్లు, అభిరుచులు విద్యార్థులలో పెంపొందిస్తాయి. ప్రతీ యూనిట్‌ను, సబ్‌యూనిట్స్‌గా విభజించేముందు వాటిని శ్రేణీకృతం చేసి సులభం నుంచి కష్టమైనవి అనే మనోవైజ్ఞానిక సూత్రాన్ని పాటించవలసి ఉన్నది. అదేవిధంగా వివిధ యూనిట్స్‌ను తార్కిక ఉపగమం క్రమంలో అమరుస్తూ యూనిట్‌కు,

యూనిట్‌కు మధ్య చక్కని అంతఃసంబంధం నెలకొల్పేటట్లుగా చూడాలి. రెండు ఘటనల పరస్పర సంబంధాలను అధ్యయనం చేసేటపుడు విద్యార్థులలో చక్కని అవగాహన ఏర్పడును. పరస్పర సంబంధం ఉన్న భావనలు యూనిట్‌లోని కేంద్రీయ ఇతివృత్తంలో అర్థవంతంగా అమర్చబడి వుంటాయి. యూనిట్‌ను ఒకేరకమైన బోధనపద్ధతిగా భావించవచ్చు. పాఠ్యప్రణాళికలో దగ్గర సంబంధం ఉన్న పాఠ్యాంశాలన్నింటిని కలిపి ఒక యూనిట్ లేదా ప్రమాణంగా చేస్తారు.

**4.2.2 యూనిట్ నిర్వచనాలు:**

**హెన్రీ మోరిసన్ ప్రకారం –** "ఒక పరిసరానికిగాని, శాస్త్రానికిగాని, కళకుగాని, ప్రవర్తనకుగాని సంబంధించిన ముఖ్యమైన, సమగ్రమైన భాగమే విభాగం లేదా యూనిట్".

**వెస్లీ నిర్వచనం –** "విద్యార్థులలో అంతర్లీనంగా దాగివున్న అభిలషణీయమైన ఫలితాలను బయటకు తీయడానికి ఒక క్రమమైన పద్ధతిలో పొందుపరిచిన విషయ, అనుభవాల నిర్మాణమే అంశం".

**ప్రెస్టన్ అభిప్రాయం ప్రకారం –** "పరస్పర సంబంధం ఉన్న ఒక సుదీర్ఘమైన సబ్జెక్టు విషయాన్నే యూనిట్ అంటారు. ప్రతి యూనిట్‌లో సబ్‌యూనిట్స్ ఉంటాయి. ఆ సబ్‌యూనిట్స్‌లో కొన్ని పాఠ్యాంశాలు ఉంటాయి. ప్రతీ పాఠ్యాంశంలోని భావన యూనిట్ సమగ్ర భావనను అందించే దిశలో ఉంటుంది.

**మంచి యూనిట్‌కు ఉండవలసిన లక్షణాలు:**

1. విద్యార్థుల వయస్సు, స్థాయి, అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా ఉండటం.
2. విద్యార్థుల వైయక్తిక భేదాలకు అనుగుణంగా ఉండటం.
3. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తుల్ని పెంపొందించేటట్లుగా ఉండటం.
4. ఒక అంశానికి సంబంధించి వివిధ విషయాల్ని సంపూర్ణంగా అందించడం.
5. భౌతిక, మానసిక, అభ్యసన కార్యక్రమాల్లో విద్యార్థులను ప్రోత్సహించడం.
6. విద్యార్థుల జీవనసరళికి అనుకూలంగా ఉండటం.
7. తార్కిక పద్ధతిలో సహసంబంధాన్ని కల్గిఉండటం.
8. అర్థవంతమైన బోధనకు ఉపయోగపడటం.
9. యూనిట్ కీలకమైన సమస్య లేదా విషయాలకు సంబంధించి ఉంటుంది.
10. యూనిట్ బోధనసౌలభ్యం కోసం ఉద్భవించింది.

**యూనిట్స్ – రకాలు :**

1. **వనరుల యూనిట్ (Resource unit) :** ఉపాధ్యాయులకు అవసరమైన విస్తృత సమాచారాన్ని అందించే యూనిట్లను వనరుల యూనిట్ అంటారు. బోధనకు అవసరమైన ఆలోచనలు రేకెత్తించడానికి, ఉపాధ్యాయులకు జ్ఞాననిధిగా ఇవి ఉపయోగపడతాయి. వీటి పరిధి చాలా ఎక్కువ.

2. **బోధన యూనిట్ (Teaching unit) :** విద్యార్థులకు అవసరమైన సమాచారాన్ని అందించే యూనిట్లను బోధనా యూనిట్స్ అంటారు. బోధనా యూనిట్స్ వనరుల యూనిట్స్‌లో భాగంగా ఉంటాయి. ఇవి ప్రత్యేక ఉద్దేశ్యాలకు అనువుగా ఉంటాయి. ఇది కార్యనిర్వహణ భాగం. దీనిని ఉపాధ్యాయులు ఒక ప్రత్యేక తరగతి బోధన కోసం తయారుచేసుకుంటారు.

3. **అనుభవ ప్రాముఖ్య యూనిట్ (Experience unit) :** ఇవి అనుభవాల కేంద్రంగా ఉంటాయి. విద్యార్థుల నిజజీవిత సన్నివేశాలు లేదా సమస్యలకు సంబంధించిన అంశాలు యిందులో చేర్చుతారు. బల్లార్డ్ చెప్పినట్లుగా దీనివల్ల నిజజీవిత భాగాన్ని తరగతి గదిలోకి దిగుమతి చేసుకున్నట్లవుతుంది. విద్యార్థులలో సమస్యలను ఎదుర్కొనే శక్తి పెంపొందుతుంది. విద్యార్థుల భావిజీవితాన్ని సమర్థవంతంగా గడపడానికి కావలసిన పరిజ్ఞానం, అవగాహన యివి అందచేస్తాయి.

4. **విషయజ్ఞాన యూనిట్ (Subject Matter unit) :** విద్యార్థికంటే విషయానికి ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చే యూనిట్స్‌ను విషయజ్ఞాన యూనిట్ అంటారు. విద్యార్థి సాధించవలసిన జ్ఞానం సమగ్రంగా అందించబడుతుంది.

5. **నిర్మాణాత్మక యూనిట్లు (Structured units) :** విద్యార్థి నిజజీవిత సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవ డానికి తగిన సామర్థ్యాలను పెంపొందించడమే ఈ యూనిట్ లక్ష్యం.

బోధనలో యూనిట్ పథకాన్ని రూపొందించడానికి తోడ్పడిన విద్యావేత్తలలో ఒకరైన డా॥ సి. హెన్రీ మోరిసన్ ఐదు బోధన సోపానాలతో ఒక ఉపగమాన్ని రూపొందించారు.

1. **అన్వేషణ (Exploration) :** విద్యార్థుల పూర్వజ్ఞానాన్ని పరిశీలించి వారిని కొత్త విషయాలు నేర్చుకోవడానికి ప్రేరణ కల్గించడం జరుగుతుంది.

2. **ప్రదర్శన (Presentation) :** విద్యార్థిని ఒక అంశానికి సంబంధించిన నూతన విషయాల బోధన జరుగు తుంది. విద్యార్థులకు విషయం పూర్తిగా అవగాహన జరగడం కోసం అవసరమైతే మళ్ళీ మళ్ళీ వివరించడం జరుగుతుంది.

3. **సాంశీకరణ (Assmilation) :** ప్రదర్శన ద్వారా వివరించబడ్డ విషయాంశాలను విద్యార్థులు అవగాహన చేసుకొని వాటిని అంతకుమునుపు ఆ విషయాంశాలకు సంబంధించి ఉన్న జ్ఞానంతో సాంశీకరణం చెందేటట్లు ఉపాధ్యాయుల కృత్యాలు ఉండాలి. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయులు విద్యార్థుల కృత్యాలు ఉండాలి. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను గుర్తుంచుకొని పనిచేయాలి. ఈ సోపానం వైయుక్తిక బేధాలను గుర్తించడానికి, సవరణాత్మక బోధనకు ఎంతో ఉపయోగపడుతుంది. చర్చలు, గ్రంథపఠనం, నియోజనాలు, సమస్యా పరిష్కారానికి దోహదం చేసే కృత్యాన్ని విద్యార్థులకిచ్చి లక్ష్యం సాధించడానికి ప్రయత్నం జరుగుతుంది.

4. **వ్యవస్థీకరణ (Organisation) :** విద్యార్థులందరూ కలిసి బోధన అనంతరం తాము గ్రహించిన విషయాల్ని ఒక క్రమపద్ధతిలో క్రోఢీకరించి వ్యవస్థీకరణం చేస్తారు.

5. **వల్లెవేయడం (Recitation) :** విద్యార్థులు విషయాలను పదే పదే వల్లెవేయడం ద్వారా వారికి పరిజ్ఞానం పూర్తిగా కల్గుతుంది. ఈ సాధన మౌఖికంగా లేదా రాతపూర్వకంగా కూడా చేయవచ్చు.

**గుణాలు / ప్రయోజనాలు :**


1. పాఠ్యాంశాలను క్రమంలో అందించడానికి వీలవుతుంది. పాఠ్యాంశాల మధ్య సహసంబంధం నెలకొల్పి భావన సక్రమంగా అందించబడుతుంది.
2. ఉపాధ్యాయుడికి తగిన స్వేచ్ఛ లభిస్తుంది. అవసరమైతే పాఠ్యప్రణాళిక పరిధిని దాటి విద్యార్థులకు అవసరమైన అంశాలు జోడిస్తారు.
3. కావలసిన బోధనోపకరణాలు ఎంచుకొని బోధించడం ద్వారా లక్ష్యసాధన సాధించడానికి అవకాశం ఏర్పడుతుంది.
4. ప్రణాళికాబద్ధం కాబట్టి బోధన సకాలంలో పూర్తవుతుంది.
5. విద్యార్థుల సామర్థ్యాలు దృష్టిలో వుంచుకొని అభ్యసనా కృత్యాలు రూపొందిస్తారు. కాబట్టి విద్యార్థులు ఉత్సాహంగా అభ్యసిస్తారు.

**పరిమితులు :**

1. ఈ పద్ధతి ఉపయోగించటంలో ప్రత్యేక శిక్షణ లేకపోవడం.
2. అన్ని విషయాలకు బోధనోపకరణాలు సమకూర్చుకోవడం సాధ్యం కాకపోవచ్చు.

### 4.2.3 విద్యాప్రణాళిక ప్రక్రియలో వివిధ దశలు (Stages in Process of Curriculum):

విద్యాప్రణాళిక ప్రక్రియను ఐదు దశలకు విభజించడం జరిగింది.



### 4.2.3.1 ఉద్దేశాలు, గమ్యాలు మరియు లక్ష్యాల ఎంపిక :

విద్యాప్రణాళిక అనేది విద్యాకార్యక్రమాలను గురించిన ప్రణాళిక. విద్యాప్రణాళికకు నిర్దిష్టమైన లక్ష్యాలు ఉంటాయి. విద్యాప్రణాళిక లక్ష్యాల సాధనలో తోడ్పడుతుంది. విద్యాలక్ష్యాలు అనేవి ఉద్దేశాలు మరియు గమ్యాల నుంచి ఉద్భవిస్తాయి. ఈ గమ్యాలు మూడు దశలుగా ఉంటాయి.

1. అంతిమగమ్యాలు, 2. మధ్యంతర గమ్యాలు, 3. రక్షణ గమ్యాలు.

| |
|---|
| అంతిమగమ్యాలు |
| మధ్యంతర గమ్యాలు |
| రక్షణ గమ్యాలు |

సాధారణంగా అంతిమంగా లేదా దీర్ఘకాలికంగా సాధించవల్సిన వాటిని గమ్యాలను, కొద్దిపాటి సమయంలో సాధించేవాటిని ఉద్దేశాలని, వెనువెంటనే సాధించాల్సిన వాటిని లక్ష్యాలని పేర్కొంటారు.

**గమ్యాలు (Goals):** గమ్యాలు విశాలమైన, దీర్ఘకాలిక అంతిమ ప్రయోజనాన్ని తెలియచేస్తాయి.

**ఉద్దేశాలు (Aims):** ఉద్దేశాలు గమ్యాల నుంచి ఏర్పడినాయి. ఇవి గమ్యాల కంటే నిర్దిష్టమైనవే కాకుండా విద్యా దిశలను కూడా సూచిస్తాయి. కాబట్టి వీటిని సాధించడానికి నిర్ణీత దీర్ఘకాలవ్యవధి అవసరం.

**2. లక్ష్యాలు (Objectives):**

అనతికాలంలో చేరగల గమ్యాలను లక్ష్యాలని అనవచ్చు.

**3. పాఠ్యవిషయం ఎంపిక (Selection of Content) :**

విద్యాప్రణాళిక అభివృద్ధిలో పాఠ్యవిషయాన్ని ముఖ్యమైన అంశంగా పరిగణిస్తారు. పాఠ్యవిషయం ఎంపికను మూడు దశలుగా చూడవచ్చు.

| దశ | General |
|---|---|
| I. | పాఠ్యవిషయం కొరకు అవసరమైన భావనల రూపకల్పన (Conceptual Framework for content themes) |
| II. | ముఖ్య భావనలు / ప్రాథమిక అంశాల ఎంపిక (Selection of Basic things / concepts) |
| III. | నిర్ధిష్ట బోధనాంశాల ఎంపిక (Selection of specific content themes) |

మొదటిదశలో విషయానికి (Content area) సంబంధించి భావనల ఎంపిక స్పష్టంగా/స్పష్టీకరణ (clarification)గా చెప్పవచ్చు.

రెండవ దశలో ముఖ్యభావనలు, ప్రాథమిక అంశాలు (Basic themes) ఎంపిక చేసి వాటి ద్వారా పాఠ్యవిషయానికి సంబంధించిన ముఖ్య భావనలను ప్రోగుచేసి, ఆ విషయానికి జ్ఞానాత్మక నిర్మాణాన్ని కల్గించడం జరుగుతుంది.

మూడవదశ చాలా నిర్ధిష్టంగా వుంటుంది. విషయాంశాలను, ముఖ్యభావనలతో / Themes పోల్చిచూసి, విషయం విద్యాప్రణాళిక లక్ష్యాలకు అవసరమయ్యే రీతిలో ఉన్నదో లేనిదో పరిశీలించడం జరుగుతుంది.

**4. అభ్యసనానుభవాల ఎంపిక మరియు పాఠ్యవిషయ వ్యవస్థీకరణం మరియు సమన్వయం**

**(Organisation and integration of learning exeprience and content) :**

తరగతిగదిలో అభ్యసన ప్రక్రియలుగా మార్చేటపుడు అభ్యాసకులు(బాలల) పూర్వ అనుభవాలు దృష్టిలో ఉంచుకోవాలి. పాఠ్యవిషయం బాలల అనుభవాలఆధారంగా చేసుకొని వ్యవస్థీకరించడం వలన అభ్యసన అనుభవాలలో పిల్లలు భాగస్వాములవుతారు. నేర్చుకునే అంశానికి పిల్లలు కలిగివున్న జ్ఞానాన్ని సమన్వయపరచడం వలన అభ్యసన ఆచరణాత్మకమవుతుంది. నిత్యజీవిత సమస్యలు, అనుభవాలు అభ్యసన ప్రక్రియలుగా మారడం వల్ల బోధన ఫలవంతమవుతుంది.

## 4.3 విద్యాప్రణాళిక మరియు పాఠ్యపుస్తకాల నిర్మాణంలో వివిధ సామాజిక వర్గాల జ్ఞాన మిళితం మరియు ప్రాతినిధ్యం

భారతదేశం అనేక కులాలు, జాతులు, భాషలు, మతాలకు పుట్టినిల్లు. హిందూ, బౌద్ధ, జైన, సిక్కు మతాలు ఆవిర్భవించాయి. వివిధ దేశాలనుండి అనేక మతాలు దేశంలోనికి ప్రవేశించాయి.

విద్యాప్రణాళికలో పాఠ్యపుస్తకాలలో విద్యార్థులకు అన్నిరకాల సంప్రదాయాలు, ప్రవర్తనా నియమావళి, క్రమశిక్షణ, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్ని కులాలు, మతాల, ప్రాంతాల, వర్గాల పట్ల భేదం లేకుండా, లింగవివక్షతకు అతీతంగా అందరిని కలుపుకొని అందరి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే విధంగా విద్య వుండాలి. విద్యాప్రణాళికలో పాఠ్యాంశాలతో పాటు సహపాఠ్య కృత్యాలు అన్నివర్గాలకు సంబంధించిన కళలు, సంస్కృతులు, నైపుణ్యాలు, జ్ఞానం మిగతా అన్నివర్గాలు అవగాహన చేసుకునేందుకు వాటిని విద్యాప్రణాళికలో చేర్చడం అవసరం. పాఠశాలలో బోధించే అన్ని విషయాల కంటే భాష, సామాజిక శాస్త్రం, కళలు, సంస్కృతి వంటి అనేక అంశాలలో జ్ఞానం కొన్ని సామాజిక వర్గాలలో విస్తృతంగా వుంది. ఆ జ్ఞానం అందరికి అవసరమై వుంటుంది. ఒకసారి విద్యాప్రణాళికలో చేర్చితే లిఖిత జ్ఞానమై విరాజిల్లుతుంది.

గిరిజనజాతి కళలు, సంప్రదాయాలు, సంస్కృతి, అలిఖిత జ్ఞానం. దీనిని ప్రతిపాదించేందుకు గిరిజనులు ముందుకు రాకపోవచ్చు. ఆ జ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావలెను. పట్టణీకరణ, నాగరికత పేరిట కొన్ని వర్గాల వారి జ్ఞానాన్ని పట్టించుకోవడం లేదు. మన విద్యాప్రణాళికలో గిరిజన సంస్కృతి, గ్రామీణ సంస్కృతి, స్త్రీల సంస్కృతి అంశాలకు తావులేదు. కావున ఈ సంస్కృతులను విద్యాప్రణాళికలో చేర్పించాలి.

ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం – 2009 ప్రకారం అందరికీ విద్య కల్పించడం విద్యాలక్ష్యంగా నిర్ణయించడమైనది. అందరి జ్ఞానాన్ని క్రోడీకరించి, అసలైన జ్ఞానాన్ని విద్యాప్రణాళికలో చేర్చాలంటే అన్ని సామాజిక వర్గాల వారిని కలుపుకుపోవాలి.

**విద్యాప్రణాళిక మరియు పాఠ్యపుస్తకాల్లో వివిధ సామాజిక వర్గాల జ్ఞానం యొక్క ప్రాతినిధ్యం, చేర్పులు మరియు మార్పులు**

విద్యాప్రణాళిక ఆధారంగా పాఠ్యపుస్తకాలు రాయబడతాయి. కనుక పాఠ్యపుస్తకాల్లో విద్యాప్రణాళికాంశాలు ప్రతిబింభిస్తాయి. విద్యాప్రణాళిక సమాజం యొక్క ప్రతిరూపం కనుక సమాజంలోని వివిధ రకాల సామాజిక వర్గాలకు సంబంధించిన జ్ఞానాన్ని విద్యాప్రణాళికలో చేర్చడం ద్వారా విద్యాప్రణాళికలో సామాజిక వర్గాలకి ప్రాతినిధ్యం కల్పించనట్లవుతుంది. సమాజంలోని వివిధ సామాజిక వర్గాలకు సంబంధించిన వివిధ అంశాలను పరిశీలిద్దాం.

1. **కులవర్గాలు (Caste Groups) :** సమాజంలో అనేక కులాలు వాటి వాటి స్వంత రీతిరివాజులు కలిగి ఉంటాయి. ప్రతి కులంలోను ఎన్నో సమాజోపయోగ అంశాలు ఉంటాయి. కుటుంబవ్యవస్థ, వివాహవ్యవస్థ, పిల్లల పెంపకం, ఆస్తిపంపకాలు, కుటుంబ కార్యకలాపాలు ఇలాంటి విషయాలను విద్యాప్రణాళిక మరియు పుస్తకాల్లో చేర్చడం మూలంగా పిల్లల భావిజీవితంలో కుటుంబవ్యవస్థ స్థిరంగా ఉంటుంది.

2. **మతవర్గాలు (Radial Groups) :** సమాజంలో కులం మరియు మతంతోపాటుగా జాతులు కూడా ఉంటాయి. తమ జాతి ఇతర జాతులకంటే గొప్పదనే భావన ఉంటూ ఉంటుంది.

## 4.4 చదువు – ప్రక్రియలు

పాఠశాలలో జరిగే బోధనాభ్యసన ప్రక్రియలనే స్కూలింగ్ అని చెప్పవచ్చును. పాఠశాల ఉన్నంతవరకు ఈ చదువు చెప్పడమనే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతూనే ఉంటుంది. దీనిని విపులంగా తెలుసుకుందాం.

1. **చదువు చెప్పడం / బోధించడం (Teaching) :** పాఠ్యప్రణాళికలోని కార్యక్రమాలు, పాఠ్యపుస్తకాలలోని కృత్యాలకు అనుగుణంగా బోధన జరిగినపుడు విద్యార్థులు జ్ఞాన సంపూర్ణులవుతారు. బోధన పిల్లవాణ్ణి జ్ఞానవంతుణ్ణి చేస్తుంది.

2. **అభ్యసనం (Learning) :** బోధన అనేది పాఠ్యప్రణాళిక ప్రకారం, పాఠ్యపుస్తకాలలోని కృత్యాలకు అనుగుణంగా జరిగినపుడు విద్యార్థి మంచి అభ్యాసకుడుగా మారి తనకు, తన తల్లిదండ్రులకు, సమాజానికి ఉపయోగపడే విద్యార్థిగా తయారవుతాడు. తద్వారా స్వీయ అభ్యసన వాతావరణం విద్యార్థిలో ఏర్పడుతుంది.

3. **సహపాఠ్య కార్యక్రమాలు (Co-curricular Activities) :** విద్యార్థులకు సెమినార్లు, చర్చా కార్యక్రమాలు, ప్రదర్శనలు, ఆటలపోటీలు, చిత్రలేఖనం, సంగీత కచేరీలు, విహారయాత్రలు మొదలగు సహపాఠ్య కార్యక్రమాల ద్వారా వారిలో ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని కల్పించడంతోపాటు వారికవసరమైన జ్ఞానాన్ని అందించవచ్చు.

4. **జట్టుకృత్యాలు (Group Activities) :** జట్టుకృత్యాలు నిర్వహించుట ద్వారా విద్యార్థులు, ఒకరినొకరు అర్థం చేసుకొని సహోదర భావం పెంపొందించుకుంటారు. కలిసి పనిచేయుటలో గల ఆనందాన్ని, కలిసి పనిచేస్తే జరిగే మంచిని వారు పరిశీలిస్తారు. దాన్ని ఆ ఫలితాన్ని అనుభవిస్తారు. ఈవిధంగా చేయడం వలన చదువుతో పాటు పని పట్ల గౌరవం, సహకారం, అభిమానం ఒకరితో ఒకరికి ఏర్పడి మంచి సమాజ నిర్మాణానికి దారితీస్తాయి.

## 4.4.1 గుప్త విద్యా ప్రణాళిక : పాఠశాల సంస్కృతి, పాఠశాల ప్రక్రియలు, ఉపాధ్యాయుల నమ్మకాలు మరియు ఆచరణలు

గుప్త విద్యాప్రణాళిక అంటే అవిధిత, అనధికారిక మరియు తరచుగా పాఠశాలలో విద్యార్థులు అభ్యసించే అప్రయత్నంగా అనుకోకుండా అభ్యసించే పాఠాలు, విలువలు మరియు దృష్టికోణాలు.

పాఠ్యాంశాలు, విద్యార్థులు పాల్గొనే అభ్యసనకృత్యాలు ఉపాధ్యాయులు బోధించే జ్ఞాన నైపుణ్యాలు వంటివి నియత విద్య ప్రణాళికలో ఉంటాయి. కాని గుప్త విద్యాప్రణాళిక అంటే బోధింపని, అవ్యక్తవిద్య సామాజిక మరియు సాంస్కృతిక సందేశాలు పాఠశాలలో, పాఠశాల ఆవరణలో ఉన్నప్పుడు విద్యార్థులు నేర్చుకునే అంశాలు. ఆ అంశాలు నియతంగా గాని, అనియతంగా గాని విద్యార్థి అభ్యసనంలో గ్రహించే పాఠ్యాంశాలు. తోటి విద్యార్థులతో, ఉపాధ్యాయులతో పెద్దలతో విద్యార్థులు వ్యవహరించే తీరు గుప్త విద్యాప్రణాళిక.

NC6Q6P

వివిధ మతాలు, కులాలు, వర్గాల లేక తరగతిలో ఉన్న సామాజిక భిన్నత్వంలోనున్న ప్రజలను, విద్యార్థులు అవగతం చేసుకునే విధానం. విద్యార్థులు, విద్యావేత్తలు ముఖ్యంగా దీనిని గుర్తించకపోయినా, విద్యార్థుల ప్రవర్తన, వ్యక్తిత్వంలో దానివలన మార్పులు కల్గుతున్నందున దానిని గుప్త విద్యాప్రణాళిక అంటున్నారు.

గుప్త విద్యా ప్రణాళికను సమాజం గుర్తించదు మరియు పరీక్షించలేదు. అయినప్పటికి గుప్త విద్యాప్రణాళికలోని అంశాలను అంగీకరిస్తారు. అందుచేత దాని ప్రభావంతో విలువలు, పాఠ్యాంశాలు బలోపేతమవుతున్నాయి.

గుప్త విద్యా ప్రణాళికలో విద్యార్థులు పాఠశాలలోనున్నప్పుడు వారు అభ్యసించే అనుభవాలు, పాఠశాల విలువలు, నమ్మకాలు లేదా అసమానతలు, సమానత్వం, స్వాతంత్ర్య, స్వేచ్ఛ వంటి వాటిని తెలియజేస్తుంది.

గుప్త విద్యాప్రణాళిక అపరిమితమైన శక్తులను విద్యార్థులలో కల్గిస్తుంది. మేధోపరమైన, సామాజిక, సాంస్కృతిక మరియు పర్యావరణ కారకాలు వంటివి అనేక శక్తులకు మూలాలు గుప్త విద్యాప్రణాళిక.

## గుప్త విద్యాప్రణాళికకు ఉదాహరణలు:

**1) సాంస్కృతిక అంచనాలు** (Cultural expectations)

విద్యావేత్తలు, పాఠశాల ఆశించిన లక్ష్యాలు, పాఠ్యాంశ, సామాజిక మరియు ప్రవర్తనా అంచనాలను విద్యార్థులకు సందేశమిస్తుంది. ఉదా:- కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు స్థాయిని మించి అధిక మార్కులు పొందుతారు. వేరే పాఠశాలలో విద్యార్థులు అన్ని బాగా వ్రాసామని అనుకున్నా తక్కువ మార్కులు పొందుతారు. ఇది కొన్ని సందర్భాలలో కొంతమంది విద్యార్థులకు ప్రోత్సాహకారిగా ఉండవచ్చు. మరికొంత మందికి నిరుత్సాహంగా ఉండవచ్చు. అధిక అంచనాలతో వున్న విద్యార్థులకు ఒకతీరు, అల్ప అంచనాలతోనున్న విద్యార్థులకు ఇంకోతీరు నచ్చుతుంది.

**సాంస్కృతిక విలువలు** (Cultural Values)

పాఠశాలలు, ఉపాధ్యాయులు, సమవయస్సు బృందాల వారు ప్రసారం చేసే విలువలు కూడా గుప్త విద్యాప్రణాళికను తెలియజేస్తాయి.

**సాంస్కృతిక దృష్టికోణం** (Cultural Perspectives)

పాఠశాలలు తెలిసో తెలియకో వైవిధ్య మరియు బహుళ సాంస్కృతిక దృక్కోణం గల వివిధ వర్గాల విద్యార్థులను గుర్తించి, కలుపుకొని, గౌరవించే సంప్రదాయం ఉంటుంది. కొన్ని పాఠశాలలయాజమాన్యం వారు కొన్ని పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఏ వృత్తివారైనా, ఏ ప్రాంతం వారైనా, ఏమతం వారైనా వారిని ఆహ్వానించి, సమావేశాలలో పాలుపంచుకోమంటారు.

**పాఠ్యాంశ విషయాలు** (Curricular Topics)

విద్యా ప్రణాళికలో పొందుపర్చబడిన పాఠ్యాంశాలు వివిధ భావజాలాలు, సంస్కృతుల సమాచారంతో ఎన్నుకోబడతాయి. వివిధ ప్రాంతాల ఆచార వ్యవహారాలను, సంస్కృతులను అన్నివర్గాలకు చెందిన విద్యార్థులు అభ్యసిస్తారు.

**బోధనా వ్యూహాలు** (Teaching Stratagies)

విద్యార్థులకు, ఉపాధ్యాయులు బోధించే విధానం, పాఠశాలకు ప్రచారం చేసిపెడతాయి. దీనిప్రభావం పాఠశాల భవిత పై వుంటుంది. బోధన వ్యూహాల పైనే విద్యార్థుల సాధన ఆధారపడి ఉంటుంది. విద్యాపరమైన బహుమతులను ప్రోత్సహించి, అభ్యసనా లోపాలను తెలుసుకొని, సూచన వ్యూహాలను మార్చుకొన్న ఉపాధ్యాయులున్న పాఠశాలలో ప్రాజెక్టు ఆధారిత అభ్యసన కల్పించి, విద్యార్థులలో పనిలో సామర్థ్యతను, సమాజం పై అవగాహనను కల్పించేందుకు ఏర్పడుచున్నవి.

**పాఠశాల నిర్మాణం** (School Structures)

పాఠశాలలోని సౌకర్యాలు, వసతులు, విద్యను అభ్యసించడానికి గల పరికరాలు వంటి అనేక అంశాలు పాఠశాలల నిర్మాణంలోకి వస్తాయి. పాఠశాల నిర్మాణంతో పనిలేకుండా దానిని నడిపించే తీరుపై విద్యార్థులు ఆసక్తిచూపుతారు.

**సంస్థాగత నియమాలు:**

పాఠశాల సముదాయం, యూనిఫారం, సమయపాలన వంటి వాటితోపాటు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు పాఠశాలను సందర్శించేటపుడు విధించే నియమాలు ఆ పాఠశాల గుప్త విద్యాప్రణాళికకు సూచిక.

**4.4.2 పాఠశాల సంస్కృతి:**

పాఠశాల సంస్కృతికి సంబంధించిన విషయాలు ఇదే పాఠ్యపుస్తకం యూనిట్-2లో చర్చించబడినది.

**4.4.3 ఉపాధ్యాయుల నమ్మకాలు మరియు ఆచరణలు** (Beliefs and practices of Teachers)

పాఠశాల ఉపాధ్యాయులకు వివిధ విషయాలపట్ల అనేక రకాల నమ్మకాలు మరియు ఆచరణలు ఉంటాయి.

**1. ఉపాధ్యాయుల నమ్మకాలు** (Beleifs of Teachers)

ఉపాధ్యాయులకి విద్యపట్ల, చదువుపట్ల, విద్యార్థులపట్ల అనుకూల లేదా వ్యతిరేక నమ్మకాలు లేదా ఆలోచనలు ఉన్నాగాని ఉపాధ్యాయుడు ఈ క్రింది నమ్మకాలని కలిగివుండాలి.

1. పిల్లలందరూ నేర్చుకోగలరు/అభ్యసించగలరు.
2. పిల్లలని సమాన అవకాశాలు పొందాల్సిన వారిగా చూడాలి.
3. పిల్లల్ని ఆ తరగతి స్థాయికి తగినట్లుగా తయారుచేయాలి.
4. పిల్లల్ని అన్నిరకాలుగా, అన్నిరంగాల్లో సమానంగా చూడాలి.
5. పిల్లల వ్యక్తిగత వైవిధ్యాలను అనుసరించి వారి అభిరుచులు, ప్రజ్ఞ, సామర్థ్యాల ఆధారంగా వారికి అవకాశాలు కల్పించాలి.
6. పిల్లల అభ్యసనం ఆనందదాయకంగా ఉండాలి.
7. పిల్లల్లోగల వైవిధ్యాన్ని తరగతి గది బలంగా చూడాలి.
8. పిల్లల అభ్యసనానికి ఉపాధ్యాయులు బాధ్యత వహించాలి.
9. పిల్లలకి ప్రేరణని కల్పించాలి.
10. పిల్లలకి గుర్తింపుని, పొగడ్తని అందించాలి.

**2. ఉపాధ్యాయుల ఆచరణలు** (Practices of Teachers)

ఉపాధ్యాయుడు తరగతిగదిలో ఆచరించే ఆచరణలు బోధనాభ్యసన ప్రక్రియను విజయవంతం చేస్తుంది. OECD సూచించిన విధంగా ఉపాధ్యాయుడు ఈ క్రింది అంశాల్లో ఆచరణలను చూపించాల్సి ఉంటుంది.

1. పాఠ్యాంశాల యొక్క పరిపూర్ణ జ్ఞానాన్ని కలిగివుండాలి.
2. బోధనని తరగతికి తగినట్టుగా ఏర్పాటు చేసుకోవాలి.
3. పిల్లలకి పున:శ్చరణ(ఓరియంటేషన్) కల్పించాలి.
4. పిల్లలకి అదనపు కృత్యాలని కల్పించాలి.
5. సహకార అభ్యసనానికి అవకాశం కల్పించాలి.
6. సమయానికి పనులను నిర్వహించాలి.
7. తరగతి గదిలో క్రమశిక్షణాయుత వాతావరణం ఉండాలి.
8. పిల్లలు ఉపాధ్యాయుని మధ్య మంచి సంబంధాలు ఉండాలి.
9. పిల్లలు అనుకూలవాతావరణంలో అభ్యసనం జరుపుకోవాలి.
10. పిల్లల ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండాలి.
11. తోటి ఉపాధ్యాయుల సహకారాన్ని పొందాలి.
12. పాఠ్యాంశానికి తగిన బోధనా పద్ధతిని ఉపయోగించాలి.
13. సహపాఠ్య కార్యక్రమాలకి బోధనలో స్థానం ఉండాలి.
14. తరగతి గది వాతావరణం ఆహ్లాదకరంగా ఉండాలి.
15. తన వృత్తిపట్ల ఉపాధ్యాయుడు తృప్తిని కలిగివుండాలి.

ఉపాధ్యాయుల నమ్మకాలు మరియు ఆచరణలు విద్యారంగం పై అనంతమైన ప్రభావాన్ని చూపిస్తాయి.

## 4.5 విద్యాప్రణాళిక, బోధనా విధానం మరియు పిల్లల అభ్యసన మదింపు:

**1. విద్యాప్రణాళిక** (Curriculam)

"పాఠశాల తన విద్యా లక్ష్యాలను సాధించడానికి విద్యార్థి నిర్వహించే కార్యకలాపాల సమాహార రూపమే విద్యాప్రణాళిక" **– ఆల్బర్ట్ అండ్ ఆల్బర్ట్**

**2. బోధనాశాస్త్రం**(Pedagogy)

విద్యావిషయాలను బోధనకు ఉపయోగించే విధానము మరియు ఆచరణలే బోధనాశాస్త్రం.

**3. మదింపు** (Assessment)

పిల్లల ప్రగతిని, సామర్థ్యాలను అంచనావేయడానికి ఉపయోగించే కార్యకలాపాలు, పనులు ప్రక్రియలన్నింటిని మదింపు అని పేర్కొంటారు.

### 4.5.1 విద్యాప్రణాళిక, బోధనాశాస్త్రం మరియు మదింపు:

విద్యాప్రణాళిక, విద్యా లక్ష్యాలను సాధించడానికి తరగతుల వారీగా, పాఠ్యాంశాల, సహపాఠ్యాంశాలతో రూపొందించబడతాయి. విద్యాప్రణాళికల ద్వారా విద్యార్థుల ఆశయాలు, సమాజ ఆశయాలు తీర్చబడతాయి. విద్యాప్రణాళిక విద్యార్థికి అవసరమైన విషయ పరిజ్ఞానాన్ని వివిధ సబ్జెక్టుల ద్వారా అందిస్తాయి. తద్వారా విద్యార్థి జ్ఞాననిర్మాణము జరుగుతుంది. సహపాఠ్యాంశాల ద్వారా శారీరక, మానసిక అభివృద్ధిని పొందుతాడు. ఈ విధంగా విద్యార్థి సంపూర్ణ మూర్తిమత్వ అభివృద్ధికి విద్యాప్రణాళిక తోడ్పడుతుంది.

పాఠశాలలో విద్యాప్రణాళికను సమర్ధవంతంగా అమలు పర్చడానికి ఉపాధ్యాయుడు తగిన బోధనాపద్దతులు ఉపయోగించవల్సి వుంటుంది. ప్రధానంగా విద్యార్థి కేంద్ర బోధనా పద్ధతులు, కృత్యాధార పద్ధతులు, ఆగమ, నిగమ బోధనా పద్దతులు, సంశ్లేషణ, విశ్లేషణ, అన్వేషణ బోధనా పద్ధతులు ఊహ మరియు Information and Communication Technology (ICT) ఆధారిత బోధనా పద్ధతులు ఉపయోగించి విద్యాప్రణాళికను తరగతి గదిలో అమలుచేయాలి. బోధనాభ్యసన ప్రక్రియ విజయవంతంగా ఉండాలంటే బోధనా పద్ధతులను సక్రమంగా వినియోగించాలి.

విద్యాప్రణాళిక, బోధనా పద్దతులు తరగతి గదిలో అమలుచేసినపుడు అవి విద్యార్థులను ఎంతమేరకు ప్రభావితం చేస్తాయో తెలుసుకోవాలంటే పిల్లల అభ్యసనాన్ని నిరంతరం మదింపు చేయాలి. నేడు పాఠశాలల్లో నిరంతర సమగ్ర మూల్యాంకనము అమలు చేయబడుచున్నది. ఇది నిర్మాణాత్మక మదింపు మరియు సంగ్రహణాత్మక మదింపుగా అమలుచేయబడుతుంది.

విద్యా ప్రణాళిక, బోధనాశాస్త్రం మరియు మదింపు అనే వాటి మధ్య విడదీయరానిబంధం ఉన్నట్లుగా తెలుస్తుంది.

### 4.5.2 జ్ఞానం, పాఠ్యాంశాలు, విద్యాప్రణాళిక మరియు అభ్యాసకుల మధ్య సంబంధాలు
(Connections among knowledge, Curriculum, Textbooks and Learners)

ఇరవైవ శతాబ్దం ప్రారంభం నుంచే మానవుల అభ్యసనాన్ని గురించిన జ్ఞానం విస్తృతమవుతూ వచ్చింది. మానవుల అభ్యసనం తీరుతెన్నులు గురించి అనేక అంశాలను పరిశోధించినా, మానవ అభ్యసన ప్రక్రియ సిద్ధాంతాల ఆవిర్భావానికి, ముఖ్యంగా ప్రవర్తనావాద సిద్ధాంతం, జ్ఞానాత్మక విద్యాప్రణాళిక నిర్మాణానికి అవసరమయ్యే అనేక ఉపగమాలను విద్యాప్రణాళికవేత్తలు విస్మరించలేరు.

జ్ఞాన స్వభావం, విద్యార్థుల్లో సంజ్ఞానాత్మకత నిర్మాణం విద్యాప్రణాళికకు గల మరో ఆధారం, జ్ఞానం అనేది సమాచారం కంటే ఏ రకంగా భిన్నమైంది? విద్యార్థులు సమాచారాన్ని జ్ఞానంగా ఎలా మార్చుకుంటారు? భిన్న ఆలోచన ప్రక్రియలకు సంజ్ఞానాత్మక ప్రక్రియా నైపుణ్యాలతో ఏరకమైన సంబంధాలు ఉన్నాయి? మొదలైన ప్రశ్నలు ఉపాధ్యాయులను, మానసిక శాస్త్రవేత్తలను, పరిశోధకులను, తాత్వికులను ఆసక్తికి గురిచేస్తూనే ఉన్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలను పొందడం వల్ల విద్యావేత్తలు విద్యాప్రణాళికలలో జ్ఞానాన్ని క్రమబద్ధీకరించ గలుగుతారు.

PLHE91

విద్యాప్రణాళిక నిర్మాణంలో అభ్యాసకులను ఆకట్టుకొనే అభ్యసనరీతులు, విధానాలు ఉండాలి. భిన్న అభ్యసనరీతులను ఇష్టపడే అభ్యాసకులందరికీ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా అభ్యసనాన్ని అందించే విద్యాప్రణాళికను సమకూర్చాలి.

### 4.5.2 సమ్మిళిత విద్య (Inclusive learner friendly):

ఏ రంగంలోనైనా వారి బలాలు, బలహీనతలతో సంబంధం లేకుండా ఒక పాఠశాలలోని విద్యార్థులందరూ పాఠశాల సముదాయంలో భాగం అవ్వడమే సమ్మిళిత విద్య. ఇతర విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది (సపోర్టుస్టాఫ్‌లో) తామూ భాగమని విద్యార్థులందరూ భావించడం ఇక్కడ ముఖ్యమైన విషయం. ఇదివరకు మంచి బోధనకు దారితీసే అన్ని రకాల ఆచరణలతో కూడి ఉండేదే సమ్మిళిత విద్య అవుతుంది. పిల్లల గురించి లోతుగా ఆలోచించేవాడు, అందరి పిల్లలకు చేరుకునే మార్గాలను అభివృద్ధిపరచినవారు ఆదర్శ సమ్మిళిత విద్యను ఈవిధంగా నిర్వచించారు. "ప్రజలు లేదా వయోజనులు సమ్మిళిత సముదాయాలలో పనిచేస్తారనని, భిన్నజాతులు, మతాలు,ఆశయాలు, బలహీనతలు ఉన్న ప్రజలలో పనిచేస్తారనే నమ్మకం మీద inclusion ఆధారపడి ఉంది అనే పద్ధతిలో అన్ని వయస్కుల పిల్లల నిజజీవితంలో అంతిమంగా ఏ పరిసరంలో వారు జీవించబోతున్నారో దాన్ని పోలి ఉండే పరిసరంలోనే నేర్చుకోవాలి వృద్ధి చెందాలి".

**సమ్మిళిత విద్య స్వభావం:**

1. విద్యార్థులందరినీ మనసులో పెట్టుకుని బోధనాభ్యసనను యోచిస్తారు.
2. విద్యార్థులందరికీ అన్ని సబ్జెక్టులలోను, అన్ని కృత్యాలలోను పాల్గొనే హక్కు ఉంటుంది.
3. ఉపాధ్యాయులు, విద్యార్థులు తామందరం ఒకే సముదాయానికి చెందినవారమని, సముదాయంలో సమాన సభ్యత్వం ఉందని భావిస్తారు.
4. సమ్మిళిత పాఠ్యప్రణాళిక తయారు, అమలులో తల్లిదండ్రుల ప్రమేయం ఉంటుంది. పిల్లలు తమ అవసరాలను బట్టి పాఠ్య ప్రణాళిక ఎన్నుకోవచ్చు.
5. సమ్మిళిత విద్య శిశుకేంద్రీకృతంగా ఉంటుంది. (Inclusive learner friendly classroom)

సమ్మిళిత(విలీన, సహిత) తరగతి గదిలో సమాజంలోని అన్నివర్గాల వారు పిల్లలతో పాటు శారీరక వైకల్యం గల పిల్లలు, అనకూలవర్గాల వారి పిల్లలు, అనగా బాలికలు, దళిత వర్గాలవారు, మైనార్టీలు, గిరిజన తెగలకు చెందిన పిల్లలకు తరగతి గదిలో బోధన జరుగుతుంది.

**సమ్మిళిత అభ్యాసకుని స్నేహపూరిత తరగతి గది వాతావరణం:**

సమ్మిళిత అభ్యాసకునికి, స్నేహపూర్వక తరగతి గది వాతావరణం కల్పించడానికి ఉపాధ్యాయులు విశేష కృషి చేయాలి. ఉపాధ్యాయుడు పిల్లలందరికి విశాల పరిధిలో అవకాశాలు కల్పించాలి. అనేకరకాల అభ్యసన అనుభవాలు అందుబాటులో ఉంచాలి. ఉదాహరణకు ఒక పనిని స్వంతంగా/ఒంటరిగా చేయడం, చిన్నగ్రూపులో చేయడం, మొత్తం గ్రూపు / పెద్దగ్రూపు చేయడం.

సమ్మిళిత అభ్యసకునికి మౌఖిక, లేఖన కృత్యాలు వస్తువుల మీద ఆధారపడ్డ కృత్యాలు మొదలైనవి కల్పించాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల నైపుణ్యాలు, జ్ఞానం, ఆసక్తులు, పూర్వానుభవం మొదలైనవి తెలుసుకోవాలి. దీనిద్వారా విద్యార్థులకు తరగతి గది కార్యక్రమాలను, లక్ష్యాల సాధనలో గల తగిన ఆసక్తిని ప్రోత్సహాన్ని కల్గించడానికి సాధ్యమవుతుంది.

తరగతి గదిలో వివిధరకాల అభ్యసన అనుభవాలలో పాల్గొనడం ద్వారా, ఆలోచించడం ద్వారా పిల్లలు తమలోని ప్రాధాన్యాలను గుర్తించగలరు. ఉదాహరణకు

కథలు చెప్పడం

పాత్రలు నటించడం

పదక్రీడలు

ప్రవేశికలు

కథాకల్పనలు

చర్యలు, చిత్రలేఖనాలు, పొడుపుకథలు.

వీటిద్వారా పిల్లలకు వైవిధ్యభరితమైన అభిరుచులను కల్పించవచ్చు. ఆహ్లాదకరమైన తరగతి గది వాతావరణాన్ని కల్పించవచ్చు.

అభ్యసన కృత్యాల్లో పిల్లలు ఇష్టపడే బోధనా సామాగ్రిని ఉపాధ్యాయుడు వినియోగించాలి. పిల్లలందరూ సహపాఠ్యాంశ కార్యక్రమాల్లో పాల్గొనేలా ఉపాధ్యాయుడు ప్రోత్సహించాలి. పిల్లలను క్షేత్రపర్యటనలకు విహారయాత్రలకు తీసుకువెళ్ళి మానసికోల్లాసం కల్గించటానికే ఉపాధ్యాయుడు కృషిచేయాలి.

**ఆటంకాలు లేని వాతావరణం (Barrier Free Environment) :**

దివ్యాంగులుగా ఉన్న పిల్లలకు ఆటంకం లేని వాతావరణం కల్పించడం ఎంతో అవసరం. సాధారణ పిల్లలతో కలిసి పాఠశాలకు వెళ్ళడానికి, రావడానికి పాఠశాలలో ఎటువంటి ఆటంకాలు లేకుండా ఉండాలి. ఉదాహరణకు పాఠశాల భవనం లోపలికి వెళ్ళడానికి, బయటకు రావడానికి, తరగతి గది లోపలి ప్రదేశంలో,

లైబ్రరీలో, అసెంబ్లీహాలు, ఆడిటోరియమ్, మూత్రశాల, భోజనగది/క్యాంటీన్, ఆటస్థలాలలో ఈ విద్యార్థులకు ఆటంకాలు లేని వాతావరణం కల్పించాలి.

దివ్యాంగులకు సాధారణ పాఠశాలలో ఎలాంటి ఆటంకాలు లేకుండా విద్యనభ్యసించడానికి ఈ క్రింది అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి.

1. పాఠశాల లోపలకు, బయటకు వెళ్ళేమార్గం
2. నడిచేటప్పుడు చేతులతో పట్టుకొని నడవడానికి వీలుగా
3. తలుపులు, వాకిలి
4. నేల జారుడుగా లేకుండా
5. వసారా, చుట్టుపక్కల ప్రదేశాలు
6. సమాచార బల్ల (information board) గుర్తు పలక (signages)
7. కాంతి, శబ్దం
8. మూత్రశాల
9. ఆటస్థలం
10. తాగునీటి సదుపాయాలు
11. అత్యవసర సమయంలో నేర్పుతో తప్పించుకోవడానికి అత్యవసర ద్వారం

పై అంశాలను దృష్టిలో ఉంచుకొన్నట్లయితే దివ్యాంగులు సాధారణ పాఠశాలలో చదువుకోవడానికి అవకాశం కల్పించిన వారమవుతాం.

**అననుకూల వర్గాల వారి పిల్లలకు సమాన అవకాశాలు:**

సమ్మిళిత విద్యలో అననుకూల వర్గాల వారి పిల్లలకు అభ్యసనంలో పాఠశాల కార్యక్రమాలలో సమాన అవకాశాలు కల్పించాలి.

బాలికల పట్ల తరగతి గదిలో ఎటువంటి వివక్షత చూపకుండా బాలురుతో పాటు సమాన అవకాశాలు కల్పించాలి. తరగతి లీడర్‌గా, పాఠశాల అసెంబ్లీ లీడర్‌గా, స్పోర్ట్స్ సెక్రటరీగా బాలికలకు ప్రాతినిధ్యం యివ్వాలి. తరగతి, పాఠశాల పరిశుభ్రత కేవలం బాలికలకు కాకుండా బాలురును భాగస్వామ్యం చేయాలి. సహపాఠ్యాంశ కార్యక్రమాలలో బాలికలు చురుకుగా పాల్గొనేటట్లు ప్రోత్సహించాలి.

దళిత, గిరిజన సామాజిక వర్గాలకు చెందిన బాలబాలికలకు అభ్యసన కార్యక్రమాలలో, సహపాఠ్యాంశ కార్యక్రమాలలో పాల్గొనేటట్లు ప్రోత్సహించాలి. ప్రభుత్వపరంగా వచ్చే అన్ని సంక్షేమ పథకాలు వీరికి అందేటట్లు ఉపాధ్యాయులు కృషిచేయాలి. అన్ని పోటీపరీక్షలకు ప్రత్యేక శిక్షణనిచ్చి ఉన్నత అవకాశాలు వీరు పొందడానికి ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.

మైనార్టీ వర్గానికి చెందిన బాలబాలికలు అందరూ పాఠశాలకు హాజరయ్యేటట్లు ఉపాధ్యాయులు తగిన ప్రణాళికలు అమలు చేయాలి. ముఖ్యంగా బాలికలందరూ పాఠశాలకు వచ్చి, విద్యాభ్యాసం పూర్తి చేసేవారిగా చూడాలి. డ్రాపౌట్స్‌ను తగ్గించి, నిలకడ సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలి.

మధ్యాహ్న, భోజన పథకంలో పిల్లలందరూ సహపంక్తి భోజనం చేసేటట్లు పిల్లలందరూ పాఠశాల యూనిఫాంలో పాఠశాలకు హాజరైయ్యేటట్లు ఉపాధ్యాయులు కృషిచేయాలి.

## అభ్యసన కోసం నిరంతర మదింపు:

మారుతున్న ఆధునిక సమాజానికి తగినవిధంగా పిల్లల్లో సృజనాత్మకత, తార్కిక ఆలోచన, అవగాహనతో కూడిన విద్యనందించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. విద్యార్థుల యొక్క సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా నిర్మాణాత్మక తరగతి గదులను, బోధనాభ్యసన ప్రక్రియలను కల్పించడం పై దృష్టి పెట్టినప్పుడు వీటిని ఎలా మదింపు చేయాలి అనే ప్రశ్న మొదలవుతుంది. ఈ నేపథ్యంలో ఎన్.సి.ఎఫ్ – 2005, ఆర్.టి.ఐ – 2009 పిల్లల ప్రగతిని అంచనా వేసేటపుడు అభ్యసన ఫలితానికి, ప్రాధాన్యత నివ్వకుండా అభ్యసన ప్రక్రియకు ప్రాధాన్యతను ఇస్తూ నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని అమలుపరచాలని పేర్కొన్నాయి. అందుకై ప్రస్తుత పరిస్థితిని పూర్తిగా సంస్కరించాలని సూచించాయి.

ప్రస్తుతం మనం పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షలు పిల్లల సమగ్ర వికాసాన్ని మదింపుచేయడానికి ఏవిధంగాను సరిపోవు. ఇవి పిల్లలు సమాచారాన్ని గుర్తుపెట్టుకొని పరీక్షలలో రాయడానికి మాత్రమే ఉపయోగపడతాయేతప్ప ఆశించిన అభ్యసన ఫలితాలను సాధించడానికి ఉపయోగపడవు. పిల్లల ప్రగతిని తెలుసుకోవడానికి అప్పుడప్పుడు నిర్వహించే రాత పరీక్షల ద్వారా అంచనా వేయడం అశాస్త్రీయం, అసమగ్రమే కాకుండా వారిలో ఒత్తిడికి కూడా దారితీస్తున్నాయి. ఈ పరిస్తితిని గట్టెక్కాలంటే పరీక్షలతోపాటు ప్రత్యామ్నాయ మూల్యాంకన విధానాలను అమల్లోకి తీసుకురావాలి. అందుకు తగినవిధంగా మదింపు సాధనాలను వాటిని వినియోగించడంలో మెళకువలను ఉపాధ్యాయులు పెంపొందించుకోవలసిన అవసరం ఏర్పడింది. దానికి అనుగుణంగా అవసరమైన మదింపు సాధనాలను ఉపాధ్యాయుడే స్వయంగా రూపొందించుకొని నిర్వహించడం అవసరం.

భాష అభ్యసనాన్ని ఒక ఉదాహరణగా చూస్తే ఉపాధ్యాయుడు నిర్దేశించుకున్న భాష లక్ష్యాలను పిల్లల్లో సాధింపజేయడానికి, పిల్లల్లో భాషాభివృద్ధి జరగడానికి ఎన్నో రకాల మదింపు సాధనాలు అవసరమవుతాయి. మదింపు చేయడంలో పిల్లల భాష, అవగాహన, నైపుణ్యాలు, అభిరుచులతోపాటు విభిన్న అభ్యసన విధానాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి. భాష పొందడం అంటే భాష నేర్చుకోవడం మాత్రమే కాదు భాషను సృజనాత్మకంగా, తార్కికంగా, సందర్భోచితంగా, ఆత్మస్థైర్యంతో వినియోగించడం. కాబట్టి వీటన్నింటిని మదింపు చేస్తున్నామా లేదా అనేది మనం ఆలోచించాల్సిన విషయం. అందుకు తగిన మదింపు సాధనాలను, విధానాలను రూపొందించుకోవాలి. మదింపును అభ్యసనంలో అంతర్భాగంగా నిరంతరం జరిగే ప్రక్రియగా నిర్వహించడానికి తగిన ప్రణాళికను తయారుచేసుకోవాలి. అందుకు ముందుగా మనం ఈ క్రింది అంశాలపై అవగాహన పొందాలి.

1. అభ్యసనంతోపాటు మదింపు (Assessment as learning)
2. అభ్యసనం కొరకు మదింపు (Assessment for learning)
3. అభ్యషనం యొక్క మదింపు (Assessment of learning)

**1. అభ్యసనంతో పాటు మదింపు (Assessment as learning):**

"అభ్యసనంతో పాటు మదింపు" అంటే పిల్లల సామర్థ్యాల సాధనను విడిగా మదింపు చేయడం కాకుండా రోజూవారి బోధనాభ్యసన ప్రక్రియల్లో భాగంగా మదింపు చేయడం. దీనివల్ల మదింపు కూడా నేర్చుకోవడానికి సహాయపడే అంశంగా ఉంటుంది. ఇది పిల్లలు తమని తాము మదింపు చేసుకోవడానికి, తోటి విద్యార్థులను (సమవయస్కులు) మదింపు చేయడానికి ఉపకరించే విధానంగా పనిచేస్తుంది. ఈ విధానం ద్వారా పిల్లలు తాము ఎంతమేరకు నేర్చుకున్నాము? ఇంకా ఏమి నేర్చుకోవాలి? తాము చేసిన పనిని విశ్లేషించుకోవడం, వారికి వారే తమ లక్ష్యాలను నిర్ధేశించుకోవడం జరుగుతుంది. అంటే విద్యార్థి నేర్చుకుంటూ, పరీక్షించుకుంటూ, సరిచేసుకుంటూ ముందుకు సాగడమన్నమాట. దీనిలో మదింపు నేర్చుకోవడానికి సహాయకారిగా ఉండడంతో పాటు నేర్చుకోవడంలో అంతర్భాగంగా నడుస్తుంది.

**2. అభ్యసనం కొరకు మదింపు (Assessment for learning):**

"అభ్యసనం కొరకు మదింపు" అనేది బోధనాభ్యసన ప్రక్రియలో అతిముఖ్యమైన భాగం. ఇందులో ఉపాధ్యాయుడు, పిల్లలు ఒకరికొకరు ప్రతిస్పందించుకుంటూ, చర్చించుకుంటూ, నిర్ణయానికి, రావడం జరుగుతుంది. ఇది తరగతి గదిలో ప్రతిరోజూ జరిగే బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా ఉంటుంది. " అభ్యసనం కొరకు మదింపు" యొక్క ముఖ్య ఉద్దేశ్యము. పిల్లలకు నేర్చుకోవడం ఎలాగో నేర్పడమే. ఇది నిరంతరం జరిగే ఒక ప్రక్రియ. తరగతిగదిలో నిర్వహించే వివిధ అభ్యసన కృత్యాలకు కొనసాగింపులు ఇవ్వడానికి ఏఏ అభ్యసనా ప్రక్రియలు అవసరమౌతాయో గుర్తించి అలాంటి అంశాలను ఒకదాని తరువాత ఒకటి అందించడానికి ఈ "అభ్యసనం కొరకు మదింపు" తోడ్పడుతుంది.

**3. అభ్యసనం యొక్క మదింపు (Assessment of learning):**

పిల్లలు ఆయా విషయాలను ఎంతవరకు నేర్చుకున్నారో తెలిపేదే అభ్యసనం యొక్క మదింపు అంటారు. విద్యార్థులు వివిధ అభ్యసన కృత్యాలలో పాల్గొంటూ వివిధ భావనలను, వ్యవహార రూపాలను, ప్రక్రియ నైపుణ్యాలను పొందుతారు. ఇలా పిల్లలు పొందిన జ్ఞానాన్ని కొంతకాలం తర్వాత పరీక్షించడమే "అభ్యసననం యొక్క మదింపు". ఇది పిల్లల మార్కులు, గ్రేడుల రూపంలో ప్రదర్శితమౌతుంది. ఇది ఉపాధ్యాయులు లేదా బాహ్యనికషలు లేదా రెండింటిచేత మదింపు చేయబడుతుంది. ఈవిధానంలో చాలామంది విద్యార్థులను ఒకేసారి ఒకేవిధంగా మదింపు చేయబడతారు. సాధారణంగా ఒక యూనిట్ లేదా టెర్మ్ పూర్తయిన తరువాత నిర్వహించే పరీక్షలు "అభ్యసనం యొక్క మదింపు" ను తెలియజేస్తాయి. ఇది పిల్లల అభ్యసన సాధనపై తుది నిర్ణయాన్ని ప్రకటించే పద్ధతి.

## అభ్యసనం యొక్క మదింపు లక్షణాలు:

- ఇది కేవలం ఉపాధ్యాయులు లేదా భాహ్యనికషల ఆధారంగా పిల్లల ప్రగతిని అంచనా వేస్తుంది.
- పిల్లల ప్రగతి ఫలితాలను మార్కులు మరియు గ్రేడులు ద్వారా ప్రదర్శించబడుతుంది.
- దీనిద్వారా పిల్లలందరికీ ఒకే విధానంలో మదింపు చేయడం జరుగుతుంది.

## 4.6 బహుళ సంస్కృతులు, బహుళ భాషల సమాజం కొరకు విద్యా ప్రణాళిక రూపకల్పన మరియు అమలు

### బహుళ సంస్కృతులు (Multicultures)

QVT3BC

ఒకటి కంటే ఎక్కువ సంప్రదాయాలు, సంస్కారాలు, ఆచార వ్యవహారాలు కలిగి విభిన్న మనస్తత్వాలు గల సమాజాన్ని బహుళ సంస్కృతులు గల సమాజం అంటారు.

ఇది విభిన్న సంస్కృతులు నేపథ్యం నుంచి వచ్చిన వివిధ జాతులు, సంస్కృతుల మధ్య తేడాలను తెలియజేస్తుంది. ఒకటికంటే ఎక్కువ సంప్రదాయాలున్న సమాజపు అవసరాలను తెలియపరుస్తుంది.

భారతదేశం లాంటి భిన్నత్వంలో ఏకత్వం కలిగిన సమాజంలో వివిధ సంస్కృతుల నేపథ్యం నుంచి వచ్చిన విద్యార్థులకు విభిన్న అభ్యసన వాతావరణాన్ని కల్పించడమే బహుళ సంస్కృతుల తరగతిగది. దీనిలో వయస్సు, లింగం, సామాజిక, ఆర్థిక అంతస్తులు ముఖ్య పాత్ర పోషిస్తాయి.

మన విద్యాలక్ష్యాలలో విద్యార్థి కేంద్రీకృతమైనవిద్యా ప్రణాళికలను చేర్పించినారు. విద్యార్థి నిత్యం అనుసరిస్తున్న సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, కృత్యాలు, ప్రాముఖ్యతనుబట్టి విద్యను అభ్యసిస్తున్నారు. ఇది విద్య యొక్క ముఖ్య లక్ష్యం. దానిని సాధించడానికి తరగతిలోనున్న అందరి విద్యార్థుల సంస్కృతులు మిగతా వారందరికి తెలియాలి. సమాజాన్ని పురోభివృద్ధిలోకి తీసుకురావాలంటే విద్యార్థులందరూ కలిసికట్టుగా పనిచేయడం బహుళ సంస్కృతి సంప్రదాయం. ఇది ఇతర సంస్కృతులపై ఉన్న దురభిప్రాయాన్ని రూపుమాపుతుంది. అందరూ కలిసి అభ్యసనంలో పాల్గొనేటట్లు చేస్తుంది.

### బహుళ భాషా సమాజం (Multilinguality)

భిన్న సంస్కృతులు, భిన్న జాతులు, భిన్న మతాలు, వర్గాలు, కులాలు ఉన్న సమాజంలో బహుభాషలు మాట్లాడే ప్రజలు ఉంటారు. మన దేశంలో ఒకటి కంటే ఎక్కువ భాషలు, విభిన్న భాషలు మాట్లాడే ప్రజలు ఉన్నారు. భారతదేశం అనేక సంవత్సరాలుగా వివిధ సంస్కృతులు, సాంప్రదాయాలు గల పాలకులచే పాలించబడింది. వారి సంస్కృతి, భాష, సంప్రదాయాలు ప్రజలపై జీవన విధానంపై ప్రభావాన్ని చూపినాయి. అదేవిధంగా విద్య స్థానిక, ప్రాంతీయ, జాతీయ మరియు అంతర్జాతీయ భాషల మధ్య సంబంధాలను పెంచింది. దేశంలో బహు భాషాతత్వం పెరిగినది.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ భాషలు నేర్చుకోవలసిన పరిస్థితి ఉన్నది. విద్యార్థులకు బహుభాషా పరిజ్ఞానం తప్పని సరిగా అవసరమవుతుంది. లేకపోతే సమాజంలో అతడు వెనుకబడి పోవడానికి కారణం అవుతుంది.

భాష అనేది వ్యక్తి యొక్క జ్ఞానాన్ని పెంపొందిస్తుంది. బహు భాష జాతీయ సమైక్యతను పెంపొందిస్తుంది. భారతదేశంలో అనేకమైన భాషలు మాట్లాడే ప్రజలు ఉన్నారు. చాలా రాష్ట్రాలలో త్రిభాషా సూత్రం అమలులో వుంది. విద్యాప్రణాళికలో భారతదేశంలోని భిన్న ప్రాంతాలలో మాట్లాడే భాషకు ప్రాధాన్యతను ఇవ్వాలి. పర్వత ప్రాంతాల్లో, లోయల్లో, సముద్ర తీరాల్లో, అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న వారి భాషకు విద్యా ప్రణాళికలో చోటు కల్పించాలి. ఆ ప్రాంత ప్రజల భాషకు గౌరవం కల్పించాలి. మిగతా నాగరికత గల నగర వాసులకు, పట్టణ ప్రాంత వాసులకు ఆయా భాషలను పరిచయం చేయాలి.

**భాష మరియు సంస్కృతుల మధ్య సంబంధం:**

భాష మరియు సంస్కృతుల మధ్య విడదీయరాని సంబంధం ఉన్నది. ఇవి పరస్పరాధారాలు. సంప్రదాయ భాష, సంప్రదాయ సంస్కృతిపై ఆధారపడి ఏర్పడినది. సంస్కృతిలోని భావాలు పంచుకోవడానికి భాష ఏర్పడినది. భాష ద్వారా వారి సాంస్కృతిక భావాలు, సంప్రదాయాలు, ఆచారాలు వివరంగా పంచుకోవడానికి అవకాశం ఏర్పడినది. భాష మరియు సంస్కృతులు కాలానుగుణంగా అభివృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుతం బహు సంస్కృతుల అవగాహనకు, బహు భాషల అవగాహన అవసరం.

**4.6.1 బహుళ భాష మరియు సంస్కృతుల పాఠ్య ప్రణాళిక రూపకల్పన మరియు అమలు**

సంప్రదాయ విద్యా ప్రణాళికలలో, పాఠ్యపుస్తకాలలో, కథలలో ఎక్కువగా ఆదిపత్యాధి వర్గాల వారి భాష, సంస్కృతులను ప్రచారం చేసేవి. కాని అననుకూల వర్గాల ప్రజల, అల్పసంఖ్యాక వర్గాల భాషగాని, సంస్కృతులు గాని నాటి పాఠ్యపుస్తకాలలో కానరావు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలు, పల్లెప్రాంతాలు, జానపదులు, వారి సంప్రదాయక పాటలు, ఆచారవ్యవహారాలు వారి భాష, వారి మాతృభాషపై వారు కనబరచిన భాషాభిమానం విలువనీయకుండా అమూల్యమైన సాంస్కృతిక జ్ఞానాన్ని విడనాడుచున్నారు, ఇటువంటి ధోరణులు మానవ సంబంధాలపై చెడు ప్రభావాన్ని చూపుతాయి.

అందుచే విద్యాప్రణాళికలను రూపకల్పన చేసేటప్పుడు సమాజంలో వివిధ భాషలను, సంస్కృతులను దృష్టిలో పెట్టుకొని సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సంబంధించిన అంశాలను విద్యాప్రణాళికల్లో చోటు కల్పించాలి.

పాఠశాలలో నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో ఆధునిక పోకడలకు సంబంధించిన ప్రదర్శనలు ఏర్పాటుచేస్తున్నారు. పాశ్చాత్య ధోరణులకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భారతీయ సంస్కృతికి సంబంధించి జానపద నృత్యాలు, జానపద గేయాలు, వివిధ భారతీయ భాషలలో ప్రముఖ నాటికలు, ప్రదర్శిస్తే విద్యార్థులందరిని ప్రోత్సహించి, వారి భాషలకు, సంస్కృతులకు ప్రాధాన్యతనిచ్చినట్లు అవుతున్నది. ఈ మధ్య కాలంలో భారత ప్రభుత్వం వారు 'కళాఉత్సవ్' పేరిట భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాముఖ్యతనిస్తూ పాఠశాలల్లో సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నారు.

ఉపాధ్యాయులు తమ పాఠ్యాంశ బోధనలో గొప్ప లక్షణాలు, సహనం, సామాజిక సేవ, చేసిన ఎవరినైనా వారి యొక్క వర్గానికి సంబంధం లేకుండా వారి యొక్క ప్రతిభలను, సేవలను ఉదహరించాలి. ఉదాహరణకు కొమరం భీమ్, సావిత్రి భాయి పూలే, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వంటి వారి నాయకత్వ లక్షణాలతోపాటు మేధాసంపత్తి కలవారిని కులమతాలకు అతీతంగా ప్రతిభనే ప్రాధాన్యతగా ఉదహరించాలి. వీరియొక్క మానవతా విలువలు సమాజ చైతన్యానికి వారు చేసిన సేవలు విద్యార్థులదరికీ స్ఫూర్తినిస్తాయి.

డా. డి.యస్. కొఠారి చెప్పిన ప్రకారం బహుళ భాష, సంస్కృతుల సమ్మేళనానికి ఉపాధ్యాయుడు నడుముకట్టి సమ్మిళిత భాషా సంస్కృతుల ప్రోత్సాహానికి అనువైన అభ్యసనానుభవాలు విద్యార్థులకు కల్పించాలి. విద్యార్థులకు ఉమ్మడిగా నిర్వహించే కృత్యాలు కేటాయిస్తే వారంతా కలిసి సమాచారాన్ని సేకరించుకొని, జ్ఞానాన్ని పెంచుకొని బహు భాషా సంస్కృతుల సమ్మేళనానికి తోడ్పడతారు.

విద్యా ప్రణాళికలు రూపకల్పన చేసేటప్పుడు కుల, మత, లింగ, భాష, సంస్కృతి, ఆర్థిక అసమానతల వివక్షత లేకుండా స్పష్టంగా విద్యాప్రణాళికలు రూపొందించాలి. భాషలో సంస్కృతిలో మరింత పరిశోధనలు చేసి, వాటి ఫలితాలను పాఠ్యపుస్తకాలలో చేర్పించాలి.

### 4.6.2 విద్యా లక్ష్యాల సాధన (Realising the Aim of Education)

విద్య అనేది ఒక విస్తృత భావన. ప్రపంచంలో పలువురు మేధావులు, తత్త్వవేత్తలు, రాజకీయవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు విద్యను వారి వారి దృక్కోణం నుంచి పరిశీలించి విద్యకు అర్థం, లక్ష్యాలు, పద్దతులు మొదలైన అంశాలపై వారి వైఖరులు తెలియజేసారు.

విద్యాలక్ష్యాలు నిర్ణయించే ముందు ఏ యే అంశాలు వాటిపై ప్రభావాన్ని చూపిస్తాయో తెలుసుకోవలసి ఉంది. అపుడు మాత్రమే విద్యాలక్ష్యాలకు తగిన కారణాలు తెలుసుకొని వాటిని సమన్వయపరుచుకొని, కాలానుగుణంగా వాటిని నిర్ణయించడానికి వీలవుతుంది.

విద్యాలక్ష్యాల సాధనలో బహుళ సంస్కృతులు, బహుళభాషలు మాట్లాడే విద్యార్థుల సామర్థ్యాలను పెంచడానికి భాషానైపుణ్యాన్ని పెంచాలి. విద్యార్థుల మాతృభాషను తరగతి గదికి సంధానం చేయాలి. బహుళ భాష, సంస్కృతులు విస్తరించడం వలన విద్యార్థుల్లో ఉన్న అపోహలు, మూఢనమ్మకాలు పోగొట్టవచ్చును. బహుళ సంస్కృతి, భాష విద్య వలన జాతి, మత,కుల, లింగ, ప్రాంత, సంస్కృతుల వివక్షతకు అతీతంగా విద్య ఉండాలి. సార్వజనీన విద్యకు తోడ్పడే విధంగా ఉండాలి.

విద్యాలక్ష్యాలను నిర్ధారించేటప్పుడు అవి వ్యక్తి అభివృద్ధి కోసమా? సమాజాభివృద్ధి కోసమా? అనే అంశాన్ని తాత్వికంగా చర్చించి నిర్ణయించవలసి ఉన్నది. ఉదాహరణకు నిరంకుశ పాలనలో సమాజాభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తే, ప్రజాస్వామ్యంలో వ్యక్తి అభివృద్ధికి ప్రాముఖ్యత ఉంటుంది. విద్యాలక్ష్యాలనునిర్ణయించే సమయంలో ఆనాటి జీవిత తత్త్వాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. జీవిత తత్త్వం మారినప్పుడు ప్రతిసారి విద్యాలక్ష్యాలను కూడా మార్చుకోవాల్సి ఉంది. విద్యాలక్ష్యాలను సాధించేందుకు పాఠ్యప్రణాళిక అనే సాధనం ఉపయోగపడుతుంది. తత్త్వశాస్త్రం విద్యాలక్ష్యాలనే కాకుండా, అధ్యయనాంశాలను కూడా నిర్ణయిస్తుంది. జీవిత తత్వాలు మారినప్పుడు విద్యాలక్ష్యాలు, వాటితోపాటు అధ్యయనం చేయవలసిన అంశాలు కూడా మారుతూ ఉంటాయి. చదవడం, రాయడం, లెక్కించడం, గురించిన విజ్ఞానమే సంపూర్ణ విద్య అనే భావం మారి, శీలనిర్మాణం, నైతిక శిక్షణలను కూడా విద్యా లక్ష్యాలుగా నేడు గుర్తించడం జరుగుతుంది. తాత్విక ఆలోచన మారినపుడు పాఠ్యప్రణాళిక కూడా మారుతుంది. భావవాదులు, నైతికశాస్త్రం, తర్కం, మతం మొదలైన అంశాలను పాఠ్య ప్రణాళికలో చేరిస్తే, ప్రకృతివాదులు పిల్లవాడి ప్రస్తుత అవసరాలు, అభిరుచులు, కార్యకలాపాలకు అనువైన అంశాలను పాఠ్యప్రణాళికలో చేర్చాలంటారు. యదార్థవాదులు వృత్తివిద్యకు ప్రాధాన్యం ఇస్తూ దానికి అనుగుణంగా పాఠ్యప్రణాళికను రూపొందించుకోవాలంటారు. అదే విధంగా బోధనా పద్ధతులు, క్రమశిక్షణ విషయాల్లో కూడా తత్వశాస్త్రం తన ప్రభావాన్ని చూపిస్తుంది.

#### 1. తత్వశాస్త్రం – విద్యాలక్ష్యాలు

తత్వశాస్త్రం (philosophy ) అనే పదం Philos (ఫిలోస్) మరియు Sophia (సోఫియా) అనే రెండు గ్రీకు పదాల నుంచి ఉత్పన్నమైనది. Philos (ఫిలోస్) అంటే ప్రేమ (Love), Sophia (సోఫియా) అంటే జ్ఞానం (wisdom) . దీన్నిబట్టి

ఫిలాసఫీ అంటే జ్ఞాన పిపాస (Love for wisdom) అని అర్థం. తత్వశాస్త్రం ఒక భావన విధానం. ప్రతి వ్యక్తి పుట్టుకతోనే ఒక తత్వవేత్త. ప్రతి ఒక్కరూ తన జీవన విధానాన్ని నిర్ణయించుకొని దాన్ని సక్రమంగా అనుసరించేందుకు తన ప్రవర్తనను సరిదిద్దుకుంటూ ఉంటారు. అందుకు ఏ రకమైన విద్యను పొందాలో నిర్ణయించుకుంటారు. తత్వశాస్త్రం, విద్య ఒకే నాణేనికి చెందిన బొమ్మ, బొరుసు లాంటివి. రాస్ 'విద్యను తత్వశాస్త్ర క్రియాశీల పార్శ్వంగా భావించడం జరిగింది. జాన్ డ్యూయీ తత్వశాస్త్రాన్ని విద్యకు సంబంధించిన సాధారణ సిద్ధాంతం' గా నిర్వచించాడు.

**2. విద్యాలక్ష్యాలు – సమాజశాస్త్ర ఆధారాలు:**

'సమాజ పరిణామ ప్రక్రియలో భౌతిక, మానసిక కారకాలు కలిసికట్టుగా పనిచేసే తీరును, సమాజం పుట్టుక, దాని పెరుగుదల, నిర్మిత, కార్యకలాపాలను అధ్యయనం చేసేది సమాజశాస్త్రం' అని గిడ్డింగ్స్ నిర్వచించారు. విద్యలో తాత్విక, మనోవిజ్ఞాన మూలాధారాలతోపాటు సామాజిక మూలాధారం కూడా ముఖ్యం. విద్యావిధానాన్ని నిర్ణయించడంలో సామాజిక అవసరాలు, ఆదర్శాలు, కోరికలకు తగిన ప్రాధాన్యం ఇవ్వవలసివుంది. అంటే విద్య ద్వారా సమాజం పట్ల వారి విధులను సక్రమంగా నిర్వహిస్తూ సమాజంలో సుఖమయమైన జీవితాన్ని గడుపుతూ తమ అభివృద్ధితోపాటు సామాజిక వృద్ధికి కూడా తోడ్పడే వ్యక్తులను తయారుచేయడమే విద్యాలక్ష్యంగా ఉండాలి.

మానవుడు సంఘజీవి. అతని జీవితం సంఘం ఇచ్చిన కానుకే. సంఘంలో వ్యక్తిగా మాట్లాడడం, రాయడం, చదవడంతోపాటు ఇతరులతో ప్రవర్తించే విధానాన్ని కూడా సంబంధం లేకుండా అభివృద్ధి చెందదు. సమాజానికి వ్యక్తి దూరంగా జీవించలేడు. సమాజాభివృద్ధితోపాటు దాని వినాశనానికి కూడా వ్యక్తి బాధ్యుడవుతాడు. జన్మతః వచ్చిన అతని అభిరుచులను, వైఖరులను, శక్తిసామర్థ్యాలను అభివృద్ధి చేసేందుకు దోహదపడతాడు. వ్యక్తి అభివృద్ధి, సమాజాభివృద్ధి ఒక దానితో మరొకటి ఆధారపడి ఉన్నాయి. 'వ్యక్తుల చర్యల వల్లనే సమాజంలో ఏదైనా మంచి అన్నది ప్రవేశిస్తుంది'–సర్ పెర్సీనన్

రూసో ప్రకారం – సామాజిక కట్టుబాట్లతో కాకుండా వ్యక్తిని తన సహజ వాతావరణంలో అభివృద్ధి చెందనిస్తే, అపుడు సమాజాభివృద్ధికి తోడ్పడతాడు.

మరొక వైపు సామాజిక శాస్త్రవేత్తలు ఆ సమాజానికి దూరంగా మానవుణ్ణి ఊహించడానికి వీలుకాదని భావిస్తారు.

పై ప్రతిపాదనలను పరిశీలిస్తే, వ్యక్తి అభివృద్ధికి సమాజం తోడ్పాటు ఎంత అవసరమో, సమాజాభివృద్ధికి వ్యక్తుల ఆలోచన, సహాయసహకారాలు కూడా అంతే అవసరమని గుర్తించవలసి వుంది.

జార్జిపేనే తన 'సామాజిక విద్యా సూత్రాలు' అనే గ్రంథంలో సమూహ జీవంపై విద్య ప్రభావం, విద్యపై సమూహ ప్రభావాలను గూర్చి చర్చించారు. సమాజాభివృద్ధికి పాఠశాల, ఉపాధ్యాయుడు చేయవలసిన కృషి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వైఖరుల సంపూర్ణ అవగాహనతో పాఠ్యప్రణాళికలను నిర్ణయించడం, ప్రజాస్వామ్య విలువలను పోషించడానికి తగిన జ్ఞానాన్ని అందించడం, సామాజిక అంశాలు వ్యక్తిపై ఎంతవరకు ప్రభావాన్ని చూపిస్తాయో, తెలుసుకోవడం మొదలైన అంశాలను విద్యాసమాజ శాస్త్రంనిర్ణయిస్తుంది.

### 4.6.3 అందరి అభ్యసనానికి హామీ (Ensuring Learning for All)

విద్యా ప్రక్రియకు అభ్యసనం అనేది ప్రాముఖ్యత గల అంశం. పుట్టుకతో సహజసిద్ధంగా వచ్చే ప్రతిచర్యలు జీవిత అవసరాలను తీర్చలేవు. కనుక వ్యక్తి మనుగడ సాగించాలంటే పుట్టుకనుంచి నేర్చుకోవాలి. కావున అభ్యసనం వ్యక్తి పుట్టుక నుంచి చనిపోయే వరకు సాగుతుంది. ఇది మానవుని జీవితాంతం కొనసాగే ఒక నిరంతర ప్రక్రియ.

వ్యక్తి జీవితంలో పాఠశాల విద్య అనేది ముఖ్యమైన ఘట్టం. దీనిలో ఉపాధ్యాయుని ప్రభావం చాలా ఉంటుంది. పిల్లలు సమాజంలో జీవించడానికి కావలసిన నైపుణ్యాలను, విలువలను, సామర్థ్యాలను పెంచుకోవాలి. వీటిని వ్యక్తి యొక్క బాల్యదశ నుంచి అభివృద్ధి చేయడానికి పాఠశాల కృషిచేస్తుంది.

విద్యార్థుల శారీరక, మానసిక, భావోద్రేక, సాంఘిక మరియు నైతిక అభివృద్ధికి అనుగుణంగా విద్యాప్రణాళికను రూపొందించుకోవాలి. విద్యార్థులలో వైయక్తిక బేధాలను, శక్తి సామర్థ్యాలను, సంస్కృతులను, అభిరుచులను గుర్తించి వారికి తగిన అభ్యసనానుభవాలను కల్పించాలి. వివిధ సంస్కృతులను సంతృప్తిపరిచే విధంగా బోధన పద్ధతులను, బోధనా సామగ్రిని తయారుచేసుకోవాలి. ఇలాంటి బహుళ సాంస్కృతిక లేదా భాషా విద్యా ప్రణాళిక పాఠ్యాంశాలు వివిధ సబ్జక్టులలోని విషయాలను సమగ్రపరచేలా చూడాలి. తద్వారా విద్యార్థులు, వివిధ జాతులను, భాషలకు అవగాహనచేసుకొని అన్వయించగల్గుతారు.

### 4.6.4 బోధనాభ్యసన పద్ధతుల ఎంపిక (Choosing teaching learning methods)

బోధన ఒక శాస్త్రం. బోధన ఒక కళ. బోధన ఒక నైపుణ్యం. విద్యార్థుల్లో ఆమోదయోగ్యమైన ప్రవర్తనా మార్పులు తేవడమే బోధన ముఖ్య ఉద్దేశం. బోధనా పద్ధతిపై ఫలితం నాణ్యత ఆధారపడి ఉంటుంది. ముందుగా నిర్ణయించుకొన్న విద్యా లక్ష్యాలను సాధించేందుకు బోధనా పద్ధతులు ఒక సాధనంగా ఉపకరిస్తాయి.

బోధనాభ్యసనం ఆసక్తిదాయకంగా జరగాలంటే తన ఊహలో బోధనా విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఏ పద్ధతిలో బోధిస్తే బాగుంటుందో ఉపాధ్యాయుడే నిర్ణయించుకోవాలి. ప్రాచీన విద్యావిధానంలో సంప్రదాయ పద్ధతులలో బోధన జరుగుతుండేది. మారుతున్న సమాజానికి అనుగుణంగా, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిల మూలంగా నేడు అనేక రకాల బోధనా పద్ధతులను అనుసరిస్తున్నారు. ఉపాధ్యాయులు తాము అనుసరించే బోధనా పద్ధతుల ద్వారా అభ్యాసకులలో అభ్యసనం అనేది సులభతరం అనే భావన కల్గించాలి,

ఉపాధ్యాయులు సబ్జెక్టు (బోధన విషయాన్ని) విద్యార్థులకు ఎలా అందించాలి? ఏ విధమైన బోధనాభ్యసన అనుభవాలను ఉండాలి. లేకపోతే బోధన సఫలీకృతం కాదు.

బోధనా పద్ధతులను ఎన్నుకోవడంలో ప్రభావితం చేసే అంశాలు:

1. బోధించే విషయం స్వభావం
2. విషయం ప్రాముఖ్యత
3. పిల్లల సంసిద్ధత, వారి మానసిక స్థాయి
4. పూర్వ అనుభవాలు
5. అందుబాటులో ఉన్న వనరులు
6. ఉపాధ్యాయుడి ప్రతిభ

ఇవన్నీ బోధనలో సరైన పద్ధతిని ఎంపికచేసుకొని సమర్థవంతంగా బోధించడానికి తోడ్పడతాయి.

ఉపాధ్యాయులు బోధనాభ్యసన ప్రక్రియలో అన్ని సంస్కృతులు వారున్న తరగతిలో ఎవరికి ఎక్కువ ప్రశ్నలు వేస్తున్నారో, ఎవరికి ఎక్కువ భాగస్వామ్యం కల్పిస్తున్నారో, ఎవరిని ప్రోత్సహిస్తున్నారో, ఎవరినుంచి సమస్యా పరిష్కారాలు కనుగొంటున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. భాషా సంస్కృతి మెరుగైన కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని పైన పేర్కొన్న కృత్యాలు నిర్వహిస్తే, అననుకూల వర్గాల వారి భాష సంస్కృతులను మరచినట్లు అవుతుంది. అందుకు ఉపాధ్యాయుడు తరగతి గదిలో పిల్లలందరిని ప్రశ్నిస్తూ, అభ్యసనంలో పాల్గొనేటట్లు చేయాలి. జట్టు కత్యాలలో కొన్ని వర్గాల పిల్లలను భాగస్వామ్యం చేయాలి. వీలైనంత వరకు వారి మాతృభాషలోనే బోధన సాగించాలి.

తరగతి గదిలో విద్యార్థులందరి జ్ఞానాన్ని, వారి సామర్థ్యాన్ని అవగాహన చేసుకుని, ఏ విద్యార్థికి ఏ పద్ధతిలో జ్ఞానమందిస్తే అది మంచి ఫలితాన్ని ఇస్తుందో గ్రహించి ఆ పద్ధతిని అమలుచేయాలి. అన్ని భాషలను, సంస్కృతులను, సాహిత్యాన్ని అభిప్రాయాలను గౌరవిస్తూ సమగ్రమైన పాఠ్యాంశాలను విద్యార్థులకు అందించాలి.

**సమాజాల భాగస్వామ్యంతో వైవిధ్యభరితమైన అవసరాలను తీర్చడం**

**(Meeting diverse needs through partnership with communities)**

సమాజంలో మనుగడ సాధించడానికి వైవిధ్యభరితమైన అవసరాలు ఉంటాయి. ఈ అవసరాలను తీర్చుకుంటే మానవ జీవితం సంతృప్తికరంగా సాగిపోతుంది.

బహుళభాష మరియు సంస్కృతుల వర్గాలవారి అవసరాలు వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, రీతులు, అలవాట్లు, నమ్మకాలపై ఆధారపడి వుంటాయి. ఉచిత నిర్భంధ విద్యాహక్కు చట్టం – 2009 ప్రకారం అన్ని భాషల వారిని, సంస్కృతుల వారికి విద్య హక్కుగా ప్రకటించడమైనది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలలో నడుస్తున్న అన్ని పాఠశాలల్లో పిల్లలందిరికీ ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను అందించాలి. పిల్లలందరికి గుణాత్మకమైన విద్యను అందించాలి. ఇవి పిల్లలందరికీ చేరాలంటే ప్రభుత్వంతోపాటు, సమాజంలోని సభ్యులు కూడా భాగస్వామ్యులుగా చేరాలి. పాఠశాలలు సమర్థవంతంగా పనిచేయడానికి, మౌలిక సదుపాయాలు కల్పనలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యపాత్రను పోషిస్తున్నాయి. దీనికి School Management Committee(SMC) లు ముఖ్య పాత్రను పోషిస్తున్నాయి. ఈ SMC లు ఆయా పాఠశాలల్లో చదివే బహుళ భాష, సంస్కృతికి చెందిన పిల్లల విద్యావసరాలు, ప్రగతిని పర్యవేక్షిస్తున్నారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి వీరు కృషిచేస్తున్నారు.

బహుళ భాష, సంస్కృతులకు చెందిన వర్గాల వారి పిల్లలు భవిష్యత్తులో సమర్థవంతంగా జీవించడానికి తగిన శిక్షణలు సమాజం కల్పించాలి. తద్వారా వీరు తమ కాళ్ళ మీద తాము నిలబడగలరు. బహుళభాష సంస్కృతి వర్గాల విద్యార్థులు వృత్తిదక్షత పెంచడానికి నైపుణ్యాభివృద్ధి శిక్షణనివ్వాలి. తద్వారా దేశాభివృద్ధిని, సమాజాభివృద్ధికి వీరు కృషిచేస్తారు.

బహుళభాష, సంస్కృతి వర్గాల వారి విద్యార్థులలో విద్య ద్వారా శారీరక, మానసిక, సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక రంగాలలో తగిన శిక్షణతో వ్యక్తిలో సంపూర్ణ మూర్తిమత్వ అభివృద్ధి జరుగుతుంది.

ప్రజాస్వామ్య సమాజంలో అన్ని స్థాయిల్లో నాయకుల అవసరత ఉన్నది. కావున బహుభాష, బహుళ జాతి వర్గాల విద్యార్థులతో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి, సమాజం ద్వారా విద్యార్థుల్లో సంఘసేవ, విధేయత, సహనం మొదలగు ఉత్తమ లక్షణాలు గల పౌరులుగా తీర్చిదిద్దాలి.

సమాజ భాగస్వామ్యంతో బహుభాష, బహుసంస్కృతుల వర్గాల విద్యార్థుల అవసరాలన్ని పూరించవచ్చు.

**విద్యాప్రణాళిక అనుభవాల వ్యవస్తీకరణ (Organization of Curricular experiences)**

విద్యాప్రణాళిక అనుభవాల వ్యవస్థీకరణలో అందరు విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాలి. బహుభాషా, బహు సంస్కృతుల వివక్షత విడనాడాలి. వారి భాషా సంస్కృతులు పాఠ్యాంశాలకు అనుకూలంగా వుంటే వాటిని అందరూ విద్యార్థులు అభ్యసించాలి.

విద్యాప్రణాళిక అనుభవాలంటే పాఠ్యాంశాలు మరియు పాఠ్య అనుభవాల వ్యవస్థీకరణ. ఇది పాఠశాల యొక్క తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి పాఠశాలకు ఒక తత్వం, అవలంభించవలసిన కృత్యాలు గుర్తించడం మరియు విద్యాప్రణాళిక అనుభవాల వ్యవస్థీకరణ, విద్యాప్రణాళిక, లక్ష్యాల విశ్లేషణతో ప్రారంభమవుతుంది. అభ్యసనానుభవాల ఎంపిక సాధారణంగా తార్కిక పద్ధతిలో జరుగుతుంది.

విద్యాప్రణాళిక విద్యాలక్ష్యాలపైనే నిర్మితమవుతుంది. విద్య యొక్క ముఖ్యలక్ష్యం ప్రతి విద్యార్థిని హేతుబద్ధమైన మరియు బాధ్యతాయుతమైన పౌరునిగా రూపొందించడం.

బహుభాష, సంస్కృతుల వారి వారసత్వాన్ని గౌరవించి, సమాజ పరివర్తనకు ప్రతినిధులుగా వ్యవహరించగల సామర్థ్యాన్ని పెంపొందించాలి.

విద్యాప్రణాళిక పాఠ్యాంశాలకే పరిమితం కాక, దాని వీక్షణం పాఠశాల బయట సమాజంలో ప్రభావితం చేయాలి. బహుభాష, సంస్కృతులకు చెందిన వివిధ సంప్రదాయాలు, సంస్కృతులు విద్యాప్రణాళికలో ఒక భాగంగా చేర్చాలి.

పాఠ్యాంశ అభ్యసనలో పాఠ్యాంశాలతోపాటు సహపాఠ్య కార్యక్రమాలు మద్దతు అభ్యసనానికి తోడ్పడుతుంది. అందుచే సహపాఠ్యక్రమాల ఎన్నికలో బహుభాషా, సంస్కృతులకు చెందిన అంశాలకు అవకాశం కల్పించాలి. ఉదాహరణకు జానపదగేయాలకు, గిరిజన నృత్యాలకు, హస్తకళలకు స్థానం కల్పించాలి.

**బోధన అభ్యసన సామగ్రి – మదింపు (Teaching learning Materials and Assessment)**

వివిధ బోధన మరియు శిక్షణ సన్నివేశాల్లో వ్యక్తులు మరియు సమూహాల మధ్య ఆలోచనల భావప్రసారానికి సహాయపడే సాధనాలే బోధనాభ్యసన సామగ్రి. వీటిని బహుళ సంవేదనా సామగ్రి అని కూడా అనవచ్చు. – ఎడ్గార్ డేల్.

ఈ బోధనా సామగ్రి పాఠశాలల్లోని ఉపాధ్యాయుల బోధనను సులభతరం చేస్తుంది. మరియు విద్యార్థుల మౌలిక అభ్యసనాలను తీరుస్తూ వారి సాధన స్థాయిని పెంచుతుంది. బోధనాభ్యసన సామగ్రి విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందిస్తుంది. ఉపాధ్యాయులు తరగతిగది, పరిసరాల నుండి సులభంగా సామాగ్రిని సమీకరించుకొని వారి బోధనను సులభతరం చేయడమేకాక భావనల స్థిరీకరణకు ఉపయోగపడుతుంది. బోధనా సామగ్రి వినియోగించడం, బోధనా ప్రక్రియలో ఒక ముఖ్యభాగం.

బహుళ భాష, సంస్కృతుల విద్యార్థులున్న తరగతి గదిలో ఆయా విద్యార్థుల పరిసరాలకు, వాతావరణం మరియు వారి చరిత్రకు, సంస్కృతికి, భాషకు సరిపడే బోధనాభ్యసన సామగ్రి ఉండాలి. విభిన్న ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల ఆసక్తి మరియు స్పందనలు వేర్వేరుగా వుంటాయి. కావున బోధనాభ్యసన సామగ్రి అనేది విభిన్న దృక్పథాలకు యోగ్యంగా ఉండాలి.

బోధనాభ్యసన సామగ్రి కృత్రిమంగా తయారుచేసినవి కాక పాఠశాల పరిసరాల నుంచి, ప్రకృతి నుంచి సేకరించిన మట్టి, ఇసుక, గులకరాళ్ళు,నీరు చెక్కలు మొదలగు పదార్థాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి తయారుచేసుకోవాలి. బోధనాభ్యసన సామగ్రి ఖర్చు లేనివి లేదా తక్కువ ఖర్చుతో లభించే వస్తువులతో, అందుబాటులో ఉన్న సామగ్రిని ఉపయోగించాలి. మరియు తిరిగి ఉపయోగించేలా వుండాలి.

అనేకమైన బోధనా లక్ష్యాలు సాధించడానికి సమర్థవంతమైన బోధనాభ్యసన సామగ్రిని ఉపయోగించడం బోధనాభ్యసన సామగ్రి విద్యార్థుల ప్రజ్ఞాస్థాయికి తగినట్లు ఉండాలి. బోధించే పాఠ్యాంశాలకు అనుగుణంగా ఉండాలి.

బహుభాష, సంస్కృతులున్న తరగతి గదిలో భాషా బోధనలో పిల్లల మాతృభాషలో ఉన్న కథలు, సామెతలు, వాడుకలో ఉన్న మాండలికాలు, గేయాలు ఉపయోగించాలి. అవసరం మేరకు పాఠశాల భాషల, పిల్లల మాతృభాషలో కూడా భోధనాభ్యసన సమాగ్రి తయారుచేయాలి. పిల్లల సంస్కృతికి సంబంధించిన కథలు పిల్లలచే చెప్పించాలి. గిరిజనుల ఆటలు, పాటలు నృత్యాలు వంటివి గ్రామాలలోని వేషధారణలు, వాయిద్యాలు ఉపయోగించవలెను. గ్రామీణ ప్రాంతాలలో లభ్యమయ్యే వివిధ హస్తకళా వస్తువులు, బొమ్మలు, చెట్లు కొమ్మలు మొదలైన సహజ వనరులు ఉపయోగించవలెను.

### మదింపు (Assessment)

ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం – 2009 ప్రకారం బడి ఈడుగల పిల్లలందరూ విద్య ద్వారా శారీరక, మానసిక అభివృద్ధిని సాధించాలని పేర్కొన్నది. అంటే పిల్లల మానసిక వికాసానికి దోహదపడే అంశాలను, శారీరక వికాసానికి దోహదపడే అంశాలను సమన్వయం చేసి పాఠశాలల్లో బోధన జరగాలని తెలుస్తోంది. బోధనకు అనుకూలంగానే మదింపు విధానాలు ఉండాలి. కావున పిల్లల, శారీరక, మానసిక, ఉద్వేగ అంశాలన్నింటిని మదింపు చేయాల్సిన అవసరం ఉంది. మదింపు ఏవో అన్ని సందర్భాలకు పరిమితమైనపుడు శారీరక, మానసిక, ఉద్వేగ వికాసాలను మదింపు చేయడం సాధ్యంకాదు. కావున వీటిని విడివిడిగా కాకుండా మొత్తంగా నిరంతరం మదింపు చేయవలసిన అవసరం ఉంది. దీనికోసం రూపొందించిన విద్యాప్రణాళిక వ్యూహమే నిరంతర సమగ్ర మూల్యాంకనం.

బహుళ భాష, సంస్కృతుల విద్యార్థులు ఉన్న తరగతి గదిలో పిల్లలందరిని మదింపు చేయవలసి వుంది. నిరంతర సమగ్ర మూల్యాంకనం వల్ల అభ్యసనంలో వెనుకబడిన పిల్లల్ని గుర్తించవచ్చు. మదింపు సాధనాలు ఉపయోగించి తరగతి గదిలో ఏ ఏ వర్గాలవారు, అభ్యసనంలో వెనుకబడి ఉన్నారో గుర్తించవచ్చు. తద్వారా లోపనివారణ బోధన చేసి అభ్యసనంలో వెనుకబడి వున్న వారి ప్రగతిని ముందుకు తీసుకురావచ్చు.

నిరంతర సమగ్ర మూల్యాంకనం రెండు విధాలుగా నిర్వహించబడుచున్నది.

1. నిర్మాణాత్మక మూల్యాంకనం
2. సంగ్రహణాత్మక మూల్యాంకనం

### నిర్మాణాత్మక మూల్యాంకనం:

బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహిస్తున్నప్పుడు విద్యాప్రమాణాల సాధన ఎలా జరుగుచున్నదో తెలుసుకోవడానికి నిర్మణాత్మక మూల్యాంకనం నిర్వహించాలి. ఈ నిర్మాణాత్మక మూల్యాంకనంలో ఉపాధ్యాయుడు పిల్లల ప్రగతిని అంచనా వేయడానికి క్రిందిసాధనాలు బోధనాభ్యసన ప్రక్రియలు వినియోగించాలి.

1. పిల్లల భాగస్వామ్యం – ప్రతిస్పందనలు
2. రాత అంశాలు
3. ప్రాజెక్టు పనులు
4. లఘు పరీక్ష

పై అంశాలను బోధనాభ్యసన ప్రక్రియలో భాగంగా నిర్వహించవలసి వుంటుంది. ఈ ప్రక్రియలో బహుళభాష, సంస్కృతుల విద్యార్థులు ఏ విధంగా పాల్గొంటున్నారో ఉపాధ్యాయులు గమనించాలి. పాఠ్యబోధన జరుగుచున్నప్పుడు పిల్లలందరితో చర్చించడం, కృత్యాలు నిర్వహించడం, ప్రశ్నలు అడగడం, నల్లబల్లపై లెక్కలు ఇచ్చి పిల్లలచే చేయించడం, స్లిప్‌టెస్ట్ నిర్వహించడం, అసైన్‌మెంట్‌లు ఇచ్చి నివేదికలు తయారుచేయించడం, ఉపాధ్యాయుడు ఎప్పటికప్పుడు వారు చేసే పొరపాట్లు, తప్పులను సరిదిద్దాలి.

**సంగ్రహణాత్మక మూల్యాంకనం:**

సంగ్రహణాత్మక మూల్యాంకనం అనగా ఒక విద్యా సంవత్సరంలో నిర్ణీత కాల వ్యవధులలో నిర్దేశించబడిన పాఠ్యాంశాలలో పిల్లలు ఏ మేరకు విద్యాప్రమాణాలు సాధించారో తెలుసుకోవడానికి నిర్వహించబడుతుంది. సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహించే సమయాన్ని తేదీలను పిల్లలకు ముందుగానే తెలియజేయడం జరుగుతుంది. ఇందుకోసం సంగ్రహణాత్మక మూల్యాంకనం జరిగే సమయానికి పూర్తి అయిన పాఠ్యాంశాలలో రాతపరీక్షను నిర్వహిస్తారు. పిల్లల ప్రగతిని మార్కులు, గ్రేడులు రూపంలో నమోదు చేయాలి.

బహుళ భాష, సంస్కృతుల పిల్లల ప్రగతి, పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలి. వారు విద్యాప్రమాణాలలో వెనుకబడి ఉంటే తగు ప్రణాళికలు అమలుచేసి, మిగతా విద్యార్థులతోపాటు ముందంజ వేయడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలి.

## మూల్యాంకనం

### వ్యాసరూప ప్రశ్నలు

1. విద్యాప్రణాళిక భావవను తెలిపి, ప్రాముఖ్యతను వివరింపుము.
2. ఉత్తమ పాఠ్యపుస్తక లక్షణాలను తెల్పండి.
3. విద్యాప్రణాళిక తయారీలో ఇమిడిఉన్న ఉపగమాలను గూర్చి రాయండి.
4. ఉపాధ్యాయుల నమ్మకాలు మరియు ఆచరణలను గూర్చి వివరింపుము.
5. జ్ఞానం, పాఠ్యాంశాలు, విద్యాప్రణాళిక మరియు అభ్యాసకుల మధ్య సంబంధాలను విశదీకరింపుము.

### లఘు సమాధాన ప్రశ్నలు

6. గుప్తవిద్యాప్రణాళిక అంటే ఏమిటి?
7. విద్యాప్రణాళిక, పాఠ్యప్రణాళికల మధ్య గల భేదాలు ఏవి?
8. యూనిట్‌లోని రకాలను పేర్కొనుము.
9. చదువు ప్రక్రియలో ఇమిడి ఉన్న అంశాలు ఏవి?
10. అనుకూల వర్గాల పిల్లలకు కల్పించబడిన సమానావకాశాలు ఏవి?